రసికజనమనోభిరామము

కూచిమంచి తిమ్మన

శ్రీరస్తు
ఓం నమః కామేశ్వర్యై

రసికజనమనోభిరామము

కవిసార్వభౌమ
కూచిమంచి - తిమ్మకవిప్రణీతము

బ్రహ్మశ్రీ
శతావధాని పురాణం, సూర్యనారాయణతీర్థులవారిచేఁ
బరిష్కృతము.

వావిళ్ల, రామస్వామిశాస్త్రులు
అండ్ సన్స్ వారిచేఁ
బ్రకటితము.

Madras:
INDIA STEAM PRINTING WORKS.

Rs. 0-8-0] 1910 All Rights Reserved

శ్రీరస్తు
ఓం నమః కామేశ్వర్యై

రసికజనమనోభిరామము

ప్రథమాశ్వాసము

పీఠిక

మీఱం దనపెండ్లివేళ నొడలం జెన్నారుభూషామణి
స్తోమంబుం బొడగాంచి శైలసుత చేతోవీధి గంపింపఁ ద
ద్భామారత్నముకొప్పు బర్హ మని యప్పాము ల్దల ల్వంప న
త్యామోదంబున నవ్వుశంభుఁ డిడు మా కశ్రాంతసౌఖ్యోన్నతుల్. ॥ 1 ॥

సీ. చిన్నారిజాబిల్లి సేసక్రొవ్వెదపువ్వు ◆ మెట్టరాచబిడారు పుట్టినిల్లు
మగనిసామేను హేమపుటోలగపుమిద్దె ◆ కలుములజవరాలు చెలిమిబోటి
తెఱగంటికల్కిముద్దియ లూడిగపుఁజెలు ◆ ల్కడిఁదిబొబ్బమెకంబు కత్తలాని
యాముటేనుఁగుమోముసామి ముద్దులపట్టి ◆ బక్కరవిరిబోడి సవతిమిన్న

తే. గాఁగ జగములు గడితంపుఁగని రంపు ◆ పెంపు రాణింప నెపుడుఁ బాలింపుచుండు
సర్వమంగళ మాకు నఖర్వసర్వ ◆ మంగళావాప్తి నొడఁగూర్చి మనుచుఁ గాత. ॥ 2 ॥

చ. పొలుపుగ గొల్లక్రొందలిరుఁబోడులకుల్కుమిటారిగుబ్బిగు
బ్బలు బలువెన్నముద్ద లని భావమునం దలపోసి డాసి కం
చెల వెడలించి మాటిని జేతుల నొక్కుచు హొంతకారి యై
యలఁతిగ నవ్వువెన్నుఁడు దయామతి మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడిన్. ॥ 3 ॥

మ. దివిషద్రాజముఖీలలామఫలకోత్కీర్ణస్ఫురత్కుంకుమ
ద్రవలాక్షారుణితాంఘ్రిపద్మ యగుచు న్రాణించునప్పద్మభూ
భువనోత్కృష్టమహాప్రబంధఘటనాపూజ్యైకసామ్రాజ్యవై
భవ మెల్లప్పుడు మా కొసంగు యనుకంపాలీలలం బ్రోవుతన్. ॥ 4 ॥

మ. నలుమోము ల్దన కబ్బి యుండుటకు నానందంబుతో నోలిమైఁ
బలుకుందొయ్యలిచెక్కులుం బెదవియున్ ఫాలంబుఁ జుంబించి చే
తులవెంట న్వలిగబ్బిగుబ్బచనుబంతు ల్వట్టి క్రీడాకళా
కలన న్మించువిరించి మా కొసఁగు సాకల్యాయురారోగ్యముల్. ॥ 5 ॥

సీ. అమరశిరఃకిరీటాంచలమణివిభా ◆ నీరాజితాంఘ్రి యేసారసాక్షి
కుందేందుమందారచందనఘనసార ◆ నీహారవర్ణ యేమోహనాంగి
హేమాబ్జకబళనోద్దామమత్తమరాళ ◆ ఘోటకారోహ యేబోటిమిన్న
వరదండపుస్తకవల్ల శుకరాజ ◆ రాజత్కరాబ్జ యేరాజవదన
తే. యమ్మహావాణి పికవాణి యజునిరాణి ◆ సైకతశ్రోణి మదచంచరీకవేణి
పరమకల్యాణి కిసలయపాణి మాకు ◆ మంజువాగుంభన లొసంగి మనుచుఁ గాత. ॥ 6 ॥

మ. ప్రమథాధీశశిరోగ్రభాగవిలసత్ప్రాలేయరుక్ఖండమున్
బ్రమదం బొప్పఁగఁ జూచి మోదకముగా భావించి యంచత్కరా
గ్రము నే చాఁచి కడంకతోడఁ దివియం గామించి మే లెంచుదం
తిముఖుం డెప్పుడుఁ బ్రోచు మత్కృతి దయార్ద్రీభూతచిత్తంబునన్. ॥ 7 ॥

మ. చిరభక్తిప్రతిభావిభాసితుఁడ నై చింతింతు నశ్రాంతమున్
బరవాదిప్రమదద్విపేంద్రపటలీపంచాననశ్రేష్ఠు బం
ధురతేజోనిధి దెందులూరికులపాథో ధోరాశిరాకానిశా
కరుని న్లింగయసద్గురూత్తముని సాక్షాచ్చంద్రచూడాకృతిన్. ॥ 8 ॥

సీ. గురుతరకౌండిన్యగోత్రవిఖ్యాతుండు ◆ బయ్యనామాత్యుఁ డేప్రభునితాత
నిరతాన్నదానవర్ణితయశస్సాంద్రుండు ◆ తిమ్మనసచివుఁ డేధీరుతండ్రి
ఘనులు జగ్గనయు సింగనయు మంత్రియు నర ◆ సనయును నేధన్యుననుజవరులు
తిమ్మయాఖ్యుఁడ నేఁ బ్రథితులు సింగనయు జ ◆ గ్గనయు సూరనయు నేయనఘుసుతుల
తే. మతులమతి రాజమాంబ యేయధిపుజనని ◆ యతిపతివ్రత లక్ష్మి యేచతురురాణి
యట్టి శ్రీకూచిమంచివంశాబ్ధిచంద్రు ◆ మజ్జనకు గంగనామాత్యు మదిఁ దలంతు. ॥ 9 ॥

మ. తన రాక న్నుతి సేతు సేతుహిమవత్సంగాప్తశైలాంతరా
వనిభాగావిరతప్రసిద్ధకవివిద్వన్మాగమాద్రాదియా
చనకానీకనిరంతరప్రణుతభాస్వద్దానవిద్యాపరా
యణు భూభృజ్జనపూజ్యు మజ్జనకు గంగామాత్యచూడామణిన్. ॥ 10 ॥

చ. మనమునఁ బ్రస్తుతింతు బుధమాన్యుల ధన్యుల జగ్గనార్య సిం
గన నరసప్రధానవిదితాఖ్యు ల మంత్రికులేంద్రముఖ్యులన్
ధనదసఖాంఘ్రిభక్తిసముదంచితచిత్తుల సాధువృత్తులన్
జనవినుతాన్నదానగుణసంతతభవ్యుల మతిపితృవ్యులన్. ॥ 11 ॥

మ. కవిచూడామణుల న్మహాఘనుల వేడ్కం గొల్తు వల్మీకసం
భవు వ్యాసు న్జయదేవు భోజనృపతన్బాణు న్మయూరాహ్వయున్
శివభద్రార్యుని గాళిదాసుకవిన్ శ్రీహర్షుని న్మాఘు భా
రవిఁ జోరు న్భవభూతి మల్హణుని వాక్ప్రాచుర్యసంసిద్ధికిన్. ॥ 12 ॥

సీ. బహుముఖవక్త యై పరఁగుకుండలినాథు ◆ నఖిలకళాధాముఁ డైనసోముఁ
బరజయోన్నతి నెన్నఁబడువీరభద్రుని ◆ సర్వజ్ఞతాగుణశాలి భీముఁ
జతురాస్యు వాగనుశాసను విబుధప్ర ◆ కరముఖ్యు నమరేశుఁ బురుషసింహుఁ
డనఁ దగశ్రీనాథు ఘనమార్గవర్తియై ◆ కరము వెలుంగుభాస్కరబుధేంద్రు
తే. సతతలోకేశ్వరప్రపూజితనితాంత ◆ రాజమానప్రభావుని రంగనాథు
మఱియు నాంధ్రకవిత్వనిర్మాణకుశలు ◆ లగురుహాకవివర్యుల నభినుతింతు. ॥ 13 ॥

తే. భంగమున దాఁగి పంకంబుపాల లోఁగి ◆ సరసులకుఁ గాక యెఱుకలు సడల నెఱసు
లేఱుచు జడాశయంబుల నెపుడు మెలఁగు ◆ కుకవినికురుంబముల లెక్కఁ గొనఁగ నేల. ॥ 14 ॥

సీ. అన్యపదాదాపహరణప్రవీణులు ◆ సమధికసుశ్లోకవిముఖమతులు
గురువు లఘువర్ణపరిశోధనాజ్ఞులు ◆ సదమలసాధులక్షణరహితులు
చిరత ఘుఃసుఖశ్రేయోవిదూరులు ◆ ప్రతిపదాత్యంతకువాదరతులు
సంతతసమధికసమతప్రకంపితు ◆ లతితరదుర్వృత్తయుతులు నైన
తే. ధూర్తకవిరాజుల కొకింతఁ దొలఁగవలయు ◆ నఖిలదిగ్దేశనృపసభాఖ్యాతపూత
భారతీలబ్ధకవితానిభాసమాన ◆ సారసామ్రాజ్యఖని యైనసజ్జనుండు. ॥ 15 ॥

సీ. బహుపురాణములు ప్రబంధము ల్లక్షణ ◆ శాస్త్రము ల్వివిధకోశములు నాట
కము లలంకారశాస్త్రములును శోధించి ◆ ప్రౌఢిమై నేతత్ప్రబంధ మే నొ
నర్చెద నిందులోన నొకించు కొక్కెడఁ ◆ బరికింప నెఱసులు దొరలి యున్న
నెన్నిక సేయక హితకరుణామతిఁ ◆ గనుఁగొని సారంబె కైకొనుండు

తే. మంచితేనియ జనులు వేమఱు కడంక ◆ నరసి వడపోసి యునిచిన నందులోన
నలుసు లొకకొన్ని యందందఁ గలుగకున్నె ◆ భవ్యమతులార కవిబుధప్రవరులార. ‖ 16 ‖

సీ. వళులయొప్పిదమున వఱలునాశయమ్మదు ◆ పదవిభ్రమంబుల బాగు మీఱి
కలితచంపకమాలికాసుకాంతిశ్రీల ◆ సరసిజముఖవికాసములఁ దనరి
మహితచమత్క్రియామధురవాగ్రచనల ◆ శుభలక్షణారూఢి సొం పెసంగి
ప్రవిమలశృంగారభావగౌరవమునఁ ◆ గన దలంకారవైఖరులఁ జెలఁగి
తే. ప్రబలుమత్కావ్యకన్యకారత్న మఖిల ◆ రసికజనసంతతమనోభిరామ మగుచు
నిండుకొనుఁతీవి నిద్ధరామండలమున ◆ నసదృశవిలాసలీలల నలరుఁ గాత. ‖ 17 ‖

వ. అని నిఖిలదేవతాప్రణతియు గురుచరణస్మరణంబును బితృపితృవ్యస్తోత్రంబును బురా
తనమహాకవివర్ణనంబును గుకవినిరాకరణంబును నాధునికసుకవివిద్వత్ప్రార్థనంబునుం
గావించి యష్టాదశాధికవర్ణనాన్వితం బగునొక్కమహాప్రబంధంబు నొనర్పఁ బూని
యున్న సమయంబున. ‖ 18 ‖

సీ. పరిపరిపీలుకర్బురపురక్షణనుఁ డ ◆ గ్రగశాపటికజుహూరాణవప్త
పరవిపిండీవృషపదకదంబుఁడు మహా ◆ కులకశయాలీనగురుకలాపుఁ
ఉడద్రిదారకసముద్యద్విస్మయవిదారి ◆ నాగప్రహధసమున్నతతురుంబుఁ
డవిరలచంద్రమయాగారగానుఁడు ◆ రీక్షపానారతప్రియసచివుఁడు
తే. భద్రఖింఛోళుఁ డాశ్రితశూద్రధరుఁడు ◆ నిగమరథ్యామృగుఁడు పీఠనిగమకులుఁడు
పత్త్రిహారేట్సమాహ్వయప్రభుఁడు నాదు ◆ స్వప్నమున నొక్కనాఁడు సాక్షాత్కరించె. ‖ 19 ‖

తే. అట్లు సాక్షాత్కరించి మహాత్ముఁ డైన ◆ పిఠాపురీకుక్కుటేశ్వరాభిఖ్యసాంబ
శివుఁడు నిస్తులకరుణార్ద్రచిత్తుఁ డగుచు ◆ నింపు దళుకొత్త ననుఁ జూచి యిట్టు లనియె. ‖ 20 ‖

సీ. ప్రతిభమై రుక్మిణీపరిణయంబును సింహ ◆ శైలమాహాత్మ్యంబు నీల పెండ్లి
కథయును రాజశేఖరవిలాసంబును ◆ నచ్చతెనుంగురామాయణంబు
సారంగధరనృపచరితంబు సాగర ◆ సంగమాహాత్మ్యంబు రంగు మీఱ
సకలలక్షణసారసంగ్రహంబు నొనర్చి ◆ కృతులు మాపేర నంకితము చేసి
తే. నట్టిప్రోడవు నీ విపు డలఘుమతివి ◆ రహి నొనర్పఁగఁ బూనిన రసికజనమ
నోభిరామముఁ గృతి సేయు మలర మాకుఁ ◆ దిమ్మకవిరాయ సకలసుధీవిధేయ. ‖ 21 ‖

క. నరవరు లిడుమణిభూషా ◆ కరితురగాందోళికాదిఘనవిభవము ల
స్థిరము లవేటికి నింకే ◆ నిరవుగ నిహపర సుఖంబు లిడియెదఁ జుమ్మీ. ‖ 22 ‖

వ. అని యాన తిచ్చి యప్పరమేశ్వరుం డంతర్హితుం డగుటయు నేను నమందానందకం
దళితహృదయారవిందుండ నై యమ్మహాదేవునకు నిమ్మహాప్రబంధంబుఁ గృతి సేయ
నిశ్చయించి. ‖ 23 ‖

సీ. నిఖిలవిద్యాభ్యాసనిపుణుఁడు మత్సహో ◆ దరుఁ డగుజగ్గసత్కవితనయులు
ఘనులు తిమ్మనయు సింగనయును లేఖక ◆ పాఠకు లై కృతు ల్వ్రాబలఁ జేయఁ
బేర్మిఁ గాంచినవాఁడఁ బీఠపురప్రాజ్య ◆ రాజ్యాధిపత్యవిరాజమాన
భూరివైభవుఁడు నద్భుతపరాక్రముఁడును ◆ దానకళాధురంధరుఁడు నైన
తే. రావునీలాద్రిమాధవరాయనృపతి ◆ చేతఁ గవిసార్వభౌమవిఖ్యాతబిరుద
మందినఘనుండఁ దిమ్మయాహ్వయుఁడ నేను ◆ విమలతరభక్తి మదిలోన విస్తరిల్ల. ‖ 24 ‖

షష్ఠ్యంతములు

క. శ్రీదునకు సకలముదిత ◆ శ్రీదునకు నితాంతభృంగిరిటపటునటనా
మోదునకు నిగమసంస్తుత ◆ పాదునకు హృతాఖిలాఘభవఖేదునకున్. ‖ 25 ‖

క. భర్గునకు దళితపురభట ◆ వరునకుఁ బ్రకీలితాపవర్గునకు లస
న్మార్గునకుఁ జిరకృపార్ద్రు ◆ సర్గునకు నితాంతసుగుణసంసర్గునకున్. ‖ 26 ‖

క. శంభునకు జితగజాసుర ◆ దంభునకు సమస్తబుధవితానావనసం
రంభునకు దానవిద్యా ◆ రంభునకుఁ బ్రహృష్టమౌనిరాడ్డింభునకున్. ‖ 27 ‖

క. భీమునకు రజతభూధర ◆ ధామునకు సుధాంశుకోటిధామునకు మహో
ద్దామునకు శ్రితజనావన ◆ కామునకు హృతోగ్రపాతకస్తోమునకున్. ‖ 28 ‖

క. శర్వునకు సతతముదితసు ◆ పర్వునకు సమస్తభువనపావనలీలా
ఖర్వునకు దళితదుర్జన ◆ గర్వునకు మహోక్షరాజగంధర్వునకున్. ‖ 29 ‖

క. స్థాణునకు సతతపరిచిత ◆ బాణునకు సరోరుహాక్షబాణునకు జగ
త్త్రాణునకు హృతకృతాంత ◆ ప్రాణున కతిసత్యవాక్యపరిమాణునకున్. ‖ 30 ‖

క. భవునకు నిరుపమశుభవై ◆ భవునకు సంఘటితసకలభవున కురుప్రా
భవునకుఁ గృతపరిపరిపరి ◆ భవునకు భవునకు నిరస్తభారభవునకున్. ‖ 31 ‖

క. రంగజ్జటాగ్రవిలస ◆ ద్గంగాప్రాలేయఘృణికి ఘనవితరణి కు
త్తుంగగుణమణికిఁ గుక్కుట ◆ లింగప్రభుమణికిఁ గుండలీకృతఫణికిన్. ‖ 32 ‖

ఆ. అర్పణముగ నమ్మహాదేవుకృప నే న ◆ నూనలీలఁ గూర్పఁ బూనినట్టి
రసికజనమనోభిరామం బనెడుకృతి ◆ కిలఁ గథావిధాన మెట్టులనిన. ‖ 33 ‖

కథాప్రారంభము

క. మును నారదమునివరునకు ◆ మునుకొని పుణ్యేతిహాసములు నలువ దగన్
వినుపించుచుండి యొకకథ ◆ యొనసిన కృపఁ దెలుపఁ బూని యిట్లని పలికెన్. ‖ 34 ‖

శా. చంచత్కాంచనసౌధభాగలసితశ్యామాశుభాంగప్రభా
భ్యంచద్విభ్రమచంచలాభ్రమకచాభ్రభ్రాంతిలీలావల
త్కించిల్లాస్యకళావిలోలఫణిభుక్కేకారవాక్రాంత మై
కాంచెన్ బేర్మిఁ బురోత్తమం బొక టిలం గల్యాణనామంబునన్. ‖ 35 ‖

సీ. ప్రాకారములడంబు పరిఘలచెలువంబు ◆ వనములపెంపు జవ్వనులసొంపు
బావులఠీవి కప్రపుధూపములతావి ◆ జగి లెలరంగు రచ్చలహొరంగు
గణికలయొప్పు బంగరుమాడువులవిప్పు ◆ గోపురంబులమించు కోట్లసంచు
తేరులతీరు ముత్తెపుఁబందిరులసోరు ◆ నగరులకల్మి యేనుఁగులబల్మి
తే. కత్తలానులయేపు మేల్కట్లకోపు ◆ మదురుగోడలమెఱపు వాల్మగలయొజఱపు
తలుపుగమిపీలు నిలువుటద్దములమేలు ◆ దనర వెలుఁగొందు నాప్రోలు ధరణియందు. ‖ 36 ‖

మ. పరిఘాంతర్విలసద్భుజంగయువతుల్ ప్రాకారశృంగాగ్రవి
స్ఫురదస్వప్నవధూమణీజనులకున్ శుభ్రారవిందంబు లం
పి రన న్మీఁదికి నేగు నంచ లమరీబింబోష్ఠు లింద్రోపలో
త్కరము ల్గ్రొమ్ముఱ వారి కంపి రన డిగ్గం బాఱుఁ దేఁటుల్ పురిన్. ‖ 37 ‖

శా. తుండాగ్రంబులు చాఁచి యప్పురి మహోత్తుంగద్విపేంద్రంబు లు
ద్దండప్రక్రియఁ గ్రీడ సేయుచు వియద్గంగాసువర్ణాంబురు
క్కాండంబు ల్పెకలించుచో సుమపరాగంబు న్మది న్మేనులమ్
నిండం బంగరుకాఁడల ట్లలరు నున్నిద్రప్రభాలీలలన్. ‖ 38 ‖

తే. అగము లుర్వీధరారాతి యాపనులకుఁ ◆ దలఁ యప్పట్టణమునకు వలసి వచ్చి
డాఁగి యుండినఁ బౌరులు నాగము లని ◆ క్రమ్మి యునిచిరి నాఁగనాగములుదనరు. || 39 ||

చ. తలఁపఁగ దక్షిణోత్తరపదంబుల కుద్ధతి నేగి యాఱునా
ఱ్నెలలకుఁ గాని క్రమ్మఱఁగ నేరక యేలిక నేట ముంచు ని
చ్చలు నినుతేరిమావు లని సారెకుఁ గేరుచు దిక్కు లన్నియుం
గలయ నిమేషమాత్రమునఁ గన్గొని వే మఱలుం బురాశ్వముల్. || 40 ||

చ. అనిలుఁడు లేడి నెక్కు జవ మారఁగ నప్పురిమేల్గుఱాలతోఁ
బని వడి పందెము ల్చఱచి పర్విడుచోటఁ గురంగ మెత్తి వై
చినచెలు వాయె నిప్పలుకు సిద్ధము గా దని యాడినం బ్రకం
పనునకుఁ గేలు సొట్ట యని పల్కుదురే కద లోకు లిద్ధరన్. || 41 ||

తే. నాలుగును వేయి వక్త్రంబు లోలిఁ గలిగి ◆ శ్రుతులు భాష్యంబు నడపుట ప్రతిభ యనుచు
విధిఫణీంద్రుల నిరసించి వేదశాస్త్ర ◆ ములు వచింతు రొక్కొక్క రాప్రోలిద్విజులు. || 42 ||

సీ. బుధవత్సలులు కళాపూర్ణులు పరచక్ర ◆ హరణులు కువలయాహ్లాదకరులు
వసుసమన్వితులు సర్వజ్ఞశిరోమణుల్ ◆ శుభలక్షణులు పరిశుద్ధమతులు
సహజలక్ష్మీకులస్తమికతతమస్కులు ◆ మండలప్రభులు సన్మార్గచరులు
మిత్రానుకూలురు గోత్రాభ్యుదయులు జై ◆ వాతృకు లోషధీశ్వరులు సుప్ర
తే. సన్నతాభాస్వరులు పంకజాతదళన ◆ చతురు లతిశీతలప్రదర్శను లుదగ్ర
మోహనాకారరేఖాసముల్లసితులు ◆ రాజు లలరుదు రప్పురరాజమునను. || 43 ||

తే. తనకుఁ దొమ్మిదిపాఁతఱ ల్ధనము గల ద ◆ టంచు జక్కులతేఁడు గర్వించుఁ గాని
లెక్క యిడరానిరొక్కంబు లీడు లేని ◆ కొలుచుగల వెన్న నవ్వీటికోమటులకు. || 44 ||

క. అద్రులు తేజంబున నమ ◆ రాద్రులు దానమునఁ గాంచనాదులు ధృతి సౌ
భద్రులు బవరంబున బల ◆ భద్రులు భుజశక్తి నందుఁ బరఁగెడుశూద్రుల్. || 45 ||

సీ. తమగానములకు 'సంతసిలి పున్నాగము ◆ ల్పొస్ఫుటభోగలోలతఁ జెలంగ
దమవిహారముల కెంతయు భూజనుల్ చొక్కి ◆ సుమనోవికాసవిస్ఫూర్తి నలరఁ
దమముఖాంభోజగంధములకు సరసాళు ◆ లుప్పొంగి మదబుద్ధిఁ గప్పుకొనఁగఁ
దమమణినూపురధ్వనులకుఁ బరమహం ◆ సలు పోలి మానసాసక్తి దఱుమఁ
తే. దమమృదూక్తిసుధారసధారలకు న ◆ శేషబుధపుంగవులు చెంతఁ జేరి నిలువఁ
జెలువముల కెల్లఁ బుట్టిన నెలవు లనఁగ ◆ మెఱయుదురు ప్రోలఁ బుణ్యాభామినులు లీల. || 46 ||

చ. అపరిమితానురాగమున నప్పురిలోని బొజుంగుమిన్న లె
ల్లపుడు దినాంతవేళల హొయ ల్మెఱయ న్విహరింతు రెంతయు
న్విపణిగృహాంతరాగ్రమణినిర్మితకాంచనసాలభంజికా
లపనకపోలచుంబనకళావివశీకృతహృత్సరోజు లై. || 47 ||

సీ. చామల కెందు నీ సరసత గలదె తొ ◆ య్యాలి యన వరియింపు నిలిచి చూడు
పడఁతి ని న్నంటి వెల్వడము కోర్కె ఫలించె ◆ నన రాజభోగమే యతిశయిల్లు
నారుగన్నను జిత్త మలరెడిఁజెలియన్న ◆ మది కొప్పు గంటె వేమఱుఁ జెలంగుఁ
బలుకొట్టి చూపక నిలు మింతె యనిన న ◆ వ్వలఁ గంది కైసైగ మెలఁపఁదగునె
తే. యనుచుఁ దముఁ జేరి నెఱజాణతనము వెలయఁ ◆ బలుకు నెలకోడెప్రాయంపుఁబాంథజనుల
కింపు దులకింప మాఱ్మాట లిడుచు నుండ్రు ◆ శాలిపాలీవధూటు లాప్రోలఁ జాల. || 48 ||

సీ. సరసిజంబులు సారెసారెకు నెనయించి ◆ యంబుజంబులు ప్రియం బలరఁ జేర్చి
చంపకమాలిక ల్పొం పెసంగ నమర్చి ◆ విచికిలస్తబకము ల్విస్తరించి
యుత్పలమాలిక లొ పుగాఁ బొసఁగించి ◆ కడుసుకేసరము లక్కఱఁ బెనంచి
లలి వెలయు నుపజాతులు నాడెముగ నిల్సి ◆ మఱియుఁ బే రగువనమంజరులును

తే. గరము మెఱయించి సుకవులకరణిఁ బెక్కు ◆ చందముల నీటుఁ జూపుచు సరసులను బ్ర
బంధలీలల నలరింత్రు పటువిలాస ◆ భాజనములందుఁ బుష్పలావీజనములు. ॥ 49 ॥

శా. వీట న్మాటి కనంగసంగరకళావిక్లాంతకాంతామణీ
కోటీపీనపయోధరాగ్రవితతాంకూరన్నిదాఘోదక
వ్యాటీకాపహృతిక్రియారభటిఁ బెంపారుం బ్రభాతంబులం
బాటీరాచలకూటనిర్గతజగత్ప్రాణార్భకవ్రాతముల్. ॥ 50 ॥

చ. పనివడి పంటపైరులకు బాళిమెయిం జనుచిల్కమూఁకలం
బనులకుఁ గ్రమ్మఱం దఱిమివైచు నుదంచితశాలిపాలికా
స్తనకలశద్వయీనిహితసాంకవగంధమలిమ్లుచత్వభా
గనిలకిశోరవాడరము లనారతము న్నగరాంతికంబునన్. ॥ 51 ॥

క. ఆనగరికి నధిపతి యై ◆ యానగరిపుకరణి ఠీవి నలరుచు నుండన్
భూనుతుఁ డర్చిష్మంతుఁడు ◆ నా నెసఁగు నృపాలవరుఁడు నయతత్పరుఁ డై. ॥ 52 ॥

క. ఆరాజమణికుమారుఁడు ◆ మారుఁడు సౌందర్యమునఁ గుమారుఁడు కడిమిన్
సూరుఁడు తేజంబున ఫణి ◆ హారుఁడు గరిమన్ ఋతుధ్వజాహ్వయుఁ డెన్నన్. ॥ 53 ॥

సీ. కాశకాశాధిపాకాశధునీహార ◆ నీహారకలశవార్నిధులఁ దెగడి
సోమసోమామరసామజతారకా ◆ తారకాదంబబృందముల నవ్వి
చంద్రచంద్రాతపచంద్రశారద ◆ శారదాంభోదకేసరుల నెన్ని
గోపగోపారదేందూపలసంతాన ◆ సంతానఫేనవజ్రములఁ గేరి
తే. మీఱి తనకీర్తి జగముల మెఱయ నలరె ◆ నిఖిలభూభరణోదగ్రనిజభుజాగ్ర
జాగ్రదుగ్రమహామండలాగ్రదళిత ◆ దుర్నృదుర్వీభుజుండు ఋతుధ్వజుండు. ॥ 54 ॥

సీ. కమనీయకలధౌతకాంతుల నిరసించి ◆ ద్విజరాజనిబిడదీధితుల నెంచి
జలజభవప్రభాసముదయంబు జయించి ◆ యమరవిద్రుమశోభ నపహసించి
షణ్ముఖజనకభాస్వద్విభావళి మించి ◆ హంసమండలదీప్తి నావరించి
చారుపయోజాతభూరిద్యుతులఁ గుంచి ◆ మంగళసద్రుచిమహిమ వంచి
తే. తనసమంచితకీర్తిప్రతాపములు ది ◆ గంతరంబుల వెలయ నుదగ్రలీల
వఱలె నఖిలధరాధురావహనముదిత ◆ కరికమఠకిరిగిరిహరీశ్వరుఁ డతండు. ॥ 55 ॥

సీ. కువలయంబున కార్తి గూర్పనియినుఁడు చ ◆ క్రావళి నొంచక యలరురాజు
గోత్రవైరము గూర్చుకొననియింద్రుఁడు పుణ్య ◆ జనులఁ గాఱింపనిచక్రవర్తి
పక్షపాతము లేక పరఁగుచుండువిరాటు ◆ పాడి దప్పనిప్రజాపరివృఢుండు
కుజనులపొందు చేకొననిధరాధిపుఁ ◆ డుగ్రుఁ డై ప్రజఁ ద్రుంపకుండు నీశుఁ
తే. డౌర యితఁ డని బుధజను లభినుతింపఁ ◆ వఱలెఁ దేజఃకళావైభవప్రభావ
జవవచఃస్ఫూర్తి ధృతిమహైశ్వర్యములను ◆ విపులగుణపాళి యమ్మహానృపతిమౌళి. ॥ 56 ॥

సీ. చాంచల్య మబ్జలోచనలచూపులయంద ◆ కుటిలత సతులముంగురులయంద
కాఠిన్య మింతులగబ్బిగుబ్బలయంద ◆ లేమి లేములమధ్యసీమలంద
బంధము ల్చందనగంధులరతులంద ◆ జడత ముద్దియలనెన్నడలయంద
చిక్కులు మత్తకాశినులహారములంద ◆ పీడ చేడియలకెంబెదవులంద
తే. కాని మఱి యెందు నేనియుఁ గలుగకుండ ◆ ధరణిఁ బాలించె నఖిలభూధవకులేంద్ర
కోటికోటీరమణివిభాంకురవిరాజ ◆ మానచరణాబ్జయుగళుఁ డమ్మనుజవిభుఁడు. ॥ 57 ॥

తే. దరికిఁ జేరిన నరికోటి దరికిఁ జేరు ◆ శరము పూనిన నహితాళి శరము పూనుఁ
గొమరు మీఱినయారాచకొమరుతోడ ◆ సరియె శూరులు మనుజకేసరియ కాక. ॥ 58 ॥

వ. అట్లు సమగ్రలీలావైభవోదగ్రుం డగునమ్మహీపాలాగ్రగణ్యుం డమందానందకందళి
తహృదయారవిందుం డగుచు నొక్కనాఁడు. ॥ 59 ॥

సీ. పగడంపుగుండ్రకంబములు మేలికడాని ◆ దూలముల్ జాబిలిఱాలమెట్లు
పులుఁగుఱాపచ్చబోదెలు తళ్కుమగమాని ◆ కంపుగోడలు తమ్మికెంపువెడఁద
తలుపులు పటికంపుద్వారబంధంబులు ◆ తెఱగంటి రాచఱాతిన్నియలును
వైడూర్యవలభిక ల్వాటంపుగోమేధి ◆ కపుజలయంత్రముల్ కడిఁదిముత్తి
తే. యంపునేఁతలు పుష్యరాగంపుజాల ◆ కములు రవికాంతమణివలీకములు రజత
ఫలకములు గల్గి నాడెంపుఁబనులబల్లౌ ◆ రంగుల ననారతంబుఁ జెలంగి మఱియు. ‖ 60 ‖

సీ. జాలవల్లికలు పచ్చలగద్దెపీఁట హొం ◆ బట్టుతివాసీలు వట్టివేళ్ల
సురటీలు మేల్పైఁడికురిచీలు నెత్తంపు ◆ పలక నిద్దాజరబాజుజీబు
చందువా ముత్యాలజాలీలు చికిలిక్రొ ◆ మ్మించుటద్దము లెనమించుతగటు
బాలీసు రతనంపుకీలుబొమ్మలు చిటి ◆ చాపలు వెడఁదవింజామరములు
తే. తమ్మపడిగలు మంచిగందంపుఁగోళ్ల ◆ చిఱుతముక్కాలిపీఁట రాచిలుకపంజ
రములు చిత్రంపుదివ్వెగంబములు గలిగి ◆ జానుదులకించుకొల్వు హజారమునను. ‖ 61 ‖

తే. రాజగురుబుధకనివసుధాజనులును ◆ మిత్రజాహీనకేతువుల్ మెఱసి కొలువ
నెంతయును దేజ మెసఁగ ననంతపదవి ◆ నయ్యినుఁడు నిండుకొలువున్న యవసరమున. ‖ 62 ‖

సీ. గొఱకయీఁటెలు మేటికఱకునారసములు ◆ వంకకత్తులు పెడవంకవిండ్లు
నడునెత్తిసికలు గీర్వాణంబు లేకువారు ◆ మెట్టులు క్రొవ్వాడి మెఱుఁగుసురెలు
కావిలాఁగులు నీలికాసెలు వాగురుల్ ◆ గుద్దుకత్తులు నల్లగొంగడీలు
నలువుమీఱినకారుములుచ యొడళ్లు జుం ◆ జురుగడ్డములు బలుకుఱుచద్రుళ్లు
తే. వలుదసొరకాయదిప్పలు తులసిపేర్లు ◆ గండ్రగొడ్డండ్లు చిక్కము ల్దండికోఱ
మీసము ల్గల్గి కొండఱుమృగయు లెదుటఁ ◆ జేరి పొడఁ గని మిగుల జోహారు లొసఁగి. ‖ 63 ‖

సీ. పులిగోళ్లు గజదంతములు పిల్లిగడ్డలు ◆ చారపప్పు వెడందచామరములు
పద్దువాడేగలు పావురాయలు నెమ్మి ◆ పించెంపుఁగుంచెలు పికిలిచెండ్లు
బిత్తరంపుజవాదిపిల్లులు ముద్దులే ◆ జింకకూనలు నవసంకుమదము
పచ్చకస్తురివీణె లచ్చంపుదేనె ◆ గజనిమ్మపండ్లు ద్రాక్షాఫలములు
తే. పనసపం డ్లీడపండ్లు కొమ్మనఁటిపండ్లు ◆ కప్పురము దబ్బపండులు నిప్పపువు
మొదలుగాఁ గానుకలు బట్టి మ్రోల నిలిచి ◆ పలికి రిట్లని కేల్మోడ్చి ప్రభునిగూర్చి. ‖ 64 ‖

క. విను జియ్య పొలముపట్టునఁ ◆ గనుఁగొన నబ్రముగ నీపు కారుమెకము లా
మున బెల్లు మీఱి మెలఁగుచు ◆ జనులకు గడుబీ తొనర్పఁజాగెం బెలుచన్. ‖ 65 ‖

సీ. కణుచు లీర్నాలుగుకాళ్లమెకంబులు ◆ బెబ్బులుల్ తోఁడేళ్లు బొబ్బమెకము
లెలుఁగులు గొఱపోఁతు లేఁదులు మనుఁబోఁతు ◆ లెనుపోఁతులును గోఁతు లేనుఁగులును
దుప్పులు రేఁచులు చివ్వంగు లడిఁదపు ◆ మెకములు సవరము మెకము లిర్లు
పందులు నక్కలుఁ బలుబూతపిల్లులు ◆ కుందేళ్లు దుప్పులు కొండగొఱియ
తే. లాది యగుదొడ్డమెకము లబ్బబ్బ యడవి ◆ నెందుఁ జూచిన నెడ లేక యేపు మీఱి
తిరుగుచున్నవి యిం కేమి తెలుపఁగలము ◆ సామి యవ్వాల్మెకంబులచంద మిపుడు. ‖ 66 ‖

సీ. కౌఁజులు పూరేళ్లు కన్నెలేళ్లు నెమళ్ళు ◆ లావుక ల్దోరువా ల్లకుముకులును
గొక్కెరల్ కక్కెరల్ గువ్వలు వెలిసెలు ◆ నేలనెమళ్లును బోలుగలును
గారుకోళ్లు పసిండికంటె లేట్రింతలు ◆ పాలలు పరుజులు పావురాలు
పికిలిపిట్టలు గడ్డిపిట్టలు గోవలు ◆ బంగరుపిచ్చుకల్ పసపుముద్ద
తే. లాదిగాఁ గలపులుఁగు లయారె బిట్టు ◆ నెట్టుకొని కోనలోఁ గనుపట్టి యున్న
వధిప వేఁటకు వేంచేయ నర్హ మిప్పు ◆ డనుచుఁ బల్కిన వారల నాదరించి. ‖ 67 ‖

క. మృగయావిహారలంపటుఁ ◆ డగుచు నపుడె చదరు డిగ్గి యతిరయమున న
జ్జగతీరమణశిరోమణి ◆ తగ నంతఃపురికిఁ జనినఁ దత్సమయమునన్. ‖ 68 ‖

చ. తడయక యూడిగంపునెలఁతల్ నృపు డగ్గఱి మానికెంపుబ
ల్తొడవులు వుచ్చి క్రొందడపుదోవతి గట్టఁగ నిచ్చి పచ్చఱా

బెడఁగుఁగడానిజినిపని పెం పగుముక్కలిపీఁటమీఁద సొం
పడర వసింపఁ జేసి వినయంబుఁ బ్రియం బిగరొత్త నత్తఱిన్. ॥ 69 ॥

సీ. మురు వైనహూరుమంజిముత్తియంపుసరంబు ◆ లుదుటుగుబ్బలమీఁదఁ బొదివియాడఁ
గరముల రత్నకంకణములు గాజులు ◆ ఘలుఘల్లు మని తాళగతులఁ జెలఁగ
సొంపారుగడితంపుసోగముంగురులు నె ◆ న్నొసలిపై ముసరి పెంపెసలు గూయ
మహనీయతాటంకమణిగణద్యుతులు క్రొం ◆ దళుకులేఁజెక్కుటద్దములఁ బొదలఁ
తే. గౌను నర్తింప నూర్పులు గందళింప ◆ నలఁతిచెమ్మట నెమ్మేన నంకురింపఁ
బసిఁడిగిన్నెయలోనిసంపంగినూనె ◆ వనజముఖి యోర్తు దల యంటె మనుజపతికి. ॥ 70 ॥

సీ. గమగమవలచుచొక్కపుఁగమ్మకస్తురి ◆ నలుగిడె నొకమదనాగయాన
కలయ గంధామలకం బిడె నొదలఁ ◆ దలకొని యొకముద్దు కలికిమిన్న
దోరంపుఁబన్నీటఁ దొరలించి జలకంబు ◆ లార్చె నొక్కసరోరుహాయతాక్షి
తడయక నెమ్మేను నిడుసోగపెన్నెరుల్ ◆ దడి యొత్తె నొక్క కాంతాలలామ
తే. జిలుఁగునిద్దంపుమడుఁగువల్వలు ధరింప ◆ నిడియె నొక్కమనోజ్ఞరాకేందువదన
సికను నెత్తావి క్రొత్తగొజ్జెంగసరులు ◆ చుట్టె నొకనీలవేణి యాక్షోణిపతికి. ॥ 71 ॥

తే. నిలువుటద్దంబు ముంగల నిల్పి మేలి ◆ కమ్మకస్తూరిరేక చొక్కముగ నొసలఁ
దీర్పఁగాఁ జేసె నొకవధూతిలక మప్పు ◆ డొఱపు రాణింప నానృపాలోత్తమునకు. ॥ 72 ॥

క. అగరుసితాభ్రజవాదీ ◆ మృగమదచందనహిమాంబుమిళితం బై సొం
పుగ వలచుమేలికలపము ◆ జగతీపతిమేన నొక్కసకియ యలందెన్. ॥ 73 ॥

క. జిలిబిలివలిలేగాడుపు ◆ లెలయఁగఁ బూసురటి విసరె నిమ్ముగ నొకశై
వలకచ కరకంకణములు ◆ ఘలుఘ ల్లని మెఱయ రాజకందర్పునకున్. ॥ 74 ॥

సీ. పులుఁగురాపచ్చబల్చిలుకతాళియ నొక్క ◆ సుదతి పేరురమునఁ గుదురుపఱచె
సొంపారునాణిముత్తెంపుఁజౌకటు లొక్క ◆ కలకంఠకంఠి వీనుల నమర్చె
గాటంపునెఱమానికపుటుంగరము లొక్క ◆ తలిరాకుఁబోఁడి యంగుళుల నునిచె
మురుగులు నపరంజిమురిడీగొలుసు లొక్క ◆ విమలాంగి హస్తపద్మముల నిడియెఁ
తే. బసిఁడికమ్మరుపట యొక్కకిసలయోష్ఠి ◆ మొలను దవిలించి సరపిణిగొలుసు లొక్క
తెఱవ వెరవార గుఱుతుగ నఱుత నించెఁ ◆ జెలువు దైవార నారాజశేఖరునకు. ॥ 75 ॥

తే. హరువు మీఱెడిపసిఁడిపళ్లెరమునందు ◆ రసరసాన్నము లిడి యొక్కరాజవదన
యింపుసొంపులు వెలయ భుజింపఁజేసె ◆ మణిగృహంబున నారాజమణిని నిలిపి. ॥ 76 ॥

క. ఎంగిలి వార్వఁగ నీ ళ్లిడె ◆ బంగరునెఱగిండితోడఁ బరువడి నొకసా
రంగవిలోచన యానృప ◆ పుంగవునకు మదిని గూర్మి పొంగారంగన్. ॥ 77 ॥

తే. తావికపురంపుబాగాలు తగటుఁబండు ◆ టాకులును మేలివలిముత్తియంపుఁ గ్రొత్త
సున్నమును గూర్చి యొకప్రోఢ యన్ను మిన్న ◆ యన్నరాధీశునకు విడెం బంది యిచ్చె. ॥ 78 ॥

క. అంతట నానృపశేఖరుఁ ◆ డంతఃపురి వెడలి వేడ్క లంతంత కెదన్
దొంతర లై పొదువఁగఁ గడు ◆ వింతగ మొగసాలకడకు వేంచేసి తగన్. ॥ 79 ॥

సీ. భేరులు కాహళు ల్పిల్లగ్రోవులు పెద్ద ◆ బూరలు తుడుములు భోరుకలుగ
మణికేతనములు చామరములు ముత్యాల ◆ గొడుగులు నరిగెలు గొఱలి తరలఁ
గరు లశ్వములు శతాంగములు వరూధినుల్ ◆ గడు నేలయీనినకరణి నడువఁ
గవులు గాయకులు మాగధులు వేశ్యలు నటుల్ ◆ పరిహాసకులు మ్రోల బలసి కొలువఁ
తే. బసిఁడిబెత్తులవా రిరుదెసలఁ గ్రమ్మి ◆ జతన దేవ పరాకు హెచ్చరిక యనుచుఁ
గరము వేడుకతో బరాబరు లొనర్ప ◆ దొరలు ప్రెగడలు జనవరు ల్తోడ రాగ. ॥ 80 ॥

తే. గడలు బాణా ల్పటాలు నగ్గలికఁ బూని ◆ పరువడుల్ ద్రొక్కుకొనుచు నిబ్బరపుబీర
ములు గనంబడ సామరుల్ మ్రోలఁ జెలఁగి ◆ సాదన లొనర్ప జట్లు హెచ్చరికఁ బెనఁగ. ॥ 81 ॥

తే. వలలు బోనులు పెనుబల్లెములును ద్రుడ్లు ◆ గండ్రగొడ్డండ్లు వాగురు ల్గడఁకఁ బూని
జాగిలంబుల డేగలఁ జాలఁ గొనుచు ◆ మృగయు లొకకొంద ఱొకచెంతఁ దగిలి చనఁగ. ॥ 82 ॥

సీ. తెలిహురుమంజిముత్తియపుఁజౌకటులక్రొం ◆ దళతళల్ చెక్కుటద్దములఁ బొదలఁ
గలి రాచిలుక లెక్కల లెక్కగొననిసో ◆ యగపుఁ జిచ్చులతాళి యఖిత మెఱయ
నవరత్నమయకంకణము లుంగరము లంగ ◆ దము లాది యగుభూషణములు వెలుఁగఁ
జలువక్రొందగటంచుజిలుఁగుదుప్పటివలె ◆ వాటు నెమ్మేయి వింతనీటు చూప
తే. నిమ్ముగా మేల్పసిండితాయెతులు మొల్ల ◆ విరిసరు ల్దట్టముగఁ జుట్టి వ్రేసినట్టి
యొరసిక మీఁదఁ బైచెంగు లునిచి కట్టి ◆ నట్టిబురుసారుమాల్గాయ ల్బిట్టుదనర. ॥ 83 ॥

సీ. తీరుగాఁ గొనగోర దిద్దిన నిడుదక ◆ స్తురిరేక నొసల మేల్సొగసు లీన
మొలకట్టుకాసెలోపల బిగ్గఁ జెరివిన ◆ బలుతమ్మికెంపులబాఁకు మెఱయ
దండగా మగరాలు దాపినబలితంపు ◆ గండపెండెరము డాకాలఁ గ్రాలఁ
బస నించునిద్దంపుబవిరిగడ్డముసొంపు ◆ రుచిరనీలోపలరుచులఁ దెగడఁ
తే. గప్పురము సాంకవము మంచిగంద మగరు ◆ గస్తురియుఁ జాదుఁ బన్నీటఁ గలపి యిడిన
కడిఁది మైపూఁతకలపంపుఁగమ్మతావు ◆ లిమ్ముగా నెల్లదిక్కులఁ గ్రమ్మికొనఁగ. ॥ 84 ॥

సీ. పసిఁడిపక్కెరజరబాజుమెత్తాముత్తి ◆ యంపుజొంపములు చొక్కంపుఁగెంపు
టంకవన్నెలు గిల్కుటందియల్ జల్లులు ◆ జిలుఁగుఁగ్రొందళుకుఁగుచ్చులతురాయి
చికిలికళ్లెము క్రొత్తముకమాలువాగె హో ◆ రంగారుజరతారుటంగువారు
బిరుదుగంటలు గజ్జె లరిదిలకుంపటా ◆ ద్రిప్పదండలు భూరిదివ్యమణులు
తే. గలితశుభలక్షణము లురుగతులు గడిఁది ◆ తేజు నందంబు జవమును దిటము గలిగి
రాణఁ దనరారు మేటిసామ్రాణి నెక్కి ◆ హాళి దైవార నపుడు వాహ్యాళి వెడలె. ॥ 85 ॥

చ. వెలువడి యోలిఁ బ్రోలి నడువీథి జనంబులుఁ బౌరకామినుల్
వలకొని మేలికప్రపునివాళు లొసంగుచుఁ బొంగి యొండొరుం
దలఁగఁగఁ ద్రోచి యాన్నృపవతంసముఁ జూచి మదిం జెలంగుచున్
జిలిబిలిక్రొత్తముత్తియపుసేసలు చల్లిరి పెల్లు మీఱఁగన్. ॥ 86 ॥

చ. జలధరవేణు లిందుమణిసౌధతలంబుల నిచ్చి మించుఁదీఁ
గల నిరసించు మైరుచులు గ్రాలఁగ ముత్తెపుసేసఁబ్రాలు భూ
తలపతిమీఁదఁ జల్లిరి ముదం బలరార ఘనాఘనంబు ల
గ్గలముగ నింగి నుండి వడగండ్లు పొరింబొరి రాల్చుకైవడిన్. ॥ 87 ॥

ఉ. అన్నులమిన్న యొర్తు వసుధాధిపనందనుఁ జూడఁ గోరి వా
ల్గన్నులఁ గుంకుమంబు నొసల న్నవకజ్జలమున్ ధరించి లో
నెన్నఁగ రానితత్తరము హెచ్చఁగ నచ్చుగ రాజపద్ధతిన్
గ్రన్నన వచ్చె దానిఁ గని కామిను లందఱు నవ్వి రొక్కటన్. ॥ 88 ॥

క. పడఁతుక యొక్కతె యపు డా ◆ యొడయనిఁబొడ గనఁగ వచ్చె నొడ్డాణము వే
మెడ నిడి మొగపులతీఁగియ ◆ నడుమున నిడి యలఁతివలపు నాటుకొనంగన్. ॥ 89 ॥

క. వలఱేనిదెగడు నాన్నృపు ◆ చెలువము నలువారఁ జూచి చెలి యొక్కతె క్రొం
జిలిబిలివలపులఁ గులికెన్ ◆ జిలజిల మరునిల్లు పెల్లు చెమ్మగిలంగన్. ॥ 90 ॥

క. వనజాక్షి యొకతె కరముల ◆ ననబంతులఁ ద్రిప్పుకొనుచు నరపుంగవుఁ గ
న్గొనఁ జేరెఁ దనమిటారపుఁ ◆ జనుగుబ్బలసొరు దెలుపుచందము దోపన్. ॥ 91 ॥

సీ. గురుతరవక్షోజకుంభసంభవగంధ ◆ సిందూరరాగంబు చెన్ను మీఱఁ
గమనీయమేఖలాఘంటామహాఘోషళం ◆ ఘళవిరావంబు లగ్గలికఁ జూపఁ

బ్రకటముఖభ్రమభ్రమరకానీకని ◆ స్తులవినీలద్యుతు ల్దళముకొనఁగ
భూరిశోభాప్రకీరోరుశుండాదండ ◆ విభ్రమం బభిరామవృత్తిఁ జెలఁగ
తే. మందయానవిలాసంబు సందడింప ◆ నతనుపట్టంపుటేనుఁగో యనఁగ నొక్క
కామినీమణి శృంగారగరిమ వెలయ ◆ వచ్చెఁ జెచ్చెరఁ గుంభినీవరుని జూడ. || 92 ||

చ. కులుకుమిటారిగబ్బిచనుగుబ్బలవ్రేఁగునఁ గౌనుఁదీఁగ కం
పిలి యసియాడ ముంగురులు బిట్టు మొగంబునఁ జిందులాడఁ గం
చెలముడి వీడఁ దత్తరపుఁజెయ్యిల నించుక నీవి యూడ వి
చ్చలవిడి జూడ వచ్చె నొకచంద్రనిభాస్య నృపాలమన్మథున్. || 93 ||

తే. మీనలోచన యనుమాట మిథ్య గాక ◆ యుండునట్టుగ నొక్కవేదండయాన
దండ దీయక నిల్చి యుద్దండలీల ◆ ఱెప్ప వేయక యన్నేలఱేనిఁ జూచె. || 94 ||

తే. అట్లు పురకామినీమణు లలమి చూడ ◆ గాయకు ల్పాడ గణికాప్రకరము లాడ
బంట్లు వెన్నాడ నతులవైభవముతోడఁ ◆ బురము వెలువడె రాజన్యపుంగవుండు. || 95 ||

క. వెడలు తదంతికమున నొక ◆ యెడ నెల్లర నిలువ నాజ్ఞ యిడి డెందమునం
గడలుకొనువేడ్కచే న ◆ య్యెడయఁడు మృగయులును దాను నురుగతిఁ జనియెన్. || 96 ||

మ. చని యాభూపవరుండు గాంచె నెదురన్ జంబీరనింబామ్లికా
పనసాశ్వత్థకపిత్థబిల్వబదరీభల్లాతకీకేతకీ
ఘనసారామలకర్ణికారవటమాకందార్జునాచ్ఛోటచం
దనమందారముఖాఖిలద్రునిచయాధారంబుఁ గాంతారమున్. || 97 ||

సీ. ప్రత్యగ్రఫలవలద్రాక్షాలతాకీర్ణ ◆ తరుణామ్రశాఖాకదంబకంబు
హిమవార్ఝరీప్రాంతసముదగ్రఘనసార ◆ కదళీమహీరుహోద్గాఢతరము
పాటీరభూమిరుట్కోటరాంతర్లగ్న ◆ ఫణిఫణామణివిభాభాసురంబు
పరిఫుల్లచంపక ప్రసవరజశ్ఛన్న ◆ నికటసరస్తోయనిస్తులంబు
తే. గంధవేదండమండల గండయుగళ ◆ గళితదానాంబులహరికామిళితలలిత
పరిణతాస్తోకమాకందఫలరసప్ర ◆ వాహమధుపూరవార మవ్వనము దనరె. || 98 ||

తే. శల్యకదలిప్రియకశివాచమరకర్ష ◆ కుంభరోహితనాగముల్ గొఱిలు నందు
శల్యకదలిప్రియకశివాచమరకర్ష ◆ కుంభరోహితనాగముల్ గొఱిలు నందు. || 99 ||

సీ. శక్రరంభాపారిజాతకైరావత ◆ ఖ్యాత మై నాకలోకంబుకరణి
గాలవశాండిల్యకౌశికకపిలారి ◆ వాస మై ధాతృనివాసమట్లు
వృషకుమారకశివాప్రియశివాపరికలి ◆ తం బయి రజతభూధరముమాడ్కి
మదనసుపర్ణకమాధవలక్ష్మీస ◆ నాథ మై వైకుంఠనగరిగరిమ
తే. సంతతానంతనాగేంద్రసహిత మగుచు ◆ విలసితం బగునలరసాతలముపోల్కి
నెసఁగు నక్కావనంబు మహీతలేశ ◆ కుంజరున కాత్మఁబ్రమదంబు గూర్చె నపుడు. || 100 ||

తే. భోగినీగాఢపరిరంభయోగమునఁ జె ◆ లంగు నచ్ఛోటిమేటిభుజంగకోటి
పద్మినీభవ్యసంభోగపారవశ్య ◆ లీలఁ బున్నాగనికరంబు గ్రాలు నందు. || 101 ||

క. పరఁగె న్వనకరికిరికా ◆ సరశరభతరక్షుఖడ్గశశవృకహరివా
నరగవయశల్యభలుక ◆ హరిణవ్యాఘ్రాదిమృగకులాకుల మగుచున్. || 102 ||

వ. ఇట్టివిచిత్రలీలావైభవంబులకుం దావకం బైనయక్కాననంబు ప్రవేశించి యానృపాల
శేఖరుండు. || 103 ||

క. తమకమున మేల్సతాణిన్ ◆ దుమికించుచు బరుగు వైచి దోర్బలవిభవం
బమర వనాంతరమునఁ బే ◆ రిమి మెఱయఁగఁ గొంతతడవు ద్రిమ్మరుచుండెన్. || 104 ||

తే. భటులు నటులనె నిర్భరార్భటులు నిగుడ ◆ లగుడశరభల్లఘనసర్వలాత్రిశూల
పరశుకరవాలికాచ్ఛురీప్రముఖనిఖిల ◆ సాధనము లూని యాతేనిజంటఁ జనిరి. ‖ 105 ‖

తే. పసిఁడిగొలుసులు జరతారుపట్టెలును ◆ మేలిహొంబట్టుజూలును మెడల గొప్ప
వెండిమువ్వలు పొదలంగ గండుమీఱి ◆ సాగె వేగఁ దుటారంపు జాగిలములు. ‖ 106 ‖

క. మోరలు దివి కెత్తుచు భౌ ◆ భౌరవములుఁ జెలంగె భషకము లపుడ
త్తారాపథ మంతయు నొక ◆ తూరియె కబళింపఁ బూని తొడరె ననంగన్. ‖ 107 ‖

తే. అపుడు గొందఱు మృగయు లయ్యడవిఁ దూఱి ◆ ఘోరముగ నెల్లకడలఁ గగ్గోలు గాఁగ
గూఁత లిడి చోపుటయు మృగకులము గలఁగి ◆ బయలు వెడలినఁ గాంచి యప్పార్థివుండు. ‖ 108 ‖

శా. సారంగంబులఁ జెండి సింగముల నిస్సారంబుగాఁ ద్రుంచి భూ
దారవ్యాఘ్రతరక్షుఖడ్గశశగంధర్వంబుల న్గంధమా
ర్జారశ్వావిదనేకపర్క్షరురులన్ జక్కాడెఁ గుంతచ్ఛురీ
నారాచాసిగదాత్రిశూలముఖనానాదివ్యశస్త్రంబులన్. ‖ 109 ‖

సీ. పులులమొత్తంబుల బోనులఁ జొరఁ దోలి ◆ గండ్రగొడ్డండ్లచేఁ జెండి చెండి
వలలలోఁ జిక్కి పోవఁగ లేనికుందేళ్లఁ ◆ గదిసి పెన్గుదియలఁ జదిపి చదిపి
ఘుర్ఘురధ్వనులఁ బైకొనవచ్చుపందులఁ ◆ గుఱుచబల్లెంబులఁ గుమ్మి కుమ్మి
బెదరి చెంగున దాఁటి చెదరి పాఱెడులేళ్లఁ ◆ జెడుగువేపుల కెర చేసి చేసి
తే. యసినికాతాంబకంబుల నచ్ఛభల్ల ◆ శల్యశంబరహర్యక్షశరభగవయ
చమరసృమరాదికంబులఁ జంపి చంపి ◆ వేఁట గావించి రా తేనివీరభటులు. ‖ 110 ‖

తే. ఖడ్గముల ఖడ్గములఁ ద్రుంచి కడిమి నచ్చ ◆ భల్లముల భల్లములఁ జంపి పెల్లు మీఱ
శల్యముల శల్యముల బిట్టు చదిపి పతికి ◆ మోద మొసఁగిరి గొందఱు జోదు లపుడు. ‖ 111 ‖

సీ. అదె కరి యిదె కిరి యదె హరి పోనీక ◆ పొడు పొడుం డని బొబ్బ లిడెడువారు
పులిఁ గ్రమ్ముకొని పులిపులిగ నీఁటెలఁ గ్రుమ్మి ◆ యేపుతో మగటిమిఁ జూపువారు
శరభావలుల ఘోరశరభావలు లెలర ◆ నెలసి భూస్థలిఁ ద్రెళ్ల నేయువారు
సారంగముల మనసారంగఁ బైకొని ◆ కొట్టి పెన్గుట్టలఁ బెట్టువారు
తే. కొండగొఱియల దుప్పుల గండకముల ◆ ఖండఖండంబులుగఁ బేర్మి నండగొనఁగఁ
జెండు బెం డాడి యుక్కునఁ జెలఁగువారు ◆ నగుచుఁ గ్రీడించి రొకకొంద ఱధిపుమ్రోల. ‖ 112 ‖

సీ. పసివట్టి తోఁకలు విసిరి తారుచుఁ జెవుల్ ◆ రికిరించుకొని దిశల్ రేసి చూచి
కొఱకొఱఁ బరువిడి మఱిలి మోరలు చాఁచి ◆ పొదలు దూఱుచుఁ జుట్టి పొంగువారి
గొదకొని నెమకుచు ఘుర్ఘురధ్వనులతోఁ ◆ బైకొని వచ్చుబల్ పందిగమికి
మొగి చివ్వన మీఁది కెగసి కొంకులు గోశ ◆ ములు మెడ ల్గలయాయములు విడంగఁ
తే. గఱచి గీపెట్టునెడల నక్కజపులావు ◆ లెలయఁ జీకొన నీడిచి యేపు చూపి
మృగయులకుఁ జాలఁబ్రమదంబు నిగుడఁజేసె ◆ సరవి నయ్యెడ నాడెంపుజాగిలములు. ‖ 113 ‖

వ. మఱియును. ‖ 114 ‖

సీ. కౌఁజుపాఁజులఁ బోవఁగానీక వాసియే ◆ రణములఁ బఱపి శీఘ్రంబ తునిమి
పూరేళ్లపైఁ బెల్లుపొదలు చంచలపుడే ◆ గలవైచి నెవ్వడి బిలుకుమార్చి
కన్నెలేడులమీఁద గాటంపుబీరంపుఁ ◆ గణసరంబులఁ జొన్పి గం డడంచి
నేల నెమళ్ళపై నేలాపుడేగల ◆ విడిచి యేపునఁ బీఁచ మడఁపఁ జేసి
తే. పసపుముద్దయుఁ బాలయుఁ బచ్చతెక్క ◆ పసిడికంటెయుఁ బరజయుఁ బసులపోలి
గాఁడు ననువానిపై జలకట్టియలను ◆ బంచి త్రుంచిరి కొందఱు బంటు లపుడు. ‖ 115 ‖

తే. అట్లు దమకంబుచే వేఁట లాడి మృగమ ◆ దంబుఁ జామరములు గజదంతములును
బిల్లిగడ్డలు పులిగోళ్లు పికిలిచెండు ◆ నాదిగాఁ దెచ్చి యిచ్చి రయ్యవనిపతికి. ‖ 116 ‖

తే. అంత నవ్వేఁట చాలించి యవనివిభుఁడు ◆ సేన గొలువంగ నవ్వనిచెంత నొక్క
పటకుటీరంబు వేయించి పాయ కెదను ◆ మించు వేడ్కలఁ దగ విశ్రమించి యుండె. ॥ 117 ॥

క. అని వనజాసనుఁ డెఱిఁగిం ◆ చిన విని సురమౌని ముదితచిత్తుం డైయా
తని నవ్వలికథ యెల్లను ◆ వినిపింపు మటంచుఁ దివిరి వేఁడుకొనుటయున్. ॥ 118 ॥

మ. పురుహూతాగ్ని పరేతరాట్పలభుగంభోధీశవాతార్థపాం
బర కేశాబ్జభవాచ్యుతాదికమహాబర్హిర్ముఖానీకభా
స్వరకార్తస్వరవిస్ఫురన్మకుటశశ్వత్పద్మరాగప్రభో
త్కరనీరాజితపాదపద్మయుగళా కాకోలభాస్వద్గళా. ॥ 119 ॥

క. దృక్కర్ణకర్ణభూషణ ◆ వాక్కాంతాకాంతముఖ్యవందిత మిహికా
రుక్కోటికోటిభాస్వర ◆ కుక్కుటలింగాభిధాన కుతలనిధానా. ॥ 120 ॥

ఉత్సాహ. పురవిభంగ ధరనిభాంగ భూశతాంగ శశివిభా
కరరథాంగ ముకుటగఁగ కరకురంగ సంహృత
స్ఫురదనంగ ధృతభుజంగ సుగుణసంగ మునిమనోం
బురుహభృంగ వృషతురంగ భువనమంగళప్రదా. ॥ 121 ॥

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వరకరుణాకటాక్షనిరీక్షణసంలబ్ధసరసకవితాసామ్రా
జ్యధురంధర ఘనయశోబంధుర కౌండిన్యగోత్రపవిత్ర కూచిమంచిగంగనామాత్య
పుత్త్ర సకలసంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ తిమ్మకవిసార్వభౌమప్రణీతం
బయినరసికజనమనోభిరామం బనుశృంగారప్రబంధంబునందుఁ బ్రథమాశ్వాసము.

శ్రీరస్తు
ఓం నమః కామేశ్వర్యై

రసికజనమనోభిరామము

ద్వితీయాశ్వాసము

శ్రీమద్ధరణీధరక
న్యామానసపద్మభృంగ నయగుణసంగా
సామజదనుజవిభంగా
కోమలభసితావృతాంగ కుక్కుటలింగా. ‖ 1 ‖

తే. అవధరింపుము కమలజుఁ డమరమౌని ◆ శేఖరున కిట్టు లని వేడ్కఁ జెప్పఁదొడఁగె
నవ్విధమన ఋతుధ్వజక్ష్మాధినాథుఁ ◆ డురుబలోపేతుఁ డై వని నుండుటయును. ‖ 2 ‖

లయగ్రాహి. అంతట వసంత
మసురాంతకతనూభవదురంతనిశితప్రసవకుంతహృతపాంథ
స్వాంతము శుకీపికశకుంతకలనిస్వననిరంతరసమాకులదిగంత మసకృన్ని
ష్క్రాంతమధుపానమదదంతురితషట్చరణసంతతి విస్మృత్వరలతాంతము వనాంతా
శ్రాంతరతికాంతరణతాంతలలనాజననితాంతసుఖదానిలనిశాంతము దనర్చెన్. ‖ 3 ‖

క. శుకపికశారీమధులి ◆ ట్ప్రకరమహానినదనిబిడబధరీకృతస
ర్వకకుప్పతికర్ణం బై ◆ యకలంకగతిన్ ధరిత్రి నామని యొప్పెన్. ‖ 4 ‖

తే. జీర్ణపర్ణంబు లూడ్చి కెంజిగురుటాకు ◆ జొంపములతోడఁ దరువులు సొం పెసఁగె వ
సంతురాక దలఁచి వనికాంతమెఱుఁగుఁ ◆ దొడవు లెడలించి మణిభూష లిడె ననంగ. ‖ 5 ‖

క. కుసుమితశాల్మలు లపు డిం ◆ పెసఁగె న్విరహిణుల గెలువ నేగుచు నెలమిన్
బిసరుహశరుఁ డంపించిన ◆ పసఁ బొసఁగెడుతమ్మికెంపుపనితేరు లనన్. ‖ 6 ‖

సీ. శుకరాజమాగధప్రకరముల్ గీర్తింపఁ ◆ గలకంఠకంఠకాహళులు మొరయఁ
బరిఫుల్లకింశుకకరదీపికలు గ్రాల ◆ సాంద్రపరాగరజమ్ము గ్రమ్మ
సహకారపల్లవాంచత్కేతువులు మీఱ ◆ సమదరోలంబసైన్యములు గొలువఁ
గేతకీగర్భదళాతతాస్త్రము లొప్పఁ ◆ బృథుమరున్నినదభేరికలు చెలఁగఁ
తే. బ్రసవచంపకరథకదంబములు మెఱయ ◆ దర్పకునితోడఁ గూడి చైత్రప్రభుండు
విరహిణీపాంథసందోహవిజయమునకు ◆ హోళి దైవార నపుడు వాహ్యాళి వెడలె. ‖ 7 ‖

మ. బలవద్దర్పకవీరకాహళరవప్రాయంబు లై మించి సొం
పలరం బాంథనితంబినీజనఘనస్వాంతంబు లెంతేనియుం
గలఁచె న్బాలరసాలపల్లవలవగ్రాసావలేపోల్లస
త్కలకంఠప్రమదానిరంతరకుహూకారంబు లప్పట్టునన్. ‖ 8 ‖

క. మహిళాపున్నాగంబు ◆ ల్రహిఁ గుసుమకదంబలీలఁ గ్రాలఁగ నచ్చో
మహిళాపున్నాగంబు ◆ ల్రహిఁ గుసుమకదంబలీలలం గ్రాలెఁ గడున్. ॥ 9 ॥

తే. పవనదుశ్శాసనుఁడు వనీపాండవేయ ◆ లలనజీర్ణచ్ఛదాంశుకంబులు హరింపఁ
గలికిశుకసూక్తిఁ జీరఁ గిసలయహేమ ◆ మయపటము లీఁడె యయ్యెడ మాధవుండు. ॥ 10 ॥

సీ. శుకముఖద్విజమండలికి మహాఫలదుఁ డై ◆ తవిలి వేమఱు మరుత్తతి భజింపఁ
గ్రూరపలాశసంహార మొనర్చుచు ◆ సరసను బర్ణలాంఛనము మెఱయ
నాశ్రితాళులు నితాంతామోదమునఁ గ్రాలఁ ◆ జెలఁగి వనప్రియశ్రేణి పొగడ
ఘనతరు ల్సుమనోవికాసలీల నెసంగఁ ◆ గలితశుభశ్రీప్రకర్ష వెలయ
తే. సమధికతరాగవహనప్రశస్తి యలర ◆ వనజసాయకగురువైభవంబు నెఱపి
భవ్యవనమాలికాసముద్భాసి యగుచు ◆ మహిమఁ జెన్నొందె నవ్వేళ మాధవుండు. ॥ 11 ॥

క. వనరమకు న్మాధవునకుఁ ◆ దనరఁగఁ బరిణయ మొనర్పఁ దఱి యనుజవరా
లునిచినముత్తెపుఁబ్రా లన ◆ మొనసి వనిం గ్రొత్తమల్లెమొగ్గలు దనరెన్. ॥ 12 ॥

క. రాగము చిగురాకున కను ◆ రాగము బొజుఁగులకు ఘనపరాగము వనికిన్
రాగము మధుకరములకు స ◆ రాగము గృహులకును గల్గె రహి నవ్వేళన్. ॥ 13 ॥

సీ. శుకనాదములు ద్విజశ్రుతిఘోషములు గాఁగఁ
దేఁటీపాటలు పురంధ్రీగీతములు గాఁగఁ ◆ గిసలముల్ తోరణవిసరములు గాఁగఁ
బలుకప్పురంపుఁదిప్పలు వితర్దులు గాఁగఁ ◆ బుప్పొడు ల్వాలిగందపొడులు గాఁగఁ
దెలిమొల్లమొగ్గచాల్పులు తలఁబ్రా ల్గాఁగ ◆ విరిదీఁగెపొదలు పందిరులు గాఁగఁ
తే. బుష్పితపలాశనికురుంబములు నివాళి ◆ పళ్ళెములు గాఁగ నిర్భరపవనచలిత
తరువంబులు భద్రవాద్యములు గాఁగ ◆ వనవధూమణిఁ జైత్రుఁ డుద్వాహమయ్యె. ॥ 14 ॥

సీ. వ్యాకీర్ణమదచంచరీకశిరోజయుఁ ◆ బ్రచలితమంజరీకుచభరయును
గళదనూనమరందఘర్మాంబులేశయు ◆ లతికాభుజాశ్లేషలాలసయును
బ్రకటితసంరక్తపల్లవాధరయు వి ◆ స్రస్తప్రసవపరిష్కారమణియుఁ
గీరశారీరుతకింకిణీరవయు నం ◆ చితసరఘాస్వనసీత్కృతియును
తే. నవపలాశద్రుకోరకనఖపదయును ◆ గంధమారుతనిశ్వాసగాఢతరయు
నగుచు వనలక్ష్మి చైత్రసమాగమమున నలఘుసంభోగలాంఛనంబులఁ జెలంగె. ॥ 15 ॥

సీ. పల్లవశ్రేణి కబ్రంపురాగ మెసంగె ◆ హితఫలంబులు ద్విజప్రతతి కొదవె
సుమనోవికాస మచ్చుగ భూజనుల కబ్బెఁ ◆ జాఁగెఁ బల్మఱు మరుత్సంభ్రమములు
చండాలులకుఁ బొల్పెసఁగె మధుపానాప్తి ◆ యమితరసాలకాండములు మెఱసెఁ
బ్రసవధర్మక్రియాపరత నొప్పిరి గృహుల్ ◆ ప్రబలె నర్చులు చిత్రభానునందుఁ
తే. గుంభినీవల్లభులకు మిక్కుటపుదాన ◆ గుణము వాటిల్లెఁ ద్రిభువనప్రణుతనిఖిల
జంతుసంతానహృదయరంజకమనోజ్ఞ ◆ లీల నలరువసంతర్తువేళయందు. ॥ 16 ॥

క. అపు డానృపుఁ డటఁ దరలెన్ ◆ విపినవిహారానుమోదవిచలితమతి యై
పనఘృణివిసరవిరహిత ◆ విపథంబున నర్మసఖుఁడు వెంబడిఁ జనఁగన్. ॥ 17 ॥

వ. అట్లు దరలి దరీకుహరాంతరవిహరమాణాకుంతకంఠీరవభైరవారవాకర్ణనాతిప్రకంపి
తాఖిలహరిదంతదంతిసంతానంబును నిర్భరనికుంజసంజవనాంగణార్గళమార్గనిర్గతజా
గ్రన్మహోగ్రవ్యాఘ్రకోటిధాటికపలాయితరురుకురంగప్రముఖనిఖిలక్షుద్రమృగకులా
కులంబును మదోద్దండవేదండమండలగండస్థలనిస్సరద్దానధారాపూరాభిషిక్తాశేషప్రదే
శంబును బరస్పరభీకరాఘాతప్రభిన్నావయవస్రవద్రుధిరధారాప్రవాహపరివ్యాప్తవ
రాహవాహయితవ్యూహంబును బటుపటీరకూటస్ఫుటకోటీరకుటీరంతర్లగ్నభుగ్నభు
జంగపుంగవోత్తుంగఫణాగ్రరంగరంగన్మణిగణప్రభాభాసమానంబును నిబిడజంఝూస
మీరప్రేరితధావద్దావపావకాభీలజ్వాలాజాలజాజ్వల్యమాననానానోకహచ్ఛటాచ్ఛ
టచ్ఛటనినాదమేదురంబును సరససరఘావిసరకాదనావసరశిథిలపృథులమధుకోశవి
నిర్గలన్మధురసాసారవర్షోత్కర్షంబును నవారితమారుతానారతపూరితభూరితరవేణుని

నాదాకీర్ణంబును నభ్యర్ణధరాధరాధిత్యకాసముజ్ఝితస్ఫురత్సరిర్ఝరీతరఙ్గనిర్ఘోషనితాం
తగర్జారవమనీషాముహుర్నటదుత్కంఠనీలకంఠానీకాస్తోకకేకారవాక్రాంతంబును
విశంకటమ్మృగయావిహారవిలాససముల్లసద్భిల్లపల్లవోష్ఠీనిష్ఠురాలాపకోలాహలధ్వాన
బధిరీకృతరోదోంతరాళంబును బహుతరక్రూరోరగమృగఖగసంఘాతసంకులంబును
బహుశిలాకంటకావృతంబును బహువిచిత్రాకరంబు నగునమ్మహారణ్యంబు చొచ్చి
విచ్చలవిడి నచ్చటివినోదంబులు గనుంగొనుచు జని చని ముందట. || 18 ||

మ. కనియె న్నృపకులాఢ్యుఁ డగ్రగవియద్గంగాతరంగోద్ధత
ధ్వనిసంఘాతనితాంతసంవృతమహాప్రత్యర్థిశంకాముహు
ర్జనితతక్రోధరణన్మృగాధిపకులస్థాయద్దరీభాగమున్
ఘనగంభీరసరిర్ఝరీతటకటన్నాగంబు శీతాగమున్. || 19 ||

క. కని యన్నగాగ్రభాగం ◆ బున కేగి తదీయచిత్రములు గనుఁగొనుచున్
మునుకొని తిరుగుచు నుండెన్ ◆ జనవరకుంజరుఁడు నర్మసచివుఁడు దానున్. || 20 ||

క. దరులం బూఁజప్పరముల ◆ దరులన్ శృంగారశిలఁ దనరెడుకాకో
దరుల న్విద్యాధరసుం ◆ దరులం బొడగాంచి యతఁ డెదం గడు నలరెన్. || 21 ||

సీ. భిల్లయోషిత్పదహల్లకోల్లిఖితకుం ◆ కుమరసాంకితమణీకుట్టిమంబు
కాకోదరీకుచకలశద్వయాలిప్త ◆ హారిద్రముద్రితాబ్జాకరంబు
కిన్నరీజనరతిక్రీడాంతరస్రస్త ◆ కుసుమోత్కరాకీర్ణకుంజగృహము
దివిషద్వధూప్రతిదినదోహదక్రియా ◆ వికసితామ్రాదికోర్వీరుహంబు
తే. ఖచరవరవర్ణినీకరకమలనిభృత ◆ సురమహీజాతజాతప్రసూనరచిత
తతసుగంధాన్వితోదగ్రతాలవృంత ◆ గంధవాహకిశోర మాక్ష్మాధరంబు. || 22 ||

సీ. అమరసరిత్కాంచనాబ్జపరాగసం ◆ ఛన్నమహారత్నసానువులును
గ్రీడాసమాసక్తకిన్నరీచరణలా ◆ క్షారసాంకితఝరీసైకతములు
గంధద్విరదఘటాకటగళదానవా ◆ ర్బిందుసంసిక్తదరీతలములు
శుకశారికాకోకపికరాజహంసమ ◆ యూరస్వనోల్లసదుపవనములు
తే. సిద్ధవిద్యాధరోరగస్త్రీకుచాగ్ర ◆ లిప్తహారిద్రచూర్ణసంక్లిష్టభూరి
వనాంచత్పుష్కృష్ణసరోవరములు ◆ గనుఁగొని చెలంగె నప్పు డజ్జనవరుండు. || 23 ||

సీ. శిఖరాగ్రవిస్ఫురజ్జీమూతదర్శన ◆ ప్రమదనృత్యన్మత్త ర్హిణములు
నిర్మలకాసారనీరనీరజనాళ ◆ కబళనోద్ధతహంసికాకులములు
పరిఫుల్లమల్లికాప్రసవరసాస్వాద ◆ నాలోలరోలంబజాలకములు
మృదులామ్రనూతనచ్ఛదచర్వణోన్మాద ◆ కూజతోద్యదనేకకోకిలములు
తే. సారసహకారమంజరీసౌరభములు ◆ కుందబృందాచ్ఛమరరందబిందుసహిత
శీతలస్ఫీతమృదువాతపోతములును ◆ హర్ష మొనగూర్చె నృపతి కయ్యద్రియందు. || 24 ||

ఉ. క్రొన్నవతీవపందిరుల గొజ్జగినీటివెడందవాగులన్
వెన్నెలరాచరాచలువవిప్పుటరుంగులఁ గప్పురంపుబల్
దిన్నియల న్లోయ ల్మెఱయఁ ద్రిమ్మఱునచ్చరపువ్వుఁబోండ్లు రా
మిన్నకుఁ దద్ద వేడుకలు మీఱఁగఁ జేరిరి యన్నగంబునన్. || 25 ||

సీ. అశ్రాంతసుమనస్సమాజపూజితపాదుఁ ◆ డవిరళకాళీసమన్వితుండు
రంగదత్తుంగభుజంగమకటకుఁ డ ◆ ద్భుతచంద్రరేఖావిభూషణుండు
సదమలభృంగీశసంగీతనిరతుండు ◆ శుకముఖద్విజగణసూక్తిహితుఁడు
నిరుపమానంతధనీశిరోభాగుండు ◆ లాలితవృషరాజలాంఛనుండు
తే. సురుచిరాగమవాహుఁ డక్షుద్రమూర్తి ◆ యఖిలశుభఫలదాయకుఁ డగ్గిరీశుఁ
డతులితామోద మొనగూర్చె నపుడు మిగుల ◆ నద్ధరిత్రీశవంశచూడాగ్రమణికి. || 26 ||

సీ. గోత్రవర్గములోన గురుతరుం డగుబల్లి ◆ దుండు వంశోద్ధారకుండు గాఁడె
బహుళగైరికసమభ్యంచితుం డగుప్రోడ ◆ సతతకల్యాణభాజనము గాఁడె

యఖిలభూజనులఁ బాయక ప్రోచుధన్యాత్ముఁ ◆ డురుఫలంబులు విప్రవరుల కీఁడె
తతవాహినీపరివృతుఁ డగుసచలుండు ◆ పరదళోన్మూలనప్రౌఢిఁ గనఁడె
తే. యౌర మేలిధరాధీశుఁ డసదృశప్ర ◆ భావశోభితుఁ డై యెన్ఁబడియె నంచుఁ
బర్వతేంద్రుని నతితరప్రతిభ మెఱయఁ ◆ బ్రస్తుతి యొనర్చునృపకులప్రవరుఁ డపుడు. || 27 ||

శా. తోరం బొప్ప నటించె నప్పుడు యత్కూలంకషోత్ఫుల్లక
ల్హారాంభోరుహహల్లకోత్పలసుగంధాశ్లిష్ట మాద్యన్మరు
ద్వారంబుల్ కుసుమాస్త్రసంగరనితాంతక్లిన్నవిద్యాధరీ
హారిస్థూలకుచాగ్రఘర్మజలలేశాంకూర మింకింపుచున్. || 28 ||

వ. అట్లు భువనాద్భుతకరాదభ్రలీలావైభవంబులకుం బ ట్టైనయగ్గట్టుపై నారాచపట్టి నె
ట్టుకొని విహరించుచుండి యందు నొక్కచోట. || 29 ||

క. కనుఁగొనియె నెలమి దివిష ◆ ద్వనితాకుచకుంభమిళితవరకస్తూరీ
ఘనసారచందనాగురు ◆ ఘనసౌరభసంగ నభ్రగంగ న్మోలన్. || 30 ||

క. కనుఁగొని హర్షాద్భుతములు ◆ మనమున బెనఁగొనఁగ నాక్షమావరుఁడు గడున్
వినయంబున నాస్రోత ◆ స్విని నిట్టు లటంచు వినతి సేయఁ దొడంగెన్. || 31 ||

సీ. జయజయ హరిపదజలజసంబంధిని ◆ జయజయ గిరితనూజాసపత్ని
జయజయ కైలాసశైలవిహారిణి ◆ జయజయ ఘోరదుష్కలుషదమని
జయజయ కైవల్యసౌఖ్యప్రదాయిని ◆ జయజయ భవసాధ్యసంప్రశమని
జయజయ దేవతాసదనప్రచారిణి ◆ జయజయ శంకరప్రియవధూటి
తే. జయ మహాదేవి భగవతి జయ సమస్త ◆ భువనజనయిత్రి జయ నిశాధవపటీర
శరశరద్ఘనఘనసారసదృశగాత్రి ◆ సకలకల్యాణసంధాత్రి జహ్నుపుత్త్రి. || 32 ||

మ. మదనారాతిజటాటవీతటనటన్మల్లీగుళుచ్ఛాకృతీ
త్రిదశాధీశపురానిశాధివసతీ దేవీ జగత్పావనీ
హృదయాహ్లాదకరీ నమజ్జనమనోభీష్టార్థసంధాయినీ
మది నెల్లప్పుడు సంస్మరింతు నిను నేమం బొప్ప మందాకినీ. || 33 ||

మ. అవని న్స్నానవుఁ డెవ్వఁడేని భవదీయాలోలకల్లోలవా
ర్ణవసంసిక్తనిజప్రతీకుఁ డగు నాప్రాజ్ఞుం డమర్త్యేంద్రపూ
ర్ణవళాక్షీకరకంకణక్వణనమిశ్రప్రోల్లసచ్చామరో
ద్భవనిస్తంద్రమరుత్కిశోరములచేతం జొక్కుఁ బో జాహ్నవీ. || 34 ||

సీ. బ్రహ్మహత్యాదిదుర్భరమహాఘవిభంగ ◆ ఘనతరతరళరంగత్తరంగ
విపులసైకతభాగవిలసితచక్రాంగ ◆ హరజటాజూటకూటాగ్రరంగ
కనకారవిందసంగతచలన్మదభృంగ ◆ సూరిజనస్తుతసుప్రసంగ
యమరీకుచాలిప్తహారిద్రసంసంగ ◆ సతతసమాశ్రితశైలశృంగ
తే. యతిదయాపాంగ పుణ్యమయాంతరంగ ◆ ప్రచురగంభీరనీరాంతరప్రమగ్న
మత్తమాతంగ నీకు నమస్కరింతు ◆ దివ్యశోభాప్రదీప్తాంగ దివిజగంగ. || 35 ||

తే. పరుస మించుక సోకి యబ్రముగ నినుము ◆ పసిఁడి యగునట్లు తావకప్రవిమలాంబు
కణ మొకించుక సోకిన ఖలజనుండు ◆ మిగులఁ బరిశుద్ధుఁ డగుఁ గదా గగనతటిని. || 36 ||

చ. తమి నొకనాఁడు మానవుఁడు దవ్వులఁ దావకవీచికానినా
దము చెవిఁ గీలుకొల్పిన నతండు వినండు గదా సురాపగా
శమనలులాయకంఠపరిసర్పితభూరితరోగ్రఘంటికా
సముదయలోకభీకరవిశంకటసాంద్రఘణంఘణధ్వనుల్. || 37 ||

క. యోగిజనానందకరీ ◆ యాగమసంస్తుతలసత్పదాంబుజయుగళీ
భోగాపవర్గదాయిని ◆ భాగీరథి నేఁడు ననుఁ గృపం గనుఁగొనవే. || 38 ||

క. ధాతృపితృచరణతలసం ◆ భూతా భువనప్రపూత బుధనుతసుగుణ
వ్రాతా విరజాసలిలో ◆ పేతా నను ధన్యుఁ జేయవే గుహమాతా. ‖ 39 ‖

వ. అని యనేకప్రకారంబులం బ్రార్థించి తదంభఃపూరంబునఁ గృతావగాహుం డై సం
ధ్యాద్యనుష్ఠానక్రియాకలాపంబు నిర్వర్తించి తదంతికప్రదేశంబున విహరింపుచుండి
పురోభాగంబున నొక్కచోట. ‖ 40 ‖

తే. కనకమణిమయసోపానగర్భగేహ ◆ కుట్టిమాకరమంటపకుడ్యగోపు
రేందుమణిపీఠికాసమన్వితమహేశ ◆ భవన మొక్కటి గాంచె సంభ్రమ మెలర్ప. ‖ 41 ‖

తే. కాంచి యద్దేవలము ప్రవేశించి యందు ◆ విమలతేజస్సమగ్రత వెలుఁగుచున్న
దివ్యలింగంబుఁ బొడగాంచి నవ్యభక్తి ◆ యమరఁ గరపంకజాతయుగ్మము మొగిడ్చి. ‖ 42 ‖

సీ. కాలకాలాయ దిక్పాలపాలస్థక ◆ స్తూరికాంకితపదాంభోరుహాయ
దేవదేవాయ రాజీవజన్మోగ్రదు ◆ ర్గర్వనిర్వాపణకారణాయ
మారమారాయ సంసారవార్ధినిమగ్న ◆ సేవకోత్తారణనావికాయ
వామవామయ సౌదామనీదామస ◆ మానమానితిజటామండలాయ
తే. శూలినే భూతకృపాశాలినే సు ◆ శీలినే శశ్వదఘతూలకీలినే క
పాలినే విశ్వలోకైకపాలినే న ◆ మో నమ యటంచుఁ గేల్మోడ్చి మ్రొక్కి మఱియు. ‖ 43 ‖

సీ. కరవీరమల్లికాకమలోత్పలములచే ◆ రమణీయబిల్వదళములచేతఁ
గౌశికసాంబ్రణికాధూపములచేత ◆ ఘనసారచందనాగరులచేత
సహకారకదళికాంచత్ఫలంబులచేత ◆ నవ్యరసాలదండములచేత
మహనీయశర్కరామధురసంబులచేతఁ ◆ బ్రచురహిమాంబుపూరములచేత
తే. భవ్యగంగావినిర్మలాంభస్సమేత ◆ నారికేళోదకములచేఁ జారువీటి
కా సద్వస్తువితతిచే నాత్మఁ దద్ద ◆ వేడుకలు మొఱఁ బూజఁ గావించి యంత. ‖ 44 ‖

క. వికటాగ్రసంస్థితుం డై ◆ ముకుళితకరకమలుఁ డగుచు మొగి నతఁడు మదిం
బ్రకట మగుభక్తిఁ గందా ◆ ష్టకమున నద్దేవు నిట్లు సంస్తుతి చేసెన్. ‖ 45 ‖

కందాష్టకము. శ్రీమత్కలధౌతాచల ◆ ధామ సుధాధామతిగ ధామసమీర
వ్యోమాంబుయజ్వపావక ◆ భూమహితాకార నన్నుఁ బోషింపు శివా. ‖ 46 ‖

క. శైలసుతాలోల హృతా ◆ భీలకృతాంతావలేప పృథుకరుణాసం
శీలా తతహేలా ధృత ◆ శూలా వ్రతమూల నీకు జోహారు శివా. ‖ 47 ‖

క. యతిగణ్యామితపుణ్యా ◆ న్వితఫణ్యాభరణ సతతనిలయీకృతప
ర్వతశృంగా ధృతగంగా ◆ తతశృంగారాంగ నన్ను దయఁ జూడు శివా. ‖ 48 ‖

క. నారదదరపారదశర ◆ శారదశరదభ్రకరితుషారాభ్రఝురీ
తారాహీతహీరామృత ◆ ధారాసితదేహ నీకు దండంబు శివా. ‖ 49 ‖

క. కాలానలకీలావిల ◆ హాలాహలభయవిచలితహరిదీశమహా
కోలాహలవేళాచల ◆ లీలావిలసనుని నిన్ను లెక్కింతు శివా. ‖ 50 ‖

క. హాటకవర ఘోటకపుర ◆ నాటకధరణీమణీభనవ్యాంబరగో
కోటీధనపేటీఘన ◆ చేటీజన మబ్బు నిన్ను సేవింప శివా. ‖ 51 ‖

క. భీమా పరభీమా పుర ◆ భామావరకంఠసూత్రభంగ సమంచ
ద్భామాశ్రితవామా హృత,కామా కృతకామ మాకు గతి నీవె శివా. ‖ 52 ‖

క. సురదానవవరమానవ ◆ వరమానవమందహాసవదనాబ్జ మరు
ద్గిరిచాపా హరిరోపా ◆ పరితాపాహరణ నిన్నె ప్రణుతింతు శివా. ‖ 53 ‖

వ. అని మఱియును. ‖ 54 ‖

కందమణిగణనికరవృత్తము

క. జయజయ పురహర జయ గిరిశయనా ◆ జయ తలవినిభృతసదమలహరిణా
నయగుణవిలసిత నయశుభచయదా ◆ జయ మునివరనుతచరణసరసిజా. ‖ 55 ‖

సగర్భస్రగ్విణీభుజంగప్రయాతద్రుతవిలంబితవృత్తసీసము

సీ. నిగమాశ్వభూసురానీకసంపూజ్యశుం ◆ భత్స్వభావా వృషపతితురంగ
సురుచికద్యోసరిజ్జూట ఖద్యోతసా ◆ హస్రభాసా సమస్తాఘహరణ
జగతీశ మాసరస్పత్త్యుఘామాన్యచం ◆ చత్కృపా నతజనశరణ్యా
మానితహాసరమ్యానవాబ్జా లస ◆ న్మంగళాత్మా నిశానాథమకుట
తే. హర సరీసృపహార భయాపహార ◆ పురనిషూదన భూరివిభూతిదాన
హరిహయప్రణతాచ్ఛపదాంబుజాత ◆ శరణు శంకర శాశ్వత సాధుపాల. ‖ 56 ‖

సగర్భమత్తేభకందసీసము

సీ. సమదవేదండనిశాచరోన్మథనభీ ◆ మప్రౌఢదోర్విక్రమా కృపాబ్ధి
ప్రముదితానేకసుపర్వ నిర్మలగుణాం ◆ భోధీ జగత్కారణా ధరేశ
లసదురోభాగనిలంబితోరగపతీ ◆ సామప్రియా శంకరా మహాత్మ
ప్రపదరుగ్భాషితపాకజిన్మకుటశుం ◆ భద్రత్నదివ్యప్రభా కపర్ది
తే. శివ నిఖిలలోకపాలన భవవిదళన ◆ శరధితూణ భయహర విజయ ప్రవిమల
హృదయ శశిధర త్రిభువనహితసుచరిత ◆ శమితపురదితిజవరా ప్రశస్తకీర్తి. ‖ 57 ‖

క. అని యనివారితభక్తిం ◆ బ్రణుతించి మహేశుకరుణ వడసి కడున్ గొ
బ్బున౯ బ్రాసాదము వెలువడి ◆ జనవరుఁడు తదంతికమున౯ జనియెడునెడలన్. ‖ 58 ‖

తే. సరసవైఖరిశ్రుతిపుటోత్సవము మీఱ ◆ నాలకింపంగఁబడియె నత్యద్భుతముగ
సకలచేతనహృదయరంజకమనోజ్ఞ ◆ మధురసంగీతరావంబు మలసి యెదుట. ‖ 59 ‖

క. ఆరవము విని నృపాగ్రణి ◆ గారవపుంజెలిమికాని౯ గనుఁగొని యహహా
చేరువ నొకమృదుసంగీ ◆ తారవము వినంగ నయ్యె నల్లదె వింటే. ‖ 60 ‖

ఉ. కిన్నరకన్యలో సురమృగీదృశలో గరుడాంబుజాక్షులో
పన్నగకాంతలో ఖతరభామలొ సిద్ధవధబటులో సుఖా
భ్యున్నతి౯ బాడ౯ జొచ్చి రట౯ బోయి దిటంబుగ వారిచందముల్
సన్నకసన్న నారసి వెస న్మరలం జనుదెమ్ము నెచ్చెలీ. ‖ 61 ‖

క. వేమఱు మది కింపుగ గజ ◆ గామిను లామనిగ౯ బాడుగానము వినుచున్
సోమరితనమున౯ దడయక ◆ సేమంబున మరలి యిపుడె చెచ్చెర రమ్మా. ‖ 62 ‖

ఉ. నావుడు౯ జెల్మికాఁడు నృపనందను వీడ్కొని వేడ్క నేగి శో
భావహలీల౯ గ్రాలునొకయబ్బురపుంబువుఁదోట౯ జొచ్చి య
త్తావున౯ బ్రోవు గూడి విత్తతంబుగ౯ గ్రీడ యొనర్చుదివ్యరా
జీవముఖీలలామముల౯ జిత్రగతి౯ బొడగాంచి వెండియున్. ‖ 63 ‖

మ. తరుమూలంబులపొంత౯ బొంచి సచినోత్తంసంబు వీక్షించె భా
స్వరకార్తస్వరవిగ్రహా న్సమదచంచచ్చంచరీకాలకన్
శరదిందుప్రతిమానచంద్రవదనం జక్రస్తని న్విస్ఫుర
త్సరసీజాతదళాయతాక్షి నొకకాంతాలోకచూడామణిన్. ‖ 64 ‖

తే. అట్లు వీక్షించి దానిసమగ్రభువన ◆ మోహనాకారరేఖ కామోద మంది
యహహా యియ్యిందువదన యయ్యసమశరుని ◆ భూరిసామ్రాజ్యలక్ష్మి గాఁబోలు భళిర. ‖ 65 ‖

చ. కులుకుమిటారిగుబ్బలును గొప్పపిఱుందును గావిమోవియుం
దెలినిడువాలుఁగన్నులును నిద్దపుముద్దుమొగంబు తళ్కుఁజె
క్కులు జిలుఁగుంగవు న్వెడఁద ◆ క్రొమ్ముడియుం గలయాచొకారపుం
గలికియలంతిజవ్వనము కన్నులపండువ యయ్యె నియ్యెడన్. ‖ 66 ‖

క. చూడమె ముజ్జగములఁ గల ◆ చేడియతలమానికములఁ జె న్నలరెడునీ
వ్రీడావతీకదంబక ◆ చూడామణివంటిదానిఁ జూడ మొకందున్. ‖ 67 ‖

సీ. చందమామకు లోనఁ గం దొనర్చినతప్పు ◆ పసిఁడికి దావిఁ గూర్పనికొఱంత
దొండపంటికిఁ దీపి నిండఁ జేయనిరట్టు ◆ తొగలఁ బెన్మడుగునఁ ద్రోచువాదు
జక్కవపులుఁగుల జత విప్పునాడిక ◆ మించుటద్దముల మాయించుకీడు
కరితుండములకు వక్రత యిడ్డ నేరమి ◆ చివురులు గార్కొనఁ జేయురవ్వ
తే. మలుపుకొనఁ జాలు నద్దిరా జలజభవుఁడు ◆ పూని యిమ్ముద్దుతలిరాకుఁబోఁడివదన
నురదాంశుక'లోచనస్తనకపోల ◆ సక్థిపదయుగ్మకము సొం పెసఁగ నొనర్చి. ‖ 68 ‖

సీ. పలుకులు నేర్చిన తళుకుఁబుత్తబొమ్మ ◆ జగతికి డిగ్గిన చంద్రరేఖ
నిలుకడఁ గాంచిన'తొలుకరిక్రొమ్మించు; తావి చేకుఱిననెత్తమ్మికెంపు
నెన్నడు పొదవినకన్నెమామిడిగున్న ◆ తను వూని మెలఁగుకెందమ్మికొలను
నగవుఁజూ పలవడ్డ సొగసుఁగ్రొన్న నచెండు ◆ చేష్ట లబ్బి మెలంగుచిత్రరేఖ
తే. గావలయు నియ్యబల దీనిగాఢకాంతి ◆ రూపలావణ్యశుభవైఖరులు గరంబు
నమ్మహారాజునకుఁ దెల్పి యతిరయంబ ◆ తోడుకొని వత్తు నని వేడ్కతోడ మరలె. ‖ 69 ‖

తే. మరలి చనుదెంచి యమ్మహీవరుని గాంచి ◆ యంచితాలాపముల నిట్టులంచుఁ బలికె
భూతలాధీశ నీయాజ్ఞఁ బూని యిందుఁ ◆ దరలి యొకయబ్బురపుఁద్రోవ నరిగి యవల. ‖ 70 ‖

సీ. పటికంపుదోనులఁ బరఁగుగొజ్జంగపూ ◆ నీటిబల్లక్కర ల్దాఁటి దాఁటి
గుప్పుగుప్పునఁ దావు లుప్పతిల్లఁగఁ ద్రోవ ◆ నెలయుకప్రపుఁదిప్ప లెక్కి యెక్కి
గాటంపునెఱపూఁతకమ్మసంపఁగిచెట్ల ◆ నీడల నంతంత నిలిచి నిలిచి
యల్లబిల్లిగఁ బ్రాకి యెల్లతావుల బెల్లు ◆ మీఱునేలకిపొద ల్దూఱి తూఱి
తే. తెమ్మ గ్రమ్మఁగఁ గడు నెడతెగక కురియు ◆ నరిది విరిదేనెసోనలఁ బొరసి పొరసి
యొఱపులకు నెల్ల నిక్క యై వఱలునొక్క ◆ మేటిచెలువంపువలిపువ్వుఁదోటఁ గంటి. ‖ 71 ‖

సీ. రామనామస్తుతిఁ గ్రాలి ఫలాహార ◆ వృత్తిఁ జరించుశుకేంద్రములును
నీలకంఠాకృతి నెఱపుచు నానంద ◆ తాండవం బాడుచంద్రకిచయంబు
నమృతాశయంబునఁ గమలజాన్వేషణే ◆ చ్ఛం జెలంగుపరమహంసవ్రజంబు
వనములఁ బడి మాధవప్రసాదముఁ గోరు ◆ కృష్ణవేషద్విజబృందములును
తే. సతతవివిధాగమాంతవాసనలవలన ◆ నాద మెఱిఁగి నిరంతరామోదలీల
నలరుసిద్ధాళులును గల్గి యవ్వనంబు ◆ గనుఁగొనఁగ నబ్ర మొదవించుఁ గద నృపాల. ‖ 72 ‖

క. ఆలీలావనమున ఘన ◆ హేలామార్గమునఁ జెలఁగి యిమ్ముగ సుమనః
కేలీరతి నలరారెడు ◆ బాలారత్నములఁ గంటి భావజరూపా. ‖ 73 ‖

ఉ. ఆమహిళాలలామములయందు రహిం బొడగంటి దివ్యశో
భామృదుతాసుగంధపరిభాసితరూపవిలాసలీలలన్
వేమఱు గోము మీఱ యరవిందశరాసనుచే వెలుంగుక్రొ
మ్మామిడిపండువంటియొకమత్తమతంగజరాజగామినిన్. ‖ 74 ‖

ఉ. ఆయెలనాగసోయగ మయారె గణింప నొకించుకైన న
త్తోయజసూతిసృష్టిఁ గలతోయరుహాననలందుఁ జెంద ద
క్కాయజుఁ డబ్బురంబుగ జగంబులు గెల్వఁగ నేర్చి యిడ్డనున్
జాయకటారి గావలయుఁ జామ నిఁ కేమని యెంతు భూవరా. ‖ 75 ‖

సీ. కలికి బంగరుబొమ్మ గాఁబోలుఁ గాకున్న ◆ బరులనెమ్మది కాస పఱుపఁగలదె
కల్కి తొల్కరిమించు గాఁబోలుఁ గాకున్న ◆ నెఱయఁ దళుక్కని మెఱయఁగలదె
కన్నె గేదఁగిపూవు గాఁబోలుఁ గాకున్న ◆ జిలిబిలివలపులు చిలుకఁగలదె
కడిఁదివెన్నెలనిగ్గు గాఁబోలుఁ గాకున్నఁ ◆ గువలయామోదంబు గూర్పఁగలదె
తే. మేలినెత్తమ్మికొలను గాఁబోలుఁ గాక ◆ యున్న శృంగారరసయుక్తి నొనరఁగలదె
యహహ మనుజేశ మదనమాయాకిరాత ◆ ముక్తలీలాకురంగి యమ్మోహనాంగి. ‖ 76 ‖

సీ. కలికిబిత్తరివాలుతళ్కుఁజూపులసొరు ◆ హరిణీవిలాసంబు పరిభవించుఁ
బడఁతియబ్బురపుఁబెందొడలనిగారింపు ◆ రంభాపటుత్వంబురవళి గెల్చుఁ
గొమ్మనిద్దపుముద్దునెమ్మొగంబుహొరంగు ◆ చంద్రరేఖాస్ఫూర్తిఁ జౌక సేయుఁ
జానవాడెంపునున్మేనిచొకాటంబు ◆ హేమాతిశయలీల నెగ్గు లెన్ను

తే. సారసామోదసారశృంగారగిరమ ◆ చిత్రరేఖాశుభాకృతిఁ జిన్నపుచ్చు
భళిర యాలేమ దేవతాభామ యేమొ ◆ కాక యయ్యంద మింకఁ నెందుఁ గలదు భువిని. ‖ 77 ‖

సీ. కలకంఠిజఘనంబు కాంచికాస్థానంబు ◆ మధురామృతస్థలి మగువమోవి
యన్నులమిన్నపదాగ్రంబు కూర్మంబు ◆ పడఁతుకజిల్గునెన్నడుము మాయ
నీలజీమూతంబు నెలఁతధమ్మిల్లంబు ◆ రాకేందుముఖరోమరాజి కాశి
నలినలోచననిమ్ననాభి కేదారంబు ◆ భామచన్దోయి శ్రీపర్వతంబు
తే. గాఁగ నృపచంద్ర సుక్షేత్రగరిమ నెపుడుఁ ◆ జెలఁగుచున్నది దాని భజింపఁగలుగు
పరమపురుషున కత్యంతభాసమాన ◆ నిరుపమానందసంసిద్ధి దొరకకున్నె. ‖ 78 ‖

సీ. అతివచెక్కులు గొప్పు నబ్దంబుల హసించుఁ ◆ బదములు గళము నబ్జముల మించుఁ
బొలఁతినాభియుఁ గుచంబులుఁ ఒక్రముల గేరు ◆ గమనంబు నారు నాగముల మీఱు
సతిమొగంబును నవ్వుఁ జంద్రస్ఫురణ నేలుఁ ◆ దనురపచు ల్వాలపు కాంచనముఁ బోలు
నువిదచూపుఁ బిఱుందుఁ గువలయంబు జయించు ◆ రదనముల్ గౌను హీరముల నెంచు
తే. నధిప యయ్యన్నుమిన్న సోయగముఁ గన్న ◆ ననిలసలిలచ్ఛదాహారు లగుచు వనులఁ
దద్దఁ గృశియించుజడదారిపెద్దలైన ◆ దాలి మంతయుఁ దూలి విరాలిఁ గొనరె. ‖ 79 ‖

వ. మఱియును. ‖ 80 ‖

ఉ. చేరిక నెంత రాజుచెవిచెంగట వ్రేలుచు నున్ననీలముల్
కోరిక నచ్చకోరదృశ క్రొవ్వెదసామ్యముఁ జెంద నేర్చునే
యూరక సారెకు న్మొఱయుచుండుమధువ్రతకోటు లెంత ఝం
కారము చూపిన న్ద్విరదగామిని వేనలిఁ బోల నేర్చునే. ‖ 81 ‖

క. ఘన మొకతఱి నొక్కొకది ◆ క్కున వృష్టి యొనర్చుఁ గాని కోమలి తుఱుమన్
ఘనము ఘన మగుచు నెల్లెడఁ ◆ గొనకొని శృంగారరసము గురియు నృపాలా. ‖ 82 ‖

తే. ఉవిద నెమ్మోముదమ్మికి నోడి స్రుక్కి ◆ తద్విరోధంబు సాధింపఁ దలఁచెఁ గాక
జనులకెల్లను గడుఁ జల్లఁందనముఁ జూపు ◆ తొగలతేఁ డబ్జముల కేల పగతుఁ డయ్యె. ‖ 83 ‖

క. అంగన కన్బొమకవతో ◆ సింగిణు లెదిరించి గెలుపు చేకుఱ కవనిన్
వంగి శర మూని కడు నా ◆ ర్తిం గొఱలుచు నుండెఁ జుమ్ము నృపకులతిలకా. ‖ 84 ‖

క. అచ్చానననాసతోడను ◆ ఱిచ్చపడక మొనసి తుదిని ఱే కత్తి వడిన్
విచ్చెం జంపకముకుళము ◆ చెచ్చెర మఱి నువ్వుఁబువ్వు స్నేహం బూనెన్. ‖ 85 ‖

క. అప్పొలఁతికన్నులందము ◆ తప్పక కన్గొనుచు నుండి తగ బేడిసమీ
లెప్పుడు నత్తెఱఁ గలవడ ◆ ఱెప్పలు మోడుపక యుండె ఱేపు న్మాపున్. ‖ 86 ‖

తే. మీలు మే లోర్వ లే కెంత మిట్టిపడిన ◆ నేణము ల్త్రాణమై నెంత యెగిరిపడినఁ
దూపు లేపార నిల నెంత తూలిపడినఁ ◆ జెలువనిడువాలుచూపుల గెలువఁగలవె. ‖ 87 ‖

క. మఱి మఱియుఁ దోమి తోమియు ◆ మెఱుఁ గిడక వెలుంగ కుండు మృదుదర్పణముల్
తెఱవనునుఁచెక్కుఁగవ కె ◆ త్తెఱఁగున నెన వచ్చు వసుమతీవరచంద్రా. || 88 ||

క. తామరసనేత్రవీనులతో మొనసి జయింపలేక త్రొక్కటమున నెం
తే మలకలఁ బడి స్రుక్కుచు ◆ నేమఱు శష్కులులు గ్రాఁగి వేఁగుచునండున్. || 89 ||

సీ. ననఁబోఁడియధరంబునకు సాటి గా కేమొ ◆ బంధుజీవకము నిగ్గరథ మయ్యెఁ
దెఱవమెఱుంగువాతెఱ కుద్ది గా కేమొ ◆ కురువిందమణి త్రాసగుణము పూనెఁ
బొలఁతిరదచ్ఛదంబున కెన గా కేమొ ◆ కఱు కూని చిగురాకు కారు పాఱె
శుకవాణిముద్దుమోవికి జోక గా కేమొ ◆ సడలి బింబఫలంబు చప్పఁబడియె
తే. నంబుజేక్షణచక్కెరకెంబెదవికి ◆ నీడు గా కేమొ విద్రుమం బెల్ల ప్రొద్దు
మ్రానుపడి యుండె నయ్యారె మాట లేటి ◆ కన్ను దలమిన్నసోయగం బెన్న నరిది. || 90 ||

క. చిగురాకుఁబోఁడినునుఁగ్రొం ◆ జిగిబిగిపలుచాల్పు దొడరి సేమంబున గె
ల్పు కొనం జాలక యెపుడును ◆ మగరా ల్జగడాలు పూని మట్టం గ్రాలెన్. || 91 ||

తే. లేమగళమున కుద్దిగా లేక యోడి ◆ సుడివడుచు లోన బిగి చెడి యడుగు వట్టి
దగము దరమూని మొద సేయ దాని కిపు డు ◆ దర మనెడుపేరు విడువక తవిలియుండె. || 92 ||

తే. రతిమనోభవకేలి కారామసీమఁ ◆ బొదలునవచూతలతలు గాఁబోలు దాని
బాహులత లట్లు గా కున్న బాణిపల్ల ◆ వములు రాజిల నేర్చునే వానితుదల. || 93 ||

సీ. పట్టినప్పుడె కంది పస దప్పి కడుమెత్తఁ ◆ బా టూనుక్రొన్ననబంతు లెనయె
పట్ట నబ్బక రెచ్చి పాఱి జో డెడవాసి ◆ కలఁగెడుకొదమజక్కవలు తులయె
పట్టి నొక్కిన శిలాప్రాయంబు లై నును ◆ గోరు నాటక యుండుకొండ లీడె
పట్టి రాచినయంత బలువన్నియల గరం ◆ గెడు మేటిజాళువాగిండ్లు సరియె
తే. పట్టఁ బట్టఁగఁ దిరుగుడు పడుచు నుండు ◆ మేలిరతనంపుపలుబొంగరాలు దొరయె
యహహ ధరణీశ యత్తలిరాకుఁబోఁడి ◆ కులుకుసిబ్బెంపువలిగబ్బిగుబ్బకవకు. || 94 ||

క. నీలాహి యనుచుఁ దుమ్మెద ◆ చా లనుచు న్నల్లచీమ చా లనుచు జనుల్
తోలుదురు గాని చెలిరో ◆ మాళి ప్రజ న్గెలుచుమరునియసిధార సుమీ. || 95 ||

తే. చంపకామోదవళుల జయింపఁ బూని ◆ యేటితరగలు పెల్లున నెగసి తద్దఁ
బెరిగి విఱుగుచు నుండె నిద్ధరణిలోన ◆ నరయ జడభావులతెఱంగు లట్ల కావె. || 96 ||

క. సుడివడి కలఁగుచు స్రుక్కెడు ◆ మడుఁగులు చెలి నాభి పోల్ప మాదిరి యగునే
యడవుల బొబ్బలు వెట్టుచు ◆ నడలెడుహరు లింతికౌనునాకృతిఁ గనునే. || 97 ||

క. తరుణీమణిజఘనమునకు ◆ దొర గాక తృణంబు పూని తుద లేక వసుం
ధర యొడితొడుగులఁ బడి మహి ◆ దరములు చుట్టుపడి తాపు దరలక యుండెన్. || 98 ||

తే. పొలఁతియూరుద్వయంబుతోఁ బోరి మున్ను ◆ గెల్పు గొన లేక పొర యూని దళము లెలయఁ
గాచి యుండియు గెలఁ జేవ గలుగకుంట ◆ నంటులకు నెల్లఁ దలవంపు లయ్యెఁ జుమ్మి. || 99 ||

క. లలనామణిపిఱుఁదులతోఁ ◆ దుల యగుభ్రమ నుఱుక దిరుగఁ దొడఁగె రథాంగం
బులు మఱియుఁ గుప్ప వడుచుం ◆ బులినంబులు మెత్తఁబాటుఁ బూనెం జుమ్మీ. || 100 ||

తే. కలమగర్భంబులో మహోత్పలదళాక్షి ◆ పిక్కలకు నోడి తద్దయుఁ బీఁకెపాఱి
వెన్ను చూపి తృణం బూని యెన్నరాని ◆ నానఁ దలవంచుచుండె ననారతంబు. || 101 ||

తే. పొలఁతిమీఁగాళ్లతో నెనఁ బోలలేని ◆ మోస మొదవిన వంతులు మునిఁగి మునిఁగి
మాటిమాటికి మేటితాఁబేటిదాఁటు ◆ గుట్టు చెడి పొట్టలోఁ దలఁ గ్రుక్కుకొనియె. || 102 ||

చ. రమణిపదద్వయంబుసరి రా నెదఁ గోరి యనేకకల్పముల్
కమలము కంఠగాత్రగత గాఁగ జలంబుల నర్కువేఁడి యం
దమితవిభాసుగంధమృదుతామలతల్ కమలాకరత్వముం
గమలభవాస్పదత్వమును గాంచి తదంఘ్రులఁ బోల దింతయున్. ‖ 103 ‖

తే. జలరుహేక్షణపదనఖంబులను బోలఁ ◆ జాల కెంతయు రిక్కచా ల్బేలపడియెఁ
గరనఖములకుఁ గేతకీగర్భదళము ◆ లోడి కంటకభావంబు వీడ కుండె. ‖ 104 ‖

తే. బాలతనుకాంతితో సాటి పోలఁ గోరి ◆ పృథ్వి ననలప్రవేశంబు పెక్కుమాఱ్లు
చేసి యెఱపులఁబడెఁ గాని వీస మైనఁ ◆ బోలఁగాఁ జాలదయ్యె జాంబూనదంబు. ‖ 105 ‖

సీ. వ్యాళము ల్దల వంచి ◆ నేలఁ జాగిలఁబడెఁ ◆ బూని నీలపురాలు పూరిఁ గఱచె
నద్రులు పాదంబులాడక పడియుండె ◆ వాలెంబు నేనుఁగుల్ గేలు మోడ్చె
బెదరి చూచుచు లేళ్లు చెదరి పాఱఁ దొడంగె ◆ నీరజంబులు లోతునీటఁ బడియెఁ
గోయిలమూఁకలు గొదకొని చె ట్టెక్కె ◆ సింగముల్ గుహల నడంగి డాఁగె
తే. నవనినాయక నిఖిలలోకాద్భుతాభి ◆ నవవిలాసవిభాసమున్నతిఁ దనర్చు
కలికిరోమాళికచకుచగమననయన ◆ ముఖవచోమధ్యములతోడ మొనసి యోడి. ‖ 106 ‖

మ. పలుగు ల్వేయు నిఁకేల భూరమణ యాబంగారు ల్బొమ్మ యా
వలికప్రంపుటనంటికొమ్మొలక యావాల్గంటి యాశ్యామ యా
యలివేణీజనచూళికాభరణ మయ్యంభోజపత్రాక్షి యా
తలిరుంబ్రాయపుఁగల్కిరాచిలుక యాతన్వంగి నీకే తగున్. ‖ 107 ‖

క. అని సంగడికాఁ డెఱిఁగిం ◆ చిన విని యత్యంతముదితచిత్తుం డగుచున్
జనవరుఁ డటఁ దరలి రయం ◆ బునఁ జనియె వధూటిఁ జూచుబులు పెదఁ బొదలన్. ‖ 108 ‖

క. చని చని వని వనితం బెనఁ ◆ కొన మోహం బంతకంతకు న్మనమున నూ
ల్కొన నజ్జనపతి సఖునిం ◆ గనులొని యి ట్లనియె నర్మగర్భము గాఁగన్. ‖ 109 ‖

చ. కనుఁగొను సంగడీఁడ వనకన్యకుఁ గాలభుజంగుఁ డిడ్డనూ
తననఖరేఖలో యనఁగఁ దద్దయు మోదుగమొగ్గ లొప్పెడిన్
జనవర నీవు నవ్వికచసారసలోచనగుబ్బదోయిపై
దనగునఖాంకురాంకములు దద్దయు నించెదు కూర్మి మీఱఁగన్. ‖ 110 ‖

తే. అలరుగుత్తులపై వ్రాలి యదె మరంద ◆ మానుచున్నది మగతేఁటి యనఁగ చూడు
సామి యాలేమకుచగుళుచ్ఛములమీఁద ◆ వ్రాలి కెమ్మోవితేనియ గ్రోలె దీవు. ‖ 111 ‖

క. చెలికాఁడ గండుఁగోయిల ◆ నలిఁ గెందలిరాకు గం ట్లొనర్చెడుఁ గంటే
భళిభళి యచ్చెలివాతెఱఁ ◆ బలుగం ట్లొనరించె దీవుఁ బ్రమదమున నృపా. ‖ 112 ‖

క. పున్నాగముతోఁ బెనఁగొను ◆ చున్నది లతకూన చూడు మోహో సఖుఁడా
పున్నాగమ నీతో న ◆ చ్చిన్నెలక్రొందీఁగఁబోఁడి చెలిమి బెనంగున్. ‖ 113 ‖

చ. పలుమఱు గీరదంపతులు భావభవప్రధనక్రియారతిన్
మెలఁగుచు మింటిదాఁకఁ బొదమిద్దియఁ గేరెడుఁ జూడు నెచ్చెలీ
భళిభళి రాజచంద్ర యల పంకజపత్రవిశాలలోచనం
గలసి సువర్ణగేహమునఁ గామసుఖోన్నతిఁ గేరె దీ విఁకన్. ‖ 114 ‖

క. కప్పురపుబూది పైపై ◆ గప్పుచు నున్నది యనంటిఁ గనుఁగొనుము సఖా
యప్పొలఁతి సురతవేళలఁ ◆ గప్పును నీమేన వలపుఁ గప్పుర మధిపా. ‖ 115 ‖

క. కలరవ మల్లదె యింపుగఁ ◆ బలుకుచు నున్నయది చూడు ప్రాణసఖా నిన్
గలసి రతికేళివేళల ◆ గళరవ మొనరించు నట్లు కలికి నృపాలా. ‖ 116 ‖

క. పలుమఱుఁ బూఁదేనెలు మెయిఁ ◆ జిలికెడు నిదె చూడు పొగడ చెలికాఁడ మహీ
తలనాథ నీపయిన్ హిమ ◆ జలపూరం బిట్లు లలన చల్లెడుఁ జుమ్మీ. ‖ 117 ‖

క. లికుచము లివె చూడుము కే ◆ లికి సొం పొనరింపఁ జాఁగె లీలాసఖుఁడా
యెకీమీఁడ యల్ల జవరా ◆ లికుచంబులు నిట్టు లలరులే నీచేతన్. ‖ 118 ‖

తే. హరిణి నల్లదె కాంచు మొయ్యన వయస్య ◆ పట్ట నబ్బక వడి లేచి పఱచుచున్న
దహహ ధరణీశ యమ్మనోహరవిలాస ◆ హరిణి నీ కబ్రముగఁ జేతి కబ్బుఁ జుమ్మ. ‖ 119 ‖

తే. అనుచు నర్మోక్తు లాడుచు నవనిజాని ◆ వనపదవినోదములు గనుంగొనుచు నుండె
ననిన విని దేవముని నల్వ నవలికతయుఁ ◆ దెలుపవే యని తవిలి ప్రార్థించుటయును. ‖ 120 ‖

మ. దళితారాతినిశాట భాసురవియద్ధంగాజటాజూట మం
జులరాజార్ధకిరీట ఘోరసమరక్షోణీనిరాఘాట ని
స్తులవేదత్రయ ఘోట పాణితమహాదోషాటవీఝాట ని
ర్మలధౌతాచలకూట దుష్టపలభుగ్భ్రామ్యత్పురోఘాటనా. ‖ 121 ‖

క. డిండీరపుండరీకా ◆ ఖండలశుండాలచంద్ర ఖండపయశ్శ్రీ
ఖండాఖండయశోవృత ◆ కుండలిమండలవిభూష కుక్కుటవేషా. ‖ 122 ‖

మాలిని. కథితశుభచరిత్రా గ్రావకన్యాకళత్రా
మథితవిమతగోత్రా మౌనిసంస్తోత్రపాత్రా
ప్రథనదితిజజైత్రా భక్తచిత్తాబ్జమిత్రా
పృథులధవళగాత్రా భీకరోగ్రాగ్నినేత్రా. ‖ 123 ‖

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వరకరుణాకటాక్షనిరీక్షణసంలబ్ధసరసకవితాసామ్రా
జ్యధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్రపవిత్ర కూచిమంచిగంగానామాత్యపు
త్త్ర సకలసంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ తిమ్మకవిసార్వభౌమప్రణీతం బ
యిన రసికజనమనోభిరామం బనుశృంగారరసప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము.

శ్రీరస్తు
ఓం నమః కామేశ్వర్యై

రసికజనమనోభిరామము

తృతీయాశ్వాసము

లలితవృషతురంగా
శైలసుతాసంగ కలశజలధినిషంగా
కాలోన్మదభంగా ధృత
హేలాసారంగ కుక్కుటేశ్వరలింగా. || 1 ||

తే. అవధరింపుము సురమౌని కబ్జగర్భుఁ ◆ డవలికత దెల్పఁ బూని యి ట్లనుచుఁ బలికె
నట్ల వనవీథిఁ దిరుగుచు నరిగి నృపతి ◆ యక్కజంబుగ ముందఱ నొక్కచోట. || 2 ||

సీ. గుజ్జులమావిమ్రాఁకుల నంటిఁ బ్రాఁకిన ◆ పరువంపుదాఁకపందిరుబదరులఁ
జలువచెంగలువబావులక్రేవ జొల్లొను ◆ వలపుగొజ్జఁగినీటివంతచెంతఁ
బ్రోదికప్రపనంటిబోదెచాలుపుమ్రోలఁ ◆ బొరలుపూలఁదేనెజక్కరలపజ్జ
మొల్లంపుఁదావు లీన్మల్లెక్రొన్ననతీవ ◆ వెసగొన్నగున్నసంపెగలనీడ
తే. మెఱుఁగుచందురురానిగ్గుటరఁగుమీఁద ◆ నీటుగా గోర వీణియ మీటుకొనుచు
బోటులను గూడి జిలిబిలిపాటఁ బాడు ◆ చున్నయెలజవ్వనపుటన్నుమిన్నఁ గనియె. || 3 ||

చ. కని యెనలేనివేడ్క లెదఁ గ్రమ్మఁగ నమ్మగమిన్న మిన్నకా
వనజదళాక్షిచెంత కనివారణఁ జేరి జగజ్జనానురం
జన మొనగూర్చుదానివిలసన్మృదుగానకథాప్రశస్తి కా
త్మను గడు సోలి యి ట్లను ముదంబును నబ్బురముం బెనంగొనన్. || 4 ||

సీ. సరససారంగాతిశయనిరూఢిఁ దనర్చెఁ ◆ బొలఁతివాల్చూపులు పొలుపు మీఱి
లాలితగతిని వరాళివైఖరిఁ బొల్చెఁ ◆ బల్లవపాణిధమ్మి గరిమ
శంకరాభరణంబు సౌష్ఠవంబును మించె ◆ భామినీరత్నంబురోమరాజి
రహిని బున్నాగాభిరామలీల నెసంగె ◆ నీలనీలాలకనిమ్ననాభి
తే. యహహ యీచాన గానవిద్యావిధాన ◆ మునఁ జెలఁగి రాగ మొనగూర్చు చొనరె దీనిఁ
గన్న మృగఖగపన్నగాగమము లెలమి ◆ నుల్లసిల్లవె యని సోలుచున్నయెడల. || 5 ||

క. అచలావల్లభుఁ గనుఁగొని ◆ సచివగ్రామణి నితాంతసంతోషరస
ప్రచురత నెమ్మదిఁ బొదువఁగ ◆ వచియించెన్ హితమ్మృదూక్తివైఖరి మెఱయన్. || 6 ||

మ. తలుకార్మేల్మిపసిండిబొమ్మకరణిన్ ◆ దట్టంపునెమ్మేనిచా
యలు నల్దిక్కులఁ గ్రమ్మి పర్వఁగ వయస్యామధ్యభాగంబునం
బలుకుంగిన్నరవీణె మీటుచుఁ గథాప్రాగల్భ్యము ల్చూపుని
క్కలకంఠీజనచూళికాభరణముం గంటే నృపాలాగ్రణీ. || 7 ||

చ. ఉవిదవయోవిలాసవిభవోజ్జ్వలరూపకళాప్రచారముల్
తవిలినవేడ్క నీకు వితతంబుగ ము న్నెఱిఁగించితిం గదా
ప్రవిమలలీల నీ విపుడు బద్మముఖిం గనుఁగొంటివే కదా
యవనితలేంద్ర నావచన మాత్మఁ దలంచిన నిక్కమేకదా. ‖ 8 ‖

ఉ. కూరిమి మీఱ నవ్వికచకోమలతామరసాయతాక్షి నిన్
గోరి వరించెనేని యిదుగో పదియాఱవవన్నెమేల్మిబం
గారముతోడ దివ్యతరకాంతిసముల్లసదబ్జరాగముం
గూరిచినట్ల సుమ్ము నృపకుంజ మాటలు వేయు నేటికిన్. ‖ 9 ‖

చ. పలుకుల కేమి భూపకులపావన యావనరాశివేష్టితా
చలఁ గలమేల్పొలంతుకల సారెకుఁ గల్గొనుచుందుమే కదా
భళిభళి యెందు నేని యొకపట్టున నీభువనైకమోహనో
జ్జలలలితాంగివంటి నెఱచందపుఁగుల్కుమిటారిఁ గంటిమే. ‖ 10 ‖

తే. కంజముఖి నీమనోహాకారరేఖ ◆ మంజుగతిఁ గన్గొనియెనేని మదనవి ఖ
పుంజనిష్పీడ్యమానయై పొదలి యాత ◆ రంజిలుచు నిన్నుఁ గవయుఁ బో రాజచంద్ర. ‖ 11 ‖

వ. అనిన నాసచివగ్రామణికి నృపాలాగ్ర యి ట్లనియె. ‖ 12 ‖

సీ. అద్దిరా యాచిన్నిముద్దుక్రొన్ననఁబోఁడి ◆ కలికినిద్దంపుఁగ్రొక్కారుమెఱుఁగు
మెఱుఁగు గా దిది యల్ల చెఱకువిల్దొరచే ◆ కడిదినెత్తావిచెంగలువదండ
దండగా దిది నల్వ దంటతనం బేరు ◆ పడ నొనర్చినమేలిపసిఁడిబొమ్మ
బొమ్మ గా దిది జగంబుల కెల్ల మిన్న యై ◆ సొంపారుబలుమానికంపుఁదొడవు
తే. తొడవు గా దిది వలరాచపడఁతిమిన్న ◆ వలనుగా నిడ్డ శృంగారవనములోన
మలయునెఱపూఁతగుజ్జులేమావిమోక ◆ యహహ వనజాస్యఁ బొగడ శక్యమె వయస్య. ‖ 13 ‖

ఉ. అందనిమ్రానుపండులకు నాస వహించినరీతి దివ్యసం
క్రందనపట్టణద్వరదగామినిపొం దెదఁ గోరి వేడ్కమై
నిందుల కేగుదెంచుట కొకించుక నెయ్య మెలర్ప నీజగ
త్సుందరి దా ననుం గవయఁ జూచునొ లేదొ కదా సుహృద్వరా. ‖ 14 ‖

ఉ. కన్నియ వన్నియ ల్బిరయఁ గ్రన్నన నన్ననవిల్తుకేళికిన్
న న్నెన లేనికూర్మి మది నాటుకొనం గవకూడ కున్నచోఁ
గ్రొన్నెలవెన్నెల న్మదకోకిలకాకలికారవంబులం
జెన్నఱి యెన్నిబన్నములఁ జెందఁగఁ గూడునొ యేమి సేయుదున్. ‖ 15 ‖

ఆ. అని వచించి యిర్వురును దమ కొకతూరి ◆ చనిన నవ్విశాలజలజనయన
సి గ్గెసంగ నెచట దిగ్గన జరుగునో ◆ యనుచుఁ దలఁచి మరల నతని కనియె. ‖ 16 ‖

ఆ. చెలిమికాఁడ నీవు వల నొప్ప ముంగలఁ ◆ జని కడంకతోన యనుఁగుఁజెలులఁ
గూడి క్రీడ సేయు చేడెల తలమిన్న ◆ గాంచి వేగ దానికరుణ వడసి. ‖ 17 ‖

క. తిన్ననిజిలిబిలిపలుకులఁ ◆ గన్నియడెందంబు మిగులఁ గరఁగింపుచు నీ
వున్నయెడ న్నే నచటికి ◆ సన్నకసన్నన్ రయంబ. చనుదెంతుఁ జుమీ. ‖ 18 ‖

శా. ఏచందంబున నింతిచెంత కఱ లే కి వేగి దర్శించెదో
యేచందంబున మాటలాడి మదిలో నింపొందఁగాఁ జేసెదో
యాచంద్రాననపొందు నా కెటువలెన్ హత్తించెదో మేలు నీ
వాచాప్రౌఢిమ నేఁడు చూతము గదా బాలేందులీలాసఖా. ‖ 19 ‖

తే. అని యతని వీడుకొల్పి యజ్జనవిభుండు ◆ గోర్కె దైవార నొకచోటఁ గూరుచుండె
నృపసఖుండును వేల్పుఁగన్నియలచెంత ◆ కబ్రముగ నేగి నిలుచున్న యవసరమున. ‖ 20 ‖

ఉ. సామజరాజకుంభవిలసత్కుచకుంభభరానతాంగు లై
నేమ మెలర్ప లేచి యతనిం బ్రియమారఁగఁ జూచి భూరిను
త్రామమణిప్రభావళివిరాజితదివ్యసువర్ణపీఠికం
దామరసాయతాక్షులు ముదంబున నిల్పిరి రాజదూతునిన్. ‖ 21 ‖

వ. అట్లు గూర్చుండంజేసి యున్న సమయంబున. ‖ 22 ‖

సీ. నీలంపుగాజుల నెఱిమించుపచ్చల ◆ కీలుకడెంబుడాకేలు మెఱుఁగు
వలిగబ్బిగుబ్బచ న్గెలనికి దార్చుచు ◆ సొలపుక్రేఁగంటివాల్చూపు లలరఁ
జిన్నారితెలినవ్వు చెక్కుటద్దములు లే ◆ వెన్నెలనిగ్గులవిధ మొనర్పఁ
గమ్మచక్కెరపానకమ్ము లిమ్ముగఁ గ్రమ్ము ◆ ముద్దునిద్దంపుకెమ్మోవి గదలఁ
తే. గలికి యారాచనెచ్చెలిఁ గని నయ మ్మె ◆ నయ వసంతాగమారంభనవరసాల
కిసలయగ్రాసమత్తకోకిలవధూస ◆ మంచితాలాపముల నిట్టు లనుచుఁ బలికె. ‖ 23 ‖

ఉ. ఎచ్చటనుండి యెచ్చటికి నేగెద వెవ్వరివాఁడ విచ్చమై
నిచ్చటి కేగుదేరఁ బని యెయ్యెది నీవు వసించునున్కిప
ట్టెచట నిన్ను నేలుమనుజేశ్వరుఁ డెవ్వఁడు దప్ప కిన్నియుం
జెచ్చెర నింక మాకెఱుఁగఁజేయుము మాటలు వేయు నేటికిన్. ‖ 24 ‖

చ. అన విని రాచదూత వినయమ్మున నమ్మధురాధరోష్ఠిఁ గ
న్గొని యనియె న్సరోజదళకోమలచారుశరీర యేను స
జ్జనపరిపాలనప్రథితసారగుణాకరుఁ డై సమున్నతిన్
దనరుబుతుధ్వజప్రభువంతంసముగారవపున్వయస్యుఁడన్. ‖ 25 ‖

క. పేరు మతిమంతుఁ డం డ్రీ ◆ ధారుణిఁ గల్యాణపురము తరుణీమణి మా
యూ రిచటికి వేఁటకు నా ◆ భూరమణుఁడు సేనఁ గూడి పొలుపుగ వచ్చెన్. ‖ 26 ‖

ఆ. వచ్చి కొంతతడవు వనవిహారము సల్పి ◆ యిన్నగాగ్రమున మహేశుఁ గొల్చి
చనుచు నీవిచిత్రసంగీతనాదంబు ◆ వీను లలర నిపుడు విని చెలంగి. ‖ 27 ‖

ఆ. నిన్నుఁ జూచి వేడ్క నివ్వటిల్లఁగఁ గొన్ని ◆ మాట లాడి చనఁగ మదిఁ దలంచి
వచ్చుచున్నవాఁడు వనజాక్షి మారాజు ◆ మునుపడంగ నన్నుఁ బనిచె నిటకు. ‖ 28 ‖

క. ఆపృథ్వీవరకుంజరు ◆ రూపవయఃప్రాభవములు రూఢిగ నీ విం
దేపారఁ జూచి మదిలో ◆ నోపైదలి యరిది వేడ్క నొందెదు సుమ్మీ. ‖ 29 ‖

శా. ఓరాజీవదళేక్షణాజనమణీ యోవాక్సుధాధోరణీ
యోరాకామిహిరాకరోజ్జ్వలముఖీ యోగానవిద్యానిధీ
యోరోలంబకదంబలంబకబరీ యోభవ్యదివ్యాకృతీ
మారాజన్యమహేంద్రుసొంపు వినుతింప న్శక్యమే యేరికిన్. ‖ 30 ‖

మ. తరుణాంభోజదళాయతాక్షి వినుమా తథ్యంబు నామాట కి
న్నరగంధర్వనిలింపమర్త్యవరుల న్వాకువ్వఁగా నేల యా
సరసాగ్రేసరుసోయగంబు దెగడం జాలు న్వసంతు న్నలుం
బురుహూతప్రభవస్మరైలబిలతుక్పూరూరవస్సోములన్. ‖ 31 ‖

ఉ. ఇంచుకసేపులోన జగ మెల్ల వెలుంగఁగఁజేయుతేజుచేఁ
బంచశరోపమానుఁ డగుపార్థివశేఖరుఁ డిందు వచ్చినం
గాంచి మనోనురాగమునఁ గామిను లెల్లఁ గరంగి పాఱఁగాఁ
జంచలనేత్ర నాపలుకు సత్యముగా నపు డాత్మ నెంచుమా. ‖ 32 ‖

ఉ. చెప్పెడి దేమి యానృపతిశేఖరించక్కదనంబు కన్నులం
దప్పక చూచిరేని పటుదర్పకఘోరశిలీముఖార్త లై

యొప్పులకుప్ప లైనగరుడోరగయక్షసుపర్వకన్యలున్
ముప్పిరి గొన్నమోహమున ముద్దియ తద్ద చలింపకుందురే. || 33 ||

క. చనఁ బూని యొక్కపలు కే ◆ ననఁ బూనిన నెచటఁ గోప మగుమో యని లో
ననుమానించెద నౌన ◆ న్విసుమా నావిన్నపంబు వికచాబ్జముఖీ. || 34 ||

మ. విమలాంగీతతుల న్శుభాకృతుల ము . న్వీక్షింపమో తత్ప్రకా
రము లెల్లం బరికింపమో యహహ యేరాజాస్యలం దైన నీ
రమణీయోజ్జ్వలరూపవిభ్రమకళాప్రాగల్భ్యముల్ గంటిమే
రమణీ సంతతసంశ్రితామరమణీ రామాజనగ్రామణీ. || 35 ||

క. తలుకారుకుందనముతోఁ ◆ దొలుకారుమెఱుంగుఁదీఁగెతోఁ దుల యగునీ
చెలువంపుమేని కారా ◆ నెలపొం దలవడకయున్న నిష్ఫలము గదా. || 36 ||

తే. వెలఁది నీరూపలావణ్యవిభ్రమముల ◆ కమ్మహారాజుతోఁ జెల్మి యబ్బెనేని
కోరి పదియాఱువన్నెబంగారుతోడఁ ◆ బద్మరాగంబుఁ గూర్చినపగిదిఁ జువ్వె. || 37 ||

క. బంధురతేజస్సరసిజ ◆ బంధుఁడు గుణసింధుఁ డగుచుఁ బరఁగెడుభూభృ
ద్గంధగజేంద్రము నిప్పుడు ◆ గాంధర్వవివాహమునను గైకొను మబలా. || 38 ||

చ. పలుకులు వేయు నేటి కిఁక భావభవప్రతిమానుఁ డైనయా
చెలువునితోడుతం జెలిమి చేకుఱ కున్న నయారె నీమెయిం
గలయలజవ్వనం బడవిఁ గాచినవెన్నెల సుమ్ము ముద్దులేఁ
జిలుకలకొల్కి నాపలుకు చిత్తమునం దలపోసి చూడుమా. || 39 ||

సీ. కనకంబునకుఁ దావి గలుగఁగఁజేయక ◆ పిల్లిగడ్డలకుఁ గల్పించినట్లు
పనసపంటికి మంచిపస యొడఁగూర్పక ◆ మునిడిపండ్లకుఁ దద్ద యొసఁగినట్లు
బుధపుంగవులకు డంబుగఁ గల్మి యొసఁగక ◆ కూళల కిరవారఁ గూర్చినట్లు
చిలుకను దడవేండ్లు జీవింపనీయక ◆ మఱిమఱి కాకుల మనిచినట్లు
తే. గాక యుండక సత్కళాకౌశలమునఁ ◆ గోరి యారాజుతో నిన్ను గూర్చె నేని
తమ్మిపూచూలిప్రోడతనమ్ము మిగుల ◆ మెచ్చవచ్చుఁ గదా నేఁడు మచ్చకంటి. || 40 ||

తే. అనుచు నతఁ డిట్లు వలికిన నాత్మలోన ◆ జాన యొకకొంతనొత్తఁబా టూని ఱేనిఁ
గనుఁగొనఁగఁ గోరి యత్తెఱం గనుఁగుఁజెలుల ◆ కగుపడక యుండఁ గ్రమ్ముచు నతని కనియె. || 41 ||

చ. అవు నవు మంచిప్రోడవె బళా యళు కించుక లేక మానినీ
నివహసభాగ్రభాగమున నిల్చి వినం గొఱగానివాక్యముల్
తవిలి వచింపఁ జాగితివి తాళుదుమే మఱియొక్కఁ డైన దూ
తవు నిను నేమియుం బలుక ధర్మము గా దని యుంటి మిత్తఱిన్. || 42 ||

క. సురనారీమణు లెచ్చట ◆ ధరణీజను లెచట నహహ తరతమభావం
బయంగ హస్తిమశకాం ◆ తర మిట్టివెడంగుపనులు దలఁపం జనునే. || 43 ||

తే. దూత వగుటను నోరికిఁ దోఁచినట్లు ◆ దివిరి మోమోడ కాడెదు దిట్ట వగుచుఁ
గటకటా ధూర్త మేము నీ కంటి కిప్పు ◆ డింత యెల్లిద మైతి మిం కేమి చెప్ప. || 44 ||

ఉ. మాటికి నొక్కభూవరకుమారుని నీ నిపు డేమొ తద్దయున్
మేటి యటంచు నెంచెదవు మే లహహా యతఁ డెన్న మామరు
త్కోటులలోన నేరి కెన గూరుపఁగాఁ దగుఁ జాలుఁ జాలు నీ
మాటలు గట్టిపెట్టి చనుమా మును వచ్చినత్రోవచొప్పునన్. || 45 ||

తే. అనుచు నవ్వేల్పుఁగెందలిరాకుఁబోడి ◆ పలుకుటయు నాతఁ డెదఁ గొంత గలఁగుచుండె
నపుడు నృపుఁ డచ్చటికి వేగ నరిగి దాని ◆ పజ్జ నిలిచిన నబ్బురపాటుతోడ. || 46 ||

సీ. జిలుఁగుపైటాణికంచెల పిక్కటిలి వలి ◆ కులుకుసిబ్బెపుగబ్బిగుబ్బ లుబ్బ
బిత్తరంపుఁబిసాళి బెళుకువాల్చూపుమొ ◆ త్తమ్ములు తమ్ములఁ గ్రుమ్మరింప
గాటంపునిడందకీల్గంటు పెన్ వ్రేఁగున ◆ నసదునెన్నడుము జవ్వాడి వడఁకఁ
గా ముత్యాలకమ్మలనునుడాలు ◆ తళుకు లేఁజెక్కుటద్దములఁ బొదల
తే. మంపుఁ దులకించుముత్తిగమానికముల ◆ మొలకనిద్దాకడానిసొమ్ములమెఱుంగు
లుమ్మడిగఁ గ్రమ్మి నెమ్మేన నొఱపు చూప ◆ రాజవరుఁ గాంచె లేచి యారాజవదన. || 47 ||

తే. కాంచి యాతనిమోహనాకారరేఖ ◆ కద్భుతం బంది మే ల్మే లయారె యిట్టి
సొగసుకాని మఱెం దైనఁ జూచి యెఱుఁగ ◆ నంచుఁ దల యూఁచి యవ్వేల్పువుమించుఁబోఁడి. || 48 ||

తే. చెలఁగి జగ మెల్ల మోహింపఁ జేయఁజాలు ◆ నవవిలాసాప్తి నెసఁగుచున్నాఁడు చూడ
నహహ యీరాచమిన్నసోయగముఁ గన్న ◆ వలసి పై వ్రాలరే యెట్టిపొలఁతు లైన. || 49 ||

ఉ. కన్నులవింటిదంటయును గల్వలనెచ్చెలియు న్వసంతుఁడుం
గిన్నరరాజనందనుఁడు గి మ్మనఁజాల రొకింత యైన ని
వ్వన్నెలప్రోకమేనిచెలువమ్ము గనుంగొని మేలు మే లహా
కన్నులపండు పై యలరుఁగా జవరాండ్రకు వీనియందముల్. || 50 ||

ఉ. తుమ్మెదదిమ్ముఁ బొ మ్మనుచుఁ ద్రోచునిగారపుసోగపెన్నెరుల్
కమ్మనితమ్మిక్రొన్ననలఁ గా దనుముద్దుమొగంబు మించుట
ద్దమ్ముల నిమ్ములన్ గెలువఁ దార్కొనునిద్దపుఁజెక్కుదోయిడా
లమ్మకచెల్ల వీనిచెలు వమ్మకరాంకుని నేలఁ జాలెడిన్. || 51 ||

సీ. మొలకనవ్వులవాఁడు తళుమనిద్దామేల్క ◆ డానిడా ల్గఱఁచుమేజానువాఁడు
తొగరువాతెఱవాఁడు తొగలసంగడికానిఁ ◆ దెగడునున్ముద్దునెమ్మొగమువాఁడు
వెడఁదకన్నులవాఁడు వేల్పురారాసొరు ◆ నిరసించుసోగపెన్నెఱులవాఁడు
మెఱుఁగుఁజెక్కులవాఁడు మేటిసింగపుగున్న ◆ నడలించుజిలుఁగునెన్నడుమువాఁడు
తే. డంబు మీఱినబవిరిగడ్డంబువాఁడు ◆ కంబునిభ మై తనర్చుకంఠంబువాఁడు
భళిర యీరాజకందర్పుచెలిమి నాకుఁ ◆ గలుగ వలవదె తొలుపుణ్యఫలము కలిమి. || 52 ||

క. అని యగ్గించుచు నెదుటం ◆ గనుపట్టువధూలలామఁ గనుఁగొని యెకిమీఁ
డనుపమహర్షాన్వితహృ ◆ ద్వనరుహుఁ డై యరిదివలపువలనం బలికెన్. || 53 ||

క. మువ్వములప్రోక యతనుని ◆ క్రొవ్వాఁడిలకోరి పూఁతగొజ్జఁగివలపున్
బువ్వలచెం డహహా యీ ◆ జవ్వని యెవ్వనియనుంగుఁజానయొ కదరా. || 54 ||

ఉ. వాలికమీల నేలనిడునాలుకనుంగవ మేలిజాలువా
డాలు గఱంచు మేను పగడాల నిసీ యను మోవి వేల్పురా
ఱాల జయించు వేనలితెఱంగుహొరం గవురయ్య ముజ్జగం
బేలుట గాదె యీకువలయేక్షణఁ గౌఁగిటఁ గూర్పఁ గల్గినన్. || 55 ||

ఉ. దీనిమెఱుంగుఁజెక్కులును దీనివెడందపిఱుందునందమున్
దీనిచొకారపుందుఱుము దీనిమిటారపుగబ్బిగుబ్బలున్
దీనినిగారపుందొడలు దీనిమొగంబును దీనికన్నులున్
దీనివిలాసముం గని మదింగడు సోలరె యెట్టిదిట్టలున్. || 56 ||

క. ఈహాటకనిభవిగ్రహ ◆ నీహాపరితృప్తి యొదవ నెనసినయెడలన్
బాహాలింగనసౌఖ్యం ◆ బాహా యింతింత యనుచు నలనియె తెలుపన్. || 57 ||

ఉ. అద్దిర దీనిచక్కఁదన మద్దివిజాంగనలందుఁ జెంద దీ
ముద్దులగుమ్మకౌఁగిటఁ బ్రమోద మెలర్ప వసింప కున్న రేల్
నిద్దుర వచ్చునే మరుఁడు నిల్వఁగనిచ్చునె కోర్కె హెచ్చునే
సుద్దుల కేమి దీనిఁ గొని సూనశరాహవకేళిఁ దేలెదన్. || 58 ||

ఉ. ఉబ్బుచు మాటిమాటికి సముద్ధత మోహనిబద్ధబుద్ధి మై
గొబ్బున నీ సరోజదళకోమలవిగ్రహమోవిచక్కిరల్
జుబ్బనజూఱగాఁ దవిలి జుఱ్ఱక కానిఁక నించు కైన న
బ్బబ్బ నితాంతకంతువిశిఖాగ్నిశిఖాపరితాప మాఱునే. ॥ 59 ॥

మ. తలిరుంబోఁడులు లేరె రూపవతు లిద్ధాత్రీస్థలిన్ వారిని
ర్మలసౌందర్యవయోవిలాసవిభవప్రాగల్భ్య మేయెక్కు డీ
యలివేణీజనచూళికామణిని గన్నంతన్ మనోజాస్త్రసం
చలితస్వాంతసరోజు లై తిరుగరే సన్యాసులు న్వెంబడిన్. ॥ 60 ॥

సీ. పుండరీకాక్షి యీభువనైకసుందరి ◆ యాత్రేయవదన యీయబ్జగంధి
పర్వతజఘన యీభామాశిరోమణి ◆ మాతంగగమన యీమంజువాణి
శాండిల్యకుచ యీయఖండతేజోనిధి ◆ శుకవాణి యీమణిప్రకరరదన
భృగుకటిభాగ యీబింబఫలాధర ◆ నారదవేణి యిన్నాతిమిన్న
తే. యౌర యియ్యింతి పరమహంసాకృతిని బొ ◆ సంగి యున్నది మది నరయంగ దీని
నెయ్య మొనగూడువానికు న్నిద్రనిబిడ ◆ నిరుపమానందయోగంబు దొరకు టరుదె. ॥ 61 ॥

సీ. ముగుదచూపులు శిలీముఖముల నిరసించుఁ ◆ కచపాళి ఘననీలరుచుల నెంచు
సతిమోము కమలలక్షణలీల నలరారు ◆ మధురాధరము విద్రుమముల గేరుఁ
గలికిపాదములు సౌగంధికంబుఁ బోలు ◆ నఖరాళి తారాళి నవ్వఁ జాలు
నతివపిఱుందు ధరామితోన్నతఁ బొల్చు ◆ గళసీమ శంఖపూగముల గెల్చు
తే. నళిశరాభ్రేంద్రమణిశశిజలజకిసల ◆ యప్రవాళాబ్జరాకల్హారమౌక్తి
కర్ణనగభూదరక్రముకములు సంగ్రహించుకొని నల్వ దీని సృజించెనేమొ. ॥ 62 ॥

సీ. తరుణి వేనలి పయోధరములఁ దెగడుఁ బ ◆ యోధరంబులు బల్ధరాధరముల
నదలించు నెఱి యధరాధరం బెన్నుఁ బ ◆ ల్లవముల మఱియుఁ బల్లవము లంబు
జంబుల గెల్చు భుజంబులు బిసనిక ◆ రంబుల గేరుఁ గరంబు లెపుడుఁ
గలఁగించు హల్లకావళులను వళు లుదం ◆ చితజలరాశివీచికల మించు
తే. మించు నెమ్మేనిడాలు గఱంచుఁ బసిఁడి ◆ నౌర యౌరగమహిలలసౌరు సౌర
సారసాక్షులచెలువంబు సవతు సేయ ◆ నీల లనయంపుఁనఖములఁ బోలఁ గలవె. ॥ 68 ॥

తే. పస నెసంగెడుగజనిమ్మపండ్లు గిండ్లు ◆ సిరులఁ జెన్నారుకుసుమమంజరులు గిరులు
నరయ నిమ్ముద్దుకెందలిరాకుఁబోఁడి ◆ కులుకుసిబ్బెంపుగబ్బిగుబ్బలకు దొరయె. ॥ 64 ॥

సీ. అవిరళవజ్రప్రహారంబులకుఁ దద్ద ◆ చలియించునుత్తాలశైలములును
దుహినాంబుబిందువు లొరలిన బిగి చెడి ◆ క్రుంకెడురాజీవకుట్మలములు
నగ్నిశిఖావాప్తి ననయంబు బిగి దప్పి ◆ కరఁగి పాఱుసువర్ణకలశములును
జంద్రయోగమునకుఁ జాలఁ దల్లడ మంది ◆ జత వీడి చనువలిజక్కవలును
తే. సాటియే వజ్రహారతుషారనీర ◆ కుంకుమసితాభ్రయుతము లై కుదురు మీఱి
జిగియు బిగి గల్గి యెడయక చెన్నొసంగు ◆ కన్నియలమిన్నా యిఱిగుబ్బచన్నుఁగవకు. ॥ 65 ॥

తే. కమలభవలీలఁ గాంచె మొగంబు నడుము ◆ హరివిలాసంబుఁ దాల్చె బిత్తరపుగుబ్బ
చన్నులు గిరీశవైఖరిఁ జెన్ను మీఱె ◆ నహహ యియ్యింతి మూర్తిత్రయాత్మిక గద. ॥ 66 ॥

సీ. అలిశశికార్ముకతిలకుసుమోత్పల ◆ కుందసౌగంధికకందుకములు
దర్పణశ్రీకారదరబిసాంబుజచక్ర ◆ వాకగుహోరగావర్తములును
గగనతరంగసైకతపిప్పలచ్ఛదా ◆ చలకరితుండనిషంగములును
గచ్ఛపవటఫలకల్హారతారకా ◆ వసుపటీరశిరీషకుసుమములును
తే. గూర్చి నలు వార నలువ యీక్రొమ్మెఱుంగుఁ ◆ బోఁడిఁ బోడిమి నొనరింపఁ బోలు నట్లు
గాక యుండిన నీభువనైకమోహ ◆ నాద్భుతాకారరేఖ యెందైనఁ గలదె. ॥ 67 ॥

క. నదమా పొక్కిలి జాంబూ ◆ నదమా మెయిచాయి కోకనదమా పద మా
పదమా జడ నడుము వియ ◆ త్పదమా నూఁగారు గూఢపదమా చెలికిన్. ॥ 68 ॥

క. రాజీవముఖికనుంగవ ◆ రాజద్గతి నెప్పుడుం దిరస్కృతి సేయున్
రాజీవముల న్విచలిత ◆ రాజీవములు బ్రఫుల్లరాజీవములన్. ‖ 69 ‖

తే. సరసలీలమహాఘన చయము నాత్మ ◆ దర్శకశ్రేణియును గూడి తరళనయన
కచకపోలవిలాసవైఖరులు పొగ ◆ మొగి ననేకశతాబ్దంబు లగుచు నుండు. ‖ 70 ‖

మ. గజయానం గుముదాక్షిఁ గేసరివలగ్న న్నీలనీకాశమ
స్తజఁ దారేశముఖి న్గనాంగదవిరాజద్బాహనుద్దీప్తతో
యజగర్భప్రసవోపమానరద రామాంగిం దగన్ దీని వే
భజియింప న్సుమనఃకదంబవరదర్పం బెల్లఁ జల్లాఱదే. ‖ 71 ‖

సీ. చంద్రబింబస్ఫూర్తి జౌ నొప్పె నీనాతి ◆ హాసాధరంబులు నాననంబుఁ
గోకనదాకృతిఁ గొనబారె నీకొమ్మ ◆ స్తననాభిబిలములు చరణయుగముఁ
గమలధరోద్వృత్తిఁ గనుపట్టె నీయింతి ◆ కరజఘనంబులు కచభరంబు
మధుకరసాదృశ్యవిధి నొప్పె నీలేమ ◆ మృదువచనోరువు ల్మెఱుఁగుటారు
తే. వజ్రపుష్పాతిశయలీల వఱలె నీవి ◆ లాసినిరదాంగకంబులు నాసికయును
భళిర యీరామసౌందర్యపటిమ యెన్న ◆ నన్నలినగర్భునకు నైన నలవి యగునె. ‖ 72 ‖

క. అని యితరేతరమోహము ◆ లనివారితగతులఁ బెరుఁగు ననిమిషనారీ
జనరత్నంబును భూభృ ◆ త్తనయశిఖామణియు వగలఁ దగిలిరి మిగులన్. ‖ 73 ‖

శా. ఆవేళం జిగురాకుబాకుదొర ప్రత్యాలీఢపాదస్థుఁ డై
చేవ ల్దీరెడుతుంటవింట మధుసంసేవాంచదిందిందిర
జ్యావల్లీనిబిడార్భటు ల్నినిచి కోపాటోప మేపార బల్
పూవుందూపులు చిమ్మె నిర్వ్యగపయిం బుంఖానుపుంఖంబుగన్. ‖ 74 ‖

తే. లేమవీక్షణమాలాశిలీముఖములు ◆ శంబరారాతిశితసుమసాయకములు
గాటముగఁ బర్వియు న్మదిఁ గాఁడుటయును ◆ వసుమతీజాని పరవశస్వాంతుఁ డయ్యె. ‖ 75 ‖

క. అత్తఱి బిత్తరిఁ గని భూభృత్తనయోత్తముఁడు దత్తరిలుచిత్తమునన్
మెత్తఁబడి క్రొత్తవలపులు ◆ హత్తఁగ నత్తెఱవ కిట్టు లనియెం బ్రేమన్. ‖ 76 ‖

క. ఎవ్వరిదానవు నీపే ◆ ర్వతె యేమిటికి వచ్చి తిచ్చొంగటికిన్
నెవ్వడి నీఱుఁ గంతయుఁ ◆ బువ్వారుంబోఁడి నాకు బొంకక చెపుమా. ‖ 77 ‖

చ. తొలకరిక్రొమ్మెఱుంగుక్రియఁ దోపఁ దళుక్కని నీవు ముంగలన్
నిలిచిన గుండె ఝల్లుమని నీసొగ సెల్ల గడంక మీఱఁ గ
న్నులఁ గనినంత నుండియు మనోభవుఁ డేమియు నిల్వనీఁ డహా
చిలుకలకొల్కి న న్నెదను జేర్చి కృపామతి నుద్ధరింపవే. ‖ 78 ‖

క. అకటా మరుఁ డిపు డుల్లం ◆ బకటావికటముగఁ జేసి యడ లూన్చెను నీ
నికటాగ్రసీమ నిడి పూ ◆ ని కటాక్షవిలోకనమున నెఱిఁ బ్రోవు చెలీ. ‖ 79 ‖

క. వీటీపాటీరాగరు ◆ హాటకతాటంకమణిమయాభరణంబుల్
గూటువలుగ నిడియెద నిఁక ◆ జోటీ మాట్లాడి ముద్దు చూపం గదవే. ‖ 80 ‖

క. ఈరేడుజగములం దిఁక నేరీ నీరీతిగోతు లెన్నిక గనునొ
య్యారీ తీ రగుకులుకుమి ◆ టారీ వలఱేనిమేల్కటారీ నారీ. ‖ 81 ‖

క. అలికికీరపికమరాళా ◆ వలికిం గరువలికి మరునివాలారుంబూ
ములికిగమిసోకులకు నో ◆ కలికీ మదిఁ దాళఁజాలఁ గలఁత లి కేలా. ‖ 82 ‖

క. కులుకుచు జిలిబిలిపలుకులు ◆ చిలుకుచు వలిగుబ్బ లెదను జేర్పవె మరుపూ
ములికీ కలికి చిలుకల ◆ కొలికీ మది నూలుకొనెడు కోరిక దీరన్. ‖ 83 ‖

క. కొమ్మా మదనునిపూవుం ◆ గొమ్మా నెమ్మది యెలర్పఁ గొమ్మా కడుఁ దో
ర మ్మైనసొమ్ము లిడియెద ◆ రమ్మా ననుఁ గూడి మాపురమ్మున కెలమిన్. ‖ 84 ‖

వ. అని యనేకప్రకారంబులం బ్రార్థించిన నమ్మించుఁబోఁడి యించుక దల వంచి మిన్న
కున్న సన్న యెఱింగి యన్నెలంతుకబోటికత్తియ యగుమదనమోహిని యన్నరేం
ద్రచంద్రుం గాంచి యి ట్లనియె. ‖ 85 ‖

తే. అవనినాయక సుశ్యామ యనెడుపేర ◆ నలరు గంధర్వరాజకన్యాలలామ
యివ్వెలందుక దీనికై యిట్లు వగలఁ ◆ దగులఁదగునయ్య మీవంటితగవరులకు. ‖ 86 ‖

తే. కన్నవారెల్ల నగఁ దముఁ గన్నవారి ◆ మిన్న కెంతయుఁ బోనాడి యెన్నరాని
మున్నెఱికెల మెలంగుట చన్నె యెందుఁ ◆ జిన్నిప్రాయంపుముద్దురాకన్నియలకు. ‖ 87 ‖

తే. అని పలికి కల్కిఁ దోడ్కొని యనుఁగుఁజెలులు ◆ వెసఁ దదంతికలీలానివేశమునకుఁ
జని రటు ల్జనుచున్నఁ గన్గొని మహీవి ◆ భుండు డాయంగఁ బోయి పూఁబోఁడి కనియె. ‖ 88 ‖

చ. నిలు నిలు పోకు బాల హరినీలనిభాలక జాల నీకు నే
వలసితిఁ జాల న న్నిటుల వంచన సేయఁగ నేల చూడఁ బూ
విలుతుఁడు కూళ వాఁ డిడెడువేదన కోరువఁజాలఁ బ్రేమ న
న్గలయుము వేళ నమ్మరునిగర్వము దూల విలాసలీలలన్. ‖ 89 ‖

ఉ. చక్కఁదనంబు జవ్వనము జాణతనంబును గల్గి ఠీవిఁ బెం
పెక్కినదాన నంచు నొకయించుక గర్వము పర్వ న న్నిటుల్
గిక్కరవెట్టఁ జూచెదు చెలీ పదమా ముదమార నింక నా
చక్కెరవింటిదంటనునుఁజాయలకోరుల నేమి యయ్యెదో. ‖ 90 ‖

క. బాలా వేలాగుల బతి ◆ మాలిన విన కిగ్గయాళిమడఁతుల వెంటన్
బేల వయి చనెదు మరువిరి ◆ గోలలపా లై కరంబు గుందెదు సుమ్మీ. ‖ 91 ‖

సీ. నీవు మాటలు నేర్పి నెమ్మితోఁ బ్రోచిన ◆ చిల్కఁ జిల్కగుఁజుమ్ము చిగురుఁబోఁడి
నీ వాట దిద్ది మన్నించి పెంచిన బర్హి ◆ బర్హి యౌఁ జుమ్ము శంపాలతాంగి
నీకొలంకులఁ జేరి నెక్కొన్నకోకంబు ◆ కోక మౌఁ జుమ్ము చకోరనయన
నీతోఁటమధు వానినీటు గాంచినయలి ◆ యలి యగుఁ జుమ్ము మత్తాలివేణి
తే. దైవబల మేరికి నొకింత దప్పెనేని ◆ ప్రాణబంధువు లైనను బగతు లగుదు
రింతి యటు గాన వేగ న న్నేలుకొనుము ◆ కాయజుఁడు ని న్జెనఁకకుండఁ గాచువాఁడ. ‖ 92 ‖

క. అనుమాన ముడిగి వినుమా ◆ నను మారునిబారిఁ ద్రోచి ననఁబోఁడి వేసం
జనఁ జూచెద వలవిధి నె ◆ క్కొనునిక్కొల నిన్నుఁ గట్టి కుడిపెడిఁ జుమ్మా. ‖ 93 ‖

సీ. వలఱేఁడు వాఁడిపూములికిమొత్తము లేయఁ ◆ జలివెలుం గుడుకువెన్నెలలు గాయ
గద్దరిజమిలిముక్కాలిబారులు మ్రోయ ◆ బలితంపుగండుఁగోయిలలు గూయఁ
దులువరాచిలుకబోదలు హళాహళి సేయఁ ◆ గొలఁకుజక్కవపౌజు లెలసి రేయఁ
గొదమనట్టువపిట్ట రోదలు తాలిమిఁ ద్రోయ ◆ వెలిలావుపులుఁగుచా ల్విసము గ్రాయఁ
తే. గమ్మకపురంపుపెనుదుమారమ్ము రేచి ◆ పోరిఁబోరిఁ బిసాళినాళితెమ్మెరలు డాయ
నయయయో గోల నలువకు నలవి గాని ◆ కడిఁది వలవంత సెక కోర్వఁగలవె చెపుమ. ‖ 94 ‖

తే. చాన ననుఁ జూడు గడితంపునాన వీడు ◆ కేరి మాటాడు కుసుమాస్త్రకేళిఁ గూడు
చెలులఁ దెగనాడు నీకు నీచేత నాడు ◆ తలిరుఁబ్రాయఁపుముద్దురాచిలుకతోడు. ‖ 95 ‖

క. అనుమాటలు విని మానిని ◆ యనుమానింపుచు నటున్న నపు డానృపుఁడున్
నెన రొదవ మదనమోహినిఁ ◆ గనుఁగొని యి ట్లనియె నేర్పు గడలుకొనంగన్. ‖ 96 ‖

ఉ. మోహసమగ్రతం బ్రియుఁడు ముద్దియయుం గవగూడి కోరి యు
త్సాహమునం జెలంగునెడ జంట దొఱంగి చనంగఁ జేయుటల్
ద్రో హము గాదె హెచ్చరికతో నిను వేఁడెద నాకు నీజగ
న్మోహినిఁ గూర్పవే మదనమోహిని శాశ్వతపుణ్య మబ్బెడిన్. ‖ 97 ‖

ఉ. కామదురాపతాపహతిఁ గ్రాఁగుచుఁ జక్కనికోడెకాఁ డెదన్
వేమఱుఁ బ్రేమ ముల్లసిల వేఁడుకొనంగ ననంగసంగరో
ద్దామవిహారలీలల ముందం బొనరించి కఱంచ లేనియా
కామినిసోయగం బడవిఁ గాచినవెన్నెల గాదె చూడఁగన్. ‖ 98 ‖

క. మీరామామణి కడిఁదియొ ◆ యారముతో మమ్ముబోంట్ల కాస కొలుపుచున్
గారా మారఁగ గడితఁపు ◆ టారామముల న్మెలంగు టర్థమె చెపుమా. ‖ 99 ‖

తే. తలిరుఁబోఁడికి గాదిలిచెలులు మీర ◆ లిందఱును గల్గుటకుఁ జేతి కందినట్టి
మేలు వోఁ ద్రోచెదరు గాని మీఁద వచ్చు ◆ చెడు గొకించుక యైనఁ బో నిడఁగఁ గలరె. ‖ 100 ‖

క. శుకవాణికి నాపై నిం ◆ చుక కూరిమి గలిగియున్న చొప్పరయక యా
గక యెడ సేయఁగఁ జూచెద ◆ వకటా ముకురాస్య సరసురాలవు గదవే. ‖ 101 ‖

తే. అద నెఱిఁగి యిందు నీయిందువదనపొందు ◆ నాకు సమకూర్చితేని యనేకమణివి
భూషణాదు లొసంగి యెప్పుడును మదిని ◆ మదనమోహిని నీమేలు మఱువ సుమ్మి. ‖ 102 ‖

క. అని పలుకునెడలఁ జెలు లె ◆ ల్ల ని దేమిటిజోలి సరి బళా పదపదరే
యని చెలిఁ దొడ్కొని గొబ్బునఁ ◆ జని రంత విభుండు గుండె ఝల్లన లీలన్. ‖ 103 ‖

వ. అచట నొక్కచొక్కటంపుటిక్కరారాచట్టుపయిం జతికిలం బడి నెమ్మొగంబున
దైన్యం బిగురొత్త వెచ్చ నూర్చుచు సంగడికానిమొగంబు చూచి యి ట్లనియె. ‖ 104 ‖

ఉ. అక్కట మిక్కు.టంపుగొన బారఁ దళుక్కని తొల్మెఱుంగున
ట్లక్కజ మొప్పఁ గానఁబడి యాసలు చూపి కఱంచి యిప్పు డా
చక్కెరబొమ్మ యెచ్చటికిఁ జాఁగెనొ న న్గికురించి యింక నా
చక్కెరవింటికూళనునుఁజాయలకోరుల కోర్వవచ్చునే. ‖ 105 ‖

చ. ఎటువలెఁ దాళువాఁడ నిపు డెవ్వరి నేమని దూరువాఁడ న
క్కుటిలశిరోజ నెయ్యెడల గొబ్బునఁ గన్గొనువాఁడ నెట్టు లె
క్కటితలిరాకుబాకుమొనగానిహళాహళి కోర్చువాఁడ న
క్కటకట చెల్మికాఁడ వలకాఁకలఁ దాళ నిఁకేమి సేయుదున్. ‖ 106 ‖

సీ. పొలఁతుకజిలిబిలిసొలపుఁబాటలకును ◆ మగువనిద్దపుముద్దుమాటలకును
ననఁబోఁడిచిన్నారినగవుచూపులకును ◆ గొమ్మవేడబపుమేల్కొలపులకును
రాకేందుముఖిచొకారంపువెన్నెలకును ◆ జేడియమురిపెంపుఁజిన్నెలకును
గలికిచనుబ్బిగుబ్బలులనిక్కులకును ◆ జెలువచొక్కపుఁదళ్కుఁజెక్కులకును
తే. వలసి సొలసితి నది నన్నుఁ గలసి మెలసి ◆ బలసి కోర్కెలు దీర్పక తులువకలువ
విరిలకోరివజీరు బల్వెతలఁ ద్రోచి ◆ చనె నయారె యిఁ కేజాడ సైపువాఁడ. ‖ 107 ‖

సీ. బలితంపుగండుఁగోయిలలకూఁకలకును ◆ దలిరువాల్తులువబల్దాఁకులకును
గొలఁకునెత్తావిసోఁకుడులవీఁక లకును ◆ వలపుగొజ్జెఁగనీటివాఁకలకును
మెదలుటాటోటుతుమ్మెదలప్రోఁకలకును ◆ గలువసంగడికానికాఁకలకును
జెన్నొందుకలికిరాచిలుకమూఁకలకును ◆ మురిమించుక్రొమ్మావిమోఁకలకును

తే. జాలఁ దూలెద నిఁకఁ దాళఁజాలఁ జాల ◆ మేల మేలురఁ నమ్ముద్దుబాల లీల
వైళ మివ్వేళఁ గూర్చి న న్నేలుకొనుము ◆ చెలిమి గడుడెందమున నిండఁ జెలిమికాఁడ. ‖ 108 ‖

వ. అని యనేకప్రకారంబులం దగిలి వగలం బొగులుచున్నయారాచమిన్నం గనుంగొ
ని నర్మసఖుం డి ట్లనియె. ‖ 109 ‖

క. ఓ ఱేఁడ నీవు పలుమఱుఁ ◆ గాఱడవులవెంట నన్యకామినికొఱకై
కాఱియలఁ బడుచు వలపులు ◆ మీఱఁగ నవియింపఁ జనునె మే నలయంగన్. ‖ 110 ‖

క. పలుదెఱఁగులఁ బెఱచెలికై ◆ వలకాఁకలఁ గ్రాఁగి నేఁగవలవదు నీకున్
వలసిన మఱి యెందును వలి ◆ కులుకుంబ్రాయంపుముద్దుగుమ్మలు లేరే. ‖ 111 ‖

చ. పటుమతిఁ జిత్తగింపుము నృపాల విరోధివరూధినీధవ
స్ఫుటమకుటాగ్రరత్నఘృణిశోభితపాదురోరుహుండ వీ
విటు లొకయన్యపంకజదళేక్షణకై పలుమాఱు సోలుచున్
గటకట యింత గాసిఁ బడఁ గారణ మేమి కడింది మీఱఁగన్. ‖ 112 ‖

క. వేలాగుల నన్యవధూ ◆ లోలుఁడ వై నాన యుడిగి లోఁగెదు ధరణీ
పాల విను “కాముకస్య కు ◆ తో లజ్జా” యనెడునుడువు తుది నిజ మయ్యెన్. ‖ 113 ‖

క. కొద లేనివగలఁ బొగలుచుఁ ◆ గొదకొని వనిఁ దిరుగ నేల గొబ్బున నిపు డో
సుదతీజననవమన్మథ ◆ పదమా ముద మార వసనభవనంబునకున్. ‖ 114 ‖

వ. అని యనునయింపుచు నర్మసఖుం డతనిం గ్రమ్మఱఁ దోడ్కొని వచ్చుచున్నయెడ
నారాజన్యపుంగవుడు ము న్నన్నిలింపలితంబినీమణులు విహరించి చనినవనంబు
చొచ్చి. ‖ 115 ‖

సీ. పద్మరేఖావృతాంబరచరప్రమదాంఘ్రి ◆ పద్మలాక్షాంకితప్రాంగణములు
దివిషన్నితంబకబరీభర ◆ స్రస్తామరద్రుప్రసవచయములు
గంధర్వకులరాజకన్యాస్తనాలిప్త ◆ హారిద్రముద్రితాబ్జాకరములు
సారనారీమణీసరసవిహారక్రి ◆ యాప్రఫుల్లన్మనోజ్ఞాగమములు
తే. క్రతుభుగంభోజలోచనాకృతమనోజ ◆ పూజనాయత్తఫలగంధపుష్పధూప
దీపనైవేద్యముఖ్యవిస్తీర్ణవస్తు ◆ సంతతులు చూచి పరవశస్వాంతుఁ డగుచు. ‖ 116 ‖

సీ. ఈకెళాకుళిచెంత రాకేందుబింబాస్య ◆ తివిరి యంచకు నడ ల్దిద్దుచుండె
నీమహీజమునీడ నిందీవరేక్షణ ◆ చిలుకకుఁ బలుకులు చెప్పుచుండె
నీదరీతటిదరి నిభరాజగామిని ◆ నెమ్మికి నాటలు నేర్పుచుండె
నీనికుంజముదండ మానినీతిలకంబు ◆ తొడరి శారికి మేత లిడుచునుండె
తే. నీనిశాకాంతకాంతమణీనిశాంత ◆ కాంతనవరత్నమయవేదికాంతరమునఁ
గాంత జిలిబిలిపాట లేకాంతలీలఁ ◆ బాడుచుండెఁ గదా చెల్మిపడఁతు లలర. ‖ 117 ‖

సీ. సక్రియక్రొందళుకుపిసాళిచూపులకోపు ◆ ముగుదనిద్దపుముద్దుమోముగోము
కొమ్మసిబ్బెపుగబ్బిగుబ్బచన్నులచెన్ను ◆ కోమలాంగివెడందకొప్పుకప్పు
రాకేందుముఖినిగారంపుఁజెక్కులటెక్కు ◆ సుందరివలుదపిఱుందునందు
గంధసింధురయానఘనతరోరులతీరు ◆ హరిణనేత్రమెఱుంగుంటారుసారు
తే. దలఁచుకొన్న జగం బెల్లఁ దన్మయముగఁ ◆ గనఁబడుచునున్న దింక నక్కలికిమిన్న
నెందుఁ గన్గొనువాఁడ నాడెందమునకు ◆ నక్కటా మిక్కుటం బైనయార్తి వొడవె. ‖ 118 ‖

క. ఏలా హేలాలీలల ◆ నోలిం గ్రీడించునద్దివౌకఃకులరా
డ్బాలామణిఁ బో బనిచితి ◆ బేలతనం బొదవ రిత్త బెదరించి యయో. ‖ 119 ‖

క. నిర్భరపుణ్యఫలప్రా ◆ దుర్భవు లగుసుజనులకును దొరకుం గా కా
స్వర్భామాసాంగత్యము ◆ నిర్భాగ్యుఁడ నైననాకు నేఁ డెటు లబ్బున్. ‖ 120 ‖

వ. అని తలంచుచుండి మఱియు సంగడికాని కి ట్లనియె. ‖ 121 ‖

క. చెలికాఁడ యెట్టినోములు ◆ సలిపెనొ యిగ్గోఁగుమ్రాను జలజేక్షణ నున్
జిలిబిలిముద్దుంబలుకుల ◆ నలరించినఁ బెంపుఁ గాంచె నభినవలీలన్. ‖ 122 ‖

చ. చెలిమి దలిర్ప నానవకుశేశయపత్త్రవిశాలనేత్ర ను
న్గలపపుఁగమ్మఁదావులు ఘనమ్ముగ నిమ్ముగఁ గ్రుమ్మరించుబ
ల్కులుకుమిటారిగబ్బిచనుగుబ్బల నొత్తి కవుంగిలించె నా
భళి భళి యిక్కురంటకముభాగ్యము చెప్పఁ దరంబె నెచ్చెలీ. ‖ 123 ‖

చ. వలఁతితనం బెలర్ప నలవారిజపత్త్రవిశాలలోచనా
తిలకము న న్నొకించుకయుఁ దేఱి కనుంగొన దయ్యెఁ గాని యీ
తిలకమహీజరాజము నతిప్రియతం దనసోయగంపుడా
ల్సొలపుఁబిసాళిక్రొందళుకుఁజూపుల బి ట్టలరించెఁ బో సఖా. ‖ 124 ‖

క. విధుబింబానన పుక్కిటి ◆ మధు విడి యిప్పొగడమ్రాను మన్నించెఁ జెలీ
మధురాధరాధరాంచ ◆ న్మధురస మిడి కనికరమున నన్ బ్రోవదుగా. ‖ 125 ‖

క. మహిలామణిపాణిసరో ◆ రుహసంస్పర్శం జెలంగి క్రొన్నన లెత్తెన్
సహకారభూజరాజం ◆ బహహా నా కిట్టిభాగ్య మబ్బునె సఖుఁడా. ‖ 126 ‖

క. వలనుగ నమ్ముద్దుం బై ◆ దలి వలి నిట్టూర్పుకమ్మతావులచే వా
విలి ననిచె ననఁగ నిది వే ◆ ల్పుల ము న్నెవ్వారి నెట్లు పూజించెనొకో. ‖ 127 ‖

తే. చేడియలమిన్నమృదుపదతాడనంబు ◆ గాంచి యంచితసుమనోవికాసలీల
నలరుచున్నది కంకెళి యహహ దీని ◆ పుణ్యఫల మెన్నఁ దరమె యింపుగ వయస్య. ‖ 128 ‖

క. పాటలగంధిచొకారపుఁ ◆ బాటల నీప్రేంఖణంబు బహుతరసుమనః
పాటనమున నలరెడు ని ◆ ప్పాటలఁ బాడింప నెంత భాగ్య మనుంగా. ‖ 129 ‖

తే. కన్నియలమిన్న చిన్నారిక్రొన్నగవుల ◆ వన్నియలు మీఱ నిప్పొన్నగున్న నలరఁ
జేసెఁ గాని యయో నేఁడు చెలిమికాఁడ ◆ నన్నుఁ గన్గొని యొక్కింత నవ్వ దయ్యె. ‖ 130 ‖

క. చెలిమోము కళలసంపఁగి ◆ నల రొందం జేసె నది వయస్యా ననుఁ దాఁ
దల యెత్తి చూడదయ్యెను ◆ జెలువకు నే నేమి తప్పు చేసితిఁ జెపుమా. ‖ 131 ‖

వ. అనుచు వెండియు. ‖ 132 ‖

క. అమ్మానిసిఱేఁడు వనిం ◆ ద్రిమ్మరుచో నొక్కపువ్వుదీవియనా జుం
జుమ్మని మొఱయుచు నాడెడు ◆ తుమ్మెదఁ గనుఁగొని కడంకతో ని ట్లనియెన్. ‖ 133 ‖

చ. అమరనితంబినీసురుచిరాననసారససారసౌరభ
భ్రమఁ బఱతెంచె దేమొ మదబంభరరాజమ శంబరాహితా
సమసుమసాయక వ్యథలఁ జాలఁ గలంగుచు నున్న నా తెఱం
గమలకృపాంతరంగమున నప్పువుఁబోఁడి కెఱుంగ జెప్పుమా. ‖ 134 ‖

క. అలికులతిలకమ నినుఁ గ ◆ న్నులఁ జూచినయంతలోనె నూల్కొను ప్రేమం
జెలితుఱుము నారుఁ జూపులుఁ ◆ దలఁ పయ్యెడు నింక నెట్లు దాళుదుఁ జెపుమా. ‖ 135 ‖

మ. క్రతుభుక్కంజముఖీవియోగభరవిక్లాంతుండ నై యివ్వనిన్
వెతలం గుందుచు నున్న నన్ను గరుణన్ వీక్షించి నీ యెడన్
బ్రతికింపంగఁ దలంచి వచ్చితిని మేల్బవ్యాంగశోభాధరీ
కృతజంభారిశిలావినిర్మలఘృణీ యిందిందిరగ్రామణీ. ‖ 136 ‖

ఉ. అక్కట మిక్కుటంపువిరహానలవేదన కోర్వలేక ని
న్నక్కఱతోడ వేఁడెద దయామతి నోయెలదేఁటిమిన్న నీ
ఱెక్కలమీఁద న న్ననిచి ఱింగున నుప్పడవీథి నేగి యా
చక్కెరబొమ్మపాదజలజమ్ములసన్నిధిఁ జేర్పు నేర్పునన్. ॥ 137 ॥

తే. అక్కటా నీకుఁ గల్గిన ఱెక్క లిపుడు ◆ నాకుఁ గల్గిన మింట నందముగఁ బఱచి
యమరభామినికుచగుళుచ్ఛములమీఁద ◆ వ్రాలి సుఖియింతుఁ గద మధువ్రతకులేంద్ర. ॥ 138 ॥

సీ. అవనిఁ బరోపకారార్థ మిదం శరీ ◆ ర మని యార్యజనము లెపుడుఁ
బలికెడుమాట యేర్పాటుగా నీవు ము ◆ న్నినియుండుదువె కద విను మలీంద్ర
నాకొఱ కిపుడు క్రన్నన నేగి గంధర్వ ◆ కాంతాలలామంబు గాంచి వెరవు
మెఱయ నిత్తెఱఁ గెల్ల నెఱిఁగించి దాని నె ◆ ట్లును బుజగించి తోడుకొని రమ్ము
తే. కాక యుండిన నామాఱు గాఁ దదంఘ్రి ◆ వనజయుగ్మంబుపై వ్రాలి వినతు లొనఁగి
యడుగుకొనియైన నిచటి కప్పడఁతిఁ దెచ్చి ◆ యనుపమాగణ్యపుణ్యావర్తనల మనుము. ॥ 139 ॥

వ. అని యెడయనియెడరుల బడలి యడలుచున్నయొడయని మెల్లనే యూరార్చి స
ఖుం డెట్టకేలకుఁ బటకుటీరాభ్యంతరంబునం జేర్చిన నమ్మహారాజచంద్రుండు. ॥ 140 ॥

సీ. పగడంపుఁగంబము ల్పచ్చరాబోదెలు ◆ గొనబారుమొకమాలు గోడబారు
కుతినీగుడారు తళ్కుపసిండికుండలు ◆ జరబాబుచందువా సొరుమాఱు
గుజరాతికెంపురాగుంపుజొంపములు ము ◆ త్తెంపుజాలీలు దట్టంపుతావి
నింపు నున్మంచిగందంపుమేకులు జగా ◆ డంబారుహొంబట్టుపంబుదాళ్లు
తే. గలిగి యభినవశృంగారగౌరవమునఁ ◆ జాల నలరారు డేరాహజారమునను
గడిఁదిదంత పుఁగోళ్లచెక్కడపుఁబనిక ◆ డానిమంచముమీఁదనె మేను చేర్చి. ॥ 141 ॥

క. ఉసు రసు రంచుం బొడలుచుఁ ◆ గసరుచుఁ క్రొవ్వేఁడియూర్పుగాడ్పులు నిగుడన్
బస చెడి బుసగొట్టుచు వెస ◆ ముసుఁ గిడి పలకాఁకకడలి మునుఁగుచు నుండెన్. ॥ 142 ॥

వ. మఱియు నద్ధరావరపుంగవుడు నిజాంతరంగం బయ్యంగనామణి జగన్మోహనాంగ
శృంగారరసాభంగరంగత్తరంగిణీసంగతం బై మునుంగ నింగితం బెఱుంగక లొంగి
కలంగి బెంగగొని నింగియుఁ బుడమియుం గనరానియంగభవదురాపతాపాటోప
మాయాంధకారంబు ఘోరంబుగఁ దోరంపుఁగన్నుఁగవం గుప్పునం గప్పుకొన్న నే
మియుం గానరాక చీకాకుపడి వీఁక చెడి యడలి బడలి యొడలిబిగి సడలి గడగడ
వడంకుచుఁ గొంకుచు బెగడి దైవంబుఁ దెగడి నిగనిగ జిగిదళు కొత్తుక్రొత్తనెత్తమ్మి
ఱేకులపస న్నిరసించునిడువాలుకన్నుఁగవం దొఱఁగుబుడిబుడివేఁడికన్నీరు బడిబడి
నిద్దంపులేఁజెక్కుటద్దంబులం జాలువాఱ రాకానిశాకరబింబప్రతిమానమానితవదనా
రవిందంబు వాడుదేఱ గుజరాతిపచ్చరాతిమెఱుంగుహొరంగులం బొంగారుబంగా
రుచిలుకతాళిమేలిపసిండివన్నియజన్నిదంపుగుంపుతోడం బెనంగొని కరంబు నురంబు
నం చారజగానిగారంపుసొంపుపెంపునం గనుపట్టు హొంబట్టుబొందు పొందుపడం జుట్టి
కట్టినవెడందక్రొమ్ముడి సడలి నెత్తావి క్రొత్తచెంగలువక్రొవ్విరు లుర్వింగూరఁ జిన్నా
రిక్రొన్నెల నెన్ను నెన్నొసలం జెన్నారుతిన్ననిసన్నంపుకమ్మకస్తురిరేఖ యొక్కుమ్ము
డి ముమ్మరంపుచెమ్మటలం బద నెక్కి నెమ్మొగంబునం గ్రమ్మి పాఱ హారకేయూ
రకటకకంకణక్షుద్రముద్రికాదిమహాభరణంబులు సడలి జాఱ బలితంపువేఁడినిట్టూ
గాడ్పుసెగలం గంది కెందలిరుటాకుబ్బృందంబులం దెగడుతొగరువాతెఱ తెలు
పు మీఱ నుస్సు రనుచు నుమ్మలింపుచు నుదరిపడుచు బెదరి బెదరినడెందంబుతోడం
గళవళింపుచుం గటకటా యనుచుం గ్రన్నన లేచి తల యూఁచి దిశలు చూచి వి
వేకంబు ద్రోచి విరిసరంబు లవని వైచి యేచినతమకంబున నాచిగురుటాకుఁబోడి
నాడెంపుగడానిమేనిజాను మానసంబునం దలపోసి గాసిలి వాసిం బాసి చెయివులు
రోసి కఱకుబెఱకుచెఱకువిలుకాఁడు బిఱబిఱం బఱగించు చుఱుకువిరిచిలుకుమొత్తంబు
లు చుఱచుఱ నదరంటం గాఁడిన సోలి తూలి తాలిమి వ్రేలి పర్యంకభాగంబున వ్రా
లి ఘోరమారవికారాపస్మారదూరితవివేకుం డగుచు నంత నప్పంకజాక్షి సమక్షంబు
న సాక్షాత్కరించిట్లు గనుపట్టినఁ బట్టరానియాశాపాశంబులం గట్టువడి గుట్టు చె

డి బిట్టువడి నెట్టకేలకు హాబాలఫాలతలాలోలనీలనీలాలకజాల జాల మేల జాలిం దా ళఁజాలఁ జాల నిక్కరాళమయూరకీరశారిహారీతపారావతపరభృతప్రముఖవివిధవ్రా తసమేతాయాతమనోజా కిరాతకరాతతతాతిశాతస్ఫీతచూతాబ్జాతశిలీముఖసంఘాత యాతనోద్ధూతభీతభీతచేతస్కుండ నైననన్ను నన్యు గాఁ గనుకొనక కనకకలశోప మానానూనపీనపయోధరద్వయం బురంబునం గదియించి కుదియించుచు హాళిం బైకొ ని మనోజసరోంతరాళనాళీకమృణాళనాళసదృగ్భుజలతాయుగంబున బిగ్గఁ గౌఁగి లించుచు ధగద్ధగాయమానమానితహీరప్రభాపుంజరంజితహాటకతాటంకంబులు మక రకేతననూతనముకురఫలకోపమానంబు లగుగండభాగంబులం దాండవం బాడ సురేం ద్రనీలనీకాశకేశపాశం బవటుప్రదేశంబునం జిందాడఁ దిన్ననిసన్నంపునెన్నడుము గడ గడ వడంకఁ గ్రొత్తహురుమంజిముత్తియంపుసరంబులు దిరంబుగఁ గులుకుసిబ్బెంపు గబ్బిగుబ్బలపయిం బరిపరిగతుల నర్తింప మంజుమంజీరకంకణకింకిణీవిరావంబులును గళరవసీత్కారంబులం జెలంగ నఱమోడ్పుకన్నుగవం జుఱుకుఁదళుకువాలుజూపు లేపు చూపఁ గమ్మకస్తురికలపంపుఁబూఁత దట్టంపుజెమ్మటసోనలం గరఁగి నెమ్మొ యిం జాలువాఱఁ గేరి డాకేలం జెక్కిలి గొట్టి దట్టించి రెట్టించుతమకంబున నుప్పొం గి విప్పుగ నాగొప్పకన్నుంగనం గప్పుకొనం గప్పురంపురజం బొప్పుగ గుప్పుగుప్పున గుప్పి కొలందిగ గుప్పుచుం జక్కెరకెమ్మోవి పంటం బట్టి చుఱుక్కన నొక్కి చొ క్కుచుఁ గులికి కిలకిల నగి కిలికించితరసంబు చిలుకుచుఁ దేనియ లొలుకం బలుకు చుఁ బలుదెఱంగులఁ బుంభావసంభోగక్రీడావినోదంబుల మోదం బొడఁగూర్చి యాదరించి మనుచు మనుచుం బాణియుగం బెత్తి మ్రొక్కి బతిమాలుచు బయలు కౌగిలింపుచుఁ బలుకరింపుచు బాష్పాంబుపూరంబు నించుచుఁ బలవరింపుచు నుండి కొంతసేపునకుఁ దెలివిం దెచ్చుకొని మరునిప్రభావంబునకు మెచ్చుకొని తనుఁ దా నె నొచ్చుకొని క్రచ్చుకొని యింక నెవ్వా రివ్విధం బప్పువ్వుఁబోడికి నెఱింగించి మది కడఁగించి కూర్చి పేర్చు నిమ్మదనవేదనానలంబు చల్లార్చం గలవా రని యనేక ప్రకారంబుల మనోవికారంబులం బొరలుచుండి దానహీనభూనాయకుండునుం బోలె నాశుకవిసంభాషణప్రసంగవిముఖుం డై శాస్త్రజ్ఞానానభిజ్ఞభిషగ్వరుండునుం బోలె సంపూర్ణచంద్రోదయలక్షణపరీక్షానపేక్షితుం డై కుకవియుంబోలె సుశబ్దా లంకారమార్గరహితుం డై సమరభీరుండునుంబోలెఁ బరశిలీముఖగరున్మరుర్ఝుంకార వికంపితస్వాంతుం డై బలవంతం బగువలవంతం బొగలుచుండె వెండియు. || 143 ||

ఆ. పరవశాత్ముఁ డై ప్రపంచంబు మఱచి జ ◆ గంబు దన్మయంబు గాఁగఁ దలఁచి
గుణవిహీనుఁ డగుచు గణుతింప నతఁడు వి ◆ యోగి యై కృశింపుచున్నయెడల. || 144 ||

క. మతిమంతుఁ డట్టిగాటపు ◆ వెతలం బడి పొరలునవనివిభుఁ గన్గొని హా
క్షితివర నీ విత్తెఱఁగున ◆ ధృతి చెడి యడలంగఁ దగునె దీనతతోడన్. || 145 ||

క. పురములు విడి పాఱవె కుల ◆ తరుణులు వెత పడరె బుధులు తప్పెన్నరె నీ
సరిదొరలు నగరె వంతలఁ ◆ గర మడలరె ప్రజలు నీప్రకారము విన్నన్. || 146 ||

మ. అకటా భూపకులాగ్రగణ్య నయవిద్యాభ్యాసపారీణతా
ధికసంశుద్ధమనస్సరోరుహుఁడ వై దీపించునీ విట్లు నేఁ
డొకసీమంతవతీవతంసమునకై యో ర్వింతయు న్లేక యూ
రక చింతాకులవృత్తి నుండఁ దగునే ప్రజ్ఞావిహీనుండ వై. || 147 ||

మ. కరు లశ్వంబులు నందలంబులు శతాంగంబు ల్మణీభూషణాం
బరవీటీమృగనాభివందనధనప్రాసాదదాసాదులుం
దరుణు ల్కాళెలు ఛత్రచామరము లుద్యల్లీలలం గ్రాలుని
ర్భరసామ్రాజ్యభరంబు వో విడిచి చేడ్పా టొంద నీ కేటికిన్. || 148 ||

క. ధరణిం గలజను లందఱు ◆ దిరముగఁ దమయాజ్ఞ మెలఁగ దృఢతర సామ్రా
జ్యరమాయుతు లగునరపా ◆ లుర కెందును దైన్యవృత్తి లోఁగం దగునే. || 149 ||

క. వసుధాధిప మృగయాద్యూ ◆ తసతీముఖ్యంబు లగుచుఁ దనరెడుసప్త
వ్యసనములఁ బొరలుమనుజుం ◆ డు సెడుం గడుసౌఖ్య మెన్నఁడుం గనకార్తిన్. ॥ 150 ॥

క. భళిభళి వినుమీ వెదలోఁ ◆ దలఁచినఁ బదివేలు ముద్దుతలిరుంబోఁడుల్
గలిగెద రిటువలె గడితపు ◆ వలవంతం జెంది కందవలదు నృపాలా. ॥ 151 ॥

క. మదిరాక్షులవలలం బడి ◆ మొదలం బెక్కండ్రు బన్నములఁ జెంది రహో
పదివేలు వచ్చె నింకం ◆ బొదమా రొద మాని వేగఁ బురవరమునకున్. ॥ 152 ॥

వ. అనిన నతని కానృపతి యి ట్లనియె. ॥ 153 ॥

మ. పురము ల్వోయినఁ బోవనీ బంధులు తప్పు ల్వట్టినం బట్టనీ
తరుణు ల్లుందినఁ గుందనీ ప్రజలు వంతం జెందినం జెందనీ
సరివా ర్నవ్విన నవ్వనీ సచివ నే సంప్రీతిఁ దద్దేవతా
హరిణాక్షీనిబిడోపగూహనసుఖ్యాయత్తుండనై యుండెదన్. ॥ 154 ॥

సీ. కలకంఠిసిద్ధంపుగబ్బిగుబ్బల సొరు ◆ తరుణిలేఁజెక్కుటద్దములతీరు
నెలఁతనిద్దపుముద్దునెమ్మొగంబుహొరంగు ◆ చాననాడెంపునున్మేనిరంగు
కలికిబిత్తరివాలుతళుకుఁజూపులయొప్పు ◆ విరిఁబోడిమెఱుఁగుపెందుఱుమువిప్పు
కరిరాజయానచక్కెరకెంబెదవిసొంపు ◆ సుందరివలుదపిఱుందుపెంపు
తే. డెందమున నాట మిగులఁగడిందివలపు ◆ గందళించుచు నున్ననమ్మందయాన
పొందు చేకూఱ కెవ్వ రేంచందమునను ◆ మందలించిన సడల దే మందు సఖుఁడ. ॥ 155 ॥

క. వారువము లందలంబులు ◆ వారణరమణీమణీనివసనవసనభూ
షారజితకాంచనము లా ◆ నారీమణిజోక లేక నా కేమిటికిన్. ॥ 156 ॥

ఉ. సంగడికాఁడ చేడియలు చాలఁ గలా రని నీకు నిప్పు డీ
భంగి వచింపఁగాఁ దగునె భావమునం బరికించి చూడుమా
యంగన లెందఱైన సరి యౌదురె యాపదియాఱువన్నెమే
ల్బంగరుబొమ్మకున్ దలిరుఁ బ్రాయపువేలుపుముద్దుగుమ్మకున్. ॥ 157 ॥

చ. సచివకులేంద్ర యవ్వికచసారసపత్రవిశాలనేత్రపొం
దచిరగతి న్ఘటించి నను నర్మిలిఁ బ్రోవుము కాకయున్న నీ
యచలగృహప్రదేశమునయందుఁ దపం బొనరించుచుందు నీ
విచటఁ దొలంగి వేగఁ బురి కేగుము మాటలు వేయు నేటికిన్. ॥ 158 ॥

తే. అనుడు నెయ్యుఁడు వెఱఁ గంది యకట యితని ◆ కగ్గలం బయ్యె విరహార్తి యంతకంత
కింకఁ గానకుఁ దోడ్కొని యేగి కొంత ◆ వంత మరలింతు నని యంత సంతసమున. ॥ 159 ॥

వ. అతనిం దోడ్కొని చని వనిం బ్రవేశించిన నమ్మహీమహేంద్రుండు. ॥ 160 ॥

సీ. పొలఁతిపాలిం డ్లంచుఁ బొన్నకాయలు వట్టి ◆ హా యివి పొన్నకాయలె యటంచు
నతివపెన్నొడ లంచు నంటికంబము లంటి ◆ భళి యివి యంటికంబములె యంచుఁ
గలికిముంగురు లంచు నెలదేంట్లఁ బట్టి య ◆ యో యిని యెలదేఁటులే యటంచు
మగువకేల్గవ యంచుఁ జిగురుటాకులు ముట్టి ◆ చెల్లఁబో యివి లేఁజిగుళ్లె యనుచు
తే. వనితవాతెఱ యని పరువంపుదొండ ◆ పండు వట్టి యహా యిది పరువు గూరి
యెఱుపు మీఱినదొండపండే యటంచు ◆ నెంచుకొంచు విరాలిం జలించుచుండె. ॥ 161 ॥

తే. అపుడు చెలికాఁడు నృపతి కయ్యతివమీఁది ◆ తలఁ పొకించుక మఱలింపఁ దలఁచికొనియు
నచట నచటఁ జరించుచుఁ బ్రచురఫణితి ◆ నింపు రాణింప నాతని కిట్టు లనియె. ॥ 162 ॥

క. అవె చూతలతలు నునుఁగెం ◆ జివురులతోఁ దేజరిలెదు క్షితివర కంటే
యవు నవు ననుంగ యివియ ◆ య్యువిదకరాబ్జములఁ బోలి యున్నవి సుమ్మీ. ॥ 163 ॥

క. వసుధాధీశ శిరీష ◆ ప్రసవము లవె చూడు సిరులఁ బరఁగెడు నౌ నౌ
రసికుఁడ యిత్తెఱఁగునఁ బొ ◆ ల్పెసఁగుం గద దానిమేనిమృదులత మిగులన్. ‖ 164 ‖

ఉ. మారెడుపండ్లు చూడు మవె మానవనాథకులావతంస సొం
పారుచు నెమ్మనంబునకు హర్ష మొనర్చుచు నున్న వౌ భళా
కూరిమిసంగడీఁడ యలకోకిలకాకలికానులాపవ
క్షోరుహయుగ్మ మిప్పగిది సొంపు వహించుఁ గదా యుదారతన్. ‖ 165 ‖

క. జననాథ మొల్లమొగ్గలు ◆ గనుఁగొను మవె మదికి ముదము గదియించుచు సొం
పునఁ దనరెడు నౌ నిట్టులె ◆ తనరుం గద సఖుఁడ దానిదంతాళిరుచుల్. ‖ 166 ‖

క. రంభాస్తంభము లవె సం ◆ రంభం బలరారఁ జూడు రాజోత్తమ య
య్యంభోజవదనయూరు ◆ స్తంభము లి ట్లలరుఁ జుమ్ము సంగడికాఁడా. ‖ 167 ‖

చ. కనుఁగొను కేతకీకుసుమగర్భదళంబు లుదగ్రవైఖరిన్
దనరుచు నున్నవల్లవె శతక్రతుసన్నిభ మే లయారె య
వ్వనజముఖీశిరోమణియవక్రనఖాంకురపంక్తి యివ్విధం
బునఁ దనరుం గదా సచివపుంగవ నవ్యవిలాసలీలలన్. ‖ 168 ‖

తే. ప్రభుజనోత్తమ చూడు జపాప్రసూన ◆ మదె మనోహరలీలచే నలరుచున్న
దౌ భళా సంగడీఁడ యయ్యన్నుమిన్న ◆ ముద్దుకెమ్మోవి యివ్విధంబుననె యలరు. ‖ 169 ‖

క. ఎకిమీఁడ చూడు మిదె చం ◆ పకముకులము లెదకుఁ జాలఁ బ్రమద మిడెడు న
వ్వికచాంబుజాతముఖినా ◆ సిక యి ట్లలరారుఁ జుమ్ము చెలికాఁడ కడున్. ‖ 170 ‖

క. పున్నాగమ కనుఁగొను మదె ◆ పున్నాగము ననిచి సిరులఁ బొలుపారెడు నౌ
నన్నాగయానపొక్కిలి ◆ యన్నా యిన్ననలపగిది నలరారుఁ గదా. ‖ 171 ‖

తే. అని వచించుచు వార లవ్వనిఁ జరించు చున్నచో గిరశారీమయూరపికమ
రాళరోలంబజాలంబు వ్రాలి కడు హ ◆ ళాహళి యొనర్ప నులికి యిలావిభుండు. ‖ 172 ‖

వ. వెండియు నతని కి ట్లనియె. ‖ 173 ‖

సీ. కొఱవిదయ్యమ్ములతెఱఁగునఁ జిగురాకు ◆ గుబురులయం దున్నకోకిలములు
బమ్మరాకాసులభంగిని జె ట్టెక్కి ◆ పదరుచు నున్నట్టిబర్హిణములు
పురుటిండ్లబూచులపోల్కెఁ బూఁబొదలపై ◆ సందడి నెఱపునిందిందిరములు
పెనుగత్తులట్ల కంపిలఁజేయుచుకు గోనఁ ◆ బొదలి యావడి సేయుమదశుకములు
తే. మఱియుఁ గపురంపుకమ్మదుమార మెలయ ◆ వీఁకఁ బైకొనుచిఱుగాడ్పుసోఁకుడులును
నలముకొనఁగ భూతాక్రోశ మైనయిట్టి ◆ వనికి న న్నేల తెచ్చితి వనుఁగ యిపుడు. ‖ 174 ‖

తే. కుసుమబాణున కెప్పుడు కువలయనవ ◆ మాలికాశోకకమలరసాలములను
సాయకము లైదు గల వండ్రు సఖుఁడ యిపు డి ◆ దేమి వని యెల్లఁ దూపు లై హెచ్చు మీఱె. ‖ 175
‖

తే. మరునిపూఁదూపు లిందాఁకఁ గెరలి వెలికిఁ ◆ గానరాకుండ నెదలోనఁ గాఁడుఁ గాని
కడఁగి యిపు డేమి మే నెల్లఁ గాఁడఁ జాఁ గె ◆ ననుగ యని సోలెఁ బై రాలుననల కులికి. ‖ 176 ‖

వ. అట్లు సోలినధరావరామరాధీశ్వరుం గ్రమంబున శిశిరోపచారంబుల సేదఁ దీర్చి
నర్మసఖుండు యథాస్థానంబునఁ జేర్చె నని నారదునకు శారదామనోహరుం డెఱిం
గించిన నతం డతని నవ్వలికథావిధానం బడుగుటయును. ‖ 177 ‖

చ. పరమకృపానివేశమృదుభాషణ భోగికులేంద్రభూషణా
హరిహయముఖ్యనిర్జరగణావన సంతతవిశ్వభావనా

కరిదనుజేంద్రదుర్మదవిఖండన బాలశశాంకమండనా
యరిబలహృద్భయంకరమహాగ్రహ కుక్కుటరాజవిగ్రహా. ‖ 178 ‖

క. స్వర్గాపవర్గఫలదని ◆ సర్గా దుర్గాధినాథ సంభృతసుమనో
వర్గా దుర్గాయితనగ ◆ భర్గా గర్గాదివినుతపటుసన్మార్గా. ‖ 179 ‖

సుగంధివృత్తము. తారకాశతారకాశతారకాశరాట్ప్రయ
శ్శారదాభ్రశారదాభ్రసామజామరద్రునీ
హార నహారఫేనహారిభూరికీర్తివి
స్తారఘోరబాహుసారదారితారిమండలా. ‖ 180 ‖

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వరకరుణాకటాక్షనిరీక్షణసంలబ్ధసరసకవితాసామ్రాజ్య
ధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్రపవిత్ర కూచిమంచిగంగనామాత్యపుత్త్ర
సకలసంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ తిమ్మకవిసార్వభౌమప్రణీతం బైనరసి
కజనమనోభిరామం బనుశృంగారరసప్రబంధంబునందుఁ దృతీయాశ్వాసము.

శ్రీరస్తు
ఓం నమః కామేశ్వర్యై

రసికజనమనోభిరామము

చతుర్థాశ్వాసము

విజితకూచిమంచిమ
హావంశాభరణగంగనారియమనోరా
జీవాకరచక్రాంగా
గోవల్లభశుభతురంగ కుక్కుటలింగా. ‖ 1 ‖

వ. అవధరింపుము వారిజాసనుండు నారదున కి ట్లని చెప్పం దొడంగె నట్లు ఋతుధ్వ
జమహీమండలాఖండలుఁ డఖండపుండ్రేక్షుకోదండప్రచండకాండపరంపరాకంపిత
స్వాంతుం డై కలంగుచుండె నంత నక్కడ. ‖ 2 ‖

తే. వేల్పుకన్నెయు నద్ధరావిభు నుదగ్ర ◆ మోహనాకారరేఖ సమ్మోద మొదవ
డెండమున నిల్పి మిగులఁ గడిందివలపు ◆ మొలక లెత్తఁగ నిజగృహంబునకుఁ
జేరి. ‖ 3 ‖

సీ. పగడంపుఁగోళ్ళహొంబట్టెమంచము దోమ ◆ తెర జరతారుమేల్పరపు తగటు
చందువా ముత్యాలజాలీలు కుతినీత ◆ లాడ దంతపుఁబావజోడు పసిఁడి
దువ్వెన చిటిచాప తూఁగుటుయ్యెల దివ్వె ◆ గంబము ల్పచ్చలగద్దెపీఁట
జాళువాచందువ ల్జాలవల్లిక తమ్మ ◆ పడిగము నెత్తంపుఁబలక రుద్ర
తే. వీణె వింజామరలు వట్టివేళ్లసురటి ◆ తబుకు కపురంపుబరిణె గందంపుఁగుడక
చిన్నియడపంబు రతనంపుఁజిలుకపంజ ◆ రమ్ములును గలయొకమిద్దెటిమ్మునందు. ‖ 4 ‖

తే. తొడవు లన్నియు నెడలించి యడలు మించి ◆ యొడలు బడలంగ మది జాలి గడలుకొనఁగ
మెఱుఁగుకొనగోళ్ళఁ గన్నీరు మీటుకొనుచు ◆ వెడఁదచిటిచాపపై వడి నొడలు వైచి. ‖ 5 ‖

తే. కళవళింపుచు మే న్గడగడ వడంకఁ ◆ బండ్లు గొఱుకుచు మూల్గుచుఁ బదరి నగుచు
నోలిఁ బండుచు లేచుచు నులికిపడుచు ◆ నుండె వలరాచబలుబూచి యొదవి యబల. ‖ 6 ‖

వ. మఱియును. ‖ 7 ‖

సీ. తలయూఁచు నెదలోనఁ దలఁకి గుప్పున లేచుఁ ◆ జిలుకలఁ గొట్టు నెఁచ్చెలులఁ దిట్టుఁ
దనలోనఁ దా నవ్వుఁ గినిసి యంచల ఱువ్వుఁ ◆ గన్నులు మూయు నల్గడలు రోయు
దైవంబు దూఱుఁ జిత్తవికారమునఁ దారుఁ ◆ దహతహ చెందు వేదనలఁ గుందుఁ
బిలువకే పల్కుఁ గోయిలకూఁకలకు నుల్కు ◆ గలవరించు నభంబుఁ గౌఁగిలించుఁ
తే. గలఁగుఁ బిమ్మటఁ గుడుచు బెగ్గిలు వడంకు ◆ బెదరుఁ గన్నీరు నించు దూపిలుఁ గృశించుఁ
బంచశరఘోరశితచూతభల్లభగ్న ◆ మానసాంభోజ యగుచు నమ్మంజువాణి. ‖ 8 ‖

క. అటు లుండి కొంతవడి కా ◆ కుటిలాలక యంతకంతకు న్మనమున మి
క్కుట మై పెరిఁగెడువెతలం ◆ గటకటపడి యి ట్లనుం దగం దనలోనన్. ‖ 9 ‖

ఉ. అక్కట పాపజాతిచెలు లక్కటికం బొకయింత లేక తా
రక్కడ నడ్డు దాఁకి బిగి యారఁగ నవ్వగకానికౌఁగిటం

డక్కఁ బెనంగనీక మగుడన్ కొని తెచ్చి మనోజవేదనన్
జిక్కువడంగఁ జేసి యఱఁజేసి రహో యిఁక నేమి సేయుదున్. || 10 ||

ఉ. ఎవ్వరి వేఁడుకొందు నిఁక నేగతి నివ్వెత వీడుకొందు నేఁ
డివ్విధ మెల్ల నెచ్చెలులు కేర్పడఁ జెప్పిన దిట్టకూళ లై
నవ్వులఁ బెట్టి యందఱు వినం గడునామునఁ ద్రుళ్లుకొంచుఁ దా
రవ్వల ఱవ్వలం బఱపి యంకిలి సేయక మాననేర్తురే. || 11 ||

ఉ. ఆద్దిర వానిచెల్వము జయంతునిఁ గంతుని నవ్వసంతునిం
దద్దయు గెల్వఁగాఁ దివురుఁ దప్పక యొప్పులకుప్ప లైనలే
ముద్దులగుమ్మ లాభువనమోహనవిగ్రహుఁ గాంచినంతలో
నుద్ది యిడంగ రానివిరహోదధి బిట్టు మునుంగకుందురే. || 12 ||

ఉ. పున్నమచందురుం దెగడుఁ బూపనిగారపుముద్దుమోము వా
ల్గన్నులు తమ్మిరేకులచొకారము దూరము సేయు జాళువా
వన్నియఁ గేరుఁ జెక్కులు కవాటముదీటువెడందఱొమ్ము హో
కన్నులఁ గట్టిన ట్టిపుడు గానఁగ నయ్యెడు వానియందముల్. || 13 ||

ఉ. పంటికొలందిఁ జక్కెరలపానక మూరెడుకావిమోవి పె
న్గంటి యొనర్చి గుబ్బ లెద గట్టిగఁ జేర్చి కవుంగిలించి పూ
వింటివజీరునాలమున వేమఱుఁ బ్రేమ దలిర్ప వానితో
జంటఁ బెనంగ లేనియలంజవ్వన మేటికి మవ్వ మేటికిన్. || 14 ||

క. అని యిటు లనివారిత మగు ◆ మనసిజవేదనఁ గలంగు మహిలామణిఁ గ
న్గొని యనుఁగుఁజెలు లందఱు ◆ ఘనతరచింతాభరంబు గడలుకొనంగన్. || 15 ||

ఆ. పొలఁతులార యిపుడు నెలఁతకు విరహార్తి ◆ బలిత మయ్యెఁ జేయుపని యిఁ కెద్ది
కలదు చూడుఁ డంచు వలకొని యందఱు ◆ నిందువదనఁ జూచి యిట్టు లనిరి. || 16 ||

క. నీహారకరముఖీ యిటు ◆ లాహా మోహాతిరేక మలరారఁ గడున్
హాహా యని సొలయుచు ఘన ◆ సాహసవృత్తిన్ మెలంగఁ జనునే చెపుమా. || 17 ||

తే. కన్నియవు గాని పోడవు గావు నీవు ◆ కువలయాక్షిరొ సి గ్గెల్లఁ గొల్లఁ బెట్టి
పలుదెఱంగుల నొఱగంగఁ బాడియగునె ◆ యహహ నీడెందమున నింత యళుకు లేక. || 18 ||

క. బాలా వనమృగమదజం ◆ బాలాతతమృదుకపోలభాలా మేలం
బేలా బేలా యిటువలె ◆ మేలా మేలాగు సడల మెలఁగఁగ నీకున్. || 19 ||

చ. తలఁపున నొక్కయన వసుధాతలనాథకుమారుఁ గోరి
దళుకుఁబసిండివన్నియలఁ దద్దయుఁ గేర్నెఱసోయగంపుమే
న్పలువలకాఁకలం గరగి పాఱఁగఁ జేసె ది దేమి మే ల్బళా
చిలుకలకొల్కి నీవెడఁగుఁజిన్నియ లెన్నఁ గ్రొత్త లయ్యెడిన్. || 20 ||

సీ. పెంపార వలిజిలిబిలిపాటఁ బాడుచు ◆ నింపుగా వీణ వాయింప వేమి
గమగమవలచు చక్కనిమంచిగందంబు ◆ వలుదచన్నుబ్బల నలఁద వేమి
జిగిమించు క్రొత్తగొజ్జఁగివిరిసరములు ◆ సొగసుగాఁ గ్రొమ్ముడిఁ జుట్ట వేమి
తళుకుఁ గొమ్మించుటద్దము చూచి నొసలను ◆ దీరుగాఁ గస్తూరి దిద్ద వేమి
తే. చిలుకబోదల మచ్చికఁ జేసి ముద్దు ◆ చిలుక మురిపెంపుమాటలు చెప్ప వేమి
కడిఁదిరతనంపుఁదొడవులు దొడగ వేమి ◆ తెఱవ నీ కిది యేలాటి తెఱఁగు చెపుమ. || 21 ||

ఉ. చెంత మెలంగునూడిగపుఁజేడెల బి ట్టదలించె దేమి ము ‘
న్నెంతయుఁ బ్రేమతోఁ బెనిచి యిడ్డ మయూరమరాళశారికా

సంతతులం గన న్మెఱయ సారెకుఁ బాఱ నడంచె దేమి సీ
మంతవతీలలామ యది మంచిదె నీమది నెంచి చూడుమా. || 22 ||

చ. మదనసమానమూర్తి యని మానవనాథకుమారశేఖరున్
మదిఁ దలపోసి యిట్లు పలుమాఱు గృశింపఁగ నేల నీకు స
మ్మద మగున ట్లొనర్చెదము మాపలు కిమ్ముగ నాదరించి యో
మదకలహంసయాన వినుమా యనుమాన మిఁకింత యేటికిన్. || 23 ||

ఆ. అనుచు నిటు లనుంగునన్నఁబోఁడు లాడిన ◆ పలుకు లాలకించి కలికిమిన్న
కడఁకతో నొకింత కలఁకలో నుడిగి య ◆ య్యిగురుఁబోఁడ్లఁ జూచి యిట్టు లనియె. || 24 ||

సీ. చెలులార వినుఁడు కల్వలతేని వలతేని ◆ నలువారఁ బలుమాఱు గెలువఁ జాలు
వలతేనిసోయగం బెలమిఁ గన్నులఁ జూచి ◆ నంత నుండియు డెంద మతనియందె
తవిలి క్రమ్మఱక వంతలఁ గలంగఁగఁ జాఁగె ◆ నహహ మోహము నిల్ప నలవి గాదు
శుకమయూరమరాళపికశారికామధు ◆ వ్రతచమూసహితుఁ డై రతివరుండు
తే. వెతలఁ బఱచుచున్నాఁడు వేయుగతులఁ ◆ దఱచు లిం కేల యీవేళఁ దాళఁ జాలఁ
జక్కఁగా మీకుఁ గేల్మోడ్చి మ్రొక్కు లిడెదఁ ◆ జెలిమి దైవార నుసురులు నిలుపరమ్మ. || 25 ||

చ. వినుఁ డొకమాట చెప్పెద నవీనకృపామతి నాదరించి యి
ప్పని యొనరించి వేదనలఁ బాపుఁడు మీ రిటు గాక యున్నచో
నెన రెడలించి నాయెడల నేరము లెంచి చలంబు మించ నో
యనుఁగువెలందులార కడునారడిఁ బెట్టకు రమ్మ వేఁడెదన్. || 26 ||

ఆ. అనిన బోటికత్తె లమ్మ నీ కిపు డింత ◆ చింత యేల వట్టిఱంతు లేల
నెమ్మి నుండి నీకు సమ్మదం బొనఁగూర్తు ◆ మనుచు నూరడించి యనిచి రెలమి. || 27 ||

తే. అటులఁ జెలు లూరడించిన నాసఁ దవిలి ◆ యన్నిలింపాంబుజాతదళాయతాక్షి
యతితరాభీప్సితావృతస్వాంత యగుచుఁ ◆ గొంతదిట మూని యున్న యనంతరమున. || 28 ||

సీ. చెఱకుసింగిణివింటఁ గఱకుతుమ్మెదవారిఁ ◆ దవిలించి విరిదొన ల్రవళిఁ బూని
కడిఁది గేఁదంగిరేకడిదంబు మొలఁ జెక్కి ◆ సురపొన్నక్రొన్ననజోడు దొడిగి
పలుమొల్లసరములపాగ బాగుగఁ జుట్టి ◆ మేలినెత్తమ్మిపూడాలు వట్టి
రాణించుచిలుకపతాణితేజీ నెక్కి ◆ గండుఁగోయిలదండు నిండి కొలువ
తే. నలరువిలుకాఁ డనెడిపేరి బలుసిపాయి ◆ హాళిఁ బైకొని కో యని యార్చి పేర్చి
కలికివలిగబ్బిగుబ్బగుబ్బలులనడుమ ◆ వాఁడివిరిముల్కి డుస్సిపోవంగ నేసె. || 29 ||

క. ఏసిన హా యని సోలి వి ◆ లాసిని వడిఁ దెలిసి పెక్కులాగుల వెతలన్
వేసరి యేమియుఁ దోఁచక ◆ గాసిలుచుం జెలిమివెలఁదుకల మొఱఁగి వెసన్. || 30 ||

సీ. పట్టెలఁ గే లూని పాన్పు మెల్లన డిగ్గి ◆ గిలుకుపసిండిపావులు దొడుగక
మినుకుచేలచెఱంగు మేలుముసుం గిడి ◆ పుడమిపైఁ దడఁబడ నడుగు లిడుచు
వీడిననెఱికొప్పు వీఁపున జీరాడ ◆ గాటంపుటూర్పులు గడలుకొనఁగ
జిలిబిలిచెమటసోనలు మేన జాల్గొన ◆ జిలుఁగునెన్నడుమునఁ జేయిఁ జేర్చి
తే. జంటఁ బిలపిలఁ జనుశుకశారికామ ◆ యూరకాదంబవితతుల నులికి పాఱఁ
దఱుముకొనుచు నొకర్తును దారి వట్టి ◆ తరలెఁ దరలాక్షి యంతికోద్యానమునకు. || 31 ||

వ. అట్లు తరలి చని వనిం బ్రవేశించి. || 32 ||

సీ. కమ్మపుప్పొడి ముండ్లకరణి నంఘ్రులు గాఁడ ◆ నలరులు మరుతూపులట్ల తగులఁ
బికరావములు పెద్దపిడుగుల ట్లదలింపఁ ◆ గేకులు పులులట్ల ఢాక చూపఁ
గొదమతేంట్లు తుపాకిగుండ్లపోలికఁ దాఁక ◆ నలఁతిగాడ్పులు బూచులట్ల పొదువఁ
దలిరుటాకులు కటారులమాడ్కి మెయి సోఁకఁ ◆ గపురంబుపెంధూళి గతిని గప్ప

తే. నడలి యెచ్చోటఁ గా లూన నలవి గాక ◆ మరలి పూఁదేనెసోనలు గురియుచున్న
తలిరుజొంపంపులేమావితరులనడుమ ◆ మేలికపురంపుఁదిన్నెపై మేను చేర్చి. ‖ 33 ‖

తే. ఏమి సేయుదుఁ గటకటా యించువిల్తుఁ ◆ డేఁచ నిలు వెళ్లి వనిఁ జేరు టెల్ల నిపుడు
గన్గొనఁగఁ బీడ విడచి బిగాది పట్టి ◆ నట్టు లయ్యె నిం కెచ్చోటి కరుగవలయు. ‖ 34 ‖

సీ. గడితంపుమొగిలిరే కడిదంబుఱొమ్మునఁ ◆ గదియించి డుస్సిపో నదుముదాన
మేటిగొజ్జెఁగనీటియేటికాలువలోనఁ జుఱు కూని చివ్వున నుఱుకుదాన
దాకతీవను బూవుందండ చేరిచి మెడ ◆ యిఱియంగ నురి బిగియించుదాన
విరిదేనెలోనఁ గప్పురము వోసి మెదించి ◆ తడయ కొక్కుమ్మడిఁ ద్రావుదాన
తే. గాక యుండిన సితగరుత్కోకశౌక ◆ కోకిలానీకమత్తమధూకచంచ
రీకశారీకదంబంబు లేక హేళి ◆ దాఁకి పైకొన నిఁక నిల్వఁదరమె యిందు. ‖ 35 ‖

చ. అళులుఁ బికంబులు న్శుకము లంచలు శారికలు న్మయూరముల్
గొలగొలలాడుచుండ నివి కూఁత లిడన్ బెగడొంది యయ్యయో
చెలుల మొఱంగీ యిచ్చటికిఁ జేరుట యెల్లఁ దలంచి చూడగా
ములు వెడలించి కొఱ్ఱు బిగమొత్తినచందము దోఁచె నియ్యెడన్. ‖ 36 ‖

వ. మఱియును. ‖ 37 ‖

తే. హరహరా యంచు రామరామా యటంచుఁ ◆ జక్రధర యంచుఁ బలుమాఱు సంస్మరించు
మకరకేతనపరభృతమందగంధ ◆ వహులదాడికి మోడి యావన్నెలాఁడి. ‖ 38 ‖

సీ. ముద్దుగుమ్మకు శిలీముఖ మయ్యెఁ దుమ్మెద ◆ యలికుంతలకి సోఁకు డయ్యె గాడ్పు
కలికికిఁ బుండరీకం బయ్యె నెత్తమ్మి ◆ యంబుజాక్షికి బర్హి యయ్యె నెమిలి
యతివకుఁ బున్నాగ మయ్యెను సురపొన్న ◆ కొమకుఁ గాండం బయ్యె హిమజలంబు
కంబుకంఠికిఁ బరాగం బయ్యెఁ బుప్పొడి ◆ సతికిఁ గోకం బయ్యెఁ జక్రవాక
తే. మంగభవఘోరసాయకాయాతయాత ◆ నావికంపితహృదయరాజీవ యగుచు
నంతకంతకు సంతాప మతిశయిల్ల ◆ నుపవనంబునఁ బ్రచరించుచుండు నపుడు. ‖ 39 ‖

క. అత్తఱిఁ బుత్తడిగీమున ◆ బిత్తరిఁ గానక కరంబు బెగ్గిలి యనుఁగుం
గత్తియ లందఱు నొకచో ◆ మొత్తము లై తత్తరిలుచు మురి సడలంగన్. ‖ 40 ‖

ఉ. హా లలనాశిరోమణి గృహంబును వెల్వడి మన్మథానల
జ్వాలల కోర్వ కెచ్చటికిఁ జూఁగెనొ యెయ్యెడ నేమి యయ్యెనో
వైళమ చూడరే యనుచు వావిరి నారయుచున్న యప్పు డా
బాలికచంద మంతయును బంజరకీరము లేర్పరించినన్. ‖ 41 ‖

క. విని వనిత లహహ నిర్భయ ◆ మున నేమరి యుండి మోసపోతిమి గదరే
యని వని కందఱు గొబ్బునఁ ◆ జని చెలి నందంద వెదుకఁ జూఁగి కడంకన్. ‖ 42 ‖

సీ. ఈకప్పురపుఁదిప్ప యెక్కి యొక్కంతసే ◆ పెలనాగ వల నొప్ప నిలిచియుండె
నీగుజ్జులేమావియివురుజొంపమునీడ ◆ బడఁతి యించుకసేపు పవ్వళించె
నీమిటారపుఁజందమామరాతిన్నెపైఁ ◆ గోమలి యించుకసేపు గూరుచుండె
నీవేడబపుమొల్లపూవుక్రొంబొదరింటఁ ◆ జాన యించుకసేపు సంచరించె
తే. నీనిగారంపుద్రాక్షాలతానికాయ ◆ కాయమానాంతరంబులకడ నొకింత
సేపు నాళీకపత్రాక్షి సేదఁ దీర్చు ◆ కొనియెఁ గన్గొనరమ్మ యోకొమ్మలార. ‖ 43 ‖

సీ. పాను పెక్కఁగ లేక బడలుచేడియ యెట్టు ◆ లీకప్పురపుఁదిప్ప లెక్క నోపె
విరిదీఁగె సోఁకి వేసరుబాల యెట్టు లీ ◆ కారుపూఁబొదరిండ్లు దూఱ నోపె
వీణాధ్వనుల కుల్కువెలఁదుక యెట్టు లీ ◆ ఘనాపికారావము ల్వినఁగ నోపెఁ
దాలవృంతములకుఁ దలఁకుపైదలి యెట్టు ◆ లీసురుగాడ్పుల కెదుర నోపెఁ

తే. గేళికాగారములపొంతఁ గేళకుళులఁ ◆ జొరవెఱచుజోటి యెట్టు లిచ్చోటిమేటి
తేటగొజ్జంగిపూనీటియేటికాల్వ ◆ దాఁట నోపెనొ కదరమ్మ బోటులార. ‖ 44 ‖

సీ. ఎద వ్రయ్య లొదవంగ నీదుండగపుగండుఁ ◆ గోయిలరాపిండు గూయుచుండ
మేను చిల్లులు వోవ నీనాలివలిగాడ్పు ◆ మూఁకలు పైపైని సోఁకుచుండఁ
తలదిమ్ము ఘటియిల్లఁ దవిలి యీతాబోటు ◆ మొకరితుమ్మెదరిమ్ము మొరయుచుండఁ
గనుదోయి నెఱిఁ గప్పఁ గడఁగి యీబలితంపు ◆ చుఱుకుఁగప్రపుబూది పఱచుచుండ
తే. నొక్కతెయుఁ గోనఁ ద్రిమ్మరుచుండి నొండు ◆ కొనుదొసంగులఁ బిమ్మటఁ గొనుచు మనలఁ
దలఁచి యమ్మక చెల్ల యవ్వేలఁది యెంత ◆ వంత నడలెనొ కదరమ్మ యింతులార. ‖ 45 ‖

సీ. ఈబిసంబులు చూచి హేలావతీమణి ◆ పాఁపకూటువ లంచు భ్రమసెనేమొ.
యీపికంబులఁ జూచి యిందీవరేక్షణ ◆ చెడుగుసోఁకుడు లంచు జడిసెనేమొ
యీనెమళ్ళను జూచి మానినీతిలకంబు ◆ బలుకార్ముకము లంచుఁ బఱచెనేమొ
యీకెందలిరుఁ జూచి రాకేందుబింబాస్య ◆ దవవహ్ని యనుచు లోఁ దలఁకెనేమొ

తే. యహహ పసిబిడ్డ కిట్టిఘోరార్తి యొదవె ◆ నేమి సేయుద మే మంద మెటకుఁ బోద
మెవ్వరిని వేఁడుకొంద మిం కిపు డటంచు ◆ నోలి దిరుగుచుఁ జని చని యొక్కచోట. ‖ 46 ‖

సీ. ముసుఁగు వాయఁగఁ ద్రోచి కసరి దిగ్గన లేచి ◆ యత్తిత్తి నలుగడ లరయుదాని
మాటి కబ్రపుజాలి నాటి క్రొవ్వేఁడిక ◆ ల్పీటిజా ల్గొనగోట మీటుదాని
హెచ్చారుమరునంపచిచ్చుఱసెకఁ గంది ◆ యుసు రంచు నిట్టూర్పు లుచ్చుదాని
బెడిదంపుమదకీరరావముల కుల్కి ◆ పెల్లుగా మదిఁ దల్లడిల్లుదాని
తే. నుసురు లూడాడ విసవిస విసరి ముసరి ◆ దొసఁగు లెసగించుసురుగాడ్పుతుటుముదాడి
కడలి తద్దయు గడగడ వడఁకుదాని ◆ వేల్పురాకన్నెఁ గాంచి రావెలఁదు లపుడు. ‖ 47 ‖

తే. కాంచి దవ్వులనుండియే కడఁకఁ బఱచి ◆ పొదవికొని యశ్రుజలపూరమున మెఱుఁగుఁ
బోఁడిమైతాప మార్చుచుఁ బ్రోడ లైన ◆ యనుఁగుఁగెందలిరాకుఁబోఁ డ్లాదరమున. ‖ 48 ‖

తే. చెంగలువపూలు మేలుసంపెంగవిరులు ◆ పడఁతి మిన్నకుఁ జుట్టి రా బడిసి వైచి
కప్పురపుబూది నిటలభాగమున బెట్టి ◆ యఱుతఁ గురువేరు గట్టి నెయ్యమున ననిరి. ‖ 49 ‖

ఉ. కొమ్మరొ ముమ్మరంపువెత గ్రుందుచు ని ల్లెడఁబాసి యిమ్మెయిన్
మ మ్మఱ చేసి యొంటిగ వనంబున కేటికి వచ్చి తమ్మ నె
త్తమ్ములఁ గేరునీమృదుపదంబులు గందెఁ గదమ్మ మేలుమే
లమ్మకచెల్ల నీబలుగయాళితనమ్ములు చెప్పఁ జిత్రముల్. ‖ 50 ‖

క. కన్నెల నెందఱినేనియుఁ ◆ గన్నులఁ జూచితిమి గాని కటకట యిటులన్
మున్నెన్నడు నీపగిది ◆ న్మున్నటికలఁ బొరలుమానినులఁ జూచితిమే. ‖ 51 ‖

సీ. కుజనులఁ జేరి చొక్కుచు శీధుపానంబు ◆ సేయుచండాలు లీచెనఁటితేఁటు
లడవులఁ దెరువరు లడలఁ గేకలు పెట్టి ◆ పఱచుశిఖండు లీబర్హిణములు
పలుగాకిమూఁకలో బ్రతికి పంచమరీతి ◆ నెసఁగుకాలాకృతు లీపికములు
విషము విదుల్చుచు వెస ఘనవిముఖతఁ ◆ జనుజాలపదము లీసారసములు
తే. పూని నిరతంబు చెలరేగి పుణ్యతరుల ◆ ఫలము లెల్లను బడఁద్రోయు పక్షపాతు
లీశుకంబులు హా వెఱ పింత లేక ◆ వనజదళనేత్ర యిం దేల వచ్చి తమ్మ ‖ 52 ‖

తే. ఆయెఁ గానిమ్ము మంచిది యబల యింకఁ ◆ గొంక వలవదు నీమదికోర్కె లెల్లఁ
దీఱు నిప్పుడు వనిలోనఁ దూఱి పూలు ◆ గోయుదము రమ్ము తహతహా కొంత దీఱ. ‖ 53 ‖

తే. అనుచు వనజాతలోచన నత్తెఱఁగున ◆ నాడి సంగడిపూఁబోఁడు లంత నచటఁ
దరలి పుష్పాపచయబుద్ధి దలముకొనఁగ ◆ వరుస నందఱు శృంగారవనము చొచ్చి. ‖ 54 ‖

తే. క్రొమ్ముడులు దిద్ది కంచెలల్ గుదియఁ గట్టి ◆ మొలల నవరత్నమయకాంచికలు బిగించి
యందియ ల్పాదకటకము ల్పొందుపఱచి ◆ యొండొరుల మీఱి వేడుక ల్మెండుకొనఁగ. || 55 ||

మ. అళులం జోపుదుఁ బువ్వుఁదేనియల నెయ్యం బొప్పఁగాఁ గ్రోలుచున్
ఫలము ల్మెక్కుచుఁ దీవపందిరులలోఁ బల్మాఱుఁ గ్రీడించుచున్
గలకంఠంబులఁ దోలుచున్ సుమపరాగం బుద్ధతిం జిమ్ముచుం
దలిరున్ జొంపము లెల్లఁ ద్రుంచుచు సుధాధామాననల్ నెమ్మదిన్. || 56 ||

మ. వలిగప్రంపుటనంటిబోదియలక్రేవ న్గుజ్జులేమావిమ్రా
కులనీడన్ బలుచాకపందిరులలో గొజ్జంగపూనీటివా
కలపొంతం గురువింద పెన్ బొదలలో గాటంపుఁజెంగల్వబా
వులపజ్జ న్నెలరాలదిన్నియలఁ బ్రోవు ల్గూడి క్రీడించుచున్. || 57 ||

సీ. మిహికాంశుముఖి యోర్తు సహకారభూజంబు ◆ కలికి యొక్కతె తిలకద్రుమంబు
కరిరాజయాన యొక్కతె సింధువారంబు ◆ కోమలి యొక్కతె కురువకంబు
శతపత్రపత్రలోచన యోర్తు వకులంబు ◆ సుందరి యొక్కతె యశోకతరువు
కలకఁఠకంఠి యొక్కతె ప్రేంఖణంబును ◆ సన్నుతాంగి యొకర్తు పొన్నమ్రాను
తే. సఖి యొకతె గోఁగు నొకయింతి చంపకంబు ◆ నలరు లెత్తించి రెలమిఁ జే నంటి చూచి
యూర్చి కౌగిటఁ బెనఁచి క ల్లుమిసి తాఁచి ◆ పాడి నగి పల్కి యాననప్రభలు నెఱపి. || 58 ||

తే. మఱియు వనియెల్లఁ గలయఁ ద్రిమ్మరి యుడుగక ◆ మెదలుటక్కరిగండుఁదుమ్మెదలు వొలయఁ
బొదలు గాటంపుఁగ్రొవ్విరిపొదలు దూఱి ◆ నవలు గోసిరి సరసిజాననలు చెలఁగి. || 59 ||

సీ. పొన్నపువ్వులు గోసెఁ బూఁబోఁడి యొక్కతె ◆ మొగలిరేకులు ద్రుంచె ముగుద యొకతె
కుందము ల్చిదిమె నిందిందిరాలక యోర్తు ◆ చంపకంబులు గిల్లెఁ జాన యొకతె
స్థలజలజవ్రజంబులు గోసెఁ జెలి యోర్తు ◆ భండీరములు ద్రుంచెఁ బడఁతి యొకతె
దాసనంబులు గోసెఁ దరుణీమణి యొకర్తు ◆ పాటలంబులు గోసె బోటి యొకతె
తే. హాళి దైవార దైవతాబ్జాస్య లెల్ల ◆ రేసి తమనాభినఖదంతనాసికాంఘ్రి
భుజరదచ్ఛదతనుగంధములకు సాటి ◆ గా వివి యటంచు నిరసించుకరణి నపుడు. || 60 ||

తే. చెఱకువిల్లును గ్రొమ్మావిచిగురువాలు ◆ నలరుఁదూపులుఁ బూని కోకిలశుకాలి
బలములోఁ దూఱి తా మనోభవుఁడ నంచు ◆ సతుల బెదరించె నొకసరోజాతవదన. || 61 ||

తే. కురులు జడ యల్లి మందారకుసుమ మునిచి ◆ కప్పురపుబూది మైఁ బూసి గొప్పమల్లె
విరిసరు ల్దాల్చి తా మహేశ్వరుఁడ నంచు ◆ దాని నదలించె నొకమత్తదంతియాన. || 62 ||

వ. వెండియుఁ దమలోన. || 63 ||

రగడ. వనిత వనితరు లలమి నేరుపు లన వల నగుననలు ద్రుంచుము
తనరుతనరుచి నెఱపుచున్నది దబ్బ దబ్బఱ గాచు కాంచుము
వలదు వల దురుగతి యనంటుల వంతవంతల కెల్ల నీరము
కలికి కలికివెడందకన్నులఁ గప్పుఁ గప్పురపున్ దుమారము
మేల మేల లతాంగి వలిదుమ్మెదలు మెదలెడుపొదలఁ దూఱెదు
చాలఁ జా లగుచున్నబాలరసాలసాలము లెక్కి జాఱెదు
పూని పూ నిలు వెల్ల ననచిన పొన్నపొన్నల నీడ నాడక
మాని మానిను లెల్ల మెల్లన మల్లి మల్లియ లాఁగి రోడక
తెఱవ తెఱవడిఁ బూని కదలిచి తేని తేనియసోనవానలు
నెఱయు నెఱయువిదలకు వేడుక నించు నించుక యలరుఁగోనలు
సారసారససౌరభము వెదచల్లు చల్లనికొలనిచెంతను
జేరి చేరిక నాడుకొందము చెలువ చెలు వలరఁగ నొకంతను
దలరెఁ దలరెడువిరులు దొరకినదాఁక దాకఫలంబు లేరక
యలసి యలసికతామయంబులయంద యందఱు నుంటి రూరక
మాను మానును మొల్లక్రొంబొద మఱుగు మరుగురుపదము భామిని

కాన కాననఁబోండ్లు చనియం గదలఁ గదలక నిలిచి రామిని
నెన్న నెన్నడుఁ జూడ మిటు పరు వేల వేలతరంబు పువ్వులు
కన్నె కన్నెఱఁ జేసి కోపము గ్రమ్మఁ గ్రమ్మఱఁ జనెదు దవ్వులు
కొమ్మ కొమ్మదుపూఁతసంపెఁగకొమ్మ కొమ్మని తఱిమి చూపకు
మమ్మ మ మ్మఱ చేసి తేఁటుల మాటిమాటికి నెడలు వాపకు
మహిల మహిల కడిందియలరుల మనికి మనికిత ముడిగి చూడుము
బహుల బహులలకొఱకు నెల్లెడఁ బర్వి పర్విడఁ బోక వీడుము
సేనసేనలు గూడి ముద్దులు చిలుకఁ జిలుకలు మొఱయు నిచ్చటఁ
జాన జా నగుననలు వెదుకఁగఁ జాగి జా గిటు లేమి ముచ్చట
యేమె యేమెడ యైనఁ జని వన మెల్ల మెల్లన గాళు చేసెదు
రామ రామకలీలఁ గ్రాలుసర మ్మురమ్మునఁ దీసి వ్రేసెదు
పొగడ పొగడఁగఁ దగు నహా నినుబోటిబోటికి దీనితావులు
తగవె తగవె మరుండు పొదలకుఁ దారి తారి తొలంగుదీవులు
మధుపమధుపవనేందులను బగ మాన మానసమునఁ దలంతమె
మధురమధురసకుసుమములు పలుమాఱు మారున కిడి భజింతమె. ॥ 64 ॥

తే. అనుచు వనకేళి సలిపి లతాంగు లెల్లఁ ◆ జాల నలరులు దలిరులు సంగ్రహించి
ఘర్మజలబిందువులఁ దోగి కడఁక మెఱయ ◆ నంత జలకేళి గావింప నదను దలఁచి. ॥ 65 ॥

సీ. యక్షనాయకునిభాండాగారమునఁ బోలె ◆ మకరకచ్ఛపవరమహిత మగుచు
గమలామనోహరుకరతలంబునుబోలెఁ ◆ బటుశంఖచక్రవిస్ఫార మగుచు
బృందారకాధీశుమందిరంబునుబోలె ◆ ననిమిషామృతపరివ్యాప్త మగుచుఁ
గామనీయకతారకాపథంబునుబోలె ◆ ఘనరాజహంససంకలిత మగుచు
తే. భూరిదిఙ్మండలముఁబోలెఁ బుండరీక ◆ కుముదసంసక్త మగుచు సంక్షుద్రలీలఁ
జాల నొప్పారుసారకాసార మొకటి ◆ గాంచి రపు డవ్వియచ్చరకమలముఖులు. ॥ 66 ॥

సీ. సమదరథాంగభాస్వరపయోధరయు స ◆ మీచీనపాఠీనలోచనయును
శైవాలవల్లరీజాలధమ్మిల్లయు ◆ వికచనవీనారవిందముఖియు
నతులగంభీరతరావర్తనాభియు ◆ రంగదుత్తుంగతరంగవళియు
విలసన్మహోదగ్రపులిననితంబయు ◆ డిండీరదరహాసమండితయును
తే. గంబుకంఠియుఁ గలహంసగామినియును ◆ రామకమిళిందమాలికారోమలతయు
నగుసరోవరలక్ష్మి యయ్యబ్జముఖుల ◆ కతులితామోద మొసఁగె నయ్యవసరమున. ॥ 67 ॥

తే. అమరనారీశిరోమణు లతితరప్రహర్షమానస లై యపు డక్కడింది
తమ్మికొలను నిరీక్షించి తత్తటమున ◆ వసనమణిమయభూషణావలులు వెట్టి. ॥ 68 ॥

చ. గడితపుఁగావిపావడలు గట్టి కుచంబులబంటి నీటిలోఁ
దడయక చొచ్చి హెచ్చరిక దార్కొన నుమ్మడి నోలలాడుచున్
దొడరి పిసాళిజక్కవలఁ దుమ్మెదదాఁటుల నంచబోదలన్
మడువునఁ బాఱఁ దోలుచు సమగ్రవిలాసవిహారలీలలన్. ॥ 69 ॥

చ. కరివరయాన యోర్తు లిసకాండము చిమ్మనగ్రోవి చేసి య
బ్బురముగ నోర్తు మీఁదఁ దనపుక్కిటినీరము చల్లి నీటిలో
సరగ మునింగె దానికచసంతతి యంచును నాఁచుఁదీవ ని
బ్బరముగ లాగె నచ్చెలువ పైదలు లందఱు నవ్వి రొక్కటిన్. ॥ 70 ॥

తే. ఉవిద యొక్కతె వెతికిలనుండి నీటఁ ◆ దేలుచో నొక్కరాయంచ తివిరి తమ్మి
మొగ్గ యంచును దానిచన్మొగడ వొడువఁ ◆ గలికి యలికి యొకించుక యులికిపడియె. ॥ 71 ॥

క. నలినకుముదాదికము ల ◆ త్తలునీమణు లెల్లఁ గోయుతఱి నొకచెలి చే
తుల ముట్ట దయ్యె నలినం ◆ బులు కన్నులఁ జూడ దయ్యెఁ బో కుముదంబుల్. ॥ 72 ॥

ఉ. చంపకగంధి యోర్తు మదషట్పదపంక్తులఁ దోలె నంచలన్
బెంపఱఁ జేసె నొక్కజలభృద్ఘనవేణి మృనాళనాళముల్
ద్రుంపఁదొడంగె నెచ్చరికతో నొకమత్తగజేంద్రయాన కం
పింపఁగఁజేసె నొక్కశశిబింబనిభానన చక్రవాకులన్. || 73 ||

చ. మెలఁతుక యోర్తు తమ్మివిరిమీఁదటితేఁటులఁ జోప నయ్యళుల్
చెలివదనాంబుజంబునకుఁ జేరినఁ గేళిసరోరుహంబుచేఁ
బలుమఱు దోలుకొన్న విడి పాఱక యున్నఁ గలంగి దానిపైఁ
దలఁగక చల్లె వేనలిని దాల్చిన గాటపుఁగ్రొత్తసంపెగల్. || 74 ||

క. అలివేణి యొకతె యొకతొ ◆ య్యలిపై నోల యిడి పఱచి యంబుజషండం
బుల నడుమ డాఁగె బానిం ◆ బలిమిం బోనీక పట్టి పడఁతి గలంచెన్. || 75 ||

క. అప్పులఁ బడి యొకచేడియ ◆ తెప్పునఁ దేలంగ లేక తిరుగుడుపడుచోఁ
గొ ప్పొడిసి తిగిచె నొకచెలి ◆ యప్పులఁ బడువారిబ్రదుకు లట్టివ కావే. || 76 ||

తే. ముగుద లుమ్మడి సరసిలో మునిఁగితేలు ◆ నపుడు కచముల జాఱు నీ రనువు మీఱఁ
గలికిమిన్నలక్రొవ్వెద ల్ఘనము లగుటఁ ◆ బెరసి ధారాళవర్షము ల్గురిసె ననఁగ. || 77 ||

చ. నెలఁతలు నీటిలోనఁ దమనీడలు గన్గొని చిల్వచెల్వ లం
చెలమిని గౌఁగిలించుకొన నేగెడుచందము దోప బాహుశా
ఖలు నెఱీఁ జూచి యీఁదుచును గ్రన్నన లోనికి డిగ్గి డిగ్గియం
గలఁగఁగఁ ద్రొక్కి యేమియును గానక యబ్బురమంది రందఱున్. || 78 ||

సీ. కరిరాజయాన యొక్కతె గాసివెట్టఁ దా ◆ మరసాక్షి హరిమధ్య మఱుగు దూఱెఁ
దుహినాంశువదన యోర్తు గలంపఁ జక్రసు ◆ స్తని యహిరోమాళి వెనుక నీఁగె
మదకీరవాణి యోర్తు దలంకఁ జేయ బిం ◆ బోష్ఠి సాంకవగంధియొద్దఁ జేరెఁ
గలకంఠకంఠి యొక్కతె నొంపఁ దలిరాకుఁ ◆ బోఁడి రామాంగి దాపున వసించెఁ
తే. గమలకల్హారకువలయకుముదసమద ◆ యాంచితామోదమేదురోద్యత్సరోవ
రాంతరంబున లీలావిహారసరణి ◆ నమర హిమరుగ్వదన లోలలాడునపుడు. || 79 ||

క. మునుఁగుచుఁ దేలుచు నీఁదుచు ◆ ననువుగ నుదకంబుఁ జల్లులాడుచుఁ బరువుల్
గొని యోల లిడుచు చొండొరుఁ ◆ జెనకుచుఁ జేడియలు క్రీడఁ జేసిరి నెమ్మిన్. || 80 ||

ఆ. అంతఁ గొలను వెడలి యింతులు దరిఁ జేరి ◆ కుంతలంబు లార్చుకొని విభూష
ణాంబరాదికంబు లలరించుకొని సంత ◆ సమున మరల వనికిఁ జని యొకెడల. || 81 ||

తే. వలపుఁగప్రంపుటనఁటిమ్రాఁకులకెలఁకుల ◆ జాలువాఱెడుచలువగొజ్జంగినీటి
యేటికాల్వల నే పొందు మేటిదాక ◆ తీవ వలిగొన్న గుజ్జులేమావిక్రింద. || 82 ||

తే. కొమరు దళుకొత్తఁ జెఱకుఁగంబములు నిలిపి ◆ యలరు పందిరి వైచి కెందలిరుటాకుఁ
దోరణంబులు గట్టి సింగార మెలయఁ; గమ్మగేదంగిరేకుద ళ్లిమ్ముపఱచి. || 83 ||

క. నును పగుమృగమదపంకం ◆ బున దీనియ దిద్ది కప్రపుంబొడి మ్రుగ్గుల్
నినిచి లవలిదళములపై ◆ మనసిజరతిసతుల వ్రాసి మఱి యద్దరులన్. || 84 ||

తే. తద్భలంబుల వ్రాసి గంధప్రసూన ◆ ధూపదీపప్రముఖషోడశోపచార
ముల నిరంతరభక్తిచే బూజ సేసి ◆ చిగురుఁబోఁడులు డాకొని పొగడి రపుడు. || 85 ||

క. దండము నీ కిదె జగదు ◆ ద్దండభుజాదండనిహితతతసుమనఃకో
దండవినిర్జితసకలా ◆ జాండస్థితజంతుజాత హరిసంజాతా. || 86 ||

సీ. ఎడప కెప్పుడుఁ గన్ను లెఱ్ఱఁజేయుబలంబు ◆ గంటి సేయక యెద నంటుతూపు
వట్టిమ్రాఁకులు చివు ర్వెట్టించుదళవాయి ◆ మి న్నంది యేపున మెలఁగుతేరు
తునిఁగియు మొలచునద్భుతపుఁగన్నులవిల్లు ◆ తనకుఁ దా మొఱయుబిత్తరపునారి
చుఱుకు మీఱఁగఁ బండ్లు గొఱుకు ఱెక్కలజక్కి ◆ నీళ్లలో జాడలు నెమకు సిడము
తే. గలిగి యలిగినపతుల శృంగారవతుల ◆ రతులఁ బెనయించి హొళిమై నతుల గతులఁ
గేరు నేరుపు నీకె చేకూఱె నౌర ◆ మహితసుకుమార మార రమాకుమార. || 87 ||

క. కొంకక యెపుడును నీపద ◆ పంకరుహధ్యానరూఢిఁ బరఁగుదు మదనన్
సంకల్పసిద్ధి యిడుము వి ◆ శంకటశృంగారవిభవ సంకల్పభవా. || 88 ||

క. కమలభవభవముఖామర ◆ సముదయ మళు కొందు నీనిశాతప్రసవా
స్త్రముల కిఁక నన్యు లెదురే ◆ సమదోద్యత్కీరగమన శంబరదమనా. || 89 ||

తే. హొళిఁ జలపట్టి మృదుకుసుమాశుగముల ◆ యతులదృఢమానసములు వ్రయ్యలుగఁ జేయు
నీపరాక్రమరూఢి వర్ణింపఁ దరమె ◆ విరహిణీపాంథజనజైత్ర విష్ణుపుత్ర. || 90 ||

చ. పనివడి యింత నీయెదురఁ బల్మఱుఁ దెల్పఁగ నేల బాల న
జ్జనవరసార్వభౌముఁడు వశంవదుఁ డై కడు గారవించి నీ
పనులఁ గరంగఁ జేయు నెడ బాళి దలిర్పఁగ నీకు నెంతయున్
ననిచినకూర్మి నుత్సవ మొనర్చుఁ జుమీ సరసీరుహాంబకా. || 91 ||

తే. అనుచు నతనుని బ్రార్థించుకొని మెఱుంగుఁ ◆ బోఁడు లక్కన్నెఁ దోడ్కొనిపోయి నిజని
కేతనము చేర్చి యతితరప్రీతి మెఱయ ◆ నరయుచుండిరి మఱి తదనంతరమున. || 92 ||

క. బంధూకప్రసవవిభా ◆ బంధురుఁ డై యపుడు పద్మబంధుఁడు గ్రుంకెన్
సింధుపరమణీవేణీ ◆ బంధంబున జాఱుపికిలిబంతియపోలెన్. || 93 ||

సీ. చరమాద్రిశిఖరసంచరదభ్రచరవధూ ◆ శ్రేణి గట్టినతోఁపుఁజీర లనఁగ
నంబరారణ్యభాగంబునఁ దళుకొత్తు ◆ గుజ్జులేమావిచిగు ళ్లనంగ
నంభుదీశ్వరురాణిహర్మ్యాగ్రభిత్తిపైఁ ◆ బొలుపారుజేవురుపూఁత లనఁగ
దిక్సతీమణులు మత్తిలి చల్లు లాడెడు ◆ గడితంపుబగ్గుండిపొడు లనంగఁ
ఆ. దిమిరమత్తేభరాజ ముద్వృత్తి బయలు ◆ వెడలుచో మేనఁ గనుపట్టు వితతగైరి
కప్రభాచ్ఛట లనఁగ నఖండలీల ◆ సంజకెంజాయ లలరె దిశాముఖముల. || 94 ||

చ. తఱి యనులోహకారకుఁ డుదగ్రతఁ బశ్చిమశైలశృంగమున్
గుఱికొని వేలుపుందెరువు గొప్పపిరంగునఁ జాయమందులోఁ
గొఱలెడువిన్నుమానికపుగుండు ఘటించి యగాదు చేసినం
దఱచుగఁ గ్రమ్ముక్రొంబొగ లనంగ జగంబునఁ బర్వెఁ జీఁకటుల్. || 95 ||

తే. రవళిఁ గువలయహితుఁ డగురాజు స్వారి ◆ వచ్చునెడల విభావరీవనరుహాక్షి
చెలఁగి చల్లినముత్తెంపుసేసఁబ్రా ల ◆ నంగఁ జుక్కలు దట్టమై నింగిఁ బర్వె. || 96 ||

చ. విరహుల గెల్వఁ గోరి ననవిల్తుఁడు బల్తుఱు తూని పుప్పలి
ట్పగభృతకేకిసంఘములఁ బం పిడి తానును విశ్వరూప మ
చ్చెరువుగఁ దాల్చెనో యనఁగఁ జీఁకటి లోకము లెల్ల నిండెఁ ద
త్కరపరిముక్తకుందవిశిఖంబు లనం దనరారెఁ దారకల్. || 97 ||

క. చిత్తజుఁడు జగముపై దం ◆ డెత్తుచు నని యిడ్డ మదపుటేనుఁ గనంగా
హత్తుకొని దిశలఁ దిమిరము ◆ ముత్తెపుఁజౌడోలి యనఁగ మొనసెం దారల్. || 98 ||

ఉ. కోకతతు ల్వియోగహతిఁ గూయఁ దొడంగె దివి న్సుధాంశుమే
ల్రాక మదిం దలంచి దినలక్ష్మి వడిం దమఱేని హేళి ను

గ్రాకృతి మీఱునుష్ణకరుఁ డంచు సహింపక యేటఁ ద్రోచె నం
చాకులవృత్తి విష్ణుపద మంటి మొగి న్మొఱ వెట్టుకైవడిన్. ‖ 99 ‖

సీ. గురులఘువర్ణవైఖరులు గణింపక ◆ విశ్రమస్థలములు వెదుకఁ బోక
కనదలంకారలక్షణము లెఱుంగక ◆ పదములఁ గడుఁదొట్రుపాటు విడక
సాధుసుశ్లోకప్రసంగము ల్గానక ◆ సరససన్మార్గచర్చలు దలఁప
కర్తృకర్మక్రియాగతులపై మతి లేక ◆ లలితప్రబంధలీలలు తెలియక
తే. తమము నిండార ధూర్తవర్తనులఁ గూడి ◆ తవిలి విహరించి రప్పు డుద్దామవృత్తిఁ
గుకవులనుబోలె గణనఁ జెందకయ భాగ్య ◆ భాజనము లైన జారనారీజనములు. ‖ 100 ‖

చ. ఎనయఁగ మచ్చు చల్లి భ్రమయించి కడున్ వివరంబు సించి లోఁ
గొని మఱి మక్కువ ల్గడవి.కొంచు సుఖోన్నతిఁ జొక్కి యున్నచో
ననువు దలంచి దోఁచుకొని రప్పుడు ముప్పిరిగొన్న వేడ్కలన్
ధనికులసొమ్ము లుమ్మడిని దస్కరులు న్వెలముద్దుగుమ్మలున్. ‖ 101 ‖

సీ. అనిమిషేంద్రవధూటి హర్మ్యాగ్రవీథిపైఁ ◆ గొఱలు మేలుపసిండికుండ యనఁగఁ
బ్రాచీదిగంగనాఫాలభాగంబునఁ ◆ బొదలుకుంకుమచుక్కబొ ట్టనంగ
రజనీజలజపాణి రహిఁ గేల నిడి యాడు ◆ బలుదమ్మికెంపురాబంతి యనఁగ
విరహులపై దాడి వెడలుచు మరుఁ డిమ్ము ◆ కొలిపినశకలాతు గొల్లెన యన
తే. విన్ను ద్రిమ్మరి ననఁబోండ్లు ◆ వెన్నునజ్జఁ ◆ బూజ సల్పిన కెందమ్మిపూ వనంగ
గొమరుదళుకొత్తఁ దూరుపుకొండమీఁద ◆ డంబు మీఱుచు నిందుబింబంబు వొడమె. ‖ 102 ‖

క. వినుపుడమిం జిగిరిచి జిగి ◆ ననువారెడుగుజ్జుమావి యన శశిబింబం
బొనరార నందుబొందుగ ◆ గొనబారెం గందు గండుఁగోయిల యనఁగన్. ‖ 103 ‖

మ. సరసం బై వసుగంధసంకలిత మై సన్మార్గసంవర్తి యై
పరరుఙ్మండలహారి యై శతభిషక్ప్రాణప్రియం బై విభా
స్వరలీలం దమ మెల్లఁ బో నిడుచు తేవం బూర్ణచంద్రోదయం
బరు దై శోభిలె నత్తఱిం గువలయాహ్లాదంబు గావించుచున్. ‖ 104 ‖

క. మరుఁ డొకట నఖిలపథికాం ◆ బురుహదళేక్షణల నేయఁ బూనినతెలిదా
మరవీరి యన నంత సుధా ◆ కరబింబము ధవళరుచులఁ గర మలరారెన్. ‖ 105 ‖

క. తిమిరపిశాచం బాశా ◆ రమణీమణి నాక్రమించి రాయిడిఁ బెట్టన్
సమయోగ్రమాంత్రికుఁడు వే ◆ గమ చల్లినబూది యనఁగఁ గౌముది యొప్పెన్. ‖ 106 ‖

సీ. బహుళజీవంజీవపటలి దూపలు దీఱెఁ ◆ గవ వీడి జక్కవల్ కడలఁబాఱె
గడితంపుచిమ్మచీఁకటులు దిగ్గన జాఱె ◆ శశికాంతమణితతు ల్జాలువాఱెఁ
దెరువరిగములపై మరుఁడు గైదువు నూఱె ◆ విరహిణీనికరంబు వెతలఁ దారెఁ
గులటల కాత్మ నగ్గలపుఖేదం బూరెఁ ◆ దొగలేమ కరిదిసోయగము మీఱెఁ
తే. గమలముకుళాంతరముల భృంగములు దూఱెఁ ◆ దవిలి క్రీడించుభోగులతాప మాఱె
ధర నశేషజనామోదకరము లగుచుఁ ◆ బండువెన్నెల లెల్లెడ నిండుటయును. ‖ 107 ‖

తే. అప్పు డమరాంగనలు మనోహరవిలాస ◆ లీలఁ జెలరేగి మద్యంబు గ్రోలఁ గోరి
కనకపాత్రల శీధువు నునిచి యునిచి ◆ కూర్మి నందఱు నొక్కచోఁ గూరుచుండి. ‖ 108 ‖

ఆ. కనకమయగలంతికల నాసవము ముంచి ◆ యానుకొనుచు సొలసి వీనుగవలు
మూసికొనుచుఁ గందముల నిచ్చగించుచు ◆ విప్పు మీఱ గ్రుడ్లు ద్రిప్పుకొనుచు. ‖ 109 ‖

క. అహహా యని సొలయుచుఁ గడు ◆ హిహిహీ యని నవ్వుకొనుచు హేలాగతిమై
నుహుహూ యని వడకుచు న ◆ మ్మిహికాకరవదన లాము మీఱఁగ మఱియున్. ‖ 110 ‖

తే. సుధ యిఁ కేటికి నిపు డివ్వ సుధఁ దనర్చు
మదిర దొరకెను మనభాగ్య మదిర యనుచు
నమరవరవర్ణినులు కోర్కె లనుమర నప్పు
డానఁ దొడఁగిరి మధు వెద నాన వెడలి. ‖ 111 ‖

క. ఆసవముచవి యెఱుంగక ◆ యాసవభాగములు గోరి యడ లొందె రహా
వాసవముఖు లైనస్వరా ◆ వాసవరుల్ దెలివి లేనివారలు గారే. ‖ 112 ‖

సీ. మధుదైత్యమదనుఁ డిమ్మధువు గ్రోలక కదా ◆ యతితరం బైనకార్శ్యంబు నొందె
మదనవిద్వేషి యిమ్మదిర యానక కదా ◆ కడిది మీఱఁగ నీలకంఠు డయ్యె
వాసవుఁ డీయాసవంబు ద్రావక కదా ◆ తనువున దురంగత్వము వహించె
నరుణగభస్తి యీసుర భజింపక కదా ◆ ప్రబలయక్ష్మామయబాధఁ గుందెఁ
తే. గరటిముఖునకుఁ గడుఁబెద్దకడుపు యక్ష ◆ నాథునకుఁ గుష్ఠరోగంబు నాటుకొనియెఁ
జెనఁటు లై శీధుపానంబు సేయ కున్న ◆ కతన మనభాగ్యమున నిది గలిగె భళిర. ‖ 113 ‖

వ. అని మఱియుం దమలోన. ‖ 114 ‖

తే. చంద్రికలు గాయు పరిపూర్ణచంద్రుఁ జూచి ◆ యోయి వెన్నెలదొర బావ యురక నన్నుఁ
జూచి నగియెద వే మంచు ◆ సుదతి యొకతె ◆ యెంచి పకపక యిహిహీ యటంచు నవ్వె. ‖ 115
‖

క. తనమదిరాకలశంబులు ◆ గొన నీ కేయోజ యనుచుఁ గొమ్మ యొకతె యా
మున నొకచెలికుచకలశము ◆ లనివారణఁ బట్టి లాగులాడుచు నుండెన్. ‖ 116 ‖

సీ. కుమ్మరిసారెలాగున నేల దిర్దిరఁ ◆ దిరిగె నంచును వ్రేలు ద్రిప్పె నొకతె
వలరాచబావకన్నులు మూసి గిలిగింత ◆ లిడియె నంచును బొబ్బ లిడియె నొకతె
చోరుఁడై కోరలో జొచ్చి యాసవ మెత్తు ◆ కొని చనె విధుఁ డంచుఁ గుందె నొకతె
వలిగాలి పయ్యెద దొలఁగించి కులుకుగు ◆ బ్బలు నొక్కె నని రిత్త యులికె నొకతె
తే. రిక్కచా ల్మింట నంటి యమ్మక్క దన్ను ◆ వెక్కిరించె నటంచు నా మెక్కి మిగులఁ
జొక్కి నిక్కుచు దిక్కులు నిక్కి చూచి ◆ వెక్కసంబుగ నపు డోర్తు వెక్కిరించె. ‖ 117 ‖

క. అల్లదె జాబిలి దన కీ ◆ క ల్లిడు మని మ్రొక్కి నన్నుఁ గన్గిలిపెడి నో
చెల్ల కనుంగొను మని యొక ◆ పల్లవకర వలుక నోర్తు పకపక నవ్వెన్. ‖ 118 ‖

చ. వెడవిలుకాఁడ పోఁకముడి విప్పకు గుబ్బలు ముట్ట రాకు క్రొ
మ్ముడి సడలింపఁ బోకు జిగిమోవియు నానకు మే లయారె రే
యొడయఁడు చూచుచుండ నిధి యోజయె నీ కని నిల్వరింపఁ
దొడఁగె నొకర్తు మైమఱచి తూరెకు మద్యమదంబు పెంపునన్. ‖ 119 ‖

తే. అపుడు నాశ్యామసాంద్రచంద్రాతపంబు ◆ హాళిఁ బొడగాంచి చాల విరాళిమించి
నింగిఁ బొంగి కరంబు వెలుంగుచున్న ◆ నీరజారాతి నిట్లు నిందింపఁ దొడఁగె. ‖ 120 ‖

క. రాజీవలాంఛనుఁడ వగు ◆ రాజువు నీ విట్లు క్రోధరససహితుఁడ వై
రాజీవరిపుఁడ నంచున్ ◆ రాజీవాక్షులఁ గలంప రాకు శశాంకా. ‖ 121 ‖

సీ. క్షీరవారాశికి గారాపుకొమరుండ ◆ వాదిలక్ష్మికిఁ బ్రియసోదరుఁడవు
మురదానవారికి ముద్దుమఱందివి ◆ హరున కుదగ్రచూడాగ్రమణివి
దక్షప్రజాధినేతకుఁ గూర్మియల్లుఁడ ◆ వశ్రాంతబుధజనాహ్లాదకరుఁడ
వసమబాణునకు నెయ్యపుమేనమామవు ◆ జగముచుట్టమునకు సంగడీఁడ

తే. విట్టినీ వయ్యయో నయ మింత లేక ◆ సారెసారెకు నజ్ఞులచందమునను
సుందరులమీఁద వేఁడిమి చూపఁ దగునె ◆ గురుజనాత్యంతనుతిపాత్ర కుముదమిత్ర. ‖ 122 ‖

క. శ్యామావధూప్రియుండవు ◆ శ్యామలపక్షంబు నీకు సైఁప దటంచున్
శ్యామల నేఁచకు మే సు ◆ శ్యామఁ జుమీ తుహినధామ జగదభిరామా. || 123 ||

సీ. కువలయప్రియుఁ డని కొనియాడుటకుఁ జాలఁ ◆ జక్రాహితత్వంబు సలుపకున్న
బుధవత్సలుం డని పొగడుట కెంతేని ◆ గురువిరోధంబునఁ గొఱలకున్న
గోత్రాభ్యుదయుఁ డనుకొనుటకు నాత్మస ◆ త్సంతతి నడఁగింప దలఁపకున్న
మనుమార్గవర్తి యంచు నుతించుటకు రాజ ◆ కాంతావలుల బిట్టు కఱఁచకున్న
తే. రాజశబ్దంబు నీకు స్వార్థముగఁ జెల్లుఁ ◆ గాక యూరకె లోకాపకారి వగుచు
నెఱయు నీరాజశబ్దంబు నేతిబీర ◆ కాయచందంబు గాదె ప్రాలేయకిరణ. || 124 ||

క. వీచి తమిం జక్రావళి ◆ నేఁచెదు తెరువరులు సతులు నిల నడ లొందన్
హా చంద్ర యేమి చెప్ప ని ◆ శాచరకృత్యములు నీకు సహజములు గదా. || 125 ||

చ. గురువరవర్ణినీమణిని గూడినద్రోహి వటం చెఱింగియున్
బరువడి లింగధారి వని భావమునం దలపోసి యేమొ ని
న్గిరిశుఁడు నెత్తిఁ బెట్టుకొనెఁ గీడు దలంపక చంద్ర యెట్టిదు
శ్చరితుల నైనఁ బ్రోచుఁ గద శంభుఁ డహా తనుఁ గొల్చువారలన్. || 126 ||

సీ. బడబానలంబుతో జడధిలోన మెలంగి ◆ కాలకూటంబుతోఁ బైలు వెడలి
సెకకంటియెకిమీనిసిక లోన నెలకొని ◆ యుదయాద్రిదవశిఖి నొరసి వెలికి
రాహుదంష్ట్రాంకురోగ్రవిషాగ్నిఁ బెనఁకొని ◆ ప్రతిమాసమును జండభానుఁ బొదివి
యక్షోపతాపమహాతాపమునఁ గ్రాగి ◆ మునితపోవహ్నిచే మును జనించి
తే. నట్టినీ వెవ్వరికి నైన నహహ మహిని ◆ జల్లనై యుందు వను టెల్లఁ గల్ల గాదె
యుష్ణు లెఱుఁగక శీతాంశుఁ డండ్రు గాని ◆ గురువధూటీమనోహారి సరసిజారి. || 127 ||

సీ. అర్జునాశుగలీల నలరుట కబ్జచ ◆ క్రములఁ జేఁబట్టుట గాంచినావొ
శ్రీవత్సలాంఛనసిద్ధి వహించుస ◆ త్సంతతిఁ బ్రభవింపఁ జాలినావొ
విధుసమాహ్వయము వావిరిఁ బూనుటకు నేపు ◆ చెడిపోవఁ గుజనుల నడఁచినావొ
విష్ణుపదారూఢి వెలయుట కేడ్తెఱ ◆ మధుమదోన్మాదంబు మాన్చినావొ
తే. కువలయోద్ధారకాభిఖ్యఁ గొఱలుటకును ◆ గరుణ మీఱ వియోగులఁ గాచినావొ
హస్తిమశకాంతరము గాఁగ హరికి నీవు ◆ జోక యగుదువె మది జనించుటనె చంద్ర. || 128 ||

క. హరునితల మట్టితిని గురు ◆ తరుణిం బట్టితివి నీకు దైవము గురుఁడుం
బరికింప నాస్తి యగుచో ◆ విరిఁబోఁడుల నేచు టెంత వింత శశాంకా. || 129 ||

తే. జనులు శ్రీతోడఁ బుట్టితివనుచు నిన్ను ◆ నెన్నుదురు గాని యామర్మ మెఱుఁగ లేరు
కాలకూటంబుతోడ నాభీలలీలఁ ◆ బుట్టినాఁడవు గద నీవు భువి మృగాంక. || 130 ||

సీ. చెలియలియింటిబల్సిరి యెల్ల హరియించి ◆ తండ్రికి భంగంబు తగులుపఱిచి
సత్సంతతులఁ బ్రకాశం బంతయు నడంచి ◆ కడు సడ్డకుని గ్రిందు పడఁగఁజేసి
తమ్ముల కార్తి దట్టమ్ముగ నొడఁ గూర్చి ◆ వదినెబిడ్డనితోడ వాదు పూని
యేపు మీఱ మఱంది హృదయంబు భేదించి ◆ గురునిసంసారంబు గూలఁ ద్రోసి
తే. కుజనులను బెంపు సేయుచుఁ గొఱఁత లేక ◆ తమిని విహరించు దుష్టవర్తనుఁడ వీవు
తెరువరులచోట నీకుఁ జుట్టరిక మింక ◆ నెవ్విధంబున సమకూఱు హిమమయూఖ. || 131 ||

తే. గురునిసతిఁ గొని రమయింటిసిరి హరించి ◆ చెలఁగి విషబిందుబృందముల్ చిలుకుచుండు
నాతతాయివి నీకుఁ దొయ్యలులమీఁద ◆ నగ్గి చల్లుట యరుదె నీహారకిరణ. || 132 ||

తే. సతుల నేఁచకు నీసొరు సన్నముగను ◆ గదిసి నినుఁ బట్టికొని పెద్దగాము మ్రింగ
నీనిలువు నీరుగాను నీ మేను పెక్కు ◆ తునియలుగ దొండి నీ మేను నెనయఁ జంద్ర. || 133 ||

తే. అనుచు సురనారి సరసీరుహారి దూఱి ◆ కేరి తనుఁజేరి పూవులకోరు లేయు
నించువిల్కానిఁ దద్బలోపేతముగఁ గు ◆ రించి యిట్లని మిగుల నిందించి పలికె. || 134 ||

క. వలఱేఁడ కడిఁదిసిరి గల ◆ బలుదొరకొమరుఁడ నటంచు భామామణులం
గలఁచకు నీపని యీశుఁడు ◆ చలపట్టి యొకింతలోనె చక్కంజేయున్. || 135 ||

సీ. అచలకార్ముకము నారాయణాస్త్రంబును ◆ బగడతాలుపునారి పుడమితేరు
ప్రాఁబల్కు తేజీలు ప్రమథబలంబును ◆ వెలుఁగొంద నలరు బల్వేల్పుమీఁదఁ
జెఱకుల్విల్లును విరిచిలుకును జమిలిమి ◆ క్కాలినారియు వలిగాడ్పుతేరు
చిలుకతత్తడియుఁ గోయిలమూఁకయును గ్రాలఁ ◆ జలమున మార్కొని గెలుపు గొన్న
తే. జగమగండవు నీ విట్లు తగవు మాలి ◆ భీరువులమీఁదఁ దొడరు టేపెద్దతనము
వలదు లెస్సగ మదిలోనఁ దలఁచుకొనుము ◆ నిరుపమాభంగశృంగార హరికుమార. || 136 ||

క. జగములకుఁ దల్లి దండ్రియు ◆ నగుసిరికి న్హరికిఁ బుట్టినట్టిదొరవు నీ
కగునే తోఁబుట్టువు లని ◆ తగ వెన్నక సతుల నేఁపఁ దతసుమచాపా. || 137 ||

సీ. వసుమతీజనుల సువర్ణకలాపము ◆ ల్హరియించుతులువ నీవరసచివుఁడు
గురుతల్పగమనుఁ డై సరవిఁ జక్రద్వేష ◆ మూనుఖలుండు నీ మేనమామ
మాన కెల్లప్పుడు మధుపానమదమునఁ ◆ బొదలుదుర్మదులు నీ మొదలిబంట్లు
జగము లెఱుంగ హెచ్చరికఁ బైకొని బ్రహ్మ ◆ ఘాత యొనర్చుటక్కరిని నీవు
తే. జాతివైరస్యగతుఁడు నీసంగడీఁడు ◆ భళి మహాఘోరదురితాన్వితులరు మీరు
విరహిజనుల నేచు టిది యెంత వింత తలఁప ◆ వంచితాశేషగీర్వాణ పంచబాణ. || 138 ||

తే. అకట భవదంబ లాగృహంబుసిరి హ ◆ రించుతెక్కలి శశి నాదరింపఁ బోకు
మదన మును “సర్వనాశాయ మాతుల” యని ◆ చిందు రాణింప స్మృతులు వచింప వినవె. || 139
||

సీ. విషయలిప్తంబు లై వెలయునారాచంబు ◆ లూరక మొఱయుచు నుండునారి
యిలఁబడి నూరాళ్లు మొలచునబ్రపుబిల్లు ◆ పెల్లార్చి పొదలెడునల్లమూఁక
నీళ్ళలో జాడలు నెమకెడుటెక్కెంబు ◆ కడు నగ్గి చాయల నడరు సురియ
యడవిఁ గాచుక యుండు గడుసరి సంగాతి ◆ యీల వెట్టిన నొద్ద వ్రాలు సచివుఁ
తే. డొరుల కేరికిఁ గనఁబడకుండురూపు ◆ దనరఁ బాంథులచిత్తవిత్తములు దోఁచు
తస్కరుఁడ వీవు ముగుదలఁ దఱుము టరుదె ◆ కుంఠితామర్త్యనగచాప కుసుమచాప. || 140 ||

సీ. హరికి బుత్రకుఁడ వై యవతరించుటయును ◆ శివునిచేఁ బన్నంబు జెందుటయును
విషమకాండప్రాప్తి విహరించుటయు ఘన ◆ కాలరూపంబునఁ గ్రాలుటయును
వజితపరాశాంతవాహుఁడ వగుటను ◆ భయదాతనూద్వృత్తిఁ బరఁగుటయును
బ్రజలమారకుఁడ వై బాధించుటయు సదా ◆ ఖండధర్మనిరూఢి నుండుటయును
తే. దలఁచి చూచిన నీకును ధర్మరాజు ◆ నకును భేదం బిఁ కెద్ది యెన్నఁడు వియోగి
జనుల గారింపఁ బోవఁ డాఘనతరుండు ◆ చంచలాక్షీమనోహారి శంబరారి. || 141 ||

సీ. శిరమున నిద్ధంపుఁజిన్నిక్రొన్నెల గాదు ◆ పొలుపారు గేదంగిపువ్వు గాని
గళమున నాభీలకాలకూటము గాదు ◆ శ్రీమించుమృగమదరేఖ గాని
తనువున భూతిగంధవిలేపనము గాదు ◆ మలయుచందనకర్దమంబు గాని
వీఁపున గాటంపువెడదకెంజెడ గాదు ◆ డంబారువేణీభరంబు గాని
తే. రహి నురమ్మున భుజగహారములు గావు ◆ మల్లికాసూనపుష్పదామములు గాని
యకట మకరాంకశంకరుఁ డనెడుశంకఁ ◆ జెలఁగి నామీఁద నిటు దాడి సేయవలదు. || 142 ||

వ. అని మఱియుం గోపావేశంబున. || 143 ||

సీ. నెఱి మించి నీవిల్లు విఱిగి ధూళి నడంగ ◆ మలయక నీరూపు మాసిపోను
బడిబడి నీబలం బడవిపాలై చన ◆ నే పైన నీటెక్కె మేటఁ గలయఁ
గొమ్మలఁ బొదవు నీయమ్ము దు మ్మై పోవఁ ◆ దూలి నీయరదంబు మూలవట్టఁ
గదిసి నీ చెలికాని గాము పుట్టుక మ్రింగ ◆ నిలఁ బాసి నీగుఱ్ఱ మెగసి పోవ
తే. నకట దర్పక ఘోరదర్పాతిరేక ◆ మెనయఁ బని పూని విరహిణీజనవధంబు
సేయుచుండెదు నీ కిది చేటు సుమ్ము ◆ పెల్లు పడి యింక నామునఁ ద్రుళ్లవలదు. || 144 ||

తే. అని మనోభవు నాడి యయ్యలరుఁబోడి ◆ వేఁడి మీఱఁగఁ బయిపయి వీచుచున్న
మలయధరణీధరాలయమందగంధ ◆ వహుని నిందింపఁ దొడఁగె భావమునఁ గినిసి. || 145 ||

క. ఇల మరుదాఖ్యుఁడవు మహా ◆ బలుఁడవు క్రూరుఁడవు నీకుఁ బౌరుష మే చలం
బెలయఁగ నబలలఁ గలఁచుట ◆ మలయమహీధరసమీర మందవిహారా. || 146 ||

తే. విషధరము నిన్నుఁ గబళించి విడువ దానిఁ ◆ జెనఁకి సాధింప నేమియుఁ జేతఁ గాక
విషధరాభిఖ్య గలమేఘవిసరములను ◆ దరమెదవు శూరుఁడవె నీవు ధర సమీర. || 147 ||

సీ. మున్ను మహాబిలంబున సముద్భవ మొంది ◆ శైలాగ్రమున నుండి బైలు వెడలి
ఘనవనాంతరముల ననయంబు మెలఁగుచు ◆ నమితనికుంజగుల్మములఁ దూఱి
జంతుకోటికిఁ బ్రభంజనలీలఁ జూపుచు ◆ విస్ఫుటమృగచరవృత్తి నలరి
పాంథులగుండియ ల్పగులంగ వడఁచుచు ◆ వితతమహాబలోద్ధతి నెసంగి
తే. చెలఁగి విహరించుగబ్బిబెబ్బులివి నీవు ◆ దాడి మెఱయంగ భీరులఁ దఱుము టరుదె
యజ్ఞు లెల్ల జగత్ప్రాణుఁ డండ్రు గాని ◆ కామినీమారణోత్సాహ గంధవాహ. || 148 ||

ఉ. మానక మానినీమణుల మాటికి నేఁచెదు నాలిగాడ్పు వై
శ్వానరుఁ గూడి నీబ్రదుకు బైలుగ నేల చరించె దిట్లు నీ
మేను దునింగి పోవ నెటి మీఱెడునీమురి మూల ముట్ట
పూనిక బుగ్గి గాను నిను బొంపఱఁ బాము మెసంగ నక్కటా. || 149 ||

వ. అని యనిలుఁ బలికి. || 150 ||

సీ. ఇలమీఁద నిల్వక యెగసి పోయెద వేమె ◆ కీరమా నిన్ను సంకెలల వేయ
నెపుడు చూచినఁ గన్ను లెఱ్ఱఁ జేసెద వేమె ◆ కోయిలా నీయిల్లు గూలిపోను
గేకలు వెట్టుచుఁ గేరి యాడెద వేమె ◆ బర్హి నీమురి చెట్లపాలు గాను
గొమ్మలఁ గదపుచుఁ గోరి మోసెద వేమె ◆ తుమ్మెదా నీత్రుళ్లు తుప్ప లెక్క
తే. ఘనులఁ గన నోడి కడలకుఁ జనియె దేమె ◆ యంచ నిను శ్వేతరుగ్బార మలమికొన న
టంచు బలుచందముల శపియించి పలికి ◆ చంచలేక్షణ కడు సంచలించుటయును. || 151 ||

క. ఆళీజను లపు డింతికి ◆ హాళిని శిశిరోపచార మలరించి రొగిన్
నాళీకనాళకిసలమ ◆ ధూళీపాళీసితాభ్రధూళిచ్ఛటలన్. || 152 ||

సీ. శైలస్తని యొకర్తు చందనగంధంబు ◆ రంభోరు వొకతె కప్రపురజంబు
హిమకరానన యోర్తు హిమజలపూరంబు ◆ లతకూన యొకతె పల్లవచయంబు
వరవర్ణి యొకర్తు సరసకాశ్మీరంబు ◆ ఘనవేణి యొకతె ముక్తాసరములు
ప్రసవగంధి యొకర్తు మసృణమరందంబు ◆ జలజాక్షి యొకతె కింజల్కధూళి
తే. కలితశృంగారసరసి యొక్కతె మృణాళ ◆ నాళశైవాలవల్లరిజాబకములు
గూర్చి యచ్చానమైతాప మార్చుకొఱకు ◆ సలిపి రెంతయు శిశిరోపచారవిధులు. || 153 ||

సీ. బంగరుగిండ్లపైఁ బటిక పూసినరీతి ◆ గబ్బిగుబ్బల మంచిగంద మలఁది
యిందీవరములపై హిమజలంబులు నించు ◆ దారిఁ గన్దోయిఁ బన్నీరు చిలికి
యబ్జరాగములపై హరినీలములు గూర్చు ◆ గతిఁ గేల శైవాలలతలు పెనఁచి
రతనంపుటరఁగుపై రంగవల్లులు దీర్చు ◆ సరణిఁ బే రెద ముత్తెసరులు వైచి
తే. మేటితుమ్మెదగముల కామెతలు పెట్టు ◆ కరణిఁ గురులను బుప్పొడి గలయఁ జల్లి
తరుణరంభాదళోశీరతాళవృంత ◆ జాలముల వీచుచుండి రాజలజముఖులు. || 154 ||

తే. మంచిగందంబు బూది యై మహిని రాలె ◆ నింకె బన్నీరు చూత్కార మెసఁగ మేన
నలరులుఁ జివుళ్లుఁ బొడిపొడి యయ్యెఁ గమల ◆ నాళములు వాడి వత్త లై డీలుపడియె. || 155 ||

క. అపు డందు మదనమోహిని ◆ చపలేక్షణ కేలువట్టి సరభసముగ నా
డీపరిక్ష చేసి ఘనవా ◆ జ్నిపుణత మెఱయంగ నొక్కచెలఁతుక కనియెన్. || 156 ||

సీ. పూర్ణచంద్రోదయంబునఁ బోవ దింతయు ◆ నెడప కంతంతకు హెచ్చుఁ గాని
వాతరాక్షసయుక్తి వదలదు తద్దయు ◆ మించి యంగదలఁ గుందించుఁ గాని
పస నెసంగువసంతకుసుమాకరంబునఁ ◆ బాయదు మఱిమఱి ప్రబలుఁ గాని
యేపొద్దు మదనకామేశ్వరంబున మాన ◆ నేరదు గాటమై నెఱయుఁ గాని

తే. నీలకంఠరసంబున ప్రీలి చనక ◆ లోగఁ జేయు నహా యింక లోకనాథ
రసమహాయోగమునఁ గాని రమణిమేని ◆ విరహతాపజ్వరం బెల్ల విడువదమ్మ. ॥ 157 ॥

వ. అదియునుం గాక. ॥ 158 ॥

సీ. పొడ గానరాక పైఁబడుమనోభూతంబు ◆ నుగ్రమంత్రంబుల నుడుపవలయు
నలమెడుసోఁకు దయ్యంబు నహీనక్తి ◆ యావిధానంబుల నడఁపవలయు
రేలెల్ల బైలఁ జరించుగామునకు వే ◆ ల్పుల నెల్లఁ బ్రార్థించి పొగడవలయు
నడవులఁ జెట్లపై నామనిఁ జెలఁగుబ ◆ ల్వేఁటకు ఘనులు రప్పింపవలయుఁ
తే. గాక యుండిన నీతనుగ్లాని మాని ◆ మానినీమణి యెట్లు సమ్మదము నొందు
ననుచు వచియించి వారు దానును గడంగి ◆ వెండియును జల్వపనులు గావించుచుండె. ॥ 159 ॥

తే. అట్లు మఱిమఱి శైత్యకృత్యము లొనర్ప ◆ నంతకంతకు నగ్గలం బై మనోభ
వానలం బుప్పతిలి నహా యంచు నులికి ◆ యిందుముఖి నెచ్చెలులఁ జూచి యిట్టులనియె. ॥ 160 ॥

సీ. వడగాడ్పులకుఁ దోడు కడుఁ జండ్రనిప్పులు ◆ పైని బోయకురమ్మ పడఁతులార
వలకాఁకలకుఁ దోడు కళపిళ నుడుకునూ ◆ నియలు చల్లకురమ్మ నెలఁతలార
వెన్నెలసెకకుఁ దో ◆ డున్నసున్నం బెల్ల ◆ మెదిచి మెత్తకురమ్మ మెలఁతలార
విరితూపులకుఁ దోడు వెడఁదకైదువ లెదఁ ◆ గదియఁ జేర్పకురమ్మ సుదతులార
తే. కటకటా నేఁడె పగదీర నిటుల నేఁచఁ ◆ జెల్లునె యటంచుఁ బల్మఱుఁ దల్లడిల్లు
ననలుఁ బన్నీరు మంచిగందంబుఁ దలిరు ◆ టాకులును జూచి మది నోడి యలరుఁబోఁడి. ॥ 161 ॥

తే. పులుల భూతంబులను బెద్ద చిలువగములఁ ◆ దెచ్చి దరి నిల్పి బెదరింపఁ జొచ్చినా రి
దేమి చెలులార యంచు బి ట్టెన్నుచుండు ◆ శిఖిపికమృణాళములఁ జూచి చిగురుఁబోఁడి. ॥ 162 ॥

వ. అని మఱియును. ॥ 163 ॥

సీ. కనకాభిషేకంబు గావించి గద్దఱి ◆ తేఁటికూటువులఁ బ్రార్థించరమ్మ
సాంకవగంధమంచల్లీల నర్పించి ◆ కీరరాజముల నగ్గింపరమ్మ
ఘనవైభవోన్నతి నెనయించి కాదంబ ◆ వితతులఁ బలుమఱు వేఁడరమ్మ
ధవళాంశుకస్ఫూర్తి దనరించి టక్కరి ◆ జక్కవగములకు మ్రొక్కరమ్మ
తే. కాకయుండినఁ గొద లేనిఢాక మెఱయ ◆ మూఁకలుగఁ గూడి దొసఁగుల ముంచుచుండు
నహహ చెలులార తొంటి నెయ్యంబు విడక ◆ కనికరము మీఱ నివ్వేళ మనుపరమ్మ. ॥ 164 ॥

వ. అని యిత్తెఱంగున మదనవేదనాభరాక్రాంత యై చింతిలునింతిం గనుంగొని కలంగి
సంగడికత్తె లత్తఱి నంగభవాదుల నుద్దేశించి యిట్లనిరి. ॥ 165 ॥

క. కొమ నాము మీఱఁ బైకొని ◆ సుమనారాచంబు లేసి స్రుక్కింపకు క్రూ
రమనా రతిగమనా ధృతి ◆ శమనా మదకీరగమన శంబరదమనా. ॥ 166 ॥

క. పంచముఖమధ్య యని బా ◆ ధించెదు హరిమధ్య యీసతీమణి మదనా
కొంచింపక కమలేక్షణ ◆ యంచుఁ గలంచెదు పొలంతి హరిణాక్షి శశీ. ॥ 167 ॥

క. పంచప్రాణంబులు నీ ◆ వంచు న్మది నమ్మి యున్న యన్నులమిన్నన్
వంచించి కలంచెద విది ◆ మంచిదె భువనైకశూర మలయసమీరా. ॥ 168 ॥

క. మాతరుణీమణి నొకపెను ◆ భూతమ వై సోకి యార్తిఁ బొదవించె దహా
భూతమవో వాతమవో ◆ నీతెఱఁ గెఱుఁగంగ రాదు నిజముగఁ బవనా. ॥ 169 ॥

ఆ. తల్లి పాఱవైచి తరల నన్న్యులపంచ ◆ బ్రతికి కూఁతవట్టి కొతుక కీవు
కన్ను లెఱ్ఱఁ జేసి యన్నులఁ గని కారు ◆ కూఁత లఱచె దేమి కోకిలంబ. ‖ 170 ‖

క. పసినిసు వగుమామగువల్ ◆ విసికింపకు మనుచు నెంత వేఁడినఁ బైపై
ముసరుచు మఱిమఱి మొరసెదు ◆ భసలమ నీ కింత యెగసిపా టేమిటికిన్. ‖ 171 ‖

ఆ. పరులపంచఁ జేరి బ్రతికి పలాశవృ ◆ త్తి మ్మెలంగుకోకిలమ్మునకుఁ బొ
సంగుఁ గాక యింటఁ జక్కెర ల్దిని మని ◆ వెగటు చిలుక నీకుఁ దగునె చిలుక. ‖ 172 ‖

సీ. బింబోష్ఠి యని నీవు పెనఁగ రాకు శుశంబ ◆ సాంకవగంధి యీపంకజాక్షి
పంకజాక్షి యటంచుఁ బదరకు తేఁటి చం ◆ పకజాలనాస యీపల్లవాంఘ్రి
పల్లవాంఘ్రి యటంచు బాధింపకు పికంబ ◆ రామాంగి యీబిసప్రచయబాహ
బిసబాహ యని రాకు వెస వంచ జలదశి ◆ రోరుహ యీమహిరోమరాజి
తే. యహిపరోమాళి యంచు డాయకుము నెమ్మి ◆ కార్ముకభ్రూలతిక యీచొకారపుఁజెలి
యనుచు శుకభృంగపరభృతహంసనీల ◆ కంఠనికురుంబములఁ దద్ద కనలి పలికె. ‖ 173 ‖

వ. అబ్బోటికత్తియ లత్తఱి నబ్బిత్తరిం జూచి యిట్టు లనిరి. ‖ 174 ‖

సీ. మలయునెమ్మేను పెన్మంట నుక్కఱిపోయె ◆ విలు పలుతునియ లై యిలను బడియెఁ
బస చెడి శరపరంపరలు దుత్తుము రయ్యె ◆ నీ టారుటెక్కియం బేటఁ గలసె
గడుసరిమూఁక కారడవులపా లయ్యెఁ ◆ దూలుచు నరదంబు మూలవట్టె
బలితంపువార్వంబు బైలు వట్టి చరించెఁ ◆ జెలికాఁడు దెసఁ జెంది చెట్లు దూఱె
తే. నింతి యిం కెక్కడిమరుం డొకింత యైన ◆ నళుకు పూనక వానిపైఁ దలఁపు మాని
మానసంబున నిపుడు మామాట నమ్మి ◆ యసదృశానందలీలల నెసఁగవమ్మ. ‖ 175 ‖

వ. అనిన నక్కుమారీమణి వారిం గని యి ట్లనియె. ‖ 176 ‖

తే. ప్రాణసఖులార నే నెంతపాపజాతి ◆ రాతిగుండియదాననో రాతిరెల్లఁ
గడిఁదివలవంతసెకలయగ్గలపునార్తి ◆ నెంతఁ బడలెనొ కదరె యయ్యెమ్మెకాఁడు. ‖ 177 ‖

ఉ. కంతుదురాపతాపహతి గ్రాఁగుచు నజ్జగవన్నెకాఁడు న
న్నెంతతుటారికత్తె యని యెగ్గులు వల్కెనొ యెంతయుల్కెనో
వంతలఁ బెట్టి మమ్ము నెడఁబాయఁగఁ జేసితి రమ్మలార మీ
పంతము దీఱ జాలి మదిఁ బాయ దహో యిఁక నేమి సేయుదున్. ‖ 178 ‖

తే. అకట నా చెల్మికై యతఁ డాసతోడఁ ◆ జేరి వలరాచపనికి న న్గోరి వేఁడు
కొనినఁ గా దని త్రోచి వచ్చినమహోగ్ర ◆ పాతకం బింక నేవంక బాపుకొందు. ‖ 179 ‖

తే. కన్ను లలరార నవ్వన్నెకానిముద్దు ◆ నెమ్మొగం బింక నెన్నఁడేనియు నొకపుడు
గనుఁగొనెడునట్టి మేటిభాగ్యంబు నాకుఁ ◆ గలుగునో లేదొ కదరమ్మ పొలఁతులార. ‖ 180 ‖

క. అక్కరుణానిధికౌఁగిటఁ ◆ దక్కఁ బెనంగొననివలఁతితన మేల కడున్
మిక్కుటపుఁటీవి యేలా ◆ చక్కఁదనం బేల యుదుటుజవ్వన మేలా. ‖ 181 ‖

వ. అని మఱియు సైరింపరానిదుఃఖావేశంబున. ‖ 182 ‖

తే. వ్రీడవతి యేడ్చె నెలుఁగెత్తి వెక్కివెక్కి ◆ యశ్రుపూరంబు కుచగిరు లంటి పాఱఁ
గిన్నరీపాణి పంకజాంకితసువర్ణ ◆ వల్లకీరావసదృశభాస్వద్గళమున. ‖ 183 ‖

తే. అప్పు డబ్బాల నెదఁ జేర్చి యనుఁగుఁజెలులు ◆ చీరచెఱఁగున వెడఁదకన్నీరు దుడిచి
కురులు సవరించి తళుకుఁజెక్కులు పుడుకుచు ◆ హితవచోరూఢి మెల్లన యిట్టులనిరి. ‖ 184 ‖

ఉ. అమ్మకచెల్ల యిట్టు లెడరారఁగ నేమిటి కేడ్చెదమ్మ చొ
క్క మ్మగునెమ్మొగంబు కసుగందెఁ గదమ్మ కపోలపాళిప

త్రమ్ము లుదారబాష్పజలధారలఁ దోఁగెఁ గదమ్మ లెమ్మ మా
యమ్మ రయమ్మ నీ కిఁక సమగ్రమనోరథసిద్ధి యయ్యెడున్. ‖ 185 ‖

తే. సుదతి నిక్కంబు వినుము నీసోయగంబు ◆ కన్ను లారంగఁ బొడగని చన్నకతన
సూటి దప్పక నిన్నటిచోటి కెలమి ◆ ఱేపు గ్రమ్మఱ నమ్మున్నుఱేఁడు వచ్చు. ‖ 186 ‖

క. వచ్చిన నతనికి నీకుం ◆ జెచ్చెర సంగతి ఘటిల్లుఁ జెలు వలరఁగ ఱే
పచ్చుటి కరుగుద మూరక ◆ విచ్చలవిడి నుండవమ్మ వెడఁగుంగొమ్మా. ‖ 187 ‖

వ. అని యబ్బాలికాచూళికాలలామంబు నారీజనకదంబంబు మందమందమధురాలాపం
బుల నూరడించుచుండె నని నారదునకు శారదావల్లభుం డెఱింగించిన నతం డతని
నవ్వలికథావిధానం బె ట్లని యడుగుటయును. ‖ 188 ‖

మ. కలుషాంభోధినిషంగ ఘోరతరసంగ్రామాంగణాభంగ భూ
వలయోత్తుంగశతాంగ నిస్తులకృపావాసోజ్జ్వలాపాంగ దు
ష్కలుషధ్వాంతపతంగ శైలతనయాసంశోభితార్ధాంగ ని
ర్మలజూటాంతరగంగ సన్మణివిభారంగద్భుజంగాంగదా. ‖ 189 ‖

తోటకము. పురదైత్యవిదారణ పుణ్యగుణా ◆ శరదబ్జనిభాకృతి సాధుమతీ
సురరాడ్ద్రుహిణార్చిత సూరినుతా ◆ చరణాయుధవిగ్రహ శైలగృహా. ‖ 190 ‖

తరల. సమరభీషణ సత్యభాషణ సర్పరాజవిభూషణా
ప్రమథనాయక భద్రదాయక పద్మలోచనసాయకా
విమతభంజన విశ్వరంజవ వేదవేద్యనిరంజనా
సమదవారణచర్మధారణ సజ్జనావనకారణా. ‖ 191 ‖

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వరకరుణాకటాక్షనిరీక్షణసంలబ్ధసరసకవితాసామ్రా
జ్యధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్రపవిత్ర కూచిమంచిగంగనామాత్య
పుత్త్ర సకలసంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ తిమ్మకవిసార్వభౌమప్రణీతం
బైనరసికజనమనోభిరామం బనుశృంగారరసప్రబంధంబునందుఁ జతుర్థాశ్వాసము.

శ్రీరస్తు
ఓం నమః కామేశ్వర్యై

రసికజనమనోభిరామము

పంచమాశ్వాసము

రాజితగుణసంగా
హారాయితవరభుజంగ హారసుధారు
క్షారాపటీరపారద
హీరాభిశుభాంగ కుక్కుటేశ్వరలింగా. || 1 ||

వ. అవధరింపుము వాణీమనోహరుండు నారదున కి ట్లని చెప్పం దొడంగె నట్లు సఖీజన కదంబం బూరడింప నిలింపచంపకామోద యిం పూని యాలకింపుచున్నసమయంబున. || 2 ||

చ. తడయక ఱెక్క లార్చి విదితంబుగఁ దోక విదిర్చి లీలమై
మెడ నిగుడించి సోయగపుమేనిహొరంగు దురంగలింపఁగా
బడిబడి ముద్దుముద్దునుపల్కు లతితియ్యఁదనం బెలర్ప న
ప్పడఁతులమిన్నఁ జూచి యొకపంజరకీరవతంస మి ట్లనున్. || 3 ||

ఉ. ఇంతిరొ యింత వింతవగ పేటికి నేఁటికిఁ జూడు ధారుణీ
కాంతుఁడు సంతసం బడరఁ గ్రన్నన నన్ననవింటిదంటచే
నంతఁ గలంగి బెంగ గొని వాలెము దాలిమి దూలి ఱేపు నీ
చెంతకు వచ్చి హెచ్చుతమిఁ జేకొను మా కొడఁగూడు వేడుకల్. || 4 ||

క. అమ్మా నీసోయగ మపు ◆ డమ్మానిసిఱేఁడు చూచి యరు దందెఁ గదా
యమ్మారునిబెడిదపుఁబూ ◆ ట మ్మాతనిమదిఁ గలంచి యడలించుఁ జుమీ. || 5 ||

తే. గాలి దూలి దూలి గ్రాలి సోలి విరాలిఁ ◆ దేలి వ్రాలి యోలి బాళి మాలి
మేలి తాలి మెల్ల వ్రీలి కలంగెదు ◆ బేల యింతవంత యేల నీకు. || 6 ||

సీ. మరువక రామనామము జపియించుము ◆ వలుదగుబ్బలసాంకవం బలందు
సారెకు రాహుగ్రహారాధన మొనర్పు ◆ తలఁపుము నీలకంధరుని మదిని
దురుమున సంపెంగవిరిసరు ల్పించుము ◆ పొలుపార నాగేంద్రుఁబూజ సలుపు
పర్జన్యునకుఁ బెనుపండువు సేయుము ◆ శరదాగమారంభ మరయుచుండు
తే. మబల పికకీరహిమకరానంగభృంగ ◆ పవనచక్రాంగచంద్రికప్రముఖదుష్ట
వితతి నీమీఁద నేమియు విగ్రహించి ◆ పెంపు రాణింప వెతలఁ గాఱింపకుండు. || 7 ||

చ. తలిరుజిరావజీరుబలుదాడికి నోడి కడంక డక్కి పే
రలమటఁ జిక్కి పొక్కెద వహా నవహాటకదేహ నీకు నేఁ
గలుగఁగ నింతవంతఁ బడఁ గారణ మే మిఁక లెమ్ము నెమ్మదిం
గలఁగక పంపువెట్టు మిదె క్రన్నన నన్నరనాథుఁ దెచ్చెదన్. || 8 ||

క. అని యనుఁగుఁజిలుక వలికిన ◆ మనమున నొకకొంతవంత మాని వధూటీ
జనచూడామణి వేడుక ◆ లెనయఁగఁ దిలకించి దాని కి ట్లని పలికెన్. ‖ 9 ‖

తే. చక్కెరలు నుక్కెడలు గ్రుక్కి మిక్కుటంపు ◆ మక్కువలఁ జొక్కి చక్క ని న్నెక్కుగతుల
నెక్కొనఁగఁ బ్రోది యిడుట కోపక్కిమిన్న ◆ యక్కఱలు దీర్చి యిపుడు నన్నాదుకొనుము. ‖ 10 ‖

క. మకరాంకునకు న్రతికిని ◆ బ్రకటంబుగ నలఁతిముద్దుపలుకులచేఁ గౌ
తుక మొసఁగు వలఁతివఁట యిదె ◆ శుకమా నీప్రౌఢి నేఁడు చూచెదము గదా. ‖ 11 ‖

ఉ. మారుని గేరుచారుసుకుమారుని నామహిభృత్కుమారునిన్
గూరిమి మీఱ నీ విటకు గొబ్బునఁ దోడ్కొని తెచ్చి హెచ్చు నీ
ఘోరమనోభవవ్యథలఁ గుంది మదిం దిగు లొందుదాని నో
కీరమనేఁడు నన్ను బ్రతికింపఁ గదే మధురస్వగీరమా. ‖ 12 ‖

తే. మంతనంబున నావలవంతతెఱఁగు ◆ విన్నపము సేయు మమ్మగమిన్నతోడ
నింపుసొంపులు నింపునిద్దంపుముద్దుఁ ◆ గలికిపలుకులఁ దేనియ ల్చిలుకఁ జిలుక. ‖ 13 ‖

సీ. ఆరాజదర్శనం బబ్బక యుండిన ◆ నయనోత్పలంబు లేక్రియఁ జెలంగు
నాయినురుచిరకరాలంబనము లేక ◆ చేతోంబుజాత మేరీతి నలరు
నాఘనునిబిడదయారస మొదవక ◆ గాఢతాపాగ్ని యేకరణి నడఁగు
నామహేంద్రమహాకటాక్షంబు నెఱయక ◆ సంభోగసుఖ మెట్లు సంభవించు
తే. నహహ విహగకులోత్తమ యట్టు లగుట ◆ జాగు చేయక వేవేగఁ జని యశేష
భువనమోహనుఁ డైనయయ్యవనినాథుఁ ◆ గడఁకఁ గొనితెచ్చి సన్మార్గగతిని మనుము. ‖ 14 ‖

ఆ. అనుడుఁ గీరరాజ మట్ల చేసెదనమ్మ ◆ చెలులఁ గూడి నీవు వలను మీఱ
నెలమి నాడుకొనుచు నే వచ్చునందాఁక ◆ మనికి వదలకుండు మనుచుఁ దెలిపి. ‖ 15 ‖

తే. కొమ్మ నీమేని దొకమంచిసొమ్ముఁ దిగిచి ◆ యానవాలుగ మెడఁ గట్టు మనిన నలరి
వనజలోచన గొబ్బునఁ దనపసిండి ◆ బన్నసర మానవా లిచ్చి పనుచుటయును. ‖ 16 ‖

చ. వెర విరవార నజ్జలదవేణిని వీడ్కొని వేడ్క మీఱ నం
బరసరణి న్వడిం బఱచి పక్షవతంసము కాంచె నొక్కచోఁ
దెరువున రాజకీరముఖదివ్యపతంగమనోనుకూలభా
స్వరఫలజాలమున్ భువనసారవిశాలరసాలసాలమున్. ‖ 17 ‖

తే. కాంచి మెల్లన యయ్యనోకహముమీఁద ◆ వ్రాలి యాక్రిందఁ బటకుటీరంబు చూచి
యిదియె కాఁబోలు నృపుఁ డున్నయిర వటంచు ◆ నాత్మ నూహించుచున్న యయ్యదనునందు. ‖ 18 ‖

క. వసుధాసుధాశనప్రభుఁ డసమశరామేయసాయకాకుంచితహృ
ద్బిసరుహుఁ డై పస చెడి దొసఁ ◆ గెసఁగఁ గృశోదరిఁ దలంచి యిట్లని పలికెన్. ‖ 19 ‖

ఉ. హా కలహంసయాన విరహానలవేదన కోర్వఁజాల న
య్యో కలకంఠకంఠి చల మూనక నన్ను సముద్ధరించు మే
లే కమలాయతాక్షి దయ లేక కలంచెద విట్లు వేగ రా
వే కనకోపమాంగి నిను వేఁడెద బిగ్గఁ గవుంగిలించవే. ‖ 20 ‖

క. లలనా మరువిరిబరిగో ◆ లల నాడెందంబు గడుఁ గలంగెడు నివ్వే
ళల నాదుకొని కృపాలీ ◆ లల నామోదం బొసంగి లలిఁ బ్రోవఁ గదే. ‖ 21 ‖

మ. తళుకుంబంగరుబొమ్మచందమున నందం బారఁ గన్పట్టి యా
సలు పుట్టించి కరంచి వెండియును హా జాలంబు రెట్టింప న

య్యలరుంగైదువుజోదువేదనకు న న్నర్పించి య ట్లేగితే
బలభన్నీలశిలావినీలచికురాబాలా జగన్మోహినీ. ‖ 22 ‖

వ. అని మఱియు ని ట్లనియె. ‖ 23 ‖

ఉ. హె చ్చుగునిచ్చవేఁట కిపు డేటికి వచ్చితి వచ్చి యెచ్చుగా
నిచ్చట నచ్చకోరదృశ నేటికిఁ జూచితిఁ జూచి యూరకే
క్రచ్చఱఁ జెచ్చెరం జనక కామిని నేటికిఁ గోరితిం గటా
ముచ్చట దీరఁ బైకొనక ముద్దియ నేటికిఁ బోవ నిచ్చితిన్. ‖ 24 ‖

క. దాన మదిఁ బొదల సంగడి ◆ చానలతోఁ గలసి మెలసి చనువెడ నయయో
పూని కవుంగిటఁ బెనఁచక ◆ మానినిఁ బో నిడితి మందు మానసుఁ డైతిన్. ‖ 25 ‖

సీ. గొబ్బిగుబ్బలు చూచి యుబ్బుచుండితిఁ గాని ◆ నిబ్బరంబుగఁ జెంత నిలువనైతి
వాలుఁగన్నులు చూచి సోలుచుండితిఁ గాని ◆ యల్లిబిల్లిగ మాటలాడనైతి
వెడఁదక్రొమ్ముడి చూచి కడిఁదిఁ జెందితిఁ గాని ◆ తివిరి నెమ్మది కోర్కెఁ దెలుపనైతి
మెఱుఁగుఁజెక్కులు చూచి తెఱఁగు దప్పితిఁ గాని ◆ కొసరి తద్దయు వేఁడుకొనఁగనైతి
తే. నహహా పని మించె నబల యిట్లుఱ దలంచె ◆ మరుఁడు పగ గాంచె వేముఱు మదిఁ గలంచె
నెడరు లొదవించె విరిముల్కు లెదను నించె ◆ శివశివా యింక నే నేమి సేయువాఁడ. ‖ 26 ‖

సీ. శైవాలధమ్మిల్లచక్రవాకస్తని ◆ కలహంసగామిని పులినజఘన
సారసవదన డిండీరాభదరహాస ◆ యావర్తనాభి కల్హారపాణి
మధుకరరోమాళి మకరజంఘాలత ◆ కచ్ఛపచరణాగ్ర కంబుకంఠి
వీచికావళి మీనలోచన కింజల్క ◆ జాలకరదన మృణాలబాహ
తే. యగుచు సొగ సూనుదివిజకన్యావిలాస ◆ సరసి నోలాడ కింక దుస్తరతరాబ్జ
శరశరాఘాతశిఖిశిఖాజాతజాత ◆ యాతినాభీతి యల్లఁ జల్లారఁ గలదె. ‖ 27 ‖

మ. సవనాదిక్రియల న్సుధాంధులను మెచ్చం జేసి ధన్యాత్ము లై
నవిశేషజ్ఞుల కబ్బుఁ గాక యకటా నాకేటికిం గల్గుని
బ్భువనాతీతవిలాసవిభ్రమకళాభూరిప్రభాంచన్మరు
ద్ధవళాక్షీమధురాధరాధరసుధాధారాసరిద్ధోరణుల్. ‖ 28 ‖

ఉ. భూమిని భామినీమణుల భూరినిలాసరసైకమాన్యలన్
వేమఱుఁ బ్రేమ ముల్లమున విస్తరిలం గనుఁగొందుమే కదా
కామునిమోహనాంబకముకైవడిఁ దద్దయు నుద్ది మీఱు న
క్కామినిరూపవైభవము కన్నులఁ గట్టినయట్ల యుండెడిన్. ‖ 29 ‖

క. తమిఁ గన్నులార నాఱని ◆ ప్రమదంబున నింక నొక్కపఱి గన్గొనుభా
గ్యము దొరకునొక్కొ నా కా ◆ సమదద్విరదేంద్రకుంభసమకుచకుంభన్. ‖ 30 ‖

ఆ. అని తలంచుచున్న యా రాచతలమిన్న ◆ పలుకు లాలకించి యెలమిఁ గాంచి
యిదియ వేళ యంచు మదిలోన నూహించి ◆ నెమ్మి నొక్కచెంతకొమ్మ కుఱికి. ‖ 31 ‖

క. కులుకుచుఁ జక్కెరతేనియ ◆ చిలికెడు నిద్దంపుముద్దుజిలిబిలిపలుకుల్
వొలయఁగఁ జతురత వెలయఁగ ◆ జిలు కానాడెంపురాచసింగముఁ బలికెన్. ‖ 32 ‖

చ. కటకట రాజచంద్ర యిది కర్జమె నిర్జరకన్యకామణిన్
దటుకున ఘోరమారనిశితప్రదరంబులపాలు చేసి యి
చ్చటి కిటు చేరి నీవును విశంకటతాపభరాలసుండ వై
యటమటఁ జెంది దేల పదమా ముదమార నెలంతచెంతకున్. ‖ 33 ‖

తే. అధిప నీమోహనాకృతి యద్భుతముగఁ ◆ గాంచినప్పటినుండియుఁ బంచశరని
శాతచూతశరాఘాతయాతనావి ◆ ధూతచేతోంబుజాత యై నాతి స్రుక్కె. ‖ 34 ‖

సీ. భృంగ మంగనకు బల్సింగ మై పొడకట్టె ◆ గాలి బాలిక కుగ్రకీలి యయ్యెఁ
బికము చేడియకుఁ గార్మేకముపోల్కె నెసంగెఁ ◆ జూత మింతికిఁ బెనుభూత మయ్యెఁ
బన్నీరు కన్నెకు మున్నీరుతెఱఁ గయ్యెఁ ◆ గలువ చెల్వకు దొడ్డచిలువ యయ్యె
శారి నారికిఁ బెద్దమారి యై కనుపట్టె ◆ హారము చెలికిఁ బ్రహార మయ్యె
తే. నేమి చెప్పుదు నీకు రాజేంద్రచంద్ర ◆ చంద్రవదనను నిపుడు నిస్తంద్రభావ
భవభవోదగ్రసంతాపసంభవవికార ◆ మంతకంతకు నగ్గలం బగుటకతన. || 35 ||

ఉ. చెప్పెడి దేమి దేవరకుఁ జేడియచందము పొన్పుక్రొవ్విరుల్
నిప్పుక లంచుఁ దద్దయుఁ జలింపుచు నూర్పులు నింపుచుండి ని
న్గుప్పునఁ దోడితె మ్మనుచుఁ గూరిమి నంపిన వచ్చితిం గటా
యిప్పు డిఁ కేమి యయ్యెనొ మృ ◆ గేక్షణ మారవికారవేదనన్. || 36 ||

ఉ. పూనదు మేన మానికపుభూషణము ల్చెలు లెన్ని చెప్పినన్
మానదు నీవిలాసగరిమంబు గణింపక యొద్దిబోటులం
గాన దనూనబాష్పకలికాకృతలోచన యై నిజమ్ము ను
మ్మానవిల్తునాన నలినానన నీపయిఁ గూర్మి పెంపునన్. || 37 ||

తే. కమ్మవిల్కానిచేతిపూఁగొమ్మ ముద్దు ◆ గుమ్మ రతనంపుబసిఁడికీల్బొమ్మ వలపు
గ్రమ్మ ని మ్మగుకపురంపుదిమ్మ సుమ్మ ◆ కొమ్మ నెమ్మె దలిర్పఁ గైకొమ్మ రమ్మ. || 38 ||

ఉ. అంగము మేల్కడాని నఖంరాంకురముల్ తెలిక్రొత్తముత్తెముల్
ముంగురు లింద్రనీలములు మోవ చొకారపుఁదమ్మి కెంపురే
వం గనుపట్టుపల్వరుస వజ్రపుఁఱ ల్పునుమానికంపుకీ
ల్బంగరుబొమ్మ సుమ్మ నరపాలక బాల కండింది మీఱఁగన్. || 39 ||

క. అండజయానచనుంగవ ◆ యండ న్వసియించుభాగ్య మబ్బిన సుమకో
దండుఁ డన నెంత వినుమా ◆ కొండలతోఁ బోర వచ్చుఁ గువలయనాథా. || 40 ||

క. అని చిలుక పలుకుటయు న ◆ జ్జనవరుఁ డ ట్లెత్తి చూచి శాఖాగ్రమునం
గనుపట్టునవ్విహంగముఁ ◆ గనుఁగొని యనియెన్ సమగ్రకౌతూహలి యై. || 41 ||

తే. రమ్ము రాచిల్క విరహవారాశిలోన ◆ మునుఁగు నా కొకతెప్ప వై మొనసి నిలిచి
మగువతెఱఁ గెల్ల నెఱిఁగించి మనిచి తింక ◆ నిన్నుఁ గొనియాడ నేజాడ నేర్చువాఁడ. || 43 ||

క. భళిభళీ శుకవికిరమణీ ◆ పలు కిప్పుడ తర్కితోపపన్నం బగుమే
లెలయింపుచు నెమ్మది క ◆ గ్గల మగుకౌతూహలంబు గలిగించెఁ గదే. || 44 ||

ఆ. అనుచుఁ జేరఁ బిలిచి నెన రొప్ప ముంజేత ◆ నునిచి మేను నిమిరి మొనసి ముద్దు
గొనుచు నెమ్మనమునఁ బెనఁచుకూరిమితోడ ◆ నెనసి మఱియు దాని కిట్టు లనియె. || 45 ||

శా. ఏమేమీ రమణీశిరోమణి భళా యిట్లాడి ని న్నంపెనా
నామీఁదం గలకంతకంఠి కెదలోనం గూర్మి వాటిల్లెనా
భామారత్నముబోటు లిప్పునికిఁ దోడ్పా టై విడంబించిరా
నీమే ల్ప ల్కిఁక దాఁచ నేల చెపుమా నీడోద్భవశ్రేష్ఠమా. || 46 ||

చ. అతితరమారఘోరవిశిఖాగ్నిశిఖాపరితాపభీతి న
య్యతివలమిన్న ని న్నిచటి కంపెడిచో మఱి యేమి వల్కె నీ
మతిఁ గొతుకంగ నేల చెపుమా జగదేకమనోహరప్రభాం
కితనిజతుండనిర్జమితకింశుకమా శుకమా రయంబునన్. || 47 ||

మ. మకరాంకుం డతిసాహసుండు శశిదుర్మార్గప్రచారుండు త
త్పికకీరభ్రమరాహిభుక్సితగరుద్బృందంబు నింద్యం బహా

శుకమా మాటలు వేయు నేటి కిఁక నాచోఁ బ్రేమ వాటించి యా
చకితానంగకురంగశాబనయనన్ జంద్రాననం గూర్పుమా. ‖ 48 ‖

ఉ. నిక్కము గాఁగ నాపలుకు నెమ్మది నమ్ము దిటంబు చేసి యో
చక్కె రవింటిమేల్చిరుదుజక్కికొలంపుజగామగండ యా
చక్కెరబొమ్మ కెంబెదవిచక్కెరపానక మాని చొక్కుచోఁ
జక్కఁగ నీకుఁ గమ్మవలిచక్కెర లక్కఱతో నొసంగెదన్. ‖ 49 ‖

తే. కోమలికి నీవు తద్దయుఁ గూర్చుననుఁగ ◆ వగుట మరునకు నెఱబంట వగుట నిన్నుఁ
గరము ప్రార్థించుకొనియెద ఖగకులేంద్ర ◆ మగువతోఁ గూర్చి ననుఁ గృప మనుపు మిపుడు. ‖ 50 ‖

తే. అనిన శుకరాజ మతనిఁ గన్గొని నృపాల ◆ వంత యిం తేల యిది యానవాలు గాఁగఁ
జేడె దనబన్నసర మంపెఁ జూడు మనుచుఁ ◆ జూపుటయుఁ బుచ్చుకొని తద్ద చోద్య మంది. ‖ 50 ‖

క. బన్నసర మపుడు నరపతి ◆ కన్నుల నద్దుకొని యెదను గదియింపుచు న
క్కన్నెలమిన్నం గాంచిన ◆ కన్నన్ డెందమునఁ గూర్మి గదురఁగఁ బలికెన్. ‖ 51 ‖

ఉ. సేమమె గోము మీఱురతిచేతినిగారపుపైఁడిబొమ్మ క
య్యామునిపువ్వుగొమ్మకు నొయారపు వలుపురాచకొమ్మకుం
గామునిగీముతోఁటవలికప్రపుదిమ్మకు ముద్దుగుమ్మ కు
ద్దామవచోనిరూఢి మణిదామమ ప్రేమ మెలర్పఁ జెప్పుమా. ‖ 52 ‖

ఉ. అంబుజపత్రనేత్రహృదయంబుతెఱం గొకయింత నీకుఁ ద
థ్యంబుగఁ గాన నయ్యెడుఁ గదా ప్రమదామణి దా ననున్ బ్రసూ
నాంబకకేళి నేలి యలరారఁగఁ జేయునొ ఘోరమారదుః
ఖాంబుధిఁ ద్రోచివైచునొ యహో మణిహారమ వేగఁ దెల్పుమా. ‖ 53 ‖

ఉ. తాలిమి దూలి జాలి మదిఁ దార్కొన నక్కనకోపమాంగిపై
వ్రాలనికూర్మిఁ గ్రుంగి బలువాసి దొలంగి కలంగుచున్నచో
వేళ యెఱింగి న న్మనుప వేళయ వచ్చితి మేలుమే లహో
నీలకచాకుచాంచలవినిద్రవిహారమ రత్నహారమా. ‖ 54 ‖

ఉ. ఊరక కోరిక న్మదమయూరకకీరకదంబబంభరీ
శారికలుం జకోరికలు సారెకుఁ గేరి కలంపఁ జాఁగె న
మ్మారుఁడు క్రూరుఁ డై పొదవె మచ్చిక హెచ్చఁగఁ దెచ్చి కూర్పు మా
హా రమణీయభర్మమయహారమణీ మణిశిరోమణిన్. ‖ 55 ‖

ఉ. అన్నులమిన్న ని న్నచటి కంపిన నిం పెనయంగ వచ్చి యా
వన్నెలదొంతి సంతసపువార్త దిటంబుఁ దెల్పి నేఁడు నా
బన్నముఁ ద్రోచి వైచి బన్నసరంబ బళా జగంబునన్
బ్రన్ననసద్గుణోన్నతులపద్ధతు లిట్టివ కావె యారయన్. ‖ 56 ‖

ఉ. అక్కమలాయతాక్షి నను నక్కున నొక్కి కవుంగిలించుచోఁ
జిక్కులఁ బెట్టి ని న్నడలఁజేయుదు నంచుఁ దలంచఁబోకు నా
యక్కఱఁ దీఱ యాదుకొనుమా మణిహారము పేరు మీఱ న
మ్మక్క పరోపకారవిహితాత్మ లిలన్ దమసేగి యెంతురే. ‖ 57 ‖

తే. కలికియురమున నెత్తావికలప మలఁది
విరిసరంబులు దమి నించువేళఁ జాల
వఱలఁ జేయుదుఁ గాని మే ల్మఱచి యేను
నిన్నుఁ జిక్కుల నిడఁ జుమీ బన్నసరమ. ‖ 58 ‖

ఉ. సాంకవగంధసారఘనసారమృగీమదసారసౌరభా
లంకృత మైనవేల్పునవలాతలమిన్నయురంబుపై నీరా
తంకగతి న్సుఖించునమిత మ్మగుభాగ్యము నీకు నబ్బె నా
కింక మ ఱెన్నఁ డబ్బు వచియింపఁగదే మణిహారరాజమా. || 59 ||

సీ. కలకంఠిజఘనభాగం బంటి యుంటకుఁ ◆ గాంచి యేపుణ్యంబు గాంచినదియొ
వెలఁదిచెక్కులచెంత వ్రేలుచుండుట కేయు ◆ పాసన చేసితో బవిరజోడు
కలికివాతెఱపానకము చవి గొనుటకు ◆ ముక్కర యేవేల్పు మ్రొక్కుకొనెనొ
పొలఁతిముద్దుమొగంబుఁ బొదవియుండుటకుఁ జే ◆ ర్చుక్క యేవ్రతముల స్రుక్కె నొక్కొ
తే. కంజముఖిమేటిసిబ్బెంపుగబ్బిగుబ్బ ◆ గుబ్బలులదండ నుండ నేఘోరతపము
సలిపితివు నీవు మీభాగ్యసరణి ధరణి ◆ నెన్నఁదరమా కడానిహొన్ బన్నసరమ. || 60 ||

చ. పలుకులు వేయు నేల విను పైదలిపైఁ దలకొన్నకూర్మి నేఁ
దెలుపఁగఁ జాల బాల నిటఁ దెచ్చి రయంబున నాయురంబునన్
నిలుపుము కాక యున్న నిదె నెమ్మది నమ్మదిరాక్షి పేరుగా
మలయుకడానిబన్నసరమా విను నక్కునఁ జేర్చి చొక్కెదన్. || 61 ||

తే. అనుచుఁ బలవింపఁ గీర మోయధిప యింక ◆ నిచట జాగేల వేగ నయ్యింతి నిన్న
క్రీడమై నున్న మనికికి వేడు కలర ◆ రమ్ము చక్కఁగఁ బొసఁగుఁ గర్జమ్ము లెల్ల. || 62 ||

వ. అని మఱియు ని ట్లనియె. || 63 ||

ఉ. అమ్మదచంచరీక రుచి ◆ రాలకజాలక దా నొకింత డెం
దమ్మునయందు నాపలుకు నమ్మక యమ్మకరాంకకంకప
త్రమ్ములదాడి నే మగునొ రాజకులైకలలామ జాళువా
కమ్మ లిఖించి నాయఱుతఁ గట్టుము చెచ్చెర నేగి యిచ్చెదన్. || 64 ||

వ. అనిన నతం డట్ల కాక యని లేఖ లిఖియించి యాలేఖ యా లేఖవధూవతంసమ్మున కి
మ్మని గట్టిగ మెడం గట్టిన. || 65 ||

క. దిట్టతన మెలయ నప్పుడు ◆ చెట్టుప లల్లార్చి యెగసి చెచ్చెర దిని న
ప్పిట్ట నెఱిఁ బఱచి కొనబుల ◆ ప ట్టగు తనమొదలినెలవుపట్టునఁ జేరెన్. || 66 ||

వ. అయ్యవసరంబున. || 67 ||

తే. వంతఁ గలఁగుచుఁ దెఱగంటి వాలుగంటి ◆ యల్లనృపుఁ దెత్తు నని పూని యరిగినట్టి
చిలుక రాదయ్యెఁ దడ వేల చేసెనొక్కొ ◆ యనుచు గాదిలిచెలికత్తియలను బలికె. || 68 ||

సీ. చెలులార ముద్దురాచిలుక రానెలప్రోలి ◆ కేరీతి నురుగతిఁ జేరఁగలదు
చేరి యేరికిఁ బ్రవేశింపఁ జెల్లనిలోన ◆ గరు మఱి యేభంగిఁ జొరఁగఁగలదు
చొచ్చి యచ్చట నిచ్చ నిచ్చ హెచ్చగురీవిఁ ◆ గ్రాలు నేలిక నెట్లు గాంచఁగలదు
కాంచి యించుక మదిఁ గొంచ కేతెఱఁగున ◆ నతనితోఁ దగుమాటలాడఁగలదు
తే. మాటలాడిన విని రాజమన్మథుండు ◆ కౌతుకం జార నిచ్చోటి కేకరణి వచ్చు
వచ్చుట హుళక్కి కటకటా పచ్చవిల్తు ◆ దాడి నిం కెవ్విధంబునఁ దాళుదాన. || 69 ||

ఉ. అక్కట మిక్కుటంపుఁదమి నక్కరుణానిధి నాడు చెల్మికై
మక్కువ మీఱఁ జేరి బతిమాలినఁ గా దని వీడనాడి నన్
జిక్కులఁ బెట్టి యిట్టివెతఁ జెందగఁ జేసితి రమ్మలార యిం
కెక్కడిమాట యాతఁ డిట కేటికి వచ్చు నృపు ల్పరాఙ్ముఖుల్. || 70 ||

ఆ. కుసుమశరశరార్తిఁ గుందుచుఁ జిల్కను ◆ రాయబార మనుప రాక మసలెఁ
బక్షు లేడ రాచపను లేడ యనుచు లోఁ ◆ దలఁప వలదె వెడఁగుఁదనము గాక. || 71 ||

తే. కోరి యేప్రొద్దు సానులకూటములను ◆ దవిలి కలకంఠు లెడపక దరుల మెలఁగ
భోగినులు చుట్టుకొనియుండఁ బొదలుభూమి ◆ భృద్వరుం డింక నీవంక కెట్లు వచ్చు. || 72 ||

తే. అహహ దక్షిణనాయకుం డగుచు జనులఁ ◆ జాల నలయించు పెద్ద గాఁబోలు నాతఁ
డటులఁ గాకున్న మారక భటులచేతి ◆ యాతనలఁ గుందఁ జేయునే యబలలార. || 73 ||

వ. అని చింతించుచున్నసమయంబునం జిలుక యాకలకంఠిమ్రోల లీలం గనుపట్టిన దా
నిం గని యావన్నెలగని యి ట్లనియె. || 74 ||

క. అండజసత్కులమండన ◆ నిండారుకుముదంబుతోడ నిక్కము చెపుమా
గుండియ లదరెడుఁ గాయో ◆ పండో నీ నేగినట్టిపని వైళమునన్. || 75 ||

ఉ. అంగజుఁ గ్రుంగఁ జేయునెఱయందపుఁజందపురాచమిన్న నె
ఱ్ఱంగిఁ గనుంగొనం బొసఁగెఁ బాయక యాయెకిమీనితోడ నే
యంగున మాట లాడితి ధరాధిపుఁ డే మని పల్కెఁ దెల్పు నా
బంగరుముద్దుచిల్క నినుఁ బ్రాణపదంబుగ నెంచి పెంచితిన్. || 76 ||

క. చిలుకా యారాక్రొన్నన ◆ విలుకానిం దేక నీవు నే వచ్చుటచే
నలు కాత్మం దళుకొత్తఁగఁ ◆ బలుకాఱియలం గృశింపఁ బాల్పడితిఁ గదే. || 77 ||

వ. అనినం బక్షి యాసరోజాక్షి నీక్షించి యిట్లనియె. || 78 ||

తే. మానినీమణి నీయాజ్ఞ పూని యేను ◆ సరభసంబుగఁ జని చని తెరువులోన
నొక్కసహకారభూరుహం బెక్కి దిక్కు ◆ లడయుచున్నంతఁ జెంత నత్తరువుక్రింద. || 79 ||

సీ. నిదురలేవడిఁ గెంపు నెఱయుకన్గవతోడఁ ◆ బొడిపొడి యైనమైపూఁతతోడ
సడలినరతనంపుబెడఁగుసొమ్ములతోడ ◆ బడలి చె న్నెడలినయొడలితోడ
నుడుగక పొడము నిట్టూర్పుగాడ్పులతోడ ◆ జిగి దొఱంగిన ముద్దుమొగముతోడఁ
జెక్కునఁ జేర్చిన చెయిదామరలతోడ ◆ జాలిఁ దూలెడుమానసంబుతోడ
తే. న్రాలి హా భువనైకవిభ్రమవిలాస ◆ భాసమానాంగి ననుఁ గృపాపాటవమున
మనుచు మనుచు మనోజవేదనలఁ గనలు ◆ చున్న నెఱవన్నియలరాచమిన్నఁ గంటి || 80 ||

ఉ. ఓ చిగురాకుఁబోఁడి విను మొక్కపటావసథాంతరంబునన్
నీచెలువంబె సారెకు గణింపుచుఁ గంపిలుచుండి దండ నన్
జూచి మనోజువాజి యనుచుం బలవింపఁ దొడంగె నౌర యా
రాచకొలంపురేదొరవిరాలితెఱం గిఁక నేమి చెప్పుదున్. || 81 ||

సీ. హా ప్రభావప్రఫుల్లాంభోజలోచన ◆ హా శరద్రాకాసుధాంశువదన
హా సమదద్విరేఫాలకజాలక ◆ హా తప్తచామీకరాభగాత్రి
హా దిశాకుంభికుంభాంచితకుచకుంభ ◆ హా పరిపక్వబింబాధరోష్ఠి
నా హీరశకలమనోహరరదనాళి ◆ హా నవదర్పణోద్యత్కపోల
తే. హా జగన్మాన్య గంధర్వరాజకన్య ◆ యహహ మారున కిటుల న న్నప్పగించి
గొడవఁ జెందించి కుందించి జుడిఁగి చనితె ◆ యంచు ని న్నెంచు నతఁడు క్రొమ్మించుఁబోఁడి. || 82 ||

తే. ఏమి చెప్పుదు మఱియు నబ్భూమిజాని ◆ యువిద నీచొక్కటపురూప మొక్కచిత్ర
ఫలకమున వ్రాసి ముందఱ నిలుపుకొని ని ◆ తాంతమోహాతిరేకంబు దనరఁ బలికె. || 83 ||

క. ఏమే యోమేచకకచ ◆ యేమే వామేక్షణామణీ హేమఘృణీ
యేమే సోమోపమముఖి ◆ యేమే మో మెత్తి చూడ కిటు లెంతురఁటే. || 84 ||

క. పచ్చనివిలుదొర పైపైఁ ◆ గ్రచ్చుఱ విరిములుకు లేసి కాఱియ నిడుచో
మచ్చిక నన్ బ్రోచుటకై ◆ వచ్చితివా ముద్దగుమ్మ ◆ వలఁతివి లెమ్మా. || 85 ||

క. నానా చూడవు మదకల ◆ యానా యానలినశరునియాన సుమీ న
న్నానన మెత్తి కనుఁగొని ◆ సూనాస్త్రక్రియల నొఱపు చూపకయున్నన్. ‖ 86 ‖

క. అలుకా పలుకవు మరువిరి ◆ చిలుకా రతిచేతిముద్దుఁజిలుకా యలుకా
తలుకారుమేలిబంగరు ◆ మొలకా వలకాఁక ముట్టముల కాయెఁ గదే. ‖ 87 ‖

వ. అని పలికి మఱియుం దత్తరంబున. ‖ 88 ‖

చ. చెక్కిలి ముద్దు వెట్టుకొనుఁ జేతఁ దురంబము దువ్వు నెమ్మదిం
జొక్కి కవుఁగిలించుకొనఁ జూచుఁ జనుంగవ యంటఁ బోవు నో
చక్కెరబొమ్మ న న్మదనసంగరలీలల నేలు మంచుఁ బె
న్మక్కువ మీఱ మ్రొక్కి బతిమాలు వివేకము మాలి తూలుచున్. ‖ 89 ‖

సీ. కావిచక్కెరముద్దుమోవి యానఁగఁ బోయి ◆ సారె కూరక నోరు చప్పరించుఁ
బెనఁగి క్రొన్ననపానుపునకుఁ దార్పఁగఁ బోయి ◆ తరలక యున్నపాదములకొఱగుఁ
గడఁక మీఱఁగఁ బోకముడి వదల్పఁగఁ బోయి ◆ గడగడ వడకించుఁ గరయుగంబు
గబ్బిచన్గవ యొత్తి కౌగిలింపఁగఁ బోయి ◆ కళవళంబున బయ ల్కౌఁగిలించుఁ
తే. బ్రేమ మాటాడు మని పల్కరించఁ బోయి ◆ మా ఱ్వాలుకకున్న వెడవెడ మాటలాడుఁ
గన్న యన్నులతఱమె యన్నన్న చిన్ని ◆ మన్నుదొర మిన్న వలవంతచిన్నె లెన్న. ‖ 90 ‖

క. కొమ్మా యనుఁ బలుకవె విరి ◆ కొమ్మా యను నీకు నింత కొఱకొఱ చెల్లెన్
బొమ్మా యను నునుఁజిత్తరు ◆ బొమ్మా యను రాజమౌళి పొదలు విరాళిన్. ‖ 91 ‖

తే. అట్టివిరహార్తిఁ గుందుచున్నట్టిమనుజ ◆ వల్లభుని గాంచి నీకెఱఁ గెల్లఁ దెలియ
విన్నవించిన నతఁడు న న్నెన్నరాని ◆ కనికరము మీఱఁ జూచి యి ట్లనుచుఁ బలికె. ‖ 92 ‖

ఉ. కోమలిమీఁద నాకుఁ గలకూరిమి దేవుఁ డెఱుంగుఁ జిల్క నీ
కే మని చెప్పువాఁడ నిపు డించుక నీవును జూచితే కదా
భామినిమోవిచక్కెరలపానక మానక మాన నేర దీ
కామదురాపతాప మిఁక గట్టిగ దానిఁ బరిగ్రహించెదన్. ‖ 93 ‖

వ. అని పల్కి. ‖ 94 ‖

తే. కమ్మవిల్కానిఁ దెగడు నయ్యెమ్మెకాఁడు ◆ కొమ్మ నామాట నీ వెద నమ్మ వనుచుఁ
గమ్మ లిఖియించి పంచె నిక్కమ్ము గాఁగ ◆ నమ్ము మిదె వచ్చు నతఁడు నీయిమ్మునకును. ‖ 95 ‖

వ. అనిన నచ్చాన చెచ్చెర నచ్చీటి విచ్చి పుచ్చుకొని నెచ్చెలి కిచ్చిన నది యిట్లని
చదువం దొడంగె. ‖ 96 ‖

సీ. శ్రీమత్సకలలోకసీమంతినీజనా ◆ తీతనిరంతరద్యోతమాన
వరరూపలావణ్య వైభవశాలిని ◆ యైనసుశ్యామాభిధానదివ్య
గాంధర్వకులరాజకన్యాలలామకు ◆ ఘనుఁడు ఋతుధ్వజావనివిభుండు
పనిచినశోభనపత్రిక నీవు నా ◆ కనుదోయి కబ్రంబు గదుర నెదురఁ

తే. గడఁకఁ బొడకట్టి యప్పుడె జుడిఁగి పోవు ◆ టాదిగఁ బ్రసూనవిశిఖజ్వరార్తిఁ జెంది
కుందుచున్నాఁడ నింక నీకోమలాధ ◆ రాధరసుధారసం బిచ్చి యాదుకొనుము. ‖ 97 ‖

ఉ. ఏ మని తెల్పువాఁడ నొకయింతయు నక్కటికంబు లేక న
న్నామనిఱేఁడు రేదొరయు నంచలు దేఁటులు గీరశారికల్
కాముఁడు గండుఁగోయిలలు గాఱియ పెట్టుతెఱంగు నీవు లోఁ
గామినికామినీజనశిఖామణి మత్తమరాళగామినీ. ‖ 98 ‖

క. అని చదివిన విని వనితా ◆ జనరత్నము సిబ్బితియును సంతసమును నె
మ్మనమునఁ బెనఁగొనఁ జిలుకం ◆ గనుఁగొని యి ట్లనియెఁ బ్రేమ గడలుకొనంగన్. ‖ 99 ‖

శా. ధాత్రీనాథశిఖామణిం గని యథార్థం బొప్ప మత్కార్యమున్
శ్రోత్రానందము గాఁగఁ దెల్పి యతనిం జొక్కించి వే క్రమ్మఱం
జిత్రప్రక్రియ నేగుదెంచి యశముం జేకొంచు మేల్మే లహా
పత్త్రీ పత్త్రికఁ దెచ్చి నిల్పితివి నాప్రాణంబు లిప్పట్టునన్. ‖ 100 ‖

క. శ్రీరమణికి గీరమణికి ◆ నీరమణీయోక్తి యుక్తి నెఱపుచుఁ దచ్చే
తోరమణులఁ గూర్తువు నిన్ ◆ గీరమణీ నే నుతింప నేర్తునె యింకన్. ‖ 101 ‖

వ. అని చిలుకం దిలకించి పలికి కలికి చెలికత్తియలుం దానును మనోవికాసంబున భా
సిలుచుండె నాసమయంబున. ‖ 102 ‖

తే. చక్రపరిపాలన మొనర్ప జగమువిందుఁ ◆ దరలి వచ్చెను నీ వింక నరుగుమంచు
సురలు శశికంచుమేలిబంగరపుఁగమ్మ ◆ చు ట్టనఁగ సభ్రమున వేగుచుక్క వొడిచె. ‖ 103 ‖

తే. చక్రరిపుఁ డగురాజశాసనమువలన ◆ నెంచి మారుండు పాంథుల నేయఁ జాఁగెఁ
గావ రావే యటంచు జగంబువిందుఁ ◆ గూర్చి మొఱ చేసెననఁగఁ గుక్కుటము లఱచె. ‖ 104 ‖

సీ. అసమానవాసనా లసమానమల్లికా ◆ ప్రసవమంజరులపై మునరి మునరి
విమలామృతాకీర్ణకమలాకరోత్ఫుల్ల ◆ కమలానుషంగంబు గాంచి కాంచి
మృదులాతిశోభనచ్ఛదలసద్ఘనసార ◆ కదళీవనంబులఁ బొదలి పొదలి
యేలాలతాజాలడోలాతతవిహార ◆ లీలలఁ బలుమాఱు సోలి సోలి

తే. యుపరిసురతక్రియాక్లిన్నచపలలోచ ◆ నాఘనస్తనభాగనిదాఘసలిల
బిందుసందోహవిహృతిఁ బెంపొంది పొంది,వీచె వలినాలిచలిగాడ్పు లేచి యపుడు. ‖ 105 ‖

తే. అతులగతుల నితాంతోపరతులఁ బతుల
మతుల కామోద మొనఁగూర్చి నుతులు గన్న
సతులనెరజాణతనపుసుస్థితుల కెలమిఁ
జెలఁగి తల లూఁచె నన దీపశిఖలు వడఁకె. ‖ 106 ‖

తే. కలకలధ్వానములతో ఖగంబు లెగసి ◆ చదలఁ జరియించెఁ దమకులస్వామి యైన
యరుణుఁ డుదయించుచో నెదు కరుగుదెంచి ◆ యతని దర్శింప సమకట్టినవియొ యనఁగ. ‖ 107
‖

చ. గుసగుసలాడి పల్లవుల గొబ్బున వీడ్కొని యుత్తరీయముల్
ముసుఁగులు పెట్టి దట్టముగ మోముల నిద్దురచొక్కు దేఱ వె
క్కసమున దిక్కు లారయుచుఁ గ్రంతలవెంబడిఁ దారి తారి పల్
దొసఁగు లెసంగులోగిళులు దూఱిరి క్రమ్మఱి జారకామినుల్. ‖ 108 ‖

సీ. కమ్మవాతెఱపానకమ్ములు చవి చూపి ◆ నిద్దంపుచెక్కులు ము ద్దొసంగి
కులుకుసిబ్బెపుగబ్బిగుబ్బ లంటఁగ నిచ్చి ◆ దట్టంపుఁగౌగిలింతలఁ బెనంచి
తమి రేఁచి నీవిబంధములు విప్పఁగ నిచ్చి ◆ జఘనసంస్పర్శనోత్సవ మొనర్చి
బహువిధరతికళామహిమలఁ జొక్కించి ◆ జిలిబిలిసొలపుఁబల్కులఁ గరంచి
తే. మెల్లమెల్లనె చేతిసొ మ్మెల్ల లాగి ◆ తెల్లవాఱినఁ దమదెస వెల్లి బెల్లి
తల్లులను దార్చి గణికామతల్లు లింద్ల ◆ వెళ్లఁ దోలించి రత్తఱిఁ బల్లవులను. ‖ 109 ‖

సీ. కడఁకతో నిదుర మేల్కాంచి దిగ్గనఁ బాన్పు ◆ దిగి కటిస్థలిఁ గోక బిగియఁ గట్టి
పెనుగొన్నముత్తెంపుఁబేర్లు చి క్కెడలించి ◆ వదలినతొడవులు గుదురుపఱచి
విరులతావులు గ్రమ్ము కురులు క్రొమ్ముడి దిద్ది ◆ కులుకుఁబాలిండ్లఁ గంచెల ఘటించి
మొకమున నెలయుకాటుక పైఁటకొన నొత్తి ◆ పుక్కిటివిడె మొక్కచక్కి నుమిసి

తే. యందియలు మ్రోయ మట్టియ ల్గ్రిందు సేయ ◆ నిదురచొక్కుల నడుగులు గొదుకు పూన
సతులు పడకిండ్లు వెలువడి చనుహోరంగు ◆ ప్రియులడెందంబు లపుడు తద్దయుఁ గరంచె. ॥ 110 ॥

ఉ. విక్కుచుఁ బోయి యాగడపు వెంపరతొత్తులయిండ్లు దూటి బల్
రొక్కము గుమ్మరించి కడఁ ◆ ద్రొక్కుచు నేగినదాఁక రాక వాం
ఛ్రొక్కెడ వైచి పోవుట కయో యని రెంటికిఁ బాసి గ్రుడ్లనీ
ళ్గ్రుక్కుచు జాఱి రిక్కలకుఁ గొత్తబొజుంగువెడంగు లయ్యెడన్. ॥ 111 ॥

క. తూరుపు తెలతెలవాఱినఁ ◆ దారలు గృహదీపములును దమి లంజియలం
జేరిన సిగ్గరిబొజుగున్ ◆ బారులమోములును దెల్లఁబాఱె నొకంతన్. ॥ 112 ॥

వ. అంత. ॥ 113 ॥

మ. బిసినీకాంతవియోగసంజనితగర్భీభూతతాపజ్వరో
ల్లసదార్తిం గృశియించుచున్న యెడఁ గల్యప్రాజ్ఞవైద్యుండు నే
ర్పెసఁగం దత్ప్రబలోపతాప ముడుపన్ హేలాగతిం దెచ్చుబ
ల్రససిందూరపుటుండయో యనఁగ మార్తాండుండు దోఁచెన్ దివిన్. ॥ 114 ॥

సీ. చక్రరక్షణకళాచాతుర్యశాలి దా ◆ నినశబ్దవాచ్యుఁ డై యెసఁగు టరుదె
సతతతమోగుణోచ్చాటనచణుఁడు దా ◆ లోకబాంధవుఁ డై వెలుంగు టరుదె
కమలాధికామోదకరమూర్తియుతుఁడు దా ◆ హరిసమాఖ్య వహించి యలరు టరుదె
విష్ణుపదాసక్తి విహరించుమేటి దాఁ ◆ బరమహంసఖ్యాతిఁ బరఁగు టరుదె
తే. యనుచు ననచినవేడ్క బుధాళు లెల్లఁ ◆ దను నుతించుచు సమయకృత్యములు దీర్ప
సకలజనులకు లోచనోత్సవము మీఱ ◆ ధరణి వెలుఁ గొందె భవవార్ధితరణి యగుచు. ॥ 115 ॥

తే. మున్ను దా నపరాసక్తిఁ జన్న ఖిన్న ◆ యగుచుఁ బద్మిని నెమ్మోము మొగిచె నంచుఁ
దరణి యచ్చేడియకు నంపుధౌతపటము ◆ లనఁగ నంచలు గొలఁకుల కపుడు డిగియె. ॥ 116 ॥

క. తమ్మికొలంకులపై జుం ◆ జు మ్మని తుమ్మెదలు మెఱయుచొ ప్పలరె సరో
జమ్ములు మీదొర వచ్చెన్ ◆ లెమ్మని మేల్కొలుపుచున్న లీల దలిర్పన్. ॥ 117 ॥

క. తమి యెల్లఁ దీర్చి తమప్రియ ◆ తముఁ డగురా జస్తమింపఁ దఱిఁ గని వచ్చెం
దిమురునఁ జండప్రభుఁ డని ◆ కుముదంబులు మోము మోడ్చి కుముదము లయ్యెన్. ॥ 118 ॥

తే. చక్రములు పొంగె దస్యుసంచయ మడంగెఁ ◆ దమము చెంగె ద్విజప్రతానము చెలంగె
సరసులం దెల్లఁ గమలాతిశయ మెసంగె ◆ జగము విం దగునినుఁడు తేజమునఁ బ్రబల. ॥ 119 ॥

తే. అపుడు సురకామినులు సమయార్హవిధులు ◆ దీర్చి మణిభూషణాంబరదివ్యగంధ
దివ్యమాల్యాదికంబులఁ దేజరిలుచు ◆ సరవి నక్కన్యఁ దోడ్కొని సరగ నరిగె. ॥ 120 ॥

తే. తమరు దొలునాఁడు మెలఁగినతావు చేరి ◆ యచట నభినవగానవిద్యావినోద
లీల నలరారుచుండి రబ్బాల నెదను ◆ నిలిపి వలవంత గుందుచు నృపతి యచట. ॥ 121 ॥

తే. కష్టతరముగ రేయెల్లఁ గడపి మఱియుఁ ◆ దత్తరింపుచు వేఁకువతఱిని లేచి
యాచిగురుటారుఁబోఁడి సోయగము దద్ద ◆ తనమనంబున ని ట్లని తలఁపఁ దొడఁగె. ॥ 122 ॥

మ. స్మరియింతున్ స్మరమండలేశ రవిరాజత్ప్రాజ్యరాజ్యేందిరన్
హరిణాక్షిన్ హరినీలనీలచికురన్ హర్యక్షమధ్య న్మనో
హరకార్తస్వరవిగ్రహన్ భుజగరోమాళిన్ సముద్యత్సుధా
కరబింబప్రతిమానచారుముఖి నగ్గంధర్వరాట్కన్యకన్. ॥ 123 ॥

చ. వలకొని బోటికత్తె లిరువంకల డాసి భజింప నింపుగా
జిలిబిలిపాట పాడునెడఁ జేతిక డానిపసిండివీణెకా
యలబలుఱాపునం బొదలి యాడెడునక్కలకంఠకంఠి ను
గ్గులుకుమిటారిగబ్బిచనుగుబ్బలసౌ రెద నెంతు నెంతయున్. ‖ 124 ‖

చ. అఱమఱ లేక నేఁ దఱిసి యాడ వసించినఁ జూచి నానతో
బిఱబిఱ లేచి హేమమణిపీఠము డిగ్గి కురంగటన్ హొయల్
మెఱయ నొకింత కన్మొగిచి మిన్నక యున్నపొలంతిమిన్నవా
ల్చుఱుకుఁబిసాళిక్రొందళుకుఁజూపుల కోపు మదిం దలంచెదన్. ‖ 125 ‖

చ. పస యొసఁగం బొసంగునునుబంగరుబొమ్మతెఱంగునన్ దరిన్
వెసఁ గనఁబడ్డ నే వలచి వేమరు నామరుఁ డేఁపఁ దద్దయున్
బిసరుహసాయకక్రియకు వేఁడిన మో మఱ వంచి లోననే
ముసిముసినవ్వు నవ్వుకొనుముద్దులగుమ్మహొయ ల్గణించెదన్. ‖ 126 ‖

క. వలఁతితనం బెలయఁగ నా ◆ చెలికానికి నుత్తరంబు చెప్పుచు ముద్దుల్
చిలికెడువప్పొలఁతుకనును ◆ జిలిబిలిపలుగులహొరంగు చింతింతు మదిన్. ‖ 127 ‖

క. తలవంచి పసిఁడిగద్దియ ◆ కెలనన్ నాపలుకు లాలకింపఁగ ముంజే
చిలుకఁ బలికించి కులికెడు ◆ తలిరాకుంబోఁడివగలు తలఁపున నెంతున్. ‖ 128 ‖

చ. అగణితలీల ఱా ల్గరఁగునట్లుగఁ జె ట్లిగిరించునట్లుగా
మృగఖగపన్నగాదు లెలమి న్విని చొక్కఁ బసిండివీణె బా
గుగ నుతి గూర్చి యామనిని గోయిల గొల్చినభంగిఁ బాడునా
సొగసులదొంతియబ్బురపుశోభనగానవిధాన మెన్నెదన్. ‖ 129 ‖

చ. చెలిమి వెలందు లిమ్మునకుఁ జెచ్చెరఁ దోడ్కొనిపోవుచున్నచో
గొలగొలలాడుచు న్వెనుకఁ గోకిలకీరమయూరశారికల్
బిలబిల నేగ వాని నదలించునెపంబున నన్నుఁ గూర్మితో
సొలసి గిఱుక్కునం దిరిగి చూచునొయారియొయార మెన్నెదన్. ‖ 130 ‖

క. పొంగారువేడ్కఁ బూచిన ◆ తంగెడుక్రియఁ జూడ నలరి తమి రేఁచినయా
బంగారుబొమ్మగడితపు ◆ సింగారం బెన్నుకొంచుఁ జిత్తమునందున్. ‖ 131 ‖

చ. తొలకరిక్రొమ్మెఱుంగుక్రియఁ దోరపురత్నశలాకపోలికన్
దళుకుపఁబసిండిబొమ్మవలె దర్పకవైభవలక్ష్మికైవడిన్
నలువుగ మ్రోలఁ గానఁబడి నామది యల్లఁ గరంచి చన్నయా
చిలుకలకొల్కిసోయగము చిత్తమునన్ స్మరియింతు సారెకున్. ‖ 132 ‖

సీ. కులుకుసిబ్బెపుగబ్బిగుబ్బల వ్రేఁకున ◆ గడగడ ననదులేఁగౌను వడఁకఁ
గ్రందుగా రతనంపుటందెలు గజ్జెలు ◆ ఘలుఘల్లు మని పెల్లుకాళ్ల మొఱయఁ
గడితంపుఁగీల్జడ కటిమండలంబునఁ ◆ బలుదెఱంగుల లాస్యకలన నెఱప
మురు వైనహురుమంజిముత్యాలచేర్చుక్క ◆ ఫాలభాగమున నుయ్యాల లూఁగ

తే. భావమున నన్ను విడనాడి పోవలేని ◆ కూర్మి నందంద తిరిగి కన్గొనుచుఁ జనెడు
పడఁతుకలమిన్నమురిపెంపునడలసొంపు ◆ చెలఁగి నాడెందమునఁ బాదు కొలుపువాఁడ. ‖ 133 ‖

తే. అని తలఁచుచుండి యంత నయ్యవనిజాని ◆ వేగుటయు లేచి సమయార్హవిధులు దీర్చి
సచివుఁడును చాను వేవేగఁ జని నిలింప ◆ తరుణు లున్నప్రదేశంబు దఱిసి యచట. ‖ 134 ‖

క. కాంచె నుదంచన్మణిమయ ◆ కాంచనపాంచాలికానికాయములఁ గడున్
వంచింపుచుఁ దొలకరిక్రొ ◆ మ్మించున్ దీవియను మించు మించుంబోఁడిన్. ‖ 135 ‖

క. మఱియును. ॥ 136 ॥

సీ. శుకవాణి నభినవముకురబింబకపోల ◆ నలికులవేణి నేణాంకముఖిని
గంభికుంభస్తని నంభోజదళపాణి ◆ నహిరోమవల్లరి నచలజఘన
నండజయాన నఖండతేజోనిధిఁ ◆ జంపక నాసఁ గాంచననిభాంగి
నావర్తనాభి నిందీవరలోచన ◆ నణుమధ్య నుత్ఫుల్లహల్లకాంఘ్రి
తే. నఖిలభువనైకమోహిని నబ్జకంఠి ◆ నతులశృంగారవారాశి నన్నిలింప
చంపకామోద నెనలేనిసంతసమునఁ ◆ గాంచె నృపవరాళి కన్నులకఱవు దీర. ॥ 137 ॥

వ. అట్లు గాంచి. ॥ 138 ॥

క. కొంచింపక వడిఁ బెన్నిధిఁ ◆ గాంచినపేదయునుబోలె ఘనతరహర్షో
దంచితమానసుఁ డై యా ◆ పంచాననమధ్యఁ జేరి పలికెం బ్రేమన్. ॥ 139 ॥

తే. వినుము తనుమధ్య మాటలు వేయు నేల ◆ వెలయునీరూపలావణ్యవిభ్రమములు
గాంచినప్పటినుండియుఁ బంచశరుఁడు ◆ నిల్వఁగానీఁడు ప్రాణము ల్నిలుపు నేఁడు. ॥ 140 ॥

క. అరవిందనయన వినుమ ◆ మ్మరుఁ డిఁక హింసింపకుండ మనుపుము కరుణం
బరికించి ము "న్నహింసా పరమో ధర్మ" యని స్మృతులు పలుకన్ వినవే. ॥ 141 ॥

సీ. కులుకుచు జిలిబిలిపలుకులఁ గపురంపుఁ ◆ బలుకులు తులకింపఁ బలుకఁగదవె
తళుకు లీనుపిసాళికలికిక్రేఁగంటివా ◆ ల్చుఱుకుఁజూపులఁ దేఱి చూడఁ గదవె
కమ్మచక్కెరపానకమ్ము లిమ్ముగఁ గ్రమ్ము ◆ నివురుకెమ్మోవి ము ద్దిడఁగఁ గదవె
చెన్నారుచిన్నారివన్నెలక్రొన్నెల ◆ నగఁ జాలుచిఱునవ్వు నవ్వఁ గదవె
తే. యెద ననుం గదియించి యియ్యెదనమదన ◆ కదనలీలల నలరింపఁ గదవె కుంద
రదన నవచూతదళరదచ్ఛదన త్రిదివ ◆ సదన పరిపూర్ణపూర్ణిమాచంద్రవదన. ॥ 142 ॥

చ. సమదగజేంద్రకుంభవిలసత్కుచకుంభయుగంబు ఱొమ్మునం
దమి నిగుడన్ ఘటించి ప్రమదమ్మున బిగ్గఁ గవుంగిలించి యీ
సుమశరతాప మార్చి నను సొంపుగఁ బ్రోవు మదభ్రమద్భ్రమ
ద్భ్రమరవినీలవేణి నినుఁ బల్మఱుఁ గేల్మోగిడించి వేఁడెదన్. ॥ 143 ॥

క. అని దీనత దోఁపఁగఁ బ ◆ ల్కిన విని తల వంచి యామృగీదృశ యపుడే
మిని పల్క కూరకుండిన ◆ జనవల్లభుఁ గాంచి యొక్కసఖి యి ట్లనియెన్. ॥ 144 ॥

క. నరపాలక యీబాలిక ◆ మరుపాలఁ గడుం గలంగి మరి నీపై ని
బ్బరమున నిలిపిన దిఁక దే ◆ వరచిత్తము వచ్చినట్లు వర్తింపఁ దగున్. ॥ 145 ॥

ఆ. అనిన సంతసిల్లి యవనిపుఁ డటు లేచి ◆ యింతులార యిన్నగాంతికమున
నొక్కపటకుటీర మున్న దచ్చటికిఁ బో ◆ దము ముదంబు మీఱఁ దరలి రండు. ॥ 146 ॥

క. అనవుడు వా రజ్జననా ◆ థునివెంబడి నంబుజాక్షిఁ దోడ్కొని సరగన్
ఘనతరకుతుకాన్వితహృ ◆ ద్వనరుహ లై యరిగి యరిగి తగ నొకచోటన్. ॥ 147 ॥

సీ. సకినెలపట్టెమంచము దోమతెర జర ◆ తారుబాలీసు క్రొందరటుపఱుపు
కుతినీతలాడ తళ్కుఁబసిండిచందువా ◆ నిలువుటద్దములు పన్నీటిగిండ్లు
జాలవల్లికలు ముత్యాలజాలీలు పెన్ ◆ వింజామరలు వట్టివేళ్లసురటి
కపురంపుబరిణెలు కస్తూరివీణె జ ◆ వ్వాదిక్రోవులు పటనాసిపెట్టె
తే. తమ్మపడిగము మంచిగందంపుఁగోర ◆ తబుకు చిన్నారియడప మత్తరువుకుప్పె
మొదలు గలదివ్యవస్తుసంపదలఁ బొదలు ◆ నమలమణిమయపటపటీరాంతరమున. ॥ 148 ॥

తే. అందఱు ప్రవేశ మొంది రానందలీల ◆ నపుడు నృపుఁడు నితాంతప్రహర్షభా
మానమానసుఁ డై సొగసూని దాని ◆ నెనయఁ గోరుచు నెపు డెప్పు డనుచు నుండె. ॥ 149 ॥

వ. అంత దినాంతం బగుటయు. ‖ 150 ‖

సీ. కలికికెన్నులఁ గ్రొత్తకజ్జలం బెలయించి ◆ తురుమున గొజ్జంగవిరులు దుఱిమి
నొసలఁ గస్తురిరేఖ పస యెసంగఁగఁ దీర్చి ◆ కలపంబు నెమ్మేనఁ గలయ నలఁది
బెడఁగు చెంగావిపావడ కటి ఘటియించి ◆ చలువమడుంగుదువ్వలువఁ గట్టి
జిలుగుపైఠాణికంచెల యెదఁ గదియించి ◆ యఱుత మల్లెసరంబు లలర నించి

తే. హారకేయూరకటకమంజీరకాంచి ◆ కామణిగ్రైవతాటంకకంకణాద్య
శేషభూషానికాయ మక్షీణలీలఁ ◆ దొడిగి కై చేసి బోటు లప్పుడఁతి కనిరి. ‖ 151 ‖

క. ఎలనాగ నీవు గోరిన ◆ చెలువుఁడు నీ కబ్బె నింక సిబ్బితిమై బె
గ్గిలి యుండక మదనాహవ ◆ కలనావైఖరులు వెలయఁ గలయుము వీనిన్. ‖ 152 ‖

సీ. చెలువుఁడు కేల్వట్టి సెజ్జకుఁ దార్చుచో ◆ బెనఁగి వెన్కకుఁ జక్కఁ జనెదు సుమ్ము
విభుఁడు నున్గపురంపువిడె మిడ వచ్చుచో ◆ గొదికి మాఱ్మోగము పెట్టెదవు సుమ్ము
వరుఁడు గంచెల యూడ్చి సిరిగంద మలఁదుచో ◆ నుదరి పెన్ రంతు చేసెదవు సుమ్ము
ధవుఁడు గొప్పునఁ బువ్వుదండలు గట్టుచో ◆ గెరలి చే యొగ్గి యాఁగెదవు సుమ్ము
తే. ప్రియుఁడు గాటంపువలపులఁ బెల్లు రేఁగి ◆ యల్లనల్లన యిక్కువ లంటి తుంట
వింటిబల్దంటపనులు గావించునపుడు ◆ కసరి విసికించెదవు సుమ్మ పసిఁడిబొమ్మ. ‖ 153 ‖

ఉ. అంటిమి గాని యోవికసితాంబుజపత్రవిశాలనేత్ర ము
న్గంటిమి గాదె నీకుఁ గలగాటపుఁగూర్మి తెఱంగు మేలు బ
ల్దంటవు తెల్ప నేటి కిఁకఁ దప్పక యిప్పెనుఱేనిఁ గూడి పూ
వింటివజీరునాలమున నేమఱుఁబ్రేమమెయి న్సుఖింపుమా. ‖ 154 ‖

క. అను ననుఁగుఁజెలులపలుకులు ◆ విని యనిమిషరాజకన్య వ్రీడానమితా
ననవనరుహ యై చుఱచుఱఁ ◆ గరుకొని వారల నొకింతఁ గసరుచుఁ బలికెన్. ‖ 155 ‖

ఉ. అమ్మకచెల్ల మీరు నను నారడిఁ బెట్టి జుడింగి పోవ ను
ల్లమ్మునఁ బూనినా రవు బళా సరిలే కన వచ్చె మీవీవే
క మ్మిపు డేను వెంబడినె క్రమ్మఱ వచ్చెదఁ గాని హా యిఁకన్
మి మ్మెడఁబాసి యిం దొకనిమేషము నొంటిఁ జరింప లేఁ జుఁడీ. ‖ 156 ‖

చ. కటకట మీర లిట్టిబలుకట్టడ లౌట యెఱుంగ నేర కి
చ్చటి కిటు నమ్మి వచ్చుటకు సారెకు బూమెలు పన్ని నన్ను బి
ట్టటమట నొందఁజేసెదరు హా కొద యేమిటి కమ్మలార మీ
కుటిలత గానవచ్చె నిదిగో పెఱమాటలు వేయు నేటికిన్. ‖ 157 ‖

క. అని పలుకుచుఁ గేళీగృహ ◆ మునకుం జొరకున్న చిన్నిముగుదలమిన్నం
గనుఁగొని వినయమ్మున న ◆ య్యనుఁగుంబువుఁబోఁడు లొత్తి యని రిట్లనుచున్. ‖ 158 ‖

శా. చాలా బేలవె మేలుమే లిపు డహా ◆ బాగాయె లే గాఁపురం
బీలా గైన ధరిత్రిఁ గన్నియల ము న్వీక్షింపమే వార లీ
మేలంబు ల్పచరించి క్రచ్చుకొనిరే మేల్పట్టులం దయ్యెడన్
జాలుం బాలు బెడంద యేల పదమా క్ష్మాకృత్సమీపోర్వికిన్. ‖ 159 ‖

సీ. చెయివట్టి పూసెజ్జఁ జేర్పఁ బోయెడు వెలం ◆ దుక కరంబు విదల్చి త్రోచి వైచి
యబ్బబ్బ పద గదె గబ్బి యంచు నదల్చు తరలాక్షిఁ గ్రొవ్విరిదండఁ గొట్టి
వగలాడి యిపు డెంత బిగెసెదే యని నవ్వ ◆ మెఱుఁగుఁబోఁడిని బండ్లు గొఱికి తిట్టి
సరిసరి బులు పెల్ల సడలేనో యిపు డను ◆ భామినీమణి నెట్టిఁబాఱ చూచి
తే. పూని యిర్వురు మువ్వురు పొదుగఁబట్టి ◆ ముందఱికిఁ ద్రోయ గడితంపుమున్నఱికల
నడుగు దరలక యిడిగిలఁ బడి పెనంగు ◆ చున్నకన్నెకు మఱియు నయ్యన్ను లనిరి. ‖ 160 ‖

క. అల్లపుడు పెక్కులాగుల ◆ నెల్లఱ బతిమాలుకొంటి వెడలనికూర్మిన్
జెల్లంబొ యేమె యోసెమ ◆ మల్లడిగొని పెనఁగె దిపుడు మాతో మిగులన్. ‖ 161 ‖

క. అగ్గలపువలపుసొలపుల ◆ బెగ్గిలుచుండితివి మున్ను ప్రియనాథునితో
డగ్గఱఁగఁ జేయునపు డీ ◆ సిగ్గేటికిఁ బొడమెనమ్మ చిత్తరుబొమ్మా. ‖ 162 ‖

క. బిఱబిఱ విభుకడ కరుగక ◆ కొఱకొఱ లాడెద వ దేమి గోరము మేల్మేల్
వెఱఁ గయ్యెడిఁ గద నీచెడు ◆ కఱదలు గనుఁగొన్న నెన్నఁ గన్నెలమిన్నా. ‖ 163 ‖

సీ. చేరి కాళ్లఁ బెనంగు. గారాపుటనుఁగురా ◆ యంచబోదలఁ బో నడంచె దేమి
తెలియాకుమడుపు చేతికిఁ దెచ్చి యిడుబోటి ◆ కత్తియ నదలించి కసరె దేమి
జిలుఁగుఁబయ్యెదచెంగు జీరాడ నది చక్క ◆ సవరించు చెలిఁ దిట్ట సణిగె దేమి
పద మహార్తము డాసెఁ బతిచెంత కని తెల్పు ◆ చేడెపైఁ గన్నెఱ్ఱఁ జేసె దేమి
తే. వారిజాక్షిరొ యిటువంటివారె కారె ◆ కోరి సారెకుఁ బువ్వులకోరిబల్వ
జీరుపోరులఁ గేరి యయారె మగల ◆ నోల లాడించి ప్రోడ లై యుండువారు. ‖ 164 ‖

చ. అని యిటు లూరడించి చెలు లవ్విభుచెంతకు నింతి మిన్నఁ దో
డ్కొని చని పూసెజ్జకడఁ గోమలి నుంచి నృపాలచంద్ర యి
య్యనిమిషకాంత నెంతయుఁ బ్రియం బలరారఁగ నేలు కొమ్ము కొ
మ్మని తగ నప్పగించి వెస నందఱు జాఱిరి మన్కిపట్లకున్. ‖ 165 ‖

చ. అపుడు నృపాలుఁ డమ్మధుకరాలకజాలకసోయగంబు గా
టపుఁదమి మీఱఁ గన్గొని తటాలున ముంజెయి కట్టి పూలపా
నుపునకుఁ దార్చుచోఁ జెలఁగె నూపురభూరిఝుళంయుళధ్వనుల్
విపులగతి న్మనోభవుఁడు విల్లు గుణధ్వని చేసెనో యనన్. ‖ 166 ‖

ఉ. ఇందునిభాస్య నాన నపు డీడిగిలం బడి పూలపాన్పునం
జెందక యున్న ఱేఁడు వలిచెక్కులు గన్నులు మోవి ఫాల మా
నందము మీఱఁ జుంబన మొనర్చుచు నిక్కువ లంటుచున్ హొయల్
గ్రందుకొనం గుచంబు లెద గట్టిగఁ బట్టి కవుంగిలింపుచున్. ‖ 167 ‖

క. మెల్లనె పూసెజ్జకు దివి ◆ షల్లలనామణిని దిగిచి జానుగ మృదధ
మ్మిల్ల మొకించుక నిమురుచు ◆ హల్లకదళపాణి కిట్టు లనియెం బ్రేమన్. ‖ 168 ‖

క. నాన యిటు లేమిటికి నలి ◆ నానన కెమ్మోవి పంట నానఁగ నిడినన్
నాననవిల్తునిచెయివుల ◆ నానందింపఁగ నొనర్చి యలరింపఁ గదే. ‖ 169 ‖

ఉ. దండిగఁ దావిచెంగలువదండలు క్రొమ్ముడిఁ జుట్టనిమ్ము క
న్పండువు గాఁగ గబ్బిచనుబంతులు పట్టఁగ నిమ్ము పుష్పకో
దండునికేళి నేలి ప్రమదంబునఁ దేలఁగ నిమ్ము మత్తవే
దండసమానయాన యొకదండము నీకు నొసంగి వేఁడెదన్. ‖ 170 ‖

చ. పలుచనితేనియల్ చిలుకఁ బల్కవె కోకిలవాణి లేఁతన
వ్వులు వొలయంగ నన్ గృప దవుల్కొన జూడు సరోజపాణి పె
న్వల పలరాడ ము ద్దొసఁగి వాంఛలు దీర్చు మదాలివేణి య
గ్గలముగఁ గౌగిలింపఁ గదె కంతునిమేలిపతాణి పోణిమిన్. ‖ 171 ‖

సీ. పాలిండ్లు కెంగేలఁ బట్ట నిచ్చిన మేటి ◆ కళుకుబంగరుగిండ్లు కాను కిత్తు
వలపార ననుఁ జూచి కిలకిల నవ్వినఁ ◆ బేరైనముత్యాలపేరు లిత్తుఁ
దావినిద్దంపుఁగెమ్మోవి ము ద్దొసఁగిన ◆ సొంపు రాణింపుబల్కెంపు లిత్తుఁ
దళుకులేఁజెక్కుటద్దము లంట నిచ్చిన ◆ వెల లేనివజ్రంపుఁబలుక లిత్తుఁ
తే. బూలపాన్పునఁ గొద లేని హొళి నతను ◆ కేళి నోలాడఁ జేసిన లీలఁ గ్రాల
మేలిసామ్రాజ్య మిత్తు నివ్వేళ యింత ◆ గోలతన మేల నను నేలుకొనవె బాల. ‖ 172 ‖

క. అని బుజ్జగించి పలుకుచు ◆ జనపాలకమౌళి వేల్పుచానయెయారం
బున కాత్మ నంతకంతకు ◆ ఘనతరమోహాతిశయము గడలుకొనంగన్. ॥ 173 ॥

సీ. కపురంపువిడె మొసంగఁగఁ బోవునెపమునఁ గావినున్మోవిఁ బల్గం ట్లొనర్చి
వలపుఁగస్తురిగంద మలఁదునెపంబునఁ ◆ గులుకుసిబ్బెపుగబ్బిగుబ్బ లంటి
జాళువామొలనూలు సవరించునెపమున ◆ డం బార ఘనజఘనంబు నిమిరి
యలరి గొజ్జెఁగదండ లలరించునెపమున ◆ విప్పారు నెఱిగప్పుఁ గొప్పు దువ్వి

తే. తరుముఁజెక్కులు చుంబించి పళులు నారుఁ ◆ బొక్కిలియుఁ గేల గిలిగింత పొడమ ముట్టి
నీవి సడలించి స్మరశాస్త్రనియతి వెలయ ◆ రతులఁ గరగించి నృపతి యారాజముఖిని. ॥ 174 ॥

సీ. వితతదంతక్షతావృతసుధాధరయు స ◆ మంచితనిశ్వాసమారుతయును
శితనఖరాంకురాంకితకుచకుంభయు ◆ ఘర్మకణాక్లిన్నగండతలయు
వదనాంబుజాతసంవ్యాప్తశిరోజయు ◆ ఘనతరసీత్కారగళరవయును
గణితమంజీరకంకణకింకిణీకయుఁ ◆ దరళితహారలతాప్రకరయు

తే. గళదనూనమృగీమదకర్దమయును ◆ సదమలానందపరవశసంహననయు
నగుచు సురకాంత మిగులసౌఖ్యం బొనర్చె ◆ నంగభవకేళి నానృపఃపుంగవునకు. ॥ 175 ॥

సీ. చెలువంపుఁగనుబొమ ◆ ల్సింగిణీవిండ్లుగాఁ ◆ జుఱుకుఁజూపులు శరస్తోమములుగ
గాటంపునూఁగారు ఘనకృపాణము గాఁగ ◆ సోగక్రొందెలిగోళ్లు సురెలు గాఁగఁ
బిగికౌఁగిలింతలు పెనుగులాటలు గాఁగ ◆ సుషమాంగరాగంబు జోడు గాఁగ
నఖదంతపదవితానము పోటుగంట్లుగా ◆ ఘర్మతోయంబు రక్తంబు గాఁగఁ
తే. కటకనూపురకింకిణీకంకణప్ర ◆ ణాదములు భూరికలకలనాదములుగ
గామినీమణి యతనుసంగ్రామకేళి ◆ సలిపె నప్పుడు నృపకులతిలకుఁ దొడరి. ॥ 176 ॥

సీ. వదలిననెఱికొప్పు వారివాహము గాఁగఁ ◆ దనురుచు ల్మెఱుఁగుమొత్తములు గాఁగ
గళరవంబు లనూనగర్జాధ్వనులు గాఁగ ◆ కలపుటూర్పులు గంధవాహములుగ
గళితముక్తాఫలంబులు వడగండ్లుగాఁ ◆ గింకిణీధ్వనులు భేకీధ్వనులుగ
సీత్కృతారవములు చిమ్మెటరొదలుగా ◆ బెడఁగులేనగవులు ఫేనములుగ
తే. మేన జాల్కొనుచెమ్మట ల్వాన గాఁగఁ ◆ గరఁగుమృగనాభిపంకంబు బురద గాఁగ
నఖపదము లింద్రగోపబృందములు గాఁగ ◆ మగువసురతంబు వర్షాగమంబుఁబోలె. ॥ 177 ॥

తే. అంత సురతాంతవేళ నయ్యింతి నంక ◆ తలమునం దిడి గుబ్బలఁ గలప మలఁది
కురులు కొప్పిడితొడవులు గుదురుపఱచి ◆ కడిఁది నెత్తావికపురంపువిడె మొసంగి. ॥ 178 ॥

క. వలినాలికమ్మగాడ్పులు ◆ వొలయఁగఁ బూసు టికేలఁ బూని విసరుచున్
జిలిబిలినునుఁబలుకులఁ జెలి ◆ నలరింపుచు రేయిఁ గడపె నవనిపుఁ డెలమిన్. ॥ 179 ॥

వ. అంత. ॥ 180 ॥

సీ. సారసకల్హారసదమలవాఃపూర ◆ పూరితకాసారతీరములను
బరికల్పితాలీనపరభృతసంతాన ◆ వలయాకృతోద్యానవాటికలను
బహుళదరీప్రాంతభాసమానాశ్రాంత ◆ విస్తృతశశికాంతవేదికలను
సరసవిభాదభ్రచంద్రికాసంశుభ్ర ◆ తలనుదగ్రసితాభపులినములను
తే. బ్రతిదినంబును హితరీతిఁ జతురశీతి ◆ బంధబంధురరతికళాపారవశ్య
లీలఁ గ్రీడింపుచుండె నిలింపమాన ◆ వతియుఁ గాను బుతుధ్వజక్షితివరుండు. ॥ 181 ॥

సీ. పువుఁబోఁడికటిచక్ర మవనిభాగము గాఁగఁ ◆ గలికినెమ్మోయి కనకంబు గాఁగఁ
దరుణిగుబ్బలు మేటిగిరిదుర్గములు గాఁగఁ ◆ బడఁతిచెక్కులు హీరఫలకములుగ
గజయానకంధర విజయశంఖము గాఁగఁ ◆ గాంతజంఘులు వీరకాహళులుగఁ
బొలఁతులమిన్నపొక్కిలి మహానిధి గాఁగ ◆ లలనవేనలి ఘనలక్ష్మి గాఁగ

తే. నెంచి నిజరాజ్యవైభవోద్వృత్తి యెల్ల ◆ మఱచి నిస్తులమదనసామ్రాజ్యవైభ
వానుభవలీలఁ గొలుచునన్నరేంద్రుఁ ◆ డతులితామోదహృదయుఁడై యలరుచుండె. ‖ 182 ‖

వ. అని నారదమహామునీంద్రునకుఁ జతురాననుం డెఱింగించిన నతం డతని నవ్వలికథా
విధానం బడుగుటయును. ‖ 183 ‖

శా. వ్యాకీర్ణాభజటాటవీతటనితాంతాలంబితోద్యత్తమి
స్రాకాంతాప్రథితప్రభాసముదయాశ్రాంతప్రఫుల్లన్మహా
నాకద్వీపవతీవినిర్మలజలాంతర్భాగభాగ్దివ్యరే
ఖాకాంతోత్పలకైరవప్రకరభాగా పార్వతీవల్లభా. ‖ 184 ‖

క. కాండనిధిశయ కాండా ◆ కాండధరోద్దండదర్పఖండన వృషరా
ట్కాండ బహుకాండకాండవి ◆ చండా నిర్దళితవిద్విషద్వేదండా. ‖ 185 ‖

మాలిని. కలితగుణకలాపా కాంచనాహార్యచాపా
జలజనయనరోపా సంహృతాశేషపాపా
బలవదరిదురాపా భానుకోటిప్రతాపా
విలసితభవతాపా వేదవేద్యస్వరూపా. ‖ 186 ‖

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వరకరుణాకటాక్షనిరీక్షణసంలబ్ధసరసకవితాసామ్రా
జ్యధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్రపవిత్ర కూచిమంచిగంగనామాత్య
పుత్త్ర సకలసంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ తిమ్మకవిసార్వభౌమప్రణీతం
బైనరసికజనమనోభిరామం బనుశృంగారరసప్రబంధంబునందుఁ బంచమాశ్వాసము.

శ్రీరస్తు
ఓం నమః కామేశ్వర్యై

రసికజనమనోభిరామము

షష్ఠాశ్వాసము

రుచిరపీఠనగరా
గార శుభాకార భక్తగణమందారా
సూరిజనాధార సమీ
ద్ధీరా వరతామ్రచూడదివ్యశరీరా. ‖ 1 ‖

వ. అవధరింపుము నిలింపమహామునీంద్రునకుం బితామహుం డి ట్లని చెప్పం దొడంగె
నట్లు బుతుధ్వజక్షితితలాధీశ్వరుం డిష్టోపభోగంబులం దనియుచుండి యొక్క నాఁడు వధూసమేతుం డై వాహ్యాళి వెడలి ఘోరకాంతారప్రదేశంబు ప్రవేశించి. ‖ 2 ‖

సీ. ఘనసారచందనాగరుతరుచ్ఛాయలఁ ◆ గమనీయనవరత్నకందరములఁ
గనకారవిందసంగతసరస్తటముల ◆ సదమలామృతఝరీసైకతములఁ
బ్రాకటద్రాక్షాలతాకుడుంగంబులఁ ◆ గుముదబంధూపలకుట్టిమములఁ
బరిణతమాకందపరిసరస్థలములఁ ◆ బ్రసవచాంపేయకప్రాజ్యవనుల
తే. సారనీహారనీరప్రపూరతీర ◆ ముల మెలంగుచు నమ్మహీతలవిభుండు
మంజువాణికి నచట సమగ్రవైభ ◆ వములు దమి మీఱఁ జూపుచు రమణఁ బలికె. ‖ 3 ‖

క. అల్లదె చూచితే వలపులఁ ◆ బె ల్లడరుచు లేజవాదిపిల్లులు వని రం
జిల్లెడు నవదూతలతా ◆ పల్లవరుగ్భాసమానపదరదవసనా. ‖ 4 ‖

తే. నడలఁ దొడలఁ గుచంబుల దొడరి తన్ను ◆ గెలిచి తని యేమొ నీచెంత నిలువ నోడి
పఱచుచున్నది యదె చూడు భద్రకరిణి ◆ చకితసారంగశాబకచారునయన. ‖ 5 ‖

క. సముదంచితవాలవ్యజ ◆ నములన్ వీచుచును శ్రమకణము లుడిపెడునీ
చమరీతతిఁ గనుఁగొంటివె ◆ సమదమధువ్రతవితానచారుశిరోజా. ‖ 6 ‖

శా. హేరాళంబుగ నీదుకన్నుఁగవతో నీ డొందఁగా లేక కాం
తారక్షోణిని జేరి తద్దయు మనస్త్రాసంబు దీపింప న
య్యారే దిక్కులు చూచుచుం బఱచెడిన్ హాళి న్విలోకింపుమా
సారంగం బదె ప్రావృషేణ విలసత్సౌదామనీవిగ్రహా. ‖ 7 ‖

క. నీకౌనుదీఁగె కెన గా ◆ లే కేమొ కలంగి కడుఁ జలింపుచు గుహలన్
దాఁకొనియె సింగ మదె యా ◆ లోకింపుము మదచకోరలోచన దానిన్. ‖ 8 ‖

తే. తొడరి నీముద్దుకెమ్మోవి దొండపం డ ◆ టంచు భావించి యేమొ డాయంగఁ జేరి
కులుకుచున్నది చూడు రాచిలుకగమి ప్ర ◆ భాతవికసితశతపత్రపత్రనేత్ర. ‖ 9 ‖

క. శృంగారరసము చిలుకుచు ◆ సంగీతకళారహస్యచాతురిఁ దగునీ
భృంగాంగనఁ గనుఁగొంటివె ◆ గంగారంగత్తరంగకమనీయవళీ. ‖ 10 ‖

తే. చెలువు మీఱెడునీకొప్పు జలద మనియుఁ ◆ దనురుచు ల్మించు లంచును దలఁచి యేమొ
యాడుచున్నది నెమ్మి యల్లదిగొ చూడు ◆ కుంభికుంభోల్లసత్కుచకుంభయుగళి. || 11 ||

క. కలరవ మల్లదె రతులం ◆ గలయునెడ న్నీ వొనర్చు గళరవముక్రియం
బలుకుచు నున్నది విను నవ ◆ జలజాతదళోపమానసదమలచరణా. || 12 ||

ఉ. భిల్లసరోజలోచనలు పింఛపటంబులు గట్టి బిట్టు శో
భిల్లుచు నల్లవారె వనిఁ బెల్లుగ గానము సేయుచున్నవా
రుల్లము పల్లవింప నిపు డొయ్యన చూడుము కార్తికీనిశా
హల్లకబంధుమండలనిభామలకోమలవక్త్రపంకజా. || 13 ||

సీ. మల్లికామాధవీమంజరీమధుమదా ◆ నందితసుందరేందిందిరములఁ
బరిపక్వసహకారఫలరసాస్వాదన ◆ లోలలీలాశుకజాలకముల
విమలసరస్తోయకమలనాళాహార ◆ లాలసమత్తమరాళతతులఁ
గలితామ్రపల్లవగ్రాసావలేపవి ◆ భాస్వరసుస్వరపరభృతముల
తే. బహుతరఝరీతరంగనిర్భరనినాద ◆ ఘనఘనాఘనసినదశంకాముహుఃప్ర
ణర్తితానేకకేకిబృందములఁ జూడు ◆ రమ్యశుభగాత్రి గంధర్వరాజపుత్రి. || 14 ||

సీ. మేటిగొజ్జెఁగనీటియేటివాఁగులు దాఁటి ◆ మలయుపూసంపెఁగమ్రాఁకు లెక్కి
ఘనసారకదళికావనముల విహరించి ◆ పొదలుక్రొవ్విరిమల్లెపొదలు దూఱి
సరిఫుల్లకేతకీప్రసవవాసన లాని ◆ సదమదాంబుజసరస్తటుల మెలఁగి
కమ్మజవాదిగంధమ్ములు చేకొని ◆ లవలీనికుంజగుల్మములు దరిసి
తే. మందమందప్రయాణము ల్పందడింపఁ ◆ దొడరి ఘర్మాంబులేశంబు లుడిపికొనుచు
వీచుచున్నవి గాడుపు లేచి చూడు ◆ తప్తచామీకరోపమోద్దీప్తగాత్రి. || 15 ||

వ. అని చూపుచుం జని చని యొక్కరమ్యప్రదేశంబున నిలింపదంపతు లింపుపొంపులు
దీపింపఁ గ్రీడించినజాడ లీక్షించి మఱియు నయ్యంగనామణి కి ట్లనియె. || 16 ||

క. చూడుము గంధర్వవధూ ◆ చూడామణి యిందు దివిజసుందరులుఁ బతు
ల్వేడుక లలవఁగ మదన ◆ క్రీడల విహరించినట్టిరీతులు వరుసన్. || 17 ||

క. ధేనుకబంధంబున నొక ◆ చానయుఁ బల్లపుఁడుఁ గ్రీడ సలిపిరి తమి ని
చ్చో నారుకరపదంబులు ◆ గానంబడెఁ జూడు వికచకంజాతముఖీ. || 18 ||

క. పురుషుఁ డొకచెలిని గరపద ◆ కరణంబునఁ గూడె నెలమిఁ గనుఁగొను మిదె క
ప్పురపుజిగిలె న్సిరోముఖ ◆ గురుకుచభుజముద్ర లంటుకొన్నవి తరుణీ. || 19 ||

శా. అంభోజనన యొర్తు ప్రోడ యగుచున్ హాళి న్మనోభర్తతోఁ
బుంభావాసమబాణకేలి నిచటన్ భోగించె నెంతేని సం
రంభం బొప్పఁగఁ జూడు వేనలివిరుల్ రాలె న్వసంతాగమా
రంభోజ్జృంభితమత్తకోకిలవధూరాజద్వచోవైభవా. || 20 ||

తే. కరపదంబులు చాఁచి చెంగావిమోవి ◆ శయ్య నిడి యున్న చెలిని మార్జాలకరణ
మునఁ బ్రియుఁడు గూడె నిందుఁ దాంబూలరాగ ◆ కుంకుమాంకంబు లలరెఁ గన్గొనుము చెలియ. || 21 ||

తే. శూలచితబంధమున నొక్కవాలుఁగంటి ◆ విటుని గవగూడెఁ జూడు మివ్విరులసెజ్జ
నొక్కకా ల్చేర్చి యున్నచొ ప్పొప్పు మీఱె ◆ హారిపరిపక్వబింబఫలాధరోష్ఠి. || 22 ||

మ. ప్రియుఁడుం గామినియుం గడంక లెలయం. బ్రేంఖావతీనామకో
చ్చయబంధంబునఁ గూడి రిరువురు సెజ్జం గూర్మి హెచ్చం బద
ద్వయము ల్దొట్రుపడ న్మెలగినవినోదం బెల్లఁ గన్పట్టెడిం
బ్రియ మారం గనుఁ గొమ్ము మత్తమధులిడ్బృందాభవేణీభరా. || 23 ||

చ. అలరఁగ సింహవిక్రమమహాకరణంబున నొక్కమానినీ
తిలకము పల్లవుం గదిసెఁ దెల్లముగాఁ బరికించి చూడు మో
జలజదళాక్షి యివ్వికచచంపకభూజముచెంత నెంతయుం,
బొలు పలరారి మూఁడుపదము ల్లుదు రొప్పఁ గనంగ నయ్యెడిన్. ॥ 24 ॥

క. కను మవలంబితకరణం ◆ బునఁ గూడిరి సతియు వల్లభుఁడు నిదె యొకగో
డను లాక్షారస మొకగో ◆ డను జందనకర్దమంబు డాకొనెఁ బడఁతీ. ॥ 25 ॥

క. అని యిత్తెఱఁగున వనజా ◆ ననకుం జూపుచు ధరాధినాథాగ్రణి కా
ననభూమధ్యంబున సం ◆ జనితామోదమున మెలఁగుసమయమునందున్. ॥ 26 ॥

సీ. కఠినాద్రిశిఖరనీకాశమూర్ధముతోడఁ ◆ గుఱువజుంజుఱుపల్లనెఱులతోడ
సానుభాగోన్నతస్ఫారవక్షముతోడ ◆ దంష్ట్రాకరాళవక్త్రంబుతోడఁ
దాళభూమీరుహోత్తాలబాహులతోడఁ ◆ గడిఁది మీఱువెడందకడుపుతోడఁ
గొఱవులక్రియ రగుల్కొనుమిడిగ్రుడ్లతో ◆ నచలోపమానదేహంబుతోడ
తే. భువనభయచాట్టహాసవిస్ఫురణతోడ ◆ ఘోరుఁ డనునొక్కనిశిచరవీరుఁ డప్పు
డక్కజంబుగఁ దెరువున కడ్డు దాఁకి ◆ దాఁక మెఱయంగ నమ్మహీధవుని జూచి. ॥ 27 ॥

ఉ. ఓరి నృపాలకాధమ యయో భయ మింతయు లేక యిట్లు కాం
తారధరాతలంబున నితంబిని గూడి మెలంగె దింక మ
ద్ఘోరనిశాతభల్లములఁ గూల్చి వడి న్బుజియింతుఁ గాక ని
న్నూరక పోవ నిత్తునె ప్రియోక్తుల నేమిట నైన మెత్తునే. ॥ 28 ॥

ఉ. కానక కాన కివ్వికచకైరవపత్రవిశాలలోచనం
బూనికతోడఁ దోడుకొని మున్నఱికం బఱతెంచి తింక నీ
ప్రాణము దక్కఁ జూచుకొని బంటుతనం బటు గట్టిపెట్టి యి
మ్మానిని డించి వేగఁ జనుమా నిను నూరక పోవ నిచ్చెదన్. ॥ 29 ॥

చ. అనవుడు ధారుణీరమణుఁ డౌర నిశాట కడింది బంట వై
పొనుపున నిల్చి యాగడపుఁబోకలఁ బోయెదు నేఁడు నిన్ను మ
ద్ఘనవిశిఖానలోజ్జ్వలశిఖావిసరంబులపాలు చేసి కా
లునిపురిఁ జేర్చెద న్నిఖిలలోకజనాభిహితం బొనర్చెదన్. ॥ 30 ॥

ఉ. ఆమునఁ ద్రుళ్లుకొంచు దనుజాధమ నోరికి వచ్చినట్లు లే
మేమొ దురోక్తు లాడెదిది యెక్కువబంటుతనంబె నేఁడు నా
తో మొనకట్టి యాలమునఁ దూలక నిల్వుము ని న్మధుద్విష
త్కామవిరోధు లడ్డపడి కాచినఁ బ్రోవఁగనీక త్రుంచెదన్. ॥ 31 ॥

తే. అనిన వాఁ డప్డు రోషతామ్రాక్షుఁ డగుచు ◆ వింట గొనయంబు సంధించి మింట లెగయు
కఱుకుమొనవాఁడితూపు లక్కజము మీఱ ◆ జానిపైఁ బదియైదు పఱపె. ॥ 32 ॥

చ. పఱపిన నల్గి యద్ధరణిపాలుఁడు సింగిణి యెక్కువెట్టి బ
ల్కఱకులకోరు లాఱు నరఘస్మరుపై నిగుడించి యార్చినం
గొఱకొఱతోడ వాఁడు నొకక్రూరశరం బరివోసి యేసి యు
క్కఱ నొనరించె భూవిభు నుదగ్రపరాక్రమలీల గ్రాలుచున్. ॥ 33 ॥

సీ. సురవైరిపై ధరావరుఁ డొకయిరువది ◆ ములుకులు నిగడించి మురి యడంచె
ధరణీశుమీఁదఁ గ్రమ్మఱ రక్కసుఁడు నూఱు ◆ తూపులు పఱపించి యేపు డించె
నృపతిపై మఱి యామినీచరపతి ◆ బదిచిల్కు లడరించి కుదిలపఱిచె
రజనీచరునిమీఁద రాజవర్యుం డొక్క ◆ వేయిబాణము లేసి పీచ మడఁచె
తే. దొనల నలుఁగులు దివియుట తొడుగుటయును ◆ నేయుటయుఁ గాఁడుటయుఁ బయికెగయుటయును
గాన రాకుండ నబ్రంబు గాఁగ నట్లు ◆ పెనఁగుచుండిరి బీరంబు లినుమడింప. ॥ 34 ॥

శా. క్షోణీపాలుఁడు చిమ్మునమ్ములెడఁ ద్రుంచు న్నిర్జరారాతి గీ
ర్వాణద్వేషణుఁ డేయు బాణము లెడన్ వారించు భూజాని త
త్తూణీరంబుల నిండుకొన్న విశిఖస్తోమం బొకింతంత సం
క్షిణం బై చనఁ బోరి రిర్వురు నిటు ల్చిత్రాతిచిత్రంబుగన్. || 35 ||

క. గొదగొని దనుజాధముఁ డొక ◆ గదఁ కొని నడతేర నృపశిఖామణి వానిం
బదిలుఁ డయి కదిసి కొదుగక ◆ గుదియం జడియంగ మోది కుదియం జేసెన్. || 36 ||

క. శూలంబుల భీషణకర ◆ వాలంబుల నుగ్రభిండివాలంబుల నా
భీలగదాముద్గరశర ◆ జాలంబులఁ దవిలి పోరు సలిపిరి మిగులన్. || 37 ||

వ. ఇ ట్లనేకప్రకారంబులం బిఱుతివియక మూఁ డహోరాత్రంబు లెడతెగక తొడరి
పోరుచుండి రప్పుడు. || 38 ||

తే. అవనిజాని సమగ్రరోషారుణితవి ◆ నేత్రుఁ డయి వానిఁ బోనీక నిశితచంద్ర
హాసమున మస్తకముఁ దెగవేసి యవనిఁ ◆ గూల్చె నమరులు చదలున నిల్చి పొగడ. || 39 ||

వ. అయ్యవసరంబున. || 40 ||

క. వలనుగ విభునకుఁ దనపైఁ ◆ గలకూరిమి యరసి చూడఁగా వలె నంచున్
దలఁగి తదంతికమున నొక ◆ యలరుం బొదరింట నింతి యడఁగి వసించెన్. || 41 ||

క. జనవరుఁ డటువలె రక్కసుఁ ◆ దునుమాడి రయంబ మరలి తొయ్యలి నచ్చో
టునఁ గానక గుండియ ఝ ◆ ల్లని లీలగ నబ్బురంపుటార్తి యెసంగన్. || 42 ||

క. ఎక్కడి కేగెనొ హా యిపు ◆ డొక్కతెయుం దెరువు వట్టి యువతివతంసం
బక్కట నాపై నింతయు ◆ నక్కటికము లేక కూర్మి యారడిఁ బోవన్. || 43 ||

క. చంచలలోచన యెం దరు ◆ దెంచెనొ ననుఁ గావలేక దృఢబలవిలస
త్పంచశరనిశితవిశిఖా ◆ కుంచితహృత్కమల యగుచు గొడవలు బెరయన్. || 44 ||

సీ. అలికిఁ గేకులహాళాహళికి గద్దఱిపి కా ◆ వలికి మందపుఁగరువలికిఁ గసరు
చిలికి సారెకుఁ జేరి కులికి యార్చుపిసాళి ◆ కలికి రాచిలుక తెక్కలికిఁ దొగల
చెలికిఁ గప్రపుబూతి వలికి మారునిపూవు ◆ ములికి మొత్తములయంకిలికి నంచ
కలికిమిన్నలబల్రవలికి శారికలర ◆ వలికి నామని పెద్దపులికి మృదుల
తే. వలికిఁ బన్నీటివాఁకయుబ్బలికి గంధ ◆ ఫలికి వికసితసుమవనస్థలికిఁ గూర్మి
వెలికిఁ గ్రమ్మఁగఁ జిలుకలకొలికి యెంత ◆ యలికి యులికెనొ మముఁ దూలఁ బలికి నేడు. || 45 ||

ఆ. ఏమి సేయువాఁడ నిపు డిందుముఖిజాడ ◆ గానరాదు చూడఁ జానతోడ
నెడసి తాళఁ జాల నెవ్వార లివ్వేళ ◆ నళుకు మాన్చి మనుపఁగల రటంచు. || 46 ||

ఉ. హా యను మారసంగరకళాతిశయానమితాప్సరస్సమూ
హా యనుఁ దప్తకాంచనసమంచితచంచలచంచలాభదే
హా యను దివ్యరత్నఖచితాంగదదీప్తమృణాళనాళబా
హా యను నెట్టు లోర్తు నహహా రుచిరాస్యసరోరుహా యనున్. || 47 ||

క. ఎన్నఁడు చూతు నయో నిన్ ◆ గన్నులపండువుగ నిఁకఁ జొకారపునవలా
మిన్నా పూఁబొన్నా కడు ◆ నెన్నికఁ గనుమరునియాముటేనుఁగుగున్నా. || 48 ||

క. కులనారీమణుల న్వెల ◆ యెలనాగలు నీక జోకయే తలఁప నహా
కల నైన నీమనోభవ ◆ కలనావైఖరులు మఱవఁగలనా లలనా. || 49 ||

క. ఇంతయుఁ గనికర మూనక ◆ వంతల నిడి చనఁగఁ దగునె వలిగొజ్జఁగపూ
బంతీ యింతీ సొగసుల ◆ దొంతీ క్రొందుంటవింటిదొరమదదంతీ. || 50 ||

ఉ. కూరిమి మీఱ నీకులుకుగుబ్బల త్రొమ్మున నాని సారెకున్
జీరిక మోవి ముద్దు గొని చెక్కులు గీటి కడుఁ గడిందియై
య్యారము చూపుకోపు నెఱియ న్మదిఁ బాయ దిఁ కేమి సేతు నా
హా రమణీ మయోభవునిహారమణీ రమణీశిరోమణీ. ॥ 51 ॥

చ. కటకట యిప్పు డింత యలుకా యులుకా బలుకానలోన న
న్నటమట నొందఁ జేయఁ దగవా నగవా పగవాడనే యిఁ కె
న్నటికిని నిన్నుఁ బాయఁ గలనా లలనా వలనా కలంచ నేఁ
డెటువలెఁ దాళువాఁడఁ బొలఁతీ వలఁతీ కలతీరు దెల్పుమా. ॥ 52 ॥

వ. అని మఱియుం దనలోన ని ట్లని పలవింపం దొడంగె. ॥ 53 ॥

చ. తవిలి కలంచుగాటపువెతం గడి నోటికిఁ బోదు కంటికిం
బవలును రేయిఁ గూడ నొకపారెయుఁ గూరుకు రా దనుంగు లౌ
నువిదలఁ గూడి వేడుకల నుండఁగ నేమియుఁ బ్రేమ లే దహా
శివశివ యింక దన్మృదుకుశేశయలోచనఁ జూడఁ గల్గునే. ॥ 54 ॥

ఉ. సన్నలఁ జాయల న్వలపు చల్లుతెఱంగులు మేమెఱుంగులుం
జిన్నియొయారపుంగొనబుఁజిన్నెలు నెన్నిక గన్నవన్నెలుం
గన్నులఁ గట్టిన ట్లగుచుఁ గన్నులవింటివజీరుతేజి యౌ
నన్నులమిన్న చె న్నెపుడు హా మదిఁ జాల విరాలి గొల్పెడిన్. ॥ 55 ॥

చ. కిలకిలలాడుచుం దఱిని గేళి మెలంగుతెఱంగు జాణ యై
వలపులు చిల్కి కుల్కి చెలువంబుగఁ బల్కుహొరంగుసారె వి
చ్చలవిడిఁ బొంగి యంగభవసంగరలీలఁ జెలంగుభంగులుం
దలఁచిన గుండె ఝల్లు మను దాని హొయ ల్గణుతింప శక్యమే. ॥ 56 ॥

సీ. కురులు గమ్మలు సరు ల్గుబ్బలు నటియింప ◆ గడగడ నసదులేఁగౌను వడఁకఁ
జెక్కులజిలిబిలి చెమ్మట ల్జాల్గొన ◆ నుదుటికస్తురిబొట్టు పదనుకొనఁగఁ
గంకణకింకిణీకటక ధ్వను లెసంగ ◆ గళరవసీత్కారములు చెలంగ
నఱమోడ్పుకనుదోయి చుఱుకుఁజూపులు మీఱఁ ◆ గలపంపుమైపూఁత గరఁగి పాఱఁ
తే. బొదవి చెక్కులు గీటి కెంబెదవి యాని ◆ కులికి కిలకిల నగి ముద్దుచిలుకఁ బలికి
వలచి వలపించి యుపరతిఁ గలయుజాణ ◆ దాని నెడఁబాసి యేజాడఁ దాళువాఁడ. ॥ 57 ॥

సీ. ఒకమాటు పైటకొం గోరగాఁ దొలఁగించి ◆ మెఁఱుగుగుబ్బలయంద మెఱుఁగఁజేయు
నొకమాటు క్రొమ్ముడి యొప్పుగా ముడి విప్పి ◆ నిప్పుగాఁ గ్రమ్మఱఁ గొప్పు దిద్దు
నొకమాటు కూరిమి ప్రకటంబు సేయుచుఁ ◆ గులుకుఁబల్కుల ముద్దు చిలుకుచుండు
నొకమాటు గాటంపుటొఱపు రాణింపఁగా ◆ జిలిబిలిసొలపుఁజూపులఁ గరంచు
తే. నొక్కమాటు మనోభవాయోధనక్రి ◆ యాప్రవీణతఁ జూపి బి ట్టలరఁ జేయు
నౌర మది నొక్కతఱి నైన నక్కడింది ◆ మగువనెఱజాణతనములు మఱువరాదు. ॥ 58 ॥

సీ. చిలుకలకొలికి ముద్దులగుమ్మ వన్నెల ◆ గని చొకారపుమానికములమూట
తొలుకఱిక్రొమ్మించుతలిరుజొంపపుమావి ◆ పగడపుఁదీఁగె సోయగపుఁగొలను
కులుకుమిటారి తళ్కుపసిండికీల్బొమ్మ ◆ వలపులదీవి చెంగలువబావి
యన్నులమిన్న యొయారమ్ములకొటారు ◆ మరునిపూఁదూపు చేమంతిబంతి
తే. చికిలిక్రొమ్మించుటద్దంబు పికిలిచెండు ◆ కప్పురపుఁదావి యొప్పులకుప్ప యనఁగ
నలరుజగవన్నెలాడి యయారె దాని ◆ చెలువు మదిఁ బాయ దిఁక నేమి సేయువాఁడ. ॥ 59 ॥

శా. ప్రాంతారామధరానిరంతరవిహారస్ఫారలీలారతిన్
సంతోషింపక యిమ్మహాగహనసంచారభ్రమం బేల నై
యెంతే దవ్వుగ నేగుదెంచుటకు నేఁ డిచ్చోట నా కేల య
య్యింతిం గూర్చితి వేల పో నిడితి విం కెట్లోర్తు హా దైవమా. ॥ 60 ॥

తే. అనుచు మఱియు సహింపంగ నలని గాని ◆ కంతుసంతాపభరమున గ్రాఁగి వేఁగి
మేర మీఱెడుచేతోవికార మొదవ ◆ నంగజబలంబుఁ గూర్చి యి ట్లనుచుఁ బలికె. || 61 ||

సీ. డెంద మార్తిఁ గలంగి కుంద మాటికి నేఁచ ◆ నందమా మము నీకుఁ జందమామ
యలుక లూరఁగఁ జెందు చిలుక నూరక యుబ్బి ◆ పలుక మేరయె మీకుఁ జిలుకలార
మొకము చూడక పెద్దమెకముల ట్లరిదివా ◆ లకము లూనెద రేల పికములార
ముదము మీఱఁగఁ గాని పదము వాడెద రింత ◆ మదము మీ కేల షట్పదములార
తే. మారుఁడా మందగంధసమీరుఁడా మ ◆ యూరమా సారచంద్రికాపూరమా మ
రాళమా మత్తశారికాజాలమా యి ◆ దేల మము నేఁచెద రటంచుఁ దూలి మఱియు. || 62 ||

క. మరుఁడా విచలితసకలా ◆ మరుఁడా గరుడాసనునికొమరుఁడా సుమతో
మరుఁడా విరహులపై వే ◆ మరు డాయఁగ రాకు క్రూరమతిఁ బామరుఁడా. || 63 ||

క. నిలు డాయ రాకు మలయా ◆ నిలుఁడా నవకమలినీవనీసౌరభసం
కలుఁడా పటుబలుఁడా చం ◆ చలుఁడా ఖలుఁడా వియోగిజనతానలుఁడా. || 64 ||

క. మామా యను విరహులఁ జల ◆ మా మాటికి నేఁచఁ జందమామా గామా
మామానినీకుమారుని ◆ మామా మామాట సేయుమా మా నెనయన్. || 65 ||

ఆ. సంతనగ వియోగిసంతతిపై నలు ◆ సంత దయయు లేక సంతసమున
సంతపింపఁ జేయు సంతత క్రూరమా ◆ సంత రాకు మిఁక వసంత నీవు. || 66 ||

క. మతమా నీ కెపుడు నిదే ◆ వ్రతమా తెరువరులఁ జెనక వచ్చెదవు మధు
వ్రతమా ఫరభృతమా పరి ◆ వృతమాద్యత్కీరకురరపృతనాశతమా. || 67 ||

వ. అని యనేకప్రకారంబుల మనోవికారంబునం బలికి కలికిం బరికింపం గోరి వనాం
తరంబు దూఱి. || 68 ||

సీ. కిలకిలమనుచు రాచిలుకలు పలుకుచోఁ ◆ గలికిపల్కు లటంచు నులికి యళుకుఁ
గవగొని కొదమజక్కవ లేగుచో ముద్దుఁ ◆ బడఁతిగుబ్బ లటంటుఁ బట్టఁ దివురుఁ
దమి మీఱ నెమ్మి మొత్తము లాడుచో దంతి ◆ గమనవేనలి యంచు భ్రమసి చూచుఁ
జెలరేఁగి గండుఁగోయిలపిండు గూయుచో ◆ నబలయెలుం గని యాలకించు
తే. నంచబోదలు మొగి నడతెంచుచోటఁ ◆ జంచలేక్షణనెన్నడ లంచు నెంచుఁ
బంచశరఘోరసాయకాకుంచితాతి ◆ చంచలాత్మీయహృదయుఁ డై జనవిభుండు. || 69 ||

తే. అట్లు వనవీథిఁ దిరుగుచు నంతకంత ◆ కగ్గలం బగుమారార్తి నడలి బడలి
మృగవిలోచన నరయుచు మృగఖగాగ ◆ మాదికంబుల ని ట్లని యడుగఁ దొడఁగె. || 70 ||

సీ. అలులార చెంచుతొయ్యలులార జక్కవ ◆ చెలులార చూడరె జలజముఖిని
దరులార చిలుకబిత్తరులార కుసుమమం ◆ జరులార చూడరె సరసమతిని
గవులార కరటిపుంగవులార యచలసా ◆ నువులార చూడరె యువతిమణిని
వనులార చిలువజవ్వనులార మత్తకే ◆ కినులార చూడరె వినయవతిని
తే. బికములార మృగేంద్రశాబకములార ◆ కొంచలార కొలంకురాయంచలార
జింకలార జగాగొరవంకలార ◆ చూడరే నేఁడు చేడె నీజాడలందు. || 71 ||

వ. అని మఱియును. || 72 ||

క. మద మారఁగ ముద మారఁగఁ ◆ బద మానఁగనీక పెల్లుపడి మొరసెదు ష
ట్పదమా పదమా ఘనవన ◆ పదమార్గమునం బయోజపదమాటునకున్. || 73 ||

క. అలుకా మదిఁ బూనెదు చెలి ◆ కలుకా మామీఁద నిట్టు లఱ చేసి యహో
చిలుకా బలుకానల గా ◆ సిలు కారణ మేమి ముద్దుచిలుకం జెపుమా. || 74 ||

క. పికమా యభినవమణిదీ ◆ పికమాడ్కి వెలుంగునిందుబింబానన యో
పిక మాలి యెందుఁ గుందెనొ ◆ చికమకలం బెట్ట కిపుడు చెపుమా మాకున్. ‖ 75 ‖

క. కోరిక లీరిక లెత్తఁగఁ ◆ జేరిక నూరకయె వలచి శివశివ యిపు డా
నారి కడుఁ గేరి కదలెన్ ◆ శారిక నీ వాపెతెఱఁగు సరగునఁ జెపుమా. ‖ 76 ‖

క. హారీతపికమయూరీ ◆ శారీతతులార వలపు సడలదు మీ రిం
దేరీతి నుండేనో మా ◆ నారీతిలకంబుఁ జూచినారే చెపుఁడా. ‖ 77 ‖

క. జీవము మా కిపు డారా ◆ జీవముఖీమణియె బంధుజీవమ జీవం
జీవమ భయవిచలితరా ◆ జీవమ దైవమ యెఱుంగఁ జెప్పఁగ నేలా. ‖ 78 ‖

క. సారంగమ రంగన్మద ◆ సారంగమ భూరిగంధసారంగమ హా
సారసమా నవనికసిత ◆ సారసమా చూపఁ గదరె సారసమాక్షిన్. ‖ 79 ‖

క. పలుమాఱు విన్న వించినఁ ◆ జెలిమార్గ మొకించు కయినఁ జెప్పవు నీకుం
జలమా తలమా గొబ్బునఁ ◆ గలమాట వచించు మందగంధానిలమా. ‖ 80 ‖

ఉ. సాలములార చంపకరసాలములార కదంబనింబహిం
తాలములార తూలపురతాలములాక తమాలమాలతీ
జాలములార మీ రిపుడు జాలము సేయక యాదరించి చూ
బాలకురంగులోచన నభంగురలీలఁ గనంగఁ జేయరే. ‖ 81 ‖

క. ఈడా నీఫలములతో ◆ నీ డగువలిగుబ్బ లలరునిభగామిని దా
నీడక యీడకు వచ్చెను ◆ వేడుక దనరార మాకు వేగమె చెపుమా. ‖ 82 ‖

క. మాకందమ శృంగారర ◆ మాకందము వేగఁ జూపు మాకందమహా
మాకంద మలరగ నవసుష ◆ మాకందలితాంబురుహదళాయతనేత్రన్. ‖ 83 ‖

సీ. అన్నులతలమిన్నఁ గన్నారఁ జూపరె ◆ పొన్నలార వెడందజిన్నలార
రతనంపుగని యిందు రాదు గదా గుజ్జు ◆ మావులార కడిందిమోవులార
చిలుకలకొల్కి మీచెంత నీఁగదు గదా ◆ మల్లులార తమాలవల్లులార
సొగసులదొంతి నిం దగపడఁ జేయరే ◆ ప్రబ్బలార సురంగుదబ్బలార
తే. కలికి తొలుకటి క్రొమ్మించుకరణి మించు ◆ మురువు రాణించు నదియించు ముద్దుగుమ్మ
రాదు గద యిందు వలపుఁగప్రంపుటనఁటి ◆ మోకలాక చొకారంపుదాఁకలార. ‖ 84 ‖

క. అని యనివారిత మగువల ◆ పునఁ బునరవిజృంభమాణపుండ్రేక్షుశరా
సనబాధాపరవశుఁ డై ◆ వనిఁ ద్రిమ్మరుచుండె నంత వనితామణియున్. ‖ 85 ‖

క. జనవరునకుఁ దనపైఁ గల ◆ ఘనతరమోహాంధకారగౌరవముఁ గనుం
గొని మదిఁ గరఁగి తటాలున ◆ ననపొదరి ల్వెడలి దాపునం గనుపట్టెన్. ‖ 86 ‖

క. కనుపట్టిన రమణిం బొడ ◆ గని పోయినసొమ్ము మరలఁ గనుపడ్డతెఱం
గునఁ బొంగి నేలతేఁ డా ◆ ననఁబోడులమిన్నఁ జూచి నగుచుం బలికెన్. ‖ 87 ‖

క. ఒప్పులకుప్పరొ నీపై ◆ నెప్పుడు మది నిలిపి యుండి యిట నావలనం
ద ప్పేమి గలిగె నూరక ◆ చెప్పక రాఁ దగునె యులికి చిలుకలకొలికీ. ‖ 88 ‖

సీ. చాన నీకెమ్మోవిపానకం బానక ◆ తెర లెడుబలుదూప దీఱిపోదు
బాల నీబాహుమృణాలము ల్చేర్పక ◆ యతనుతాపవికార మాఱ చనదు
భామ నీకుచదుర్గసీమ వసింపక ◆ ఘోరమారబలార్తి గ్రుంగఁ బడదు
చెలి నీకృపారసోజ్జ్వలవృష్టి పర్వక ◆ సమధికకామసస్యము ఫలింప

తే. దహహ యిఁక నైనఁ దహతహ నడలనీక ◆ నీకవుంగిట న న్నహర్నిశము నునిచి
ప్రేమ దైవార వేనుఱఁ గాముకేలి ◆ నోలలాడించి యేలుము నీలవేణి. ‖ 89 ‖

సీ. అలికులవేణి శరాసనభ్రూవల్లి ◆ మలయజాతోమోద పులినజఘన
లికుచవక్షోజ నాళీకపత్రేక్షణ ◆ కోకిలకలవాణి కుందరదన
రాకేందువదన శరశ్చంద్రికాహాస ◆ గజరాజగామిని కంబుకంఠి
పల్లవపాణి శంపాలతావిగ్రహ ◆ బిసబాహువల్లరి విద్రుమోష్ఠి
తే. భుజగరోమాళి నవతిలపుష్పనాస ◆ తారకోదారనఖర రంభోరుకాండ
పంచముఖమధ్య మృదులదర్పణకపోల ◆ గురుకృపాలీల నను నేలుకొనవె బాల. ‖ 90 ‖

వ. అని యనంగశరాసారధారాపూరపూరితశరీరుం డగుచుం దఱిసి గాఢపరీరంభచుంబ
నాదిసంభోగలీలావిహారంబుల నన్నితంబినీమణిం గూడి క్రీడించి యయ్యింతియుం
దానును గ్రమ్మఱ నిజపటకుటీరాంతరంబు చేరి యిష్టోపభోగంబులం దనియుచుండె
నంత. ‖ 91 ‖

క. కంతునిభమూర్తి యగుభూ ◆ కాంతాగ్రేసరునితోడఁ గలసి ప్రహర్ష
స్వాంత యయి యుండుచో న ◆ క్కాంతాజనరత్నమునకు గర్భం బయ్యెన్. ‖ 92 ‖

క. చిట్టుములు నోకిలింతలు ◆ నిట్టూర్పులు దళముకొనియె నెమ్మదిఁ గోర్కుల్
బి ట్టొదవె గుట్టుపట్టుకు ◆ మ ట్టగుజఘనంబు ప్రబలె మహిళామణికిన్. ‖ 93 ‖

క. మేలిననచెండ్లతో నెన ◆ పోలుపఁ దగుచిగురుటాకుఁబోఁడి మెఱుంగుం
బాలిండ్లు చూడఁ జూడఁగఁ ◆ దాళఫలోపమము లగుచుఁ దద్దయు బలిసెన్. ‖ 94 ‖

తే. నేలచేడియ యవ్వేల్పువాలుఁగంటి ◆ యుదరమునఁ బుట్ట నూహించి ముదముతో బ్ర
వేశ మొందుచు నున్నదో వెస ననంగఁ ◆ బొలఁతుకకు మంటిచొరవ మిక్కిలియుఁ బొసఁగె. ‖ 95 ‖

క. ఘనజఘనస్తనమధ్యం ◆ బున నడుఁకెడుతరుణినడుము భూపతి చేప
ట్టినకతన నబ్బురపుఠీ ◆ వినిబెంపు వహించి విఱ్ఱవీఁగుచు నుండెన్. ‖ 96 ‖

తే. చిలుకతేజీవజీరుచేఁ జెలఁగుమేలి ◆ జాళువాబొంగరములపైఁ గ్రాలుచున్న
వలుదవేలుపురాచరాములుకు లనఁగ ◆ నెలఁతుకలమిన్నచనుమొనల్ నలుపు మీఱె. ‖ 97 ‖

క. చిగురాకు దొండపండును ◆ బగడంబును దమ్మికెంపు బంధూకము నీ
డగు ననఁ దగునుమవాతెఱ మిగులం దెలుపారె నపుడు మీనేక్షణకున్. ‖ 98 ‖

తే. అలఁతిచీమలచాలుతో దుల యొనర్ప ◆ వఱలునాళీకపత్రాక్షి మెఱుఁగుటారు
బాలనీలభుజంగంబుఁ బోలి యపుడు ◆ గాటమై పూఁటపూఁటకుఁ గారుకొనియె. ‖ 99 ‖

ఆ. పొన్నపువ్వుదీటు పోల్చులోకులమాట ◆ నోటు చేసి వేల్పుబోటినాభి
విస్తరిల్లె నపుడు వెడఁదబావిని బోల్చు ◆ నేర్పుకాండ్రమాట నేటు చేసి. ‖ 100 ‖

సీ. తళుకులేఁజెక్కుటద్దములు వెల్వెలఁ బాఱె ◆ నిద్దంపునెమ్మేను తద్ద డస్సె
నడు కొకయామ డై నడలు దొట్రిలఁజొచ్చెఁ ◆ దృణము మేరునగంబుతెఱఁగు దోఁచెఁ
దట్టంపుటొఱపుము త్తరులస్రుక్కులు దేఱెఁ ◆ దరిలేనియలఁతి నిద్దురలు మీఱె
బలుముత్తియంపుఁజేరులు చాల వ్రేఁ గయ్యెఁ; దొడవు లొక్కొకకొన్ని సడలి జాఱె
తే. జడత వాటిల్లె బడలిక సంఘటిల్లె ◆ వన్నె గొద యయ్యె నెలుఁ గింత సన్నగిల్లె
నిన్నుద్రిమ్మరిరాముద్దుటన్నుమిన్న ◆ కెన్న నాపన్నసత్త్వ యై యున్నకతన. ‖ 101 ‖

వ. అట్లు గర్భంబు దాల్చి యద్దివిషద్వధూరత్నం బొకశుభముహూర్తంబున జగజ్జనాభి
వంద్య యగుబాలారత్నం బుదయించినం గాంచి దానిం దదంతికగృహాంతరంబున
నునిచి యి ట్లనియె. ‖ 102 ‖

క. బాలా యిగ్గృహలోనికి ◆ హేలామార్గమున నెవ్వఁ డేతెంచు నిజం
బాలలితోదారుఁడు త ◆ త్కాలంబున నీకు మగఁడు గాఁగలఁడు సుమీ. ॥ 103 ॥

క. అని తెలిపి సురవధూమణి ◆ మనుజేంద్రుని జూచి నీవు మసలక పురికిం
జను మింక నిజనివాసం ◆ బున కరిగెద నేను నృపతిపుంగవ నెమ్మిన్. ॥ 104 ॥

చ. అనవుడు గుండె ఝల్లు మన నల్లన సోలి కడిందిజాలిలోఁ
బెనఁగొన వెచ్చ నూర్చుచును బెగ్గిలుచుం గడునుమ్మలించుచుం
గనుఁగవ నశ్రుబిందువులు గ్రమ్మఁగ గద్గదకంఠుఁ డై రయం
బునఁ జెలి చెట్ట పట్టుకొని భూపకులాగ్రణి పల్కెఁ గూరిమిన్. ॥ 105 ॥

ఉ. అక్కట మిక్కుటంపువల పారఁ దవుల్కొని నెమ్మనంబునం
జక్కెరబొమ్మ నీచెలిమి శాశ్వత మంచుఁ దలంచుచుంటకున్
మక్కువ వీడ నాడి నను మారునిబారికి నప్పగించి నీ
వెక్కడి కేగఁ జూచె దిపుడే నినుఁ బోవ నిడంగ నేర్తునే. ॥ 106 ॥

ఉ. అంగము లొక్కటై పొదువ నల్లికబిల్లిక లై కరంబు ను
ప్పొంగుచుఁ బెక్కునాఁడు లోకపూఁటయె కాఁగ మెలంగుచుంటి మి
బ్బంగిఁ గృపావిహీనమతిఁ బల్కె దయో నెన రింత లేక మే
ల్బంగరుబొమ్మ యింక నినుఁ బాసి క్షణంబును నిల్వ నేర్తునే. ॥ 107 ॥

చ. అలుక యొకింత యెట్టితఱి నైన నెఱుంగక నిచ్చనిచ్చలుం
దలఁగనిక్రొత్తకూరుములు దార్కొన నంగజసౌఖ్యలీలలన్
మెలఁగుచునుంటి మిర్వురము నెమ్మి దలిర్పఁగ నేఁటిదాఁక నో
యలికులవేణి నన్ను విడనాడి చనంగఁ బదంబు లాడునే. ॥ 108 ॥

సీ. కొమ్మ నీయధరామృతమ్ముఁ గ్రోలుటఁ జేసి ◆ యాహారవాంఛ యింతైన లేక
చామ నీకుచదుర్గసీమ నుండుటఁ జేసి ◆ స్మరబలభీతి లేశమును గనక
సుదతి నీసంభోగసుఖము గల్గుటఁ జేసి ◆ బహుతరరాజ్యవైభవము వదలి
కలికి నీతనుకాంతికనక మబ్బుటఁ జేసి ◆ ధనసంగ్రహేచ్ఛ కొంతయు నెఱుఁగక
తే. ప్రతిదినంబును నీపొందు సతత మటంచు ◆ నమ్మి యితరానుభవవిధానమ్ము లెల్ల
విడిచి యుండుట కహహ న న్వీడనాడి ◆ చనఁ దలంచుట నాయంబె చంద్రవదన. ॥ 109 ॥

క. కరు లేటికి గడితపుబం ◆ గరు లేటికి మఱియు మేల్నగరు లేటికి రా
సిరు లేటికి బలురతనపు ◆ సరు లేటికి నిన్ను విడిచి చనునెడఁ దరుణీ. ॥ 110 ॥

ఉ. తామరసాక్షి నమ్ము మిదె దైవము సాక్షిగ నీకుఁ జెప్పెదం
బ్రేమ దలిర్ప ని న్గలసి పెక్కుదినంబులనుండియున్ సము
ద్దామమనోజరాజ్యపరతంత్రత నుండితి నీవు లేనిచో
భూములు గీములు న్ఘనవిభూతులు నీతులు నాకు నేటికిన్. ॥ 111 ॥

చ. తగిలినప్రేమ మాట జవదాఁటక యెన్నఁడుఁ బాయ మంచు నొ
ప్పుగఁ గవగూడి యెందు నఱ పూనక యుంటిమి యిప్పు డెంతయున్
వెగటుగ నాడి గుండియలు వ్రీలఁగఁ జేసెదు హా జగంబునన్
మగువల నమ్మరా దనెడుమాట నిజంబుగఁ దోఁచెఁ బో చెలీ. ॥ 112 ॥

చ. ఇచ్చట నీకు నుండుట కొకించుక ముచ్చట లేక యుండినన్
మచ్చికతోడ నీక్షణమె మాపురికిం జనుదెమ్ము కాక యా
పచ్చనివింటిబల్తులువబారికి నగ్గము చేసి పోక నన్
జెచ్చెర నీదుటెంకి కఱ సేయక తోడ్కొనిపొమ్ము వచ్చెదన్. ॥ 113 ॥

క. మానిని నిను నాపట్టపు ◆ జానిగ నొనరించి సకలసామ్రాజ్యంబున్
మానుగ నీ కిడి కొలిచెద ◆ నానాజనసహితముగ ననారతభక్తిన్. ॥ 114 ॥

ఆ. అనినఁ గలికి పలికె నవనీశ నీకింత ◆ చింత యేల కడిదివంత యేల
సంతసమునఁ బురిఁ జని నెమ్మి దైవార ◆ నఖిలరాజ్యసుఖము లనుభవింపు. ‖ 115 ‖

తే. నరపతివి నీవు నేను గంధర్వసతిని ◆ దైవవశమున మనకు నిద్దఱికిఁ జెలిమి
యొదవెఁ గొన్నేఁడు లింక నిం దుండరాదు ◆ పోయి వచ్చెద సెలవిమ్ము భూపతిలక ‖ 116 ‖

తే. అనుచు నిటు లూరడించి యయ్యధిపుచేత ◆ నాజ్ఞ గొని యింతి పఱతెంచె నాకమునకు
దళము కొలువంగఁ బసిఁడియందలము నెక్కి ◆ జనకరుండును నిజపురంబునకుఁ జనియె. ‖ 117 ‖

క. అంతట వనదేవత ల ◆ త్యంతామోదమునఁ బనుప నసదృశతేజః
కాంతివిలాసంబుల గుహ ◆ నెంతయుఁ గుశలమున బాల యెదుగుచునుండెన్. ‖ 118 ‖

సీ. కురులు బొమ్మలమీఁదఁ గులికి పెంపెసలాడె ◆ నెదఁ జిన్నిచన్నులు గదురు లెత్తెఁ
దావిమోవికిఁ గ్రొత్తతలిరుడాలు ఘటిల్లె ◆ నూనూఁగునూఁగారు గాన నయ్యెఁ
గనుదోయి నఱసిగ్గు కలికి చూపులు మీఱె ◆ వలిచెక్కుఁగవకుఁ గ్రొందళుకు లొదవె
జిలిబిలిముద్దుపల్కులసొల పలరారె ◆ మొగమునఁ జిన్నారినగవు లెసఁగె
తే. నడలఁ గడ లేనిమురిపెంబు గడలుకొనియెఁ ◆ గటియు జఘనంబు నొక్కింత ఘనతఁ జెందె
నాఁడునాఁటికి రాచపూఁబోఁడికొఱపు ◆ మించులేజవ్వనం బంకురించుటయును. ‖ 119 ‖

క. మఱియుఁ గుచంబులు గటియును ◆ నెఱియు న్విస్తరిలె నాభి నిమ్నతఁ జెందెన్
మెఱుఁగారునారు గార్కొనె ◆ నెఱజవ్వన మిందుముఖికి నిండారుటయున్. ‖ 120 ‖

వ. ఆసమయంబున. ‖ 121 ‖

చ. అలులుఁ బికంబులు న్శుకము లంచలు శారికలు న్నెమళ్లు వి
చ్చలవిడిఁ బొంగి చెంగటఁ బొసంగ హళాహళి సేయుచున్న ను
గ్మలి యొకయింతమన్మథవికారము నెమ్మది నంకురించినం
దలఁకక తల్లి చెప్పినవ ధంబుఁ దలంచి వినిశ్చలాత్మ యై. ‖ 122 ‖

చ. గడితపునారచీరఁ గటిఁ గట్టి పటుస్ఫటికాక్షమాలికల్
మెడఁ గడు నించి దట్టముగ మేన విభూతి యలంది పెన్నెరుల్
జడలుగఁ దాల్చి డెందమునఁ జాల దిటం బగుభక్తిఁ బూని య
ప్పడఁతుక యబ్బురంబుగఁ దపం బొనరింపఁ దొడంగె నెంతయున్. ‖ 123 ‖

క. అనిశము జలదళపవనా ◆ శనవృత్తి న్మనుచు దివిజసంఘము వొగడం
దనకక బహుకల్పము లా ◆ ననఁబోఁడులమిన్న తప మొనర్చుచు నుండెన్. ‖ 124 ‖

తే. అని పితామహుఁ డెఱిఁగింప నమరమౌని ◆ యంతట బుతుధ్వజక్ష్మాకాంతపుత్త్రి
చంద మే మయ్యె నెఱిఁగింపు సరవి ననిన ◆ నయ్యజుం డాతనికి నిట్టు లానతిచ్చె. ‖ 125 ‖

క. విను మునిజనపంచానన ◆ మును గౌతముఁ డనఁగ విప్రముఖ్యుఁ డొకఁడు భూ
జనునుత నిష్ఠాపరుఁ డై ◆ యనుపమవిద్యానిరూఢి నలరుచు నుండెన్. ‖ 126 ‖

క. భూసురతతిలో వన్నెయు ◆ వాసియు దీపింప నెలమి వర్తిలునెడలన్
నాసాహీనుం డొకసుతుఁ ◆ డాసంయమి కుద్భవించె నద్భుతసరణిన్.

సీ. అత్తెఱంగున వికృతాకారుఁ డై ప్రభ ◆ వించినసుతు నిరీక్షించి తల్లి
దండ్రు లత్యంతచింతావ్యాకులస్వాంతు ◆ లై యంత జాతకర్మాదివిధు లొ
నర్చి గౌతముఁ డనునామధేయం బిడి ◆ యైదవయేఁట నయ్యర్భకునకుఁ
బ్రియమార్గమున నుపనయనంబు గావించి ◆ యాదరంబున నుపాధ్యాయునొద్దఁ ‖ 127 ‖

తే. జదువఁ బెట్టిన నిబిడ లజ్జాభరంబు ◆ పేర్మి నొకయక్షరంబును బ్రేమతోడఁ
జదువుకొనఁ డయ్యె శిష్యులఁ గదిసి విహిత ◆ మగుసహాధ్యాయితయుఁ గాంచఁ డయ్యె నతఁడు. ‖ 128 ‖

క. గాయత్ర్యభ్యసనంబును ◆ వాయుసఖోపాసనంబు వదలక యెపుడుం
జేయుచు నుండె ద్విజోత్తముఁ ◆ డాయుర్వర్ధన మొసంగె నతనికి మిగులన్. ‖ 129 ‖

తే. అగ్నికార్యంబువలన గాయత్రివలన ◆ బ్రాహ్మణుం డనునామమంత్రంబుఁ బెరసెఁ
గాని విద్యావధూపరిగ్రహము లబ్బ ◆ వయ్యె నమ్మేదినీనిర్జరాన్వయునకు. ‖ 130 ‖

వ. అ ట్లగుటంజేసి మహావైరాగ్యం బూని యతండు. ‖ 131 ‖

సీ. కాశీగయాప్రయాగములఁ గేదారంబు ◆ బదరికాశ్రమము చంపకవనంబు
నైమిశారణ్యంబు నారాయణాశ్రమం ◆ బరుణాచలము వేంకటాచలంబు
శ్రీపర్వతము కురుక్షేత్ర మవంతిక ◆ కాంచి ద్వారావతి కాళహస్తి
మధుర శ్రీకూర్మంబు మాయ యయోధ్య య ◆ హోబలంబును బురుషోత్తమంబు
తే. మొదలు గల్గుమహాక్షేత్రములకు సారె ◆ వచ్చుచును బోవుచును బెక్కువత్సరములు
గడపి యంతట నొకనాఁడు కౌతుకం బె ◆ సంగఁ బఱతెంచె నీహారశైలమునకు. ‖ 132 ‖

వ. అట్లు పఱతెంచి యమహామహీధరాగ్రభాగంబునం గొంతదడవు విహరించి యంత
నచ్చట నొక్కగుహఁ గనుంగొని. ‖ 133 ‖

క. అగ్గుహలోపలి కెంతయు ◆ దిగ్గన సొత్తెంచి యందు దృఢమానసుఁ డై
యగ్గలపుభక్తితో స ◆ మ్యగ్గతిఁ దప మాచరింప నాత్మఁ దలంచెన్. ‖ 134 ‖

తే. తలఁచి వర్తించుచో నొక్కదండ నొంటిఁ ◆ దపముఁ గావించుచున్న వృద్ధప్రసూన
గంధి నత్యంతశిథిలవిగ్రహఁ బ్రపూత ◆ బ్రహ్మచారిణిఁ జూచె నబ్రంబు దోఁప. ‖ 135 ‖

తే. చూచి యేచినవేడ్క నజ్జోటిదరికిఁ ◆ జేరి చేరికతో నమస్కృతి యొనర్చు
టయు నివారించి యాపద్మనయన యతని ◆ నంచితాపాంగదృష్టి నీక్షించి పలికె. ‖ 136 ‖

క. ధరణీసురవర నాకున్ ◆ వరుఁడవు గాఁగలవు నీవు వంచించుచు ని
క్కరణిన్ మ్రొక్కఁగఁ దగ దనఁ ◆ గరములు ముకుళించి మౌని కామిని కనియెన్. ‖ 137 ‖

తే. పెద్దదానవు తపమునఁ దద్ద నిలిచి ◆ యున్నదానవు గుణముల మిన్న నీవు
తలిరుఁబ్రాయంబు నల్పవిద్యయును గలుగు ◆ నేను నీ కెట్లు వరుఁడఁ గా నేర్తుఁ దరుణి. ‖ 138 ‖

సీ. అనిన నమ్మానిని యమ్మౌనివరునితో ◆ మును బుతుధ్వజమహాజనవిభుండు
వల నొప్ప వేఁటకు వచ్చుటయును నితాం ◆ తామోదలీల సుశ్యామ యనెడు
గంధర్వకన్యకఁ గాంచుటయును దాని ◆ గాఢతరప్రేమఁ గలయుటయును
వారి కిర్వురకుఁ దా నారూఢిఁ బ్రభవించుటయుఁ దల్లి తనుఁ గడుఁబ్రియముతోడ
తే. నగ్గుహాగేహమున నుంచి యబల యిచటి ◆ కెవ్వఁ డేతెంచు నతఁడు నీ కెనయ మగఁడు
గాఁగలఁ డటంచుఁ బలికి నాకమున కెలమి ◆ నేగుటయుఁ దెల్పి వెండియు నిట్టు లనియె. ‖ 139 ‖

తే. మునివరేణ్య బుతుధ్వజమనుజపతికిఁ ◆ ద్రిదశకాంతకుఁ బుట్టినాఁ డొదలు గాఁగ
నురుతపోనిష్ఠ నిచటనే యున్నదాన ◆ నిచటి కెవ్వండు నెపుడు రాఁ డీవు దక్క. ‖ 140 ‖

తే. వినుము మాతండ్రి యెనుబదివేలయేండ్లు ◆ ధరణిఁ బాలించి యిచటనె తప మొనర్చి
నాకమున కేగె నవ్విభునందనుండు ◆ నట్ల చనెఁ బదివేలేఁడు లవని యేలి. ‖ 141 ‖

తే. నాఁటనుండియుఁ దరల కిచ్చోట నున్న ◆ దాన నన్యుల కొనఁగినదానఁ గాను
దల్లిదండ్రులు లేనిస్వతంత్రురాల ◆ రాజకన్యను వ్రతనిష్ఠఁ బ్రబలుదాన. ‖ 142 ‖

వ. కావునఁ బురుషార్థిని నగునన్నుం బరిగ్రహింపు మనిన నాగౌతముఁ డి ట్లనియె. ‖ 143 ‖

తే. వనజముఖి నేను వేయేండ్లవాఁడ నీవు ◆ బహుసహస్రాబ్దములదాన వహహ వృద్ధ
వైననీకును బాలుఁడ నైననాకు ◆ ఘటన యిం కెవ్విధమునఁ గాఁ గలదు చెపుమ. || 144 ||

ఆ. అనిన నబల వలికె ననఘు ము న్నా కీవు ◆ భర్త వై సృజింపఁ బడితి వజుని
చేత నింక నొరుని ◆ జేకొన నొల్ల న ◆ ట్లగుట నన్నుఁ దెగడఁ దగదు నీకు. || 145 ||

తే. తాపసోత్తంస న న్ననాదరణ చేసి ◆ విడువఁ జూచెద వేని భావించి నీవు
గనుఁగొనుచునుండ నిపుడె నిక్కముగఁ దనువు ◆ విడుచుదాన నటన్న లో నడలి యతఁడు. || 146 ||

క. నాసాహీనుఁడ విద్యా ◆ భ్యాసం బెన్నడు నెఱుంగ నంభోజముఖీ
యేసరణి నీమనోరథ ◆ మే సమకూర్పంగ నేర్తు హిత వారంగన్. || 147 ||

తే. మును సురూపంబు సద్విద్యయును దొరకినఁ ◆ బిదప నీవచనంబు చేసెద నటన్న
నలరి నెయ్యంబు దైవార నతనిఁ జూచి ◆ వృద్ధకామిని వెండియు నిట్టు లనియె. || 148 ||

క. తపమున నాచే వాక్సతి ◆ యపరిమితామోద యయ్యె ననలుఁడు నటులే
కృపఁ జూచువాఁడు వానికి ◆ నిపు డతివిద్యయు సురూప మిడియెదరు సుమీ. || 149 ||

క. అని పలికి యవ్వధూటీ ◆ జనరత్నం బపుడు భక్తి చాతురి మెఱయన్
వనజాతభవునికూరిమి ◆ ననఁబోఁడి న్వేఁడఁ దొడఁగె నమ్రతతోడన్. || 150 ||

సీ. జయ చతుర్ముఖవక్త్రసౌధవిహారిణి ◆ జయ సితాంభోరుహాసననిషణ్ణ
జయ మత్తకాదంబసైంధవగామిని ◆ జయ కుందమందారసదృశవర్ణ
జయ దివ్యరత్నభూషణవిరాజద్గాత్రి జయ యామినీకరశకలమౌళి
జయ సమస్తామ్నాయసారసంవేదిని ◆ జయ మౌనిహృదయకాసారహంసి
తే. జయ పురందరముఖసుధాశనవితాన ◆ భర్మకోటీరవిలసితపద్మరాగ
మణిమయూఖావళీరాజమానసూత్న ◆ చరణపద్మద్వయాడంబ శారదాంబ. || 151 ||

సీ. శుకదండవల్లకీముకురపుస్తకపాణి ◆ లాలితనీలరోలంబవేణి
బహుళవిద్యాదానపాలితాంతర్వాణి ◆ రుచిరావలోకనప్రచలితైణి
కవిజనస్తుతిపాత్రకలితగుణశ్రేణి ◆ మత్తవనప్రియమంజువాణి
కటిభాగనిర్జితాఖండమహాక్షోణి ◆ బాహుదండాగ్రశుంభత్కృపాణి
తే. పరమకల్యాణి కమలసంభవునిరాణి ◆ పరమపదసౌధనిశ్రేణి పరిచితేంది
రాముఖాఖిలగీర్వాణి రాజమాన ◆ ఘనకృపాదృష్టి మముఁ బ్రోవఁ గదవె వాణి. || 152 ||

క. తల్లీ యమరీలోకమ ◆ తల్లీ మల్లీందుకుందదరసురభూరు
డ్వల్లీనిభశుభగాత్రి భ ◆ వల్లీలాలోకనంబు వడి నింపఁ గదే. || 153 ||

మ. చిరకారుణ్యమతీ మహాగుణవతీ శృంగారలీలారతీ
శరదబ్జాభశుభాకృతీ నయగతీ శశ్వత్ప్రభావోన్నతీ
సరసీజాతసముద్భవప్రియసతీ సాహిత్యవిద్యాధృతీ
నిరతాశేషజగన్నుతీ భగవతీ నిన్ మ్రొక్కెద న్భారతీ. || 154 ||

మ. తనరార న్భవదీయసత్కృపకుఁ బాత్రం బైనపాజ్ఞుం డిలన్
మనుజాధీశులచే ధనమ్ము గొని సామ్రాజ్యైకధౌరేయుఁ డై
యనవద్యస్థితి నొందుఁ బో "సుకవితా యద్యస్తి రాజ్యేన కి"
మ్మనువాచాకలనంబు నిక్కముగ నంబా కంబుకంఠీమణీ. || 155 ||

క. అలఘుతరభక్తి నీపద ◆ జలజాతము లాశ్రయింతుఁ జదువులజేజే
కలికీ పలుకుంజిలుకల ◆ కొలికీ నీకరుణ యిరవు కొలుపుము నాపై. || 156 ||

మ. అనవద్యాగమవేద్యు సద్రుచిరకల్యాణప్రదు న్దేవతా
జనచూడామణి నబ్జజాచ్యుతమహేశానస్వరూపున్ ద్విజా
వననైపుణ్యనిధిం గృశాను ననలు న్వహ్ని న్హుతాశి న్శిఖిన్
నిను సేవించెద నెప్పుడు న్ననుఁ గృప న్వీక్షింపు వైశ్వానరా. || 157 ||

వ. అని యనేకప్రకారంబుల వాగ్దేవిం బ్రార్థించి వైశ్వానరుం బ్రసన్నుం జేసికొని య
మ్మునిపతి నతితరవిద్యారూపసంపన్నుం గావించిన నతం డత్యంతసంప్రీతచేతస్కుం
డై యప్పుండరీకనయనం గూడుకొని మనోజక్రీడావినోదంబులం బ్రమోదించుచుం
డె నంత. || 158 ||

తే. ప్రతిదినంబును బ్రోవు లై శతసహస్ర ◆ సంఖ్యలకు మాఱి యతిథు లాదంపతులను
గాంచువేడుకతోఁ బఱతెంచుచుండి ◆ రట్లు చేసినవారల నాదరించి. || 159 ||

వ. భయభక్తిసంభ్రమంబులు వెలయ సత్కారంబు లొనరించి వీడ్కొలుపుచుండి రం
దు బాలోన్మత్తయువజనంబులు కొందఱు వారిం గని నగి గేలి యొనర్చుచుండిరి మ
ఱియుం గొంద ఱావృద్ధాంగనం గనుంగొని. || 160 ||

క. పడఁతిరొ నిజముగ నీతఁడు ◆ కొడుకో మనుమండొ నీకుఁ గొంచింపక యే
ర్పడఁ దెలుపుము మా కనుచుం ◆ గడు నగి రొకకొంద ఱుత్సుకత మీఱంగన్. || 161 ||

ఆ. పల్వలోదకంబు బాలాతపము నిశా ◆ యామదధిసమన్వితాశనంబు
వృద్ధభామినియును బ్రేతధూమంబును ◆ బ్రతుకు దఱుఁగు నండ్రు ప్రాజ్ఞు లెల్ల. || 162 ||

క. వృద్ధునకు యువతి విష మగు ◆ వృద్ధసతికి యువజనుండు వెలయఁగ సుధ యౌ
సిద్ధ మని కొంద ఱపు డా ◆ వృద్ధాగౌతముల కెగ్గు లెన్నిరి పెలుచన్. || 163 ||

వ. అని పలుకుచుం గృతాతిథ్యు లై సమస్తమహర్షివరులును యథేచ్ఛాగతులం జనుచుం
డిరి తద్వచనంబు లాకర్ణించి యాదంపతు లత్యంతశోకవ్యాకులస్వాంతు లై యంత
నచ్చుటం దరలి చనుదెంచి. || 64 ||

ఉ. కారుమొసళ్లగుంపు తరగ ల్దివిఁ గ్రమ్మెడుపొంపుగండుమీల్
మీరి నటించుసొంపు రవళిం జలపక్షులు గేరుమంపు లోఁ
దారుఘులీకులీరఫణిదర్దురకోటులపెంపు దద్ద దై
వారఁ జెలంగి పొంగెడునపారనిధిఁ గన్గొని రవ్వధూవరుల్. || 165 ||

సీ. వృద్ధాంగనకు యువప్రియుఁ డబ్బెఁ బో యని ◆ నగియెడులీల ఫేనములు గ్రాల
నజుచెయ్వి లిట్లె పో యని తద్ద ఘూర్ణిల్లు ◆ జాడల నిబిడఘోషములు మీఱ
మునిదంపతులఁ గరంబులు చాఁచి డాయంగఁ ◆ బిలుచుచందమున వీచులు దనర్పఁ
దగువారి కర్ఘ్యపాద్యము లిచ్చువడువున ◆ శీకరాసారము ల్చిందుచుండ
తే. వినయగతి వారలకు నెమ్మి విశ్రమింపఁ ◆ బీఠము ల్పెట్టుచాడ్పునఁ బృథులసైక
తములు రాణింప సొంపునఁ దనరుచున్న ◆ యప్పయోరాశిఁ దఱిసి రయ్యలఘుమతులు. || 166 ||

సీ. ఘనులఁ బ్రపూర్ణజీవనులఁ జేయువదాన్యుఁ ◆ డవిగతామితబాడబాశ్రయుండు
తవిలి మర్యాద దాఁట కుండుఘనుండు ◆ బహుతరవాహినీపరివృతుండు
ధీవరకోటి కధిన మౌధన్యుండు ◆ సదమలగాంభీర్యసంయుతుండు
సరసపురోహితసమితి కాకరసీమ ◆ భువనాంతరవ్యాప్తభూరికీర్తి
తే. యహిమకరధాముఁ డసదృశోదగ్రరత్న ◆ కంకణమహోర్మికోద్భాసికనిహితుండు
నగురసాధీశుఁ డెంతయు నబ్బురంపు ◆ సంతస మొనర్చె నప్పు డాదంపతులకు. || 167 ||

వ. అట్లు సముద్రదర్శనం బొనర్చి యుప్పొంగుచు. || 168 ||

మ. “దళితాశేషమహాంహసే ఘనపయోధామ్నే సముద్రాయ శై
వలినీమండలనాయకాయ వరుణావాసాయ పద్మాలయా

లలనేశశ్వశురాయ పుణ్యనిధయే లావణ్యపూర్ణాయ ని
స్తులగాంభీర్యయుతాయ తే నమ" యటంచు న్మొక్కి మోదంబునన్. || 169 ||

తే. అవ్వధూవరు లందుఁ గృతావగాహు ◆ లై రయంబునఁ జని యగస్త్యాశ్రమంబు
చేరి యమ్ముని నాన దర్శించినపుడు ◆ గౌతముం డాయనకు మ్రొక్కి కడఁకఁ బలికె. || 170 ||

తే. మునికులోత్తమ భువి భుక్తి ముక్తిదంబు ◆ నఖిలవాంఛాప్రదంబు నైనట్టి పుణ్య
తీర్థ మెయ్యెది నాడెంపు ◆ దేశ మెద్ది ◆ తేటతెల్లంబుగా మాకుఁ దెలుపవలయు. || 171 ||

క. అని ప్రార్థించిన గౌతముఁ ◆ గనుఁగొని నెయ్యంబుతో నగస్త్యుఁడు వలికెన్
మునివర గౌతమి యఖిలవృ ◆ జినములు దొలఁగించు నిష్టసిద్ధియుఁ జేయున్. || 172 ||

తే. ధరణి నెన్నికఁ గన్న తీర్థముల కెల్ల ◆ మిన్న యై గౌతమీగంగ వన్నె కెక్కు
నయ్యశేషాఘహారిణియందు మునుఁగు ◆ జనుల కిహపరసుఖములు సంఘటిల్లు. || 173 ||

క. కావున నీ విపు డచటికి ◆ వేవేగం జనుము వేడ్క వెలయఁగ నేను
న్నీవెంటనె వచ్చెద నని ◆ యావిమలాత్మకుఁడు తరలి యరుదెంచె వెసన్. || 174 ||

తే. గౌతముండును భార్యాసమేతుఁ డగుచు ◆ గౌతమికి నేగి యందలి గాఢనిష్ఠఁ
దప మొనర్చుచు నొకనాఁడు దవిలి యీశ్వ ◆ రాద్యుతుల నమ్మహానది నభినుతించె. || 175 ||

క. పురదానవమదహరణా ◆ హరిహయనుతిచరణ రాజతాచలశరణా
చిరుకరుణాభరణా కి ◆ న్నరపరివృఢశరణ నీకు నతి శశిభరణా. || 176 ||

సీ. రవిశశిశిఖినేత్ర భువనరక్షణసూత్ర ◆ పాలితమునిపుత్త్ర ప్రధనజైత్ర
విజితశాత్రవగోత్ర కుజనద్రుకరపత్ర ◆ భవలతోగ్రలవిత్ర ధవళగాత్ర
దివిజోపవనచైత్ర కవిజనస్తుతిపాత్ర ◆ ఘనతరవృషపత్ర ధనదమిత్ర
నిలయితసితగోత్ర నిభృతచక్షుశ్శ్రోత్ర ◆ పరమపవిత్ర బంధురచరిత్ర
తే. పంకరుహపత్రలోచనకంకపత్ర ◆ వ్యాజసంసారసాగరయానపాత్ర
వృజనసంఘాతకాననవీతిహోత్ర ◆ నినుఁ బొగడ నేర్తుమే భవానీకళత్ర. || 177 ||

వ. అని మహేశ్వరుం బ్రణుతించి. || 178 ||

దండకము. శ్రీమజ్జగన్నాథ లక్ష్మీమనోనాథ గాధేయకౌండిన్యశాండిల్యమాండవ్యవల్మీ
కజవ్యాసవాసిష్ఠగర్గాద్యశేషర్షిసంఘాతసంస్తూయమానస్థిరోదారచారిత్రదూరీకృతా
మిత్ర మిత్రేందువేధోమరుత్వజ్జలాధీశకీనాశదైత్యేశవాతార్థపేశానలాహీశముఖ్యాఖి
లామర్త్యకోటీ రవిస్ఫారతేజోవిరాజన్మహారత్నకాంతిచ్ఛటాజస్రనీరాజితోద్యత్ప
దాంభోజ భోజావనీజానిజానిర్మలస్వాంతనీరేరుహాంతర్విలీనప్రమత్తద్విరేఫా ఘనా
భా సరోజాతనాభా శరచ్చంద్రకాకుందబృందారకాహారమందాకినీహారనీహారహీ
రేందుకోటీరసాటీ వాక్కామినీకాశనీకాశకీర్తిప్రకాశా నిరీశా హరీ శార్ఙ్గపాణీ కృ
పాణీ కృపానీరధీ సారథీ ధీరగాండీవభృత్సారథీ భూరిధర్మైకనిష్ఠాగరిష్ఠామితోత్కృ
ష్టసృష్టిప్రజాభీష్టసంధాయకా విశ్వవిశ్వంభరానాయకా విశ్రుతానంతనీరేజగర్భాం
డభాండావలీ పూరితోద్యత్ప్రచండారివక్షఃకులాధ్యక్షదుగ్గర్వనిర్వాపణాఖర్వభీమ
ప్రభావాభిరామా జగద్గీతనామా పదాంగుష్ఠనిష్ఠ్యూతగంగాంతరంగాంబుధారాలవా
సేచనక్షాళితబ్రహ్మహత్యాముఖక్రూరపాపా ప్రశస్తానులాపా నిరస్తోపతాపా పర
బ్రహ్మరూపా సమిద్ధోరకోపా సుధాలాప నీలాపరంభసంభోగకేలీవిహారామితో
ల్లాసలీలాసమాలోలగోపాలలీలావతీబంధురోరోజకుంభద్వయాలిప్తకస్తూరికాసాంక
వామోదసంవాసితోదారదోరంతరాళా మహాభీమసంగ్రామసీమాకరాళా విపశ్చి
న్మనస్సారకాసారమాద్యన్మరాళా విరాడ్దివ్యఖేంఖోళ కాళిందికాతీరవానీరకుంజద్రు
మాగారమధ్యోల్లసత్పుష్పశయ్యాతలాబాధరాధావధూసంతతాస్తోకనాలీకనాలీకకే
ళీకళాకౌశలామోద దామోదరా పుండరీకాక్ష వైకుంఠ శౌరీ నరాక్రూరగాంగేయరు
క్మాంగదానేకపేంద్రాంబరీషాంజనేయప్రభృత్యంఘ్రిభక్తావనోపాయపారీణ నారా
యణా వాసుదేవా చిదానంద గోవింద బృందావనాంతర్విహారా నృసింహా హృషీ,

కేశ హేమాంబా దేవదేవా మహాదేవ నీదివ్యలీలావినోదప్రకారంబు లెన్నంగ నెవ్వారికిం దీరు ధీరాత్ము లై యాగమాంతార్థవిజ్ఞాను లై జ్ఞానవైరాగ్యసంపన్ను లై నిర్గుణత్వంబునం బోల్చుయోగు ల్పృథివ్యంబు తేజోనిలద్యోమయం బై చరస్థావ రంబైనసర్వప్రపంచంబు నీమూర్తిగా నాత్మ భావించిని న్గాంతు రష్టాపదం బొక్క టైయుండి నానాసరిస్కా గరూపంబులం బోల్చుపోల్కెర్ బరతుండ నొక్కండ టైయుండి నీ వెల్లరూపంబులం దాల్చి వర్తింతు వో సామి నీ కగ్ని వక్త్రంబు తా రాపథం బుత్తమాంగంబు దిక్కుల్ చెవుల్ భానుజైవాతృకుల్ నేత్రము ల్తోయ ధుల్ కుక్షి నాకంబు కంఠంబు వేదంబు లుక్తుల్ ధరిత్రీతలం బంఘ్రియుగ్మం బు గాయత్రి కీల్గంటు వైవస్వతుం డాత్మ యోగీశ్వరుల్ రోమము ల్గంధవా హుండు ప్రాణంబు బృందారకు ల్బాహువు ల్భారతీదేవి దా జిహ్వ యుం గా జగ ద్రూపి వై యేవుతోడం బ్రదీపింతు వౌ నీవ యంభోజగర్భాచ్యుతేశాకృతు ల్దా ల్చి శశ్వద్గతి న్విశ్వసృష్టిస్థితిధ్వంసనక్రీడల న్మీఱు దౌ వెండియు న్దుష్టసంహారశిష్టా వనార్థం బనేకాకృతు ల్పూని రాణింతు వాది న్విసారంబ వై యంబురాశిం బ్రవే శించి క్రూరాత్ముఁడౌ సోమకుం ద్రుంచి వేదంబు లన్వేధ కొప్పింపవా కూర్మరూ పంబుతో నేపునన్ మందరోర్వీధ్రముం బూని జేజేల నెల్ల న్సుధాహారసంతుష్టిఁ దే లింపవా సూకరాకారముం బూని యక్షీణశౌర్యప్రభాదక్షు హేమాక్షు శిక్షించి ధాత్రీతలం బెల్ల దంష్ట్రాగ్రభాగంబునం దాల్పవా మర్త్యపారీంద్రదేహుండ వై స్వ ర్ణదైతేయు నిర్జించి ప్రహ్లాదుఁ బాలింపవా వర్ణి వై తూర్ణ మంఘ్రిత్రయం బుర్వి య ర్థించి వైరోచనుం గ్రిందికి న్మట్టవా భృగ్వధీశుండ వై గండ్రగొడ్డంట ముయ్యేడు మాఱు ల్నరాధీశులం గొట్టవా జానకీభర్త వై ఘోరదుర్వర్తనుం డైన యప్పంక్తి కంఠాసురేంద్రు న్సమిద్భూమిఁ బోకార్చవా శీరి వై హాళి మీఱం బ్రలంబాదులం ద్రుంపవా బుద్ధరూపంబుచే దైత్యనారీకదంబంబుల న్వన్న మొందింపవా సాది వై మ్లేచ్ఛరాజన్యుల న్మోదుచు న్సాధులం బ్రోవనున్నావు నీవర్తనం బెల్ల లెక్కింప మాబోంట్ల కెంతే నశక్యంబె నిన్ను న్బృశస్తేంద్రనీలోపలద్విట్ప్రతీకాశసమ్యక్తురుం బోపరిస్నిగ్ధమాణిక్యరోచిశ్చటాంచత్కిరీటోత్తమాంగున్ సుధాకీర్ణరాకానిశాకేతు బింబోపమస్మేరవక్త్రాగవిందు న్ముకుందు న్మనోజాతలీలాధనుస్సన్నిభభ్రూలతా భాసురుం గృత్తదంభాసురుం బ్రాతరారంభవేళాసముజ్జృంభమాణారుణాంశుప్రభా జాలనిర్భిన్నశుభ్రాబ్జదసంవర్తికాచారునేత్రు న్బుధస్తోత్రపాత్రు న్నలీనాగ్రచాంపేయ జాలాభిరామస్వనాసు న్సరత్కౌముదీమందహాసు న్జపాబింబికాబంధుజీవప్రవాళా బ్జరాగోపమానామృతాధారశోణాధరు న్శ్రీధరుం గుందబృందాచ్ఛదంతావళీభాస మానుం బ్రభావాసనను న్జ్వలత్కుండలస్థాపితానర్ఘ్యరత్నద్యుతిప్రోల్లసద్గండ భాగు న్యతీన్ద్రానురాగు న్మణిగ్రైవహారావళీవిస్ఫురత్కంబుకంఠు న్గదాశంఖచ క్రాబ్జశార్ఙ్గాయుధోపేతదిక్కుంభిశుండాసదృక్పీనవృత్తాయతాజానుబాహు న్విహం గేంద్రవాహు న్రమాకౌస్తుభాస్తోకముక్తామణీధామకాలంకృతోత్తుంగబాహాంతరా ళుం గృపాళుం గళిందాత్మజాభంగరంగత్త్రిభంగు న్మదారాతిభంగు న్గరుత్మచ్ఛిలా బద్ధభర్మోర్మికాకంకణాలంకృతస్నిగ్ధహస్తాంబుజాతు న్జగన్మోహనాకారరేఖాప రాభూతపాకీనకేతు న్సముద్దామసౌదామనీదామశంకాకరస్వర్ణచేలావృతోద్యత్క టీరు న్మునీంద్రాత్తచేతోంబురుట్కర్ణికాంతఃకుటీకు న్హలాంభోజశంఖధ్వజానీకక ల్యాణరేఖావృతాంచత్పదున్ శ్రీప్రదున్ హృత్పయోజాతమధ్యంబున న్నిల్పి సే వింతు మత్యాదరం బొప్ప మ మ్మేలు మీశా నమస్తే నమస్తే నమస్తే నమః. || 179 ||

వ. అని శ్రీమన్నారాయణుం గొనియాడి. || 180 ||

క. శర ణొందెద నిను గంగా ◆ పరిపూర్ణకృపాంతరంగ భవ్యతరంగా
గిరిశజటాంతరసంగా ◆ పరిచితచక్రాంగ దురితపటలవిభంగా. || 181 ||

క. ఆదిత్యయక్షఫణిర ◆ క్షోదానవసిద్ధసాధ్యసురనుతవిలస
త్పాదారవిందయుగళీ ◆ గోదావరి నను౯ బవిత్రకుం జేయఁగదే. || 182 ||

తే. మగ్నమాతంగ మదజలోన్మత్తభృంగ ◆ యతిదయాపాంగ శంభుజటాగ్రరంగ
కలితశుభసంగ ఘోరదుష్కలుషభంగ ◆ గౌతమీగంగ తరళరంగత్తరంగ. || 183 ||

తే. అని నుతించుమునీంద్రున కపుడు నిఖిల ◆ భువనపావని పొడగట్టి భూసురేంద్ర
మంత్రపూతంబు లైనట్టి మజ్జలముల ◆ నీవధూమణిఁ దడపుము నియమ మొప్ప. ॥ 184 ॥

తే. అత్తెఱంగునఁ జారురూపాన్విత యగు ◆ మగువచే నభిషిక్తుఁడ వగుము నీవు
నిఖిలకల్యాణలక్షణాన్వితుఁడ వగుచు ◆ మరల రూపంబు దాల్చెదు మహిమ మెఱయ. ॥ 185 ॥

తే. అనుచు గౌతమి కృపఁ బల్క నట్లు చేసి ◆ దంపతులు శోభనాకారసంపదల నె
సంగి రెంతయు గౌతమీసలిలసేచ ◆ నమున మానసములఁ బ్రమోదము దలిర్ప. ॥ 186 ॥

తే. అపు డగస్త్యవసిష్ఠగర్గాదిమునులు ◆ ప్రేమ దైవాఱ వారలఁ బెండ్లి సేయఁ
దలఁచి యొకదివ్యనగరంబు తత్క్షణంబ ◆ సొంపు దీపింప నచట నిర్మింపఁజేసి. ॥ 187 ॥

తే. చంద్రతారాబలప్రశస్తముగఁ బొసఁగి ◆ యి మ్మలరునొక్కశుభముహూర్తమ్ము నిశ్చ
యించి పౌరులఁ బురి యలరించుటకును ◆ బూన్చుటయు వారు సంతసంబునఁ జెలంగి. ॥ 188 ॥

సీ. గోడల నెల్ల రంగుగఁ జిత్తరులు వ్రాసి ◆ ముంగిళ్ల ముత్యాలముగ్గు లునిచి
తోరంబుగాఁ బచ్చతోరణంబులు గట్టి ◆ దరి లేనిచలువపందిరులు వైచి
యంగళ్ల మేలుక ట్లమరించి వేదిక ◆ లలికి మేడలు మిద్దె లలరఁ జేసి
కదళికాస్తంభము ల్కనకకుంభంబులు ◆ దల దువారంబులఁ దగులుపఱిచి
తే. యగురుఘనసారధూపము ల్మిగుల వైచి ◆ సతులుఁ బురుషులు నతులితోత్సాహలీల
గంధమాల్యాభరణవస్త్రకలితు లగుచు ◆ నలరుచుండిరి కడుఁ దదనంతరమున. ॥ 189 ॥

ఆ. సవిత హస్తమించె సంజ కెంపుదలిర్చెఁ ◆ దమము గ్రమ్ముకొనియెఁ దార లెసఁగెఁ
జంద్రుఁ డుదయ మయ్యెఁ జంద్రిక ల్వెలసిల్లె ◆ నపుడు మునులు మిగులహర్ష మొనర. ॥ 190 ॥

సీ. ఝల్లరీనిస్సాణశంఖభేరీకాహ ◆ ళలు దూర్యములు ధరఁ బ్రోయ
బిఱుసులుఁ జివ్వలు బెడఁగుచంద్రజ్యోతు ◆ లును నభం బెల్ల వెలుంగఁ జేయ
ఘనమర్దలధ్వను లెనయ నాడెఁపువార ◆ రమణీమణులు నర్తనములు సలుప
జగ మంతయును బట్టపగలు గావించుచుఁ ◆ గరదీపికాసముత్కరము వఱల
తే. సకలనగరాంతరాగతజనపరంప ◆ దానిరంతరకలకలారవము దిగిభ
నివహకర్ణపుటంబులఁ జెవుడుపఱుప ◆ సదమలానందకరమహోత్సవము వెలయ. ॥ 191 ॥

వ. వివాహోచితకృత్యంబు లాచరింపఁ దీర్పరు లైనపురంధ్రీభూసురోత్తముల నియో
గించుటయును. ॥ 192 ॥

తే. మిన్న యై యున్నయారాచకన్నియకును ◆ బుణ్యనిధి యగుభూసురపుంగవునకు
మంగళస్నాన మాచరింపఁగ నొనర్చి ◆ రెలమిఁ గొందఱు ముత్తెదువలు గడంగి. ॥ 193 ॥

మ. వరరత్నాభరణావలు ల్తొడిగి సౌవర్ణాంబరంబు ల్తొయల్
బెరయం గట్టి పటీరచంద్రమృగనాభీపంకము ల్మేనులన్
గర మొప్పార నలంది క్రొవ్విరిసరుల్ గాటంబుగా వైచి వా
విరిఁ గైచేసిరి కాంత లాన్నృపసుతావిశ్వంభరాదేవులన్. ॥ 194 ॥

తే. అపుడు కల్యాణవేదిపై నమలరత్న ◆ పీఠమున విప్రుఁ గూర్చుండఁబెట్టి కాళ్లు
గడిగి మధుపర్కము లొసంగి కన్యఁ దెచ్చి ◆ రమణ నిర్వురకును గంకణములు గట్టి. ॥ 195 ॥

క. ఉడువీథిఁ జూచి యాజకు ◆ లడరఁగ సుముహూర్తవేళ యయ్యె నటంచున్
గుడజీరకములు శిరమున ◆ నిడి కన్నియఁ జూపి రామహీదేవునకున్. ॥ 196 ॥

క. మునుకొని విప్రోత్తము లె ◆ ల్లను గము లై పలికి రపుడు లక్ష్మీనారా
యణ సావధాన యనుచుం ◆ దనరఁగ సుముహూర్తసావధాన యటంచున్. ॥ 197 ॥

మ. ఘనగంభీరవిరావసంకలితు లై క్ష్మాదేవతాముఖ్యు లె
ల్లను మోదంబున నవ్వధూవరులమ్రోలం గూటువ ల్గూడి డా
కొని "సర్వే మునయ స్సురాగ్రహయుతాః కుర్వంతు వా మ్మంగళ"
మ్మని లగ్నాష్టకము ల్పఠించిరి శుభోదంచత్ప్రకారంబునన్. || 198 ||

క. కల్యాణపాత్రికల సా ◆ కల్యముగ నివాళు లునిచి గణితలు గౌరీ
కల్యాణంబులు పాడిరి ◆ కల్యాంచితమాధురీప్రకారము వెలయన్. || 199 ||

ఉ. పల్లవపాటలాధరశుభప్రభ లొప్పఁగ మేల్పయంటలన్
బెల్లుగ గుబ్బచన్గనలు పెంపెసలాడఁ గడిందివేడుకల్
మొల్లము మీఱఁ గ్రొత్తతెలిముత్తియపున్రతనంపుసేసఁబ్రాల్
చల్లుచుఁ బేరఁటాండ్రు ధవళంబులు పాడిరి కొంద ఱయ్యెడన్. || 200 ||

శా. ఆ రాజన్యకుమారికంఠమున గోత్రాదిత్యవర్యుండు సొం
పాగ న్మంగళసూత్ర మప్పుడు నితాంతామోది యై కట్టి వి
స్తారోత్కంఠత నాగమోక్తికము వాచాప్రౌఢి మీఱన్ "ధ్రువం
తే రాజా వరుణోధ్రువ" మ్మనుచు ధాత్రీనిర్జరు ల్వల్కఁగన్. || 201 ||

క. లలనాలలామశిరమున వలనుగ భూసురవరుండు వసుధామరు నౌ
దలఁ గలకంఠియు ముత్యపుఁదలఁబ్రా ల్పోసిరి ముదంబు దళుగుకొత్తంగన్. || 202 ||

తే. అంతరిక్షంబునం దిల నఖిలజనులు ◆ సొరిదితోడ నరుంధతిఁ జూచుచుందు
రప్పు డచటనె చెలఁగి జాయాపతుల క ◆ రుంధతిని జూపి రొజ్జయల్ రూఢి మీఱ.

వ. మఱియు నగ్నిప్రతిష్ఠాపనాదివిధు లాగమోక్తప్రకారంబునం గావింపుచుఁ గ్రమం
బునఁ జనఁ బంచవాసరంబులు గడపి యున్న యాదంపతుల దీవించి యగస్త్యాదిమ
హర్షులు యథాస్థానంబులకుం జని రంత. || 204 ||

క. అతిభోగభాగ్యమహిమా ◆ న్వితు లై యతిథులను నిచ్చనిచ్చలు గరుణా
మతిఁ బ్రోచుచు అద్దంపతు ◆ లతులప్రాభవనిరూఢి నలరిరి ధాత్రిన్. || 205 ||

క. అని కమలజుఁడు ఋతుధ్వజ ◆ జనపాలకుచరిత దివిజసంయమి కెలమిన్
వినిపించిన విని యాతఁడు ◆ మనమున నత్యంతహర్షమగ్నుం డయ్యెన్. || 206 ||

సీ. రహి మీఱ బ్రహ్మపురాణోక్త మగుచు గో ◆ దావరీఖండంబు దనరు నందు
వృద్ధస్స్రవంతీసరిత్ప్వతీసంగమ ◆ మాహాత్మ్య మెపుడు సన హిమ నదియ్
రసికజనమనోభిరామం బనెడు పేరఁ ◆ దెనుఁగున శాలివాహనశకాబ్ద
ములఁ గరిగిరిరసభూసంఖ్యఁ దద్దయు ◆ వఱలుప్రమోదూతవత్సరమున

తే. నీప్రబంధంబు రచియించి నీ కొసఁగితి ◆ నిందుశేఖర నీకృప నిది ధరిత్రి
నాసుధాకరతారార్క మగుచుఁ గవిజ ◆ నోత్తములయిండ్ల నేప్రొద్దు నుండుఁ గాత. || 207 ||

చ. పరమకృపాలవాల నిజభక్తజనావనశీల శత్రుభీ
కరఖరశూల భావభవగ..నివారణమూల శోభనా
కరగుణజాల భవ్యతరంగం... గజాజినచేల తాపసో
త్కగనుతిలోల నిర్మథితకాల నిశాముఖలాస్యఖేలనా. || 208 ||

క. పవనాశన హారబుద్ధో ◆ పవనావళినవవసంత ప్రథికమహీభృ
ద్భవనా భవనాళీకో ◆ ద్భవనానాక్రతుభుగవన పరివృతభువనా. || 209 ||

మాలిని. శరనిధివరతూణా సత్యవాక్యప్రమాణా
పరిహృతసుమబాణా పంకజాతాక్షబాణా

పరికలితకృపాణా భక్తరక్షాధురీణా
సరవృషజుహురాణా పాణిపద్మాంచదేణా. ‖ 210 ‖

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వరకరుణాకటాక్షనిరీక్షణసంలబ్ధసరసకవితాసామ్రాజ్యధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్రపవిత్ర కూచిమంచిగంగనామాత్యపుత్త్ర సకలసంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ తిమ్మకవిసార్వభౌమప్రణీతంబైనరసికజనమనోభిరామం బనుశృంగారరసప్రబంధంబునందు సర్వంబును షష్ఠాశ్వాసము.

శ్రీకామేశ్వరీపరదేవతార్పణ మస్తు.